

ఈనాడు



విజయవాడ 9-2-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 180

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



అన్ని రాష్ట్రాలూ మెరుగైన పనితీరు చూపాల్సిందే

కేంద్రానికి మేం సహకరిస్తున్నాం.. కేంద్రం మాకు సహకరిస్తోంది..

అందుకే 'డబుల్ ఇంజిన్' సర్కారు అంటున్నాం

12లో

'పీటీఐ వీడియోస్' ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు



శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం

2లో



ఆ ఫోన్ నంబర్ వైవీ సుబ్బారెడ్డిదే!

కల్తీ నెయ్యి నేరం కోసం చిన్నప్పన్న వాడిన నంబర్ అదే


సుబ్బారెడ్డి లోక్‌సభ సభ్యుడిగా ఉన్నప్పుడు అధికారిక లెటర్‌హెడ్‌లో 95424 19999 నంబర్

- ఆ నంబర్ కదురు చిన్నప్పన్నదిగా అభియోగపత్రంలో సిట్ వెల్లడి
- సుబ్బారెడ్డి, చిన్నప్పన్నల మధ్య గాఢానుబంధానికి ఇదే తార్కాణం
- కల్తీ నెయ్యి సరఫరాదారుల నుంచి ఆ నంబరు ద్వారానే లంచాల వసూళ్లు
- లంచాల వసూలుకు కాల్స్ చేసింది చిన్నప్పన్నే.. చేయించిందెవరో సిట్‌కు తెలియలేదా?
- సీడీఆర్, టవర్ డంప్, గూగుల్ టేకవుట్ వంటి వాటిని విశ్లేషిస్తే అసలు 'సూత్రధారి' వెలుగులోకి


చిన్నప్పన్న


వైవీ సుబ్బారెడ్డి

2018 మార్చి 15


Y.V. SUBBA REDDY
MEMBER OF PARLIAMENT
(LOK SABHA)

Dated: 15.03.2018.

Dear Ms. Suchlata Shrivastava,

Under Rule 198(b) of Chapter XVII of the Rules of Procedure and Conduct of Business in Lok Sabha, I hereby give notice to move the following motion in the House on 16.03.2018.

I request you to include the motion in the Revised List of Business for 16.03.2018.

MOTION

"This House expresses No-Confidence in the Council of Ministers."

Regards,

Yours sincerely,

(Y.V. SUBBA REDDY)


Ms. Suchlata Shrivastava,
Secretary-General,
Lok Sabha,
New Delhi – 110 001.

95424 19999

వైవీ సుబ్బారెడ్డి లోక్‌సభ సభ్యుడిగా ఉన్న సమయంలో అధికారిక లెటర్ హెడ్‌లో తన చిరునామాలతో పాటు పేర్కొన్న 95424 19999 ఫోన్ నంబర్

అప్పట్లో లోక్‌సభ సభ్యుడిగా ఉన్న వైకాపా నేత వైవీ సుబ్బారెడ్డి తన అధికారిక లెటర్ హెడ్‌పై లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలత శ్రీవాస్తవకు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వంపై తాము అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నామని.. 16.03.2018న నాటి రివైజ్డ్ లిస్ట్ ఆఫ్ బిజినెస్‌లో ఈ తీర్మానాన్ని చేర్చాలని అందులో పేర్కొన్నారు. ఆ లెటర్ ప్యాడ్‌లో దిల్లీ, ఒంగోలు, హైదరాబాద్‌లలోని సుబ్బారెడ్డి నివాసాల చిరునామాలతో పాటు ఆయన ఫోన్ నంబర్లూ ఉన్నాయి. వాటిల్లో 95424 19999 ఫోన్ నంబరు ఒకటి. 2018 మార్చి 15న వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఈ లేఖను తన ట్విటర్ (ప్రస్తుత ఎక్స్) ఖాతాలో పోస్టుచేశారు.

2026 జనవరి 28


Accused No -24 (Arraigned Accused)

(i)	Name	KaduruChinnappanna Mobile No. 9542419999, PAN No. BVFPK7069A, Aadhaar No. 270388289134, Email: chinnappannak@gmail.com.
(ii)	Father's Name	Late Chinna Rao Kaduru
(iii)	Date/Year of birth	08.06.1990
(iv)	Sex	Male
(v)	Nationality	Indian
(vi)	Passport No., date of issue: Place of issue	W1078382 15.06.2022 Vijayawada
(vii)	Religion	Hindu
(viii)	Whether SC/ST/OBC	
(ix)	Occupation:	Acted as PA to Chairman, TTD.

వైకాపా హయాంలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో అభియోగపత్రం దాఖలు చేసిన సిట్ నిందితుడు కదురు చిన్నప్పన్నపై పలు అభియోగాలు మోపింది. తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ హోదాలో కె.చిన్నప్పన్న తితిదే వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారని, నెయ్యి సరఫరాదారులకు కాల్స్ చేసి పిలిపించుకుని వారినుంచి హవాలా మార్గాల్లో లంచాలు తీసుకున్నారని వివరించింది. 95424 19999 నంబర్ చిన్నప్పన్నదిగా పేర్కొంది.

> వైకాపా హయాంలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలక నిందితుడైన కదురు చిన్నప్పన్న, తితిదే పాలకమండలి నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిల మధ్య ఎంతటి గాఢమైన బంధం పెనవేసుకుందో చెప్పేందుకు ఇదే నిదర్శనం.

ఈనాడు – అమరావతి

చిన్నప్పన్న 2014-18 వరకే తన దగ్గర పీఏగా ఉన్నారని, ఆ తర్వాత ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్‌గానూ, మరికొందరు ఎంపీల దగ్గర పీఏగా పనిచేశారంటూ సుబ్బారెడ్డి గత కొన్నాళ్లుగా బుకాయిస్తూ వస్తున్నారు. 2018 తర్వాత చిన్నప్పన్నకు తనకు ఎలాంటి సంబంధమూ లేదన్న తరహాలో మాట్లాడుతూ వస్తున్నారు. కల్తీ నెయ్యి కేసులో చిన్నప్పన్న పాత్రను సిట్ గుర్తించినప్పటి నుంచి సుబ్బారెడ్డి ఇదే పాట పాడుతున్నారు. అతన్ని నిందితుడిగా చేర్చినప్పుడు, అరెస్టయినప్పుడూ ఇదే తరహాలో మాట్లాడారు. ఆయన చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని తేటతెల్లమైపోయింది. 95424 19999 నంబర్ చిన్నప్పన్నదిగా సిట్ అభియోగపత్రంలో పేర్కొంది. దీన్నిబట్టి చిన్నప్పన్న సుబ్బారెడ్డికి పీఏ మాత్రమే కాదు.. వారిద్దరి మధ్య అంతకుమించిన బంధం ఉందని అర్థమవుతుంది. సిట్ అభియోగపత్రాన్ని విశ్లేషిస్తే.. కల్తీనెయ్యి నేరంలో ఈ నంబరే వినియోగించారని స్పష్టమైంది. నెయ్యి సరఫరాదారులను తమ దగ్గరకు రప్పించుకోవడానికి, వారినుంచి లంచాలు తీసుకోవటానికి ఈ నంబరే వాడారని అర్థమవుతోంది.

సుబ్బారెడ్డి నంబర్ చిన్నప్పన్న దగ్గర ఎందుకుంటుంది?

■ సుబ్బారెడ్డికి, చిన్నప్పన్న మధ్య ఎంతో అనుబంధం లేకపోతే.. ఆయన తితిదే ఛైర్మన్‌గా ఉన్న సమయంలో అతని ఫోన్ నంబర్ చిన్నప్పన్న దగ్గర ఎందుకుంటుంది? ఎలా ఉంటుంది? దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు అప్పటి తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం సుబ్రహ్మణ్యం మొబైల్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించగా అందులో 95424 19999 ఫోన్ నంబర్‌ను 'పీఎస్ టూ ఛైర్మన్' అని సేవ్ చేసుకుని ఉన్నట్లు తేలింది. ఆ నంబర్‌తోనే రెగ్యులర్‌గా కాల్స్ చేసి మాట్లాడినట్లు వెల్లడైంది.

■ సుబ్బారెడ్డి నంబర్‌తో చిన్నప్పన్న రెగ్యులర్‌గా కాల్స్ చేస్తుండటం వల్ల అందరూ దాన్ని చిన్నప్పన్న నంబర్‌గా (మిగతా 3లో)



లక్ష టిడ్కో గృహాలు సిద్ధం

ఉగాదికి గృహప్రవేశాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా పంపిణీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహ సముదాయాల్లో పూర్తయిన లక్ష గృహాలను రానున్న ఉగాదికి లబ్ధిదారులకు అందించనున్నారు. ఇందులో 300 చ.అ. విస్తీర్ణం ఉన్న ఇళ్లు 54,934, 365 చ.అ విస్తీర్ణం ఉన్నవి 16,223, 430 చ.అ విస్తీర్ణం ఉన్నవి 28,986 ఉన్నాయి. వీటికి ఉగాది సందర్భంగా సీఎం చేతులమీదుగా లబ్ధిదారులతో గృహప్రవేశాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వైకాపా హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయకుండా పాడు పెట్టగా.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనుల్ని వేగిరం చేసింది. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు తెచ్చిన అప్పుల్ని ఇతర అవసరాలకు మళ్లించింది. లబ్ధిదారుల వాటాగా బ్యాంకుల నుంచి రుణం తీసుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి వారికి అప్పగించకుండా తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. చాలామంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు నిరర్థక ఖాతాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం సమస్యలన్నీ ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ఇళ్ల నిర్మాణాల్ని, మౌలిక వసతుల్ని పూర్తి చేసింది.

అప్పట్లో రుణమిచ్చేందుకు ససేమిరా

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి హడ్కో రుణాన్ని తీసుకునేందుకు వైకాపా హయాంలో రెండేళ్లుగా అధికారులు ప్రయత్నించారు. ఇదిగో.. అదిగో అనడమే తప్ప ఒక్క రూపాయి ఇవ్వలేదు. బ్యాంకులైతే పూర్తిగా వెనకడుగు వేశాయి. తాజాగా ప్రభుత్వ గ్యారంటీతో రూ.4.451 కోట్ల రుణాన్ని (మిగతా 2లో)

బంగ్లాదేశ్ ఎన్నికలు ఒక నాటకం

- ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం లేదు
- అధికారంలోకి ఎవరొచ్చినా సంక్షోభం తప్పదు
- పాక్‌తో స్నేహానికి యూనస్ వెంపర్లాడుతున్నారు
- 'ఈటీవీ భారత్' ప్రత్యేక ఇంటర్వ్యూలో మాజీ ప్రధాని షేక్ హసీనా

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలను ఓ నాటకంగా అభివర్ణించారు ఆ దేశ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా. దేశంలోని అతి పెద్ద రాజకీయ పక్షమైన తమ పార్టీ(అవామీ లీగ్)ని పోటీ చేయకుండా నిషేధించి నిర్వహించే ఈ ఎన్నికలకు ఎలాంటి విలువా ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం ఏర్పడే ఏ ప్రభుత్వమైనా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమం కారణంగా హసీనా ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. బంగ్లాదేశ్‌లో గురువారం ఎన్నికలు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో హసీనా ఆదివారం 'ఈటీవీ భారత్'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

? అవామీ లీగ్ లేకుండా జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతాయని భావిస్తున్నారా?

హసీనా: ఒక అక్రమ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించడం కోసం జరుగుతున్న నాటకంలో భాగమే ఈ ఎన్నికలు. ఒక్క బంగ్లాదేశీ ఓటు కూడా పొందని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం దేశ చరిత్రలో తొమ్మిదిసార్లు ప్రజాస్వామ్యబద్ధంగా (మిగతా 2లో)

రూ.9 వేల కోట్లతో.. ట్రాన్స్‌కో నెట్‌వర్క్ బలోపేతం

- డేటా సెంటర్లు, భారీ పరిశ్రమల విద్యుత్ అవసరాల కోసం..
- ఏడాదిలో 108 పనుల పూర్తికి రోడ్‌మ్యాప్
- కొత్తగా 48 ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్లు

ఈనాడు – అమరావతి



రాష్ట్రంలో భవిష్యత్తు విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా నెట్‌వర్క్ బలోపేతంపై ఏపీ ట్రాన్స్‌కో దృష్టిపెట్టింది. విశాఖపట్నంలో డేటాసెంటర్లు ఏర్పాటు కానుండటం.. రాష్ట్రానికి కొత్తగా వస్తున్న సంస్థలు, భారీ ప్రాజెక్టులతో విద్యుత్ డిమాండ్ కనీసం 2వేల మెగావాట్లు పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా. వాటికి ప్రస్తుత నెట్‌వర్క్‌తో నాణ్యమైన విద్యుత్ అందించడం సాధ్యం కాదు. అదనంగా మౌలిక సదుపాయాలు కల్పించాలి. కొత్తగా ఏర్పాటవుతున్న పునరుత్పాదక ప్రాజెక్టుల నుంచి వచ్చే విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసేందుకు నెట్‌వర్క్ బలోపేతం తప్పనిసరని అధికారులు భావిస్తున్నారు. దీనికోసం ఈ ఏడాది డిసెంబరు నాటికి సుమారు రూ.9వేల కోట్లతో లైన్లు, సబ్‌స్టేషన్లు, ఇతర సాంకేతిక విస్తరణ పనుల పూర్తికి (మిగతా 2లో)

మానవ రహిత సబ్‌స్టేషన్లు

ట్రాన్స్‌కో పరిధిలో ఉన్న 400 కేవీ సబ్ స్టేషన్లను 'మానవ రహితం'గా నిర్వహించేలా కొత్త సాంకేతికత ప్రవేశపెట్టనున్నారు. దీన్ని కేంద్ర విద్యుత్‌సంస్థ.. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) ఇప్పటికే అనుసరిస్తోంది. దీనికోసం 'స్టేట్ ఎసెట్ ట్రాన్స్‌మిషన్ మేనేజ్ సెంటర్' (ఎస్టీఎంసీ) ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. దీని వల్ల ఎస్టీఎంసీ నుంచే సబ్ స్టేషన్ కార్యకలాపాలను పర్యవేక్షించే సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. ట్రాన్స్‌కోకు 400 కేవీ సామర్థ్యం ఉన్న సబ్ స్టేషన్లు సుమారు 18 వరకు ఉన్నాయి.



ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాల్లేవు

రాజీపడకుండా పోరాడతాం

వ్యూహాత్మక రంగాల్లో మలేసియాతో బంధాలు

ఇండో-పసిఫిక్‌లో శాంతి-సుస్థిరతకు కట్టుబడి ఉన్నాం: మోదీ

11 ఒప్పందాలపై సంతకాలు

10లో


పొలాల్లో పడిపోయిన విమానం

కర్ణాటకలో కూలిన శిక్షణ విమానం

ఇద్దరికి గాయాలు

12లో



శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారి ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటం

నంద్యాల, శ్రీశైల ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు దంపతులు, అర్చకులు, వేదపండితులు యాగశాలలోకి ప్రవేశించి, ఉత్సవాలకు ఆరంభ పూజలు చేశారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ స్వామివారి ఆలయ ధ్వజస్తంభంపై ధ్వజపటాన్ని ఎగురవేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున అక్కడి ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ఏఈవో ఎన్వీఎస్ మోహన్, అర్చకులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. జ్యోతిర్లింగ దర్శనానికి శివదీక్షా భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలానికి తరలివచ్చారు.

బంగ్లాదేశ్ ఎన్నికలు ఒక నాటకం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికైన అవామీ లీగ్‌ను నిషేధించింది. తద్వారా లక్షల మంది ప్రజలను ఓటు హక్కుకు దూరం చేసింది. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) లేదా జమాత్-ఎ-ఇస్లామీ అనుబంధ పార్టీలకు చెందిన వారు ఎవరైనా నామినేషన్ పత్రాలను కొనాలని చూస్తే, పోలీసులు వారిని అరెస్టు చేస్తున్నారు. ఈ నామమాత్రపు ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎవరు అధికారంలోకి వచ్చినా, మొదటి రోజే సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది.

? అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ మీకు విధించిన ఉరిశిక్షను ఎలా చూస్తున్నారు?

నా రాజకీయ ప్రత్యర్థులు తమకు అనుకూలమైన వారితో కోర్టును నింపేశారు. నాకు నచ్చిన న్యాయవాదిని ఎంచుకునే హక్కును నిరాకరించారు. అవామీ లీగ్‌పై సానుభూతి ఉన్న న్యాయవాదులను జాబితా నుంచి తొలగించి, వారి స్థానంలో పక్షపాతమైన పరిజ్ఞానం లేని, ప్రభుత్వం నియమించిన వ్యక్తులను ఉంచారు. విచారణ ప్రారంభం కాకముందే ప్రభుత్వ అధికారులు బహిరంగంగా నేను నేరస్థురాలినని ప్రకటించారు. ప్రజల ద్వారా ఎన్నికవ్వని ప్రభుత్వం కింద అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ పనిచేస్తోంది. ఇది కేవలం అవామీ లీగ్ సభ్యులనే లక్ష్యంగా చేసుకుని విచారణలు నిర్వహిస్తోంది.

? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించమని ఆదేశాలిచ్చారని మీపై ఆరోపణలు ఉన్నాయి. వాటికి మీ సమాధానం?

నేను ఎవరినీ చంపాలని ఆదేశాలివ్వలేదు. దేశంలో హింస చెలరేగి, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమవుతున్నప్పుడు, ఒక బాధ్యతాయుతమైన దేశాధినేతగా శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి ప్రయత్నించాను. పరిస్థితులు వేగంగా మారడంతో పరిస్థితి చేయి దాటింది. అప్పుడు జరిగిన మరణాలపై విచారణ జరిపించడానికి ఓ కమిటీని నియమించాను. దురదృష్టవశాత్తు యూనస్ అధికారం చేపట్టగానే దాన్ని రద్దు చేశారు. బహుశా ఆ నివేదిక తననే దోషిగా తేలుస్తుందని ఆయనకు తెలుసేమో.

? బంగ్లాదేశ్‌లో హిందువులు హత్యకు గురవుతున్నారు. మైనారిటీలకు భద్రత లేదని మీరు భావిస్తున్నారా?

బంగ్లాదేశ్ ఒక లౌకిక గణతంత్ర దేశం. అన్ని మతాల ప్రజలు ఒకరితో ఒకరు కలిసి శాంతియుతంగా జీవించే ప్రదేశం. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. యూనస్ అధికారాన్ని చేజిక్కించుకున్న కొన్ని వారాల్లోనే హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, ఆదివాసీ తెగలను



లక్ష్యంగా చేసుకుని 2,000 కంటే ఎక్కువ దాడులు జరిగాయని నివేదికలు చెబుతున్నాయి. మత దూషణ చేశారనే ఆరోపణలతో ఒక హిందూ గార్మెంట్ కార్మికుడిని అతని సహోద్యోగులే బహిరంగంగా కొట్టి చంపారు. ఆ మృతదేహాన్ని చెట్టుకు కట్టేసిన ఘటన చూసి ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. ఈ అనాగరిక చర్యలకు బాధ్యులైన తీవ్రవాద శక్తులను యూనస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో మైనారిటీలు భయంతో బతుకుతున్నారు. మూకదాడులు నిత్యకృత్యమయ్యాయి.

? యూనస్ ప్రభుత్వం పాకిస్థాన్‌తో పెంచుకుంటున్న సాన్నిహిత్యాన్ని ఎలా చూస్తారు?

'అందరితో స్నేహం- ఎవరితోనూ శత్రుత్వం వద్దు' అనేదే మా విదేశాంగ విధానం. భౌగోళిక పరిస్థితులు, చరిత్ర, పరస్పర విశ్వాసం ప్రాతిపదికన మేము భారత్‌తో బలమైన భాగస్వామ్యాన్ని నిర్మించుకున్నాం. ఇది వాణిజ్యం, అనుసంధానం, ప్రాంతీయ స్థిరత్వానికి ఎంతో దోహదపడింది. అదే సమయంలో ఆర్థికాభివృద్ధి కోసం చైనాతోనూ నిర్మాణాత్మకంగా వ్యవహరించాం. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం విదేశాంగ విధానాన్ని పూర్తిగా మార్చడానికి ప్రయత్నిస్తోంది. 1971లో జరిగిన మారణహోమాన్ని పాకిస్థాన్ ఇప్పటికీ గుర్తించలేదు. ఆయన ప్రతీకే, ఆ దేశంతో సాన్నిహిత్యం కోసం యూనస్ వెంపర్లాడుతున్నారు.

? మీరు అత్యధిక కాలం దేశాన్ని పాలించిన నాయకురాలు. ప్రతిపక్షానికి సరైన రాజకీయ అవకాశాలు కల్పించలేకపోయానని పశ్చాత్తాపం మీకు ఉందా?

బంగ్లాదేశ్ ప్రజలు అవామీ లీగ్‌ను తొమ్మిది సార్లు ఎన్నుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని వారు మమ్మల్ని పదేపదే నమ్మారు. మేము రాజ్యాంగ విరుద్ధమైన మార్గాల ద్వారా అధికారం చేజిక్కించుకోలేదు. ఎన్నికల్లో పోటీ చేసి... విజయం సాధించాం. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలను బహిష్కరించి, వారి మద్దతుదారులకు ఓటు హక్కు లేకుండా చేయాలని నిర్ణయించుకుంటే, అది వారి సొంత నిర్ణయం. మేము వారిని పోటీ చేయకుండా ఎప్పుడూ నిషేధించలేదు. కానీ ఇప్పుడు మమ్మల్ని నిషేధించారు. 1.52 లక్షల మందికి పైగా ప్రజలను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌ను ఎవరు పాలించినా సరే, ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఒక నాయకుడికి కుర్చీలో కూర్చోవడం వల్ల అధికారం రాదు. అలా ఆ నాయకుడు ఎప్పుడైతే అనుకుంటాడో అతని పతనం మొదలైనట్లే అవుతుంది.

లక్ష టిడ్కో గృహాలు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చేందుకు హడ్కో ముందుకొచ్చింది. ఇదికాకుండా లబ్ధిదారుల వాటా మరో రూ.1500 కోట్ల వరకు సమకూరనున్నాయి. మొత్తం నిర్మాణాలు జూన్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా ఇప్పటికే అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.

వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన నిధులూ చెల్లింపు

వైకాపా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయకపోగా.. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకుండా వేధించింది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణ పనులు చేసిన వారికీ బిల్లులివ్వలేదు. ఇవన్నీ కలిపి దాదాపుగా రూ. 500 కోట్లు పెండింగ్ పెట్టింది. కూటమి ప్రభుత్వం ఆ నిధుల్ని చెల్లించడంతోపాటు పనుల్లో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు గుత్తేదారులకు చెల్లింపులు చేస్తోంది.

ఉగాది నాటికి వివిధ జిల్లాలవారీగా లబ్ధిదారులకు అప్పగించనున్న టిడ్కో గృహాల వివరాలు

జిల్లా	అప్పగించనున్న టిడ్కో గృహాలు
పార్వతీపురం మన్యం	1,054
విజయనగరం	1,248
విశాఖపట్నం	13,623
అనకాపల్లి	2,988
తూర్పుగోదావరి	2,653
కాకినాడ	2,508
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	4,082
పశ్చిమగోదావరి	11,622
కృష్ణా	2,751
ఎన్టీఆర్	2,256
గుంటూరు	3,447
పల్నాడు	3,737
ప్రకాశం	912
నెల్లూరు	17,183
తిరుపతి	9,663
చిత్తూరు	2,941
అన్నమయ్య	322
వైఎస్సార్ కడప	5,456
నంద్యాల	5,864
కర్నూలు	3,529
అనంతపురం	2,304
మొత్తం	1,00,143

వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులు స్వేచ్ఛ కోల్పోయారు

- ఆరేళ్లలో బకాయిలు రూ.32 వేల కోట్లకు చేరాయి
- ప్రస్తుతం ప్రశాంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం
- ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు విద్యాసాగర్



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నూతన అధ్యక్షుడు విద్యాసాగర్. వేదికపై నాయకులు శివారెడ్డి, పూర్ణచంద్రరావు, దస్తగిరి, పురుషోత్తంనాయుడు, ఎన్నికల అధికారి ఆచంట రామారాయుడు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, కార్యవర్గ సభ్యులు



ఏపీ ఎన్‌జీజీవో నాయకులు, ఉద్యోగుల ర్యాలీ


ఈనాడు-అమరావతి: వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులు స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం లేదని, సమస్యలు పట్టించుకునే పరిస్థితి సైతం లేకపోయిందని ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగుల కార్యక్రమాలను ఇప్పుడు స్వేచ్ఛగా నిర్వహించుకుంటున్నామని, హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించగలుగుతున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఆదివారం జరిగిన ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన విజయవాడ జింఖానా మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో, అంతకుముందు ర్యాలీ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఎదుర్కొన్న అనేక ఇబ్బందులను ప్రస్తావించారు. అసోసియేషన్ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. 'ఉద్యోగుల వేతన సవరణలో ఇప్పటికే జాప్యమైంది. ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేతన సవరణ కమిషన్ ఛైర్మన్‌ను ఏర్పాటు చేయిస్తాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఆరేళ్లలో రూ.32 వేల కోట్లకు చేరాయి. సీఎం చంద్రబాబుతో చర్చించి ఉద్యోగుల ఖాతాల్లో రూ.1,300 కోట్లు వేయించాం. జీపీఎఫ్, ఏపీజీఐఎల్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వచ్చేలా చేశాం' అని విద్యాసాగర్ వివరించారు.

ఉద్యోగులపై కేసులకు త్వరలో ముగింపు: 'ఉద్యోగులపై అనేక ఏళ్ల క్రితం నమోదైన క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులకు త్వరలోనే పూర్తి పరిష్కారం లభించనుంది. 3,600 కేసుల్లో 70 తప్పితే మిగిలినవి పరిష్కారమయ్యాయి. ఆర్టీసీ, స్వర్ణ వార్డు, గ్రామ ఉద్యోగుల, పెన్షనర్లతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా కృషిచేయాల్సిన బాధ్యత మనపైనా ఉంది. ఉద్యమాలు అదుపుతప్పితే ఇబ్బందులు ఎదురవుతాయని కూడా గమనించాలి' అని విద్యాసాగర్ పేర్కొన్నారు. 'గతంలో ఎన్నడూ లేని విధంగా అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. 75 ఏళ్ల వేడుకలు విజయవాడలో త్వరలో నిర్వహించనున్నాం' అని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డీవీ రమణ అన్నారు.

కొత్త కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం: ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణలతోపాటు ఎన్నికైన కొత్త కార్యవర్గంతో ఎన్నికల అధికారి ఎ.రామారాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను ఉద్యోగులు సత్కరించారు. అంతకుముందు విజయవాడ పాత బస్టాండ్ నుంచి గాంధీనగర్‌లోని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎన్నికల్లో పోటీ చేసే నేతలు నామినేషన్లు దాఖలు చేశారు.

మధ్యస్థ నగరం.. గరం గరం

- నాన్ మెట్రో సిటీల్లో అనూహ్య ఉష్ణోగ్రతలు
- ఖమ్మంలో ఏటా 1.6-2 డిగ్రీల పెరుగుదల
- యూకే వర్సిటీ అధ్యయనంలో వెల్లడి



ఈనాడు - విశాఖపట్నం

దేశంలో నగరాలు, పట్టణాల్లో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నట్లు యూకేలోని ఈస్ట్ ఆంగ్లియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. భూతాపం కారణంగా గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నాన్-మెట్రోపాలిటన్ నగరాలు త్వరగా వేడెక్కుతున్నట్లు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం వెలువడుతున్న కర్బన ఉద్గారాల దృష్ట్యా భూతాపం సగటున 2 డిగ్రీలు పెరిగితే.. 104 మధ్యస్థ నగరాల్లో వాతావరణ పరిస్థితి ఎలా ఉంటుందో పరిశోధకులు విశ్లేషించారు. భారత్‌లో 3 లక్షల నుంచి 10 లక్షల మధ్య జనాభా ఉన్న 18 నగరాలను ఎంపిక చేశారు. ఈ జాబితాలో ఖమ్మం (తెలంగాణ), అల్వార్, బీకానేర్ (రాజస్థాన్), బఠిండా, జలంధర్, పటియాలా (పంజాబ్), హిసార్, రోహ్‌తక్ (హరియాణా), ఈరోడ్ (తమిళనాడు), విజయపుర (కర్ణాటక), పర్భణీ, నాందేడ్, అకోలా (మహారాష్ట్ర), ముజఫర్‌నగర్, షాజహాన్‌పుర్, మథుర(ఉత్తర్‌ప్రదేశ్), సత్నా (మధ్యప్రదేశ్), గయ (బిహార్) నగరాలు ఉన్నాయి. ఇవన్నీ సమీప గ్రామీణ ప్రాంతాల కంటే వేగంగా వేడెక్కుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఖమ్మంలో ఏడాదికి సగటున ఉష్ణోగ్రత 1.6 నుంచి 2 డిగ్రీలు పెరుగుతుందని అంచనా వేశారు.

రెట్టింపు స్థాయిలో పెరుగుదల

పంజాబ్‌లోని పటియాలాలో భూఉపరితల ఉష్ణోగ్రతలు సమీప గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే.. ప్రపంచ వాతావరణ మోడళ్ల అంచనాలకు భిన్నంగా రెట్టింపు స్థాయిలో పెరగవచ్చని యూకే శాస్త్రవేత్తల అధ్యయనం పేర్కొంది. ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్‌కు చెందిన మోడళ్లు పటియాలాలో 2 డిగ్రీలు పెరగొచ్చని అంచనా వేస్తే.. ఆ పెరుగుదల 4 డిగ్రీల వరకు ఉండొచ్చని ఈస్ట్ ఆంగ్లియా యూనివర్సిటీ తెలిపింది. మిగిలిన నగరాల్లోనూ భవిష్యత్తులో అదే పరిస్థితి తలెత్తనుంది. వడగాలుల తీవ్రత పెరగనుంది. తద్వారా నీటి సౌకర్యం, శీతలీకరణకు ప్రభుత్వం చేయాల్సిన వ్యయంపై గణనీయ ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

విస్తరిస్తున్న నగరీకరణ

పట్టణాలు, నగరాలు అర్బన్ హీట్ ఐలాండ్‌లుగా మారుతున్నాయి. వాతావరణ మోడళ్ల అంచనాల కంటే దేశంలోని అన్ని నగరాల్లో భూఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతోంది. ఆ ప్రాంత వాతావరణం, భూఉపరితలం తదితరాలు ఉష్ణోగ్రతలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచ జనాభాలో సగానికి పైగా పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్లు 2018లో అంచనా వేశారు. అది 2050 నాటికి 68 శాతానికి పెరుగుతుందని అంచనా. నగర పరిధి విస్తరించే కొద్దీ అర్బన్ హీట్ ఐలాండ్ కూడా పెరుగుతుంది. అక్కడ వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో పాటు వడగాలులు తీవ్రతరమవుతాయి. ఇది మానవ ఆరోగ్యంతో పాటు ఇతర జీవజాలంపైనా ప్రభావం చూపుతుంది. వడగాలుల ప్రభావిత మరణాలు పెరగవచ్చని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో పట్టణవాసులు ఎదుర్కొనే వాతావరణ సంబంధిత ప్రమాదాలను విధాన రూపకర్తలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

కోకో పంటకు ఏపీ చిరునామా

త్వరలో గ్లోబల్ హబ్‌గా మారే అవకాశం ● 'ఈనాడు'తో ముఖాముఖిలో సీపీసీఆర్ఐ మాజీ డైరెక్టర్ చౌడప్ప

ఈనాడు - ఏలూరు





ప్రపంచంలో కోకో పంట సాగు, దిగుబడులు తగ్గుతున్నాయి. తెగుళ్లు రావడం, వాతావరణ మార్పులు సాగుపై బాగా ప్రభావం చూపుతున్నాయి. అయితే రాష్ట్రంలో మాత్రం ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తూ లాభసాటి సేద్యంగా మార్చుకుంటున్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి కోకో హబ్‌గా తయారవుతుందని కేంద్రీయ వన్య పంటల పరిశోధనా సంస్థ (సీపీసీఆర్ఐ) విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప చెప్పారు. 'కోకో కాంక్లేవ్'లో పాల్గొనేందుకు ఇటీవల ఏలూరు వచ్చిన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు.

? కోకో సాగులో ఏపీ నంబరు-1గా అయ్యేందుకు ఉన్న అనుకూలతలు ఏమిటి?

కోకో సాగుకు సారవంతమైన భూములు, నీటి వసతి రాష్ట్రంలో విస్తారంగా ఉంది. ఇది చెట్ల నీడన సాగవుతుంది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, విశాఖ, విజయనగరం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో ఆ చెట్ల నీడన కోకో సాగు చేస్తున్నారు. దీనివల్ల నీడ సమస్యే లేకుండా పోయింది.. ఇవన్నీ అనుకూలతలు. రాష్ట్రంలో ప్రస్తుతం 40 వేల హెక్టార్లలో మాత్రమే ఇది ఉంది. 3 లక్షలకు పైగా హెక్టార్లలో ఇంకా దీని సాగుకు అవకాశం ఉంది. ఇక్కడ రైతులకు పెట్టుబడి పెట్టే సామర్థ్యం.. కష్టపడి పనిచేసే తత్వం ఉండటం వల్ల సాగు విజయవంతమవుతోంది.

? అంతర్‌పంటగా కోకో విజయవంతం కావడానికి కారణం?

కోకో సాగుకు ప్రత్యేకంగా భూమి అవసరం లేదు. కొబ్బరి, ఆయిల్‌పామ్‌తోటల్లో ఇది అంతర పంటగా వేయటం వల్ల రైతుకు దీనిపై లాభమే తప్ప నష్టం ఉండదు. మిగిలిన పంటలు దెబ్బతిన్నా ఇది నికర ఆదాయాన్నిస్తుంది. అందుకే కోకో కాసుల పంటగా మారింది. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలకు వేసే ఎరువే దీనికి సరిపోతుంది. ఎకరానికి 750 కిలోల ఆకులు రాలుతాయి. ఇవి నేలను కప్పి ఉంచుతాయి. కలుపు మొక్కలు రావు. ఆకులు భూమిపై పరుచుకోవడం వల్ల తేమశాతం ఉంటుంది. ఆకులు ఎండి, కుళ్లిపోయి ఎరువుగా మారుతుంది. ఇది భూమికి చాలా బలం. ఇవన్నీ దిగుబడుల్ని పెంచేవే.

? ఇతర దేశాల్లో కోకో సాగును ప్రజలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

కోకోకు ప్రసిద్ధిగాంచిన ఘనా, తూర్పు ఆఫ్రికా, బ్రెజిల్ సహా ఆసియా దేశాల్లో అడవులను ధ్వంసం చేసి సాగు చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పంటను కొనుగోలు చేయకూడదని ఆంక్షలు విధించుకోవడంతో సాగు విస్తీర్ణం పడిపోతోంది. అటవీభూముల్లో నీడ, నీటి వసతి లోపించడం.. తెగుళ్ల వ్యాప్తితో దిగుబడులు తగ్గుతున్నాయి. బాల కార్మికులను వినియోగించడం వంటివి కూడా సాగు తగ్గిపోవడానికి కారణమే. భారత్‌తో పోలిస్తే ఆ దేశాల్లో చెట్ల వయసు కొంచెం ఎక్కువ. ఇప్పటికే వాటి వయసు 40-50 ఏళ్ల మధ్య ఉండటంతో దిగుబడులు తగ్గుతున్నాయి. మూడేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమై 60 ఏళ్ల వయసు వచ్చే దాకా కోకో కాయలు కాస్తుంది.

? తొలుత కేరళ, కర్ణాటకలో కోకో సాగు ప్రారంభమైనా ఏపీ మొదటి స్థానంలో నిలబడటానికి కారణాలు ఏమిటి?

కేరళ, కర్ణాటకల్లో 1970లో ప్రారంభమైనా 30 ఏళ్ల తర్వాత కోకో సాగు ప్రారంభించిన ఏపీ ప్రస్తుతం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో కేరళ, కర్ణాటక ఉన్నాయి. ఏపీ రైతులు కష్టపడి పనిచేయడం, యాజమాన్య పద్ధతులు అవలంబించడం వల్ల రాష్ట్రంలో హెక్టార్‌కు అత్యధికంగా 1200 కిలోల గింజలు వస్తున్నాయి. ప్రపంచంలో దీని సగటు ఐదారు వందల కిలోలు. ఆంధ్రప్రదేశ్‌లో 40 వేల హెక్టార్లలో ఏటా 12-13 వేల టన్నుల ఉత్పత్తి వస్తోంది. దేశం మొత్తం మీద వచ్చేది 30 వేల టన్నులే. మొత్తం ఉత్పత్తిలో 40 శాతం ఏపీ నుంచే సమకూరుతోంది.

? వినియోగం ఎలా ఉంది?

ప్రపంచంలో చాక్లెట్లు దాని అనుబంధ ఉత్పత్తులకు 5 మిలియన్ టన్నుల కోకో గింజలు అవసరం. భారత్‌లో 2030 నాటికి 1.25 లక్షల టన్నులు కావాలి. ఏపీ గ్లోబల్ హబ్ కావాలంటే 2040 నాటికి 5 లక్షల టన్నుల ఉత్పత్తికి చేరుకోవాలి. అది సాధ్యపడాలంటే ఏటా 10 వేల హెక్టార్లలో అదనంగా పంట పెంచాలి.

? ఇంత పెద్ద మొత్తంలో మొక్కలు సమకూర్చుకోవటం ఎలా?

ప్రస్తుతం దేశం మొత్తానికి కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కాసరఘడ్‌లోని సీపీసీఆర్ఐ నుంచి సరఫరా చేస్తున్నారు. వీటిలో ఏటా 40-50 లక్షల మొక్కలే పెంచుతారు. ఒక్క ఏపీకే 25-30 లక్షల కొత్త మొక్కలు కావాలి. అందుకు స్థానిక రైతులు కలెక్టివ్‌గా ఏర్పడి మదర్ ప్లాంటేషన్ నుంచి మంచి దిగుబడులు వచ్చే మొక్కలను పెంచి సరఫరా చేయాలన్న అభిప్రాయం ఏలూరులో జరిగిన కోకో కాంక్లేవ్‌లో వ్యక్తమైంది. దీనిపై ఉద్యానశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

? మార్కెటింగ్.. నాణ్యత ప్రమాణాల సమస్య ఉంది కదా?

మార్కెటింగ్, నాణ్యత ప్రమాణాల పాటింపునకు కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా రైతులకు శిక్షణ ఇస్తున్నాయి. కోకో గింజలు పులియబెట్టడం, ఆరబెట్టుకుని మంచి నాణ్యమైన గింజలను ఉత్పత్తి చేసేందుకు సోలార్ డ్రయ్యర్లు, బాక్సులు అందిస్తోంది. చాక్లెట్ తయారీ కంపెనీల ప్రతినిధులతో శిక్షణలు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.

గ్రహం అనుగ్రహం


9-2-2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
అష్టమి: పూర్తి, విశాఖ: పూర్తి
వర్జ్యం: మ. 12-01 నుంచి 1-46 వరకు
అమృత ఘడియలు: రా. 10-34 నుంచి 12-19 వరకు
దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-21 వరకు తిరిగి 2-52 నుంచి 3-37 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.34; సూర్యాస్తమయం: సా.5.54

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.7	31.3
విజయనగరం	15.0	30.0
హైదరాబాద్	15.5	31.4
నిజామాబాద్	16.8	31.5
అనంతపురం	17.5	34.6
రాజమహేంద్రవరం	17.5	36.0
విశాఖపట్నం	18.0	30.0
శ్రీకాకుళం	18.0	32.0
కడప	18.0	33.0
మహబూబ్‌నగర్	18.2	34.9
విజయవాడ	18.7	31.7
నల్గొండ	18.8	30.0
గుంటూరు	19.0	33.0
తాడేపల్లిగూడెం	19.0	33.0
కర్నూలు	19.2	34.0
నరసాపురం	20.6	32.4
ఒంగోలు	20.6	33.9
నెల్లూరు	21.5	33.5
సూర్యాపేట	22.5	32.0

ఇదీ సంగతి!



సమాధానం చెప్పినా బుద్ధి రాకపోతే ఏం చేయాలి సార్!

రూ.9 వేల కోట్లతో.. ట్రాన్స్‌కో నెట్‌వర్క్ బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదించిన వాటితో కలిపి సుమారు 108 పనుల పూర్తికి నిర్దేశిత గడువుతో రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. తొలిదశలో తక్కువ వ్యవధిలో పూర్తిచేసేందుకు అవకాశం ఉన్న పనులపై దృష్టిపెట్టారు.

అసంపూర్తి పనులపై దృష్టి

ఇప్పటికే ప్రారంభమై అసంపూర్తిగా నిలిచిన విద్యుత్ సరఫరా పనుల పూర్తికి కాలవ్యవధి నిర్దేశించారు. ఇలాంటివి సుమారు రూ.6,000 కోట్లతో చేపట్టిన 60 పనులు ఉన్నాయి. వీటిలో 20%లోపు పెండింగ్ ఉన్నవాటిపై దృష్టి పెట్టి, రాబోయే 2 నెలల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా గడువు నిర్దేశించారు. అలాంటి పనుల విలువ సుమారు రూ.2,000 కోట్లు. వీటిలో సర్క్యూట్ లైన్లు.. సబ్‌స్టేషన్ల నిర్మాణం వంటివి ఉన్నాయి.

- నెట్‌వర్క్ బలోపేతం కోసం కొత్తగా 132/220/400 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు రూ.2,500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తంగా 48 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచి, గుత్తేదారులకు పనులు అప్పగించాలని నిర్ణయించారు.
- కొత్తగా ఏర్పాటు చేసే విద్యుత్ సరఫరా లైన్ల కోసం 'మోనో పోల్స్' వినియోగిస్తున్నారు. ఇవి టవర్ పోల్‌తో పోలిస్తే.. తక్కువ స్థలంలో ఏర్పాటు చేసే వెసులుబాటు ఉంటుంది. దీంతోపాటు బలంగా వీచే గాలులకు దెబ్బతినే అవకాశం తక్కువగా ఉంటుందని, ఇప్పటికే కొన్నిచోట్ల వాటిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆ ఫోన్ నంబర్ వైవీ సుబ్బారెడ్డిదే!

(మొదటి పేజీ తరువాయి)

సేవ్ చేసుకున్నట్లు, ఆ నంబర్‌తోనే చిన్నప్పన్న అక్రమ కార్యకలాపాలు నడిపించినట్లు దీన్నిబట్టి అర్థమవుతోంది. తితిదేలో నెయ్యి, ఇతర సరకులకు సంబంధించిన టెండర్లపై కొనుగోలు కమిటీ సిఫార్సులు కూడా బోర్డు మీటింగ్ కంటే ముందు ప్రొక్యూర్‌మెంట్ జీఎం అధికారిక మెయిల్ నుంచి చిన్నప్పన్నకే వెళ్లేవని సిట్ అభియోగపత్రంలో పేర్కొంది. 2019-2023 వరకూ సుబ్బారెడ్డి తితిదే ఛైర్మన్‌గా ఉన్న సమయంలో చిన్నప్పన్న అతని పీఏగా పనిచేసినట్లు సిట్ వెల్లడించింది.

10. The forensic Analysis report vide No. SFSL(AP)/972/CBF/244/2025 dated 23.06.2025 of Sri Rallapalli Srinivasa Sri Venkata Rama Subrahmanyam @ RSSVR Subrahmanyam (A-29), S/o Late. R. Someswara Rao, Executive Engineer-I, TTD, formerly worked as General Manager (Procurement), TTD disclosed that he has acquaintance with Shri KaduruChinnappanna (A-24). The mobile number of Shri KaduruChinnappanna (A-24) saved as PS to Chairman.

ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం మొబైల్‌లో చిన్నప్పన్న ఫోన్ నంబర్‌ను 'పీఎస్ టూ ఛైర్మన్' అని సేవ్ చేసుకున్నట్లు ఫోరెన్సిక్ విశ్లేషణలో వెల్లడైందని పేర్కొన్న సిట్ రిపోర్టు

కాల్స్ చేసింది చిన్నప్పన్నే.. చేయించింది ఎవరో తెలీదా?

● తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ హోదాలో చిన్నప్పన్న తితిదే వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారని, నెయ్యి సరఫరాదారుల నుంచి లంచం డిమాండ్ చేసి మరీ తీసుకున్నారని సిట్ అభియోగపత్రంలో వెల్లడించింది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్‌కు కాల్ చేసి దిల్లీ రప్పించి, తిరుమలకు నెయ్యి సరఫరా చేయాలంటే కిలోకు రూ.25 చొప్పున లంచమివ్వాలని డిమాండ్ చేసినట్లు సిట్ పేర్కొంది.

● 'తితిదే నెయ్యి సరఫరా టెండర్ల వ్యవహారంలో మాట్లాడేందుకు దిల్లీకి రావాలని ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తాకు 2022 మే నెలలో చిన్నప్పన్న కాల్ చేయగా.. దిల్లీ నార్త్ ఎవెన్యూలోని ఎంపీ నివాస్‌లో చిన్నప్పన్నను జగ్‌మోహన్ గుప్తా కలిశారు. తితిదేకు నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్టు కావాలంటే తమకు కిలోకు రూ.7 చొప్పున లంచమివ్వాలని చిన్నప్పన్న డిమాండ్ చేయగా అందుకు జగ్‌మోహన్ గుప్తా అంగీకరించారు. ఆ తర్వాత ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు తితిదేకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు లభించింది. లంచం సొమ్ము రాబట్టుకోవటం కోసం చిన్నప్పన్న జగ్‌మోహన్ గుప్తాతో నిరంతరం ఫోన్లో టచ్‌లో ఉండేవారు. 2022 నుంచి 2023 మధ్య జగ్‌మోహన్ గుప్తా నుంచి హవాలా మార్గాల్లో చిన్నప్పన్న రూ.50 లక్షలు లంచంగా తీసుకున్నారు' అని సిట్ తేల్చింది.

● తితిదే అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యానికి కాల్ చేసి తితిదేకు నెయ్యి సరఫరా చేసే వారి ఫోన్ నంబర్లు, వివరాలను చిన్నప్పన్నే తీసుకున్నారని సిట్ గుర్తించింది. అంతేకాదు.. 2022 ఏప్రిల్/మే మధ్యలో కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్‌తోనూ చిన్నప్పన్న ఇదే నంబర్‌తో మాట్లాడేవారని తేలింది.

● 95424 19999 నంబర్ చిన్నప్పన్నదిగా సిట్ అభియోగపత్రంలో పేర్కొంది. అంటే కల్తీ నెయ్యికి సంబంధించిన నేరంలో ఆయన ఈ నంబరే వినియోగించారని అర్థం. అంటే నెయ్యి సరఫరాదారులను తమ దగ్గరకు రప్పించుకోవటానికి, వారి నుంచి లంచాలు తీసుకోవటానికి చిన్నప్పన్న సుబ్బారెడ్డి ఫోన్ నంబరే వాడారనేది తేటతెల్లమవుతోంది.

● సుబ్బారెడ్డి నంబర్‌తో కల్తీ నెయ్యి వ్యవహారంలో అక్రమాలకు పాల్పడేందుకు, లంచాలు వసూలు చేసేందుకు కాల్స్ చేసింది చిన్నప్పన్నే కావచ్చు.. చేయించింది ఎవరో సిట్‌కు అర్థం కాలేదా? వైఎస్ వివేకా హత్య కేసు తరహాలో దర్యాప్తును అర్ధంతరంగా ముగించేయకుండా.. ఈ అంశాలన్నీ వెలికితీయాలి.

లంచం అడుగుతున్నారని చెప్పినప్పుడే కేసు ఎందుకు నమోదు చేయించలేదు?

● 'మీ పీఏ చిన్నప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం అడుగుతున్నారు' అని భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్ 2022 మే 25న వైవీ సుబ్బారెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు సిట్ గుర్తించింది. నిజంగా అప్పటికి చిన్నప్పన్న తన పీఏ కాకపోతే సుబ్బారెడ్డి ఆ విషయాన్ని పొమిల్ జైన్‌కు ఎందుకు చెప్పలేదు? తన పేరు దుర్వినియోగం చేస్తూ లంచం అడుగుతున్నందుకు చిన్నప్పన్నపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించకుండా ఎందుకు ఊరుకున్నారు? దీన్నిబట్టే సుబ్బారెడ్డి, చిన్నప్పన్నల మధ్య ఎంతటి గాఢానుబంధం పెనవేసుకుందో అర్థమవుతుంది.

● భోలేబాబా డెయిరీపై చిన్నప్పన్న 2022 మే 16న వైవీ సుబ్బారెడ్డికి ఓ ఫిర్యాదివ్వగా.. దాన్ని ఆయన అప్పటికప్పుడు ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యానికి అందజేసి విచారించాలని ఆదేశించారు. అంతకు ఒక రోజు ముందే చిన్నప్పన్న భోలేబాబా డైరెక్టర్ పొమిల్ జైన్‌ను కిలోకు రూ.25 చొప్పున లంచం అడిగారు. దానికి నిరాకరించినందుకే మర్నాడు ఫిర్యాదిచ్చారు. నిజంగా చిన్నప్పన్నతో సుబ్బారెడ్డికి ఎంతటి అనుబంధముందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

సుబ్బారెడ్డి లెటర్‌హెడ్‌ను ట్వీట్ చేసిన జగన్..

'కేంద్ర ప్రభుత్వంపై వైకాపా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఏపీ ప్రజల హక్కుల కోసం ప్రత్యేక హోదా సాధించే పోరాటాన్ని మేము నిరంతరం కొనసాగిస్తాం' అని పేర్కొంటూ వైకాపా అధినేత జగన్ 2018 మార్చి 15న ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌తో పాటు అప్పట్లో లోక్‌సభ సభ్యుడిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి లెటర్ హెడ్‌పై ఇచ్చిన నోటీసును తన ట్వీట్‌కు జతపరిచారు. ఆ లెటర్‌హెడ్‌పై సుబ్బారెడ్డి పేర్కొన్న నంబర్లలో.. 95424 19999 ఫోన్ నంబరు ఉండటం గమనార్హం.

సీడీఆర్, టవర్ డంప్ లొకేషన్లు, గూగుల్ టేకవుట్ తీస్తే.. గుట్టు రట్టు

కల్తీ నెయ్యి కేసులో అక్రమాల కోసం సుబ్బారెడ్డి నంబర్‌నే చిన్నప్పన్న వినియోగించారనేది స్పష్టమైపోయింది. అయితే అక్రమాలకు పాల్పడేందుకు, లంచాలు వసూలు చేసేందుకు కాల్స్ చేసింది చిన్నప్పన్నే కావొచ్చు.. తెరవెనక నుంచి చేయించింది ఎవరో తేలాలంటే సిట్.. సీడీఆర్ (కాల్ డిటెయిల్ రికార్డ్స్), టవర్ డంప్, గూగుల్ టేకవుట్ వంటివి వెలికితీసి విశ్లేషిస్తే అసలు 'కుట్రదారు' బయటపడతారు. చిన్నప్పన్న ఏయే సమయాల్లో ఎవరెవరికి కాల్స్ చేశారు? ఆ సమయంలో ఆయన ఏ టవర్ లొకేషన్‌లో ఉంటూ కాల్స్ చేశారు? ఆ ప్రాంతం ఎవరి చిరునామా? ఆ సమయంలో అతనితో అదే లొకేషన్‌లో ఇంకా ఏయే నంబర్లు ఉన్నాయి? అవి ఎవరివి? ఇలాంటివన్నీ సిట్ లోతుగా దర్యాప్తు చేస్తేనే అసలు దొంగలు బయటపడతారు.



95424 19999 నంబరుకు ట్రూ కాలర్‌లో డయల్ చేస్తే కనిపిస్తున్న చిన్నప్పన్న పేరు

ట్రూ కాలర్‌లో చూస్తే ఇప్పటికీ చిన్నప్పన్న పేరుతోనే..

95424 19999 నంబర్‌ను ట్రూ కాలర్‌లో నమోదు చేసి చూస్తే ఇప్పటికీ కదురు చిన్నప్పన్న అనే పేరుతోనే వస్తోంది. ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. 'మీరు డయల్ చేసిన నంబర్ పనిచేయట్లేదు. దయచేసి నంబర్‌ను చెక్ చేసుకోండి' అని వస్తోంది.

● 95424 19999 నంబర్ ఎవరి పేరుతో ఉంది? చిన్నప్పన్న పేరుతోనా? సుబ్బారెడ్డి పేరుతోనా? ఆ నంబర్ చిన్నప్పన్న పేరుతో ఉంటే సుబ్బారెడ్డి తన అధికారిక లెటర్‌హెడ్‌పై ఆ నంబర్ ఎందుకు వేశారు? అంటే పీఏల నంబర్లు అధికారిక లెటర్‌హెడ్‌పై ముద్రిస్తారా? సుబ్బారెడ్డి పేరుతోనే ఉంటే.. ఆయన తితిదే ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఆ నంబరు చిన్నప్పన్న దగ్గర ఎందుకుంది? ఆయన ఎలా వాడారు? ఆ నంబరుతో అక్రమ వ్యవహారాలన్నీ ఎలా నడిపారు? దీన్ని బట్టే వారిద్దరి మధ్య బంధం ఎలాంటిదో అర్థమైపోతుంది. అయితే సిట్ మాత్రం ఎవర్ని కాపాడటానికో, ఏమో కానీ ఇలాంటి వాటిపై కనీస దర్యాప్తు కూడా చేయలేదు. ఆ నంబరు గుట్టు రట్టు చేయకుండా వదిలేసింది.

కల్తీ నెయ్యి విషయంలో మాజీ సీఎంను బాధ్యుడిని చేయాలి

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



ఈనాడు, విశాఖపట్నం: కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూలు తయారు చేసి.. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా చేసిన వారందరిపై చర్యలు ఉండేలా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బాధ్యుడిని చేయాలన్నారు. ఆయనకు హిందువుల మనోభావాలపై నమ్మకం లేదని, డబ్బుకు కక్కుర్తి పడి ఇంత దారుణానికి ఒడిగట్టారన్నారు. ఆదివారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా దేవాలయాలపై దాడులకు పాల్పడ్డారు. విగ్రహాల తలలు నరికారు. రథాలను తగలబెట్టారు. ఇప్పుడు తిరుమల లడ్డూకు ఉపయోగించిన నెయ్యిని కల్తీ చేశారు. కల్తీ జరిగిందని మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెబుతుండగా, మాజీ సీఎం జగన్ మాత్రం కల్తీ జరగలేదంటున్నారు. వారి మాటలు హిందువులను బాధించాయి. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని బయటపడితే ప్రజలు ఎలా స్పందిస్తారో అనేది మేము ఆలోచించాం. అయినా వాస్తవాలు బయటపెట్టాలి. వీటన్నింటిపై త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తాం' అని పల్లా చెప్పారు.

కల్తీ నెయ్యి వ్యవహారం వైకాపా నాయకులకు ముందే తెలుసు

మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి టౌన్, న్యూస్‌టుడే: 'తిరుమలలో గత ప్రభుత్వ సమయంలో వాడిన నెయ్యి అసలైనది కాదనే విషయం వైకాపా నాయకులకు ముందే తెలుసు. అయోధ్య లడ్డూల కోసం ప్రత్యేకంగా నెయ్యి తెప్పించామని వారు చెప్పడమే ఇందుకు నిదర్శనం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తిరుమల లడ్డూ విషయంలో కల్తీ జరిగిందని సిట్ నివేదిక స్పష్టం చేసింది. అయినా వైకాపా నాయకులు ఎదురుదాడి ధోరణితో మాట్లాడటం దుర్మార్గం. తప్పు జరిగిందని అంగీకరించి భక్తులకు క్షమాపణ చెప్పాల్సినవారు రోడ్లపై హడావుడి చేస్తున్నారు. ఇంకా ప్రజలను ఇబ్బంది పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఈ అంశంపై రాజకీయాలకు అతీతంగా మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలు, బాధ్యత కలిగిన వ్యక్తులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి వాస్తవాలను విశ్లేషించాలి. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆలోచన ఎప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడడమే. ఇతర మతాలను కించపర్చడం కాదు' అని మనోహర్ పేర్కొన్నారు.

నిందితులను శిక్షించాలంటూ జనసేన ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పసుపులేటి హరిప్రసాద్, జనసేన నేతలు, కార్యకర్తలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి కేసులో నిందితులను శిక్షించాలని, సిట్ పేరిట క్లీన్‌చిట్ వచ్చిందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్న భూమన కరుణాకరరెడ్డి తదితరులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ జనసేన నేతలు, కార్యకర్తలు తిరుపతిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. నెయ్యి కల్తీకి పాల్పడిన వైకాపా నాయకులకు త్వరగా శిక్షపడేలా చూడాలని శ్రీవేంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. అంతకుముందు హరేరామ హరేకృష్ణ ఆలయం నుంచి గరుడ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్, వైవీ సుబ్బారెడ్డిలను వెంటనే అరెస్టు చేయాలి

విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్

ఈనాడు, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్, తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి వెంటనే అరెస్టు చేయాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ డిమాండ్ చేశారు. నెయ్యి కల్తీని పొరపాటుగా చూడలేమని, ఇది వారి ఉద్దేశపూర్వక హిందూ వ్యతిరేక మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. "హిందూ సమాజ అస్తిత్వం, నమ్మకాలు, దేవాలయ సంప్రదాయాలపై దీర్ఘకాలికంగా హిందూ ద్రోహులు చేస్తున్న వ్యవస్థీకృత దాడుల్లో కల్తీ నెయ్యి వ్యవహారం కూడా ఒకటి. రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న దేవాలయాల్లో లోపభూయిష్ట నిర్వహణకు ఈ ఘటన అద్దం పడుతోంది. జగన్ ప్రభుత్వంలో రసాయనాలతో చేసిన నెయ్యిని తిరుమల లడ్డూ తయారీకి వాడారని చంద్రబాబు వ్యాఖ్యల ద్వారా తెలియడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్తులో ఇలాంటి కుట్రల నుంచి దేవాలయాలు, హిందూ ఆచారాలను రక్షించేందుకు ఈ దిశగా చంద్రబాబు దృఢమైన, స్పష్టమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాం" అని వినోద్‌బన్సల్ పేర్కొన్నారు.

హెరిటేజ్ ఫుడ్స్ పెరుగులో వెన్న లేదనేది దుష్ప్రచారమే

● సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవం

● మేం అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటిస్తాం

● హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ సీవోవో సాంబమూర్తి

ఈనాడు, అమరావతి: హెరిటేజ్ ఫుడ్స్ పెరుగులో వెన్న లేదంటూ జరుగుతున్నది దుష్ప్రచారమేనని ఆ సంస్థ ఖండించింది. హరియాణాలో హెరిటేజ్ ఫుడ్స్ ఉత్పత్తి చేసిన పెరుగులో వెన్న శాతం లేదంటూ సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవమని ఆ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జె.సాంబమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించే హెరిటేజ్ ఫుడ్స్‌కు తమ ఉత్పత్తుల్లో వెన్న శాతాన్ని తగ్గించే ఆలోచన ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు. వినియోగదారుల్ని, పాఠకుల్ని పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతోనే సాక్షి పత్రిక అసత్య కథనాన్ని ప్రచురించిందని పేర్కొన్నారు. 'గతేడాది డిసెంబరు 18న జారీ అయిన నోటీసుపై.. గురుగ్రామ్‌లోని ఫుడ్‌సేఫ్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్‌లో అప్పీలు చేసి హెరిటేజ్ ఫుడ్స్ స్టే ఉత్తర్వులు పొందింది. విచారణ పూర్తయ్యేవరకూ జరిమానాను కూడా నిలిపేస్తూ ట్రైబ్యునల్ ఉత్తర్వులిచ్చింది. వివిధ ఉత్పత్తుల తయారీలో, నాణ్యతలో రాజీలేని ప్రక్రియను హెరిటేజ్ ఫుడ్స్ అనుసరిస్తోంది. అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. హెరిటేజ్ ప్రకటనలోని ప్రధానాంశాలివి..

నమూనాల సేకరణలో సరైన విధానాలు పాటించలేదు..

● పరీక్షల కోసం నమూనాల సేకరణలో సరైన విధానాలు పాటించలేదు. ఆ ప్రక్రియలో అనేక లోపాలున్నాయి. ● ల్యాబ్ నివేదిక ప్రకారం చూస్తే ఎస్ఎన్ఎఫ్ స్థాయి నిర్దేశిత ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీనిని బట్టి వెన్న శాతాన్ని తగ్గించి వాణిజ్యపరంగా లాభపడాలనే ఉద్దేశం హెరిటేజ్‌కు లేదని స్పష్టమవుతోంది. ● మా సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, తప్పుదారి పట్టించేలా ఉన్న దుష్ప్రచారాలను ఎవరూ విశ్వసించొద్దు.

తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే ఊరుకోం

● తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

● దేవాలయ వ్యవస్థల ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● 'కమల వికాసం'లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



మాట్లాడుతున్న మాధవ్. చిత్రంలో సామంచి శ్రీనివాస్, వరప్రసాద్ తదితరులు

ఈనాడు డిజిటల్, తిరుపతి: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామికి అపచారం జరిగితే భాజపా చూస్తూ ఊరుకోదని, తిరుమల పవిత్రతకు భంగం కలిగించే శక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఆస్కారమిచ్చేలా జీవోలు తెచ్చినప్పుడు తమ పార్టీ పోరాడిందని గుర్తుచేశారు. తిరుపతిలో ఆదివారం జరిగిన 'కమలవికాసం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో అనేక అపచారాలు జరిగాయి. బాధ్యులకు కచ్చితంగా శిక్ష పడుతుంది. ఆలయాల పవిత్రతను కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులతో చర్చలు జరిపాం' అని తెలిపారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని, మార్చి 31 నాటికి 'నక్సల్స్ ముక్త భారత్' సాకారమవుతుందని మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా 'సారథ్యం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, వాజ్‌పేయీ స్ఫూర్తితో రూపొందించిన ఈ కార్యాచరణలో భాగంగా 'మన ఊరు-మన జెండా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాధవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా భాజపా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఏడాది నివేదికను విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

● ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని, గూగుల్, క్వాంటమ్ లాంటి సంస్థలు రావడానికి కారణం భాజపాయేనని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కోసం గట్టిగా కొట్లాడాలని, అధిక కోటా దక్కించుకోవడానికి సిద్ధంగా ఉండాలని వేదికపై ఉన్న నేతలకు దిశానిర్దేశం చేశారు.

అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం

మదనపల్లె గ్రామీణ, సదుం, న్యూస్‌టుడే, ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లె, కంభవారిపల్లె గ్రామాల్లో ఇటీవల పెద్ద సంఖ్యలో నాటుకోళ్లు మరణించాయి. పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమై ఆ కోళ్ల నమూనాలను భోపాల్ ఎన్ఐహెచ్ఎస్ఏడీ ల్యాబ్‌కు పంపించారు. పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లెలో చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు ఆదివారం నిర్ధారించారు. కంభవారిపల్లె గ్రామానికి సంబంధించి నివేదిక రావాల్సి ఉంది. మరోవైపు మదనపల్లె మండలంలో మృతి చెందిన కోళ్లను కొత్తవారిపల్లె పంచాయతీ సీటీఎం పెద్దచెరువులో వేయగా అధికారులు అప్రమత్తమై గుంతలు తవ్వి పూడ్చారు. బర్డ్ ఫ్లూపై వదంతులు, అసత్యాలు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మదనపల్లెలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. అనుమానాల నివృత్తికి 70139-14401, 93982-62752 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. 100 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలో ఉడికించిన చికెన్, గుడ్లు తినడం సురక్షితమని, సగం వండిన మాంసం, గుడ్లు తినవద్దని అధికారులు సూచించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలో ఇటీవల కోళ్ల మరణాలు సంభవించిన నేపథ్యంలో ఇక్కడి నమూనాల్నీ భోపాల్ ల్యాబ్‌కు పంపించారు.

ఆందోళన వద్దు: అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పక్షులు, కోళ్ల ఆకస్మిక మరణాల నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. బర్డ్ ఫ్లూపై ప్రజలెవరూ ఆందోళన చెందొద్దు. బర్డ్‌ఫ్లూ అనేది పక్షులకు సంబంధించిన వ్యాధి మాత్రమే. మనుషులకు సంక్రమించదు.' – టి.దామోదర్‌నాయుడు, పశుసంవర్ధకశాఖ సంచాలకులు

చిరస్మరణీయుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి

● కొనియాడిన వక్తలు

● ఏబీ వెంకటేశ్వరరావు, చల్లపల్లి స్వరూపారాణికి పురస్కారాల ప్రదానం





చల్లపల్లి స్వరూపారాణికి త్రిపురనేని రామస్వామిచౌదరి పురస్కారాన్ని అందజేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏబీ వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జయసుధ ★ ఏబీ వెంకటేశ్వరరావుకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, గుంటూరు (నెహ్రూనగర్): సాహిత్యాన్ని సాధనంగా చేసుకుని హేతువాద భావాలను వ్యక్తపరుస్తూ ప్రజలను మేల్కొలిపిన మహోన్నత వ్యక్తి కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి అని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-జాషువా-పులే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు సీపీఎం కార్యాలయంలోని సోమేపల్లి వెంకటసుబ్బయ్య ప్రాంగణంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. సభకు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు చల్లపల్లి స్వరూపారాణి, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావులకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. అతిథిగా హాజరైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తన తండ్రి రత్తయ్య తనకు చిన్ననాటి నుంచి త్రిపురనేని భావాలను తెలియజేసేవారన్నారు. అందరికీ సమాన అవకాశాలు రావాలని త్రిపురనేని కృషి చేశారన్నారు. ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్రిపురనేని బ్రాహ్మణ వ్యతిరేకి కాదని.. ధర్మం పేరుతో అన్యాయం చేసిన వారిని మాత్రమే గట్టిగా ప్రశ్నించారన్నారు. పురాణాలు, ఉపనిషత్తులను వడపోసి వాటిలో మంచి చెడులను స్పష్టంగా సమాజానికి తెలియజెప్పిన మొదటి వ్యక్తి అని గుర్తుచేశారు. తర్వాత ఆయన ఆలోచనలను ఎన్టీఆర్ పుణికిపుచ్చుకున్నారని వివరించారు. ఆచార్యులు చల్లపల్లి స్వరూపారాణి మాట్లాడుతూ త్రిపురనేని తన రచనలతో సైద్ధాంతిక పరమైన అవగాహన కల్పించారని, ఆయన రాసిన సూతపురాణం అందరూ చదవాలని చెప్పారు. త్రిపురనేని సాహిత్యసేవను మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కొనియాడారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జయసుధ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్- జాషువా-పులే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాతో మోదీ చీకటి ఒప్పందం

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: అమెరికాతో మోదీ ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. అమెరికా బెదిరింపులకు తలొగ్గి దేశప్రజల ప్రయోజనాల్ని ప్రధాని మోదీ తాకట్టు పెట్టారని ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. "సున్నా సుంకాలతో భారత మార్కెట్‌లోకి అమెరికా ఉత్పత్తుల్ని అంగీకరిస్తే అది స్వదేశీ ఉత్పత్తులకు మరణశాసనమే. దీనివల్ల రూపాయి భవితవ్యం దెబ్బతింటుంది. ఈ ఒప్పందం అమెరికాకే లాభదాయకం" అని షర్మిల పేర్కొన్నారు.



కొవ్వు కరగడం లేదంటే..

కొంతమంది బరువు తగ్గేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా శరీరంలో కొవ్వు కరగదు. ఇందుకు కారణాలను పరిశీలిస్తే..
✦ కార్టిసాల్ ✦ చిరుతిళ్లు ✦ శరీరాంతర్గత వాపు ✦ నిద్రలేమి ✦ హైపోథైరాయిడిజం ✦ బద్ధకంగా ఉండటం ✦ హార్మోన్ల అసమతౌల్యం ✦ సూక్ష్మపోషకాల లోపం ✦ జీవగడియారానికి భిన్నంగా తినడం.
వీటిని సరిచేసుకోవడం ద్వారా ఫలితం సాధించొచ్చు.
– ఆష్లే రిచ్‌మండ్, హెల్త్ కన్సల్టెంట్

పుస్తక హుండీ... నెల్లూరు ప్రత్యేకమండి!

చదివేసిన పుస్తకాలు, ఇక చదవాల్సిన అవసరం లేనివి ప్రతి ఇంట్లో ఒకటోరెండో ఉంటాయి. అలాంటి వాటిని ఒక్కచోట చేర్చి.. కావాల్సిన వారి చెంతకు చేర్చుతోంది.. 'పుస్తక విరాళ హుండీ'. ఒక్క పుస్తకమూ వృథా కాకూడదనే లక్ష్యంలో ఏపీ గ్రంథాలయ సంఘం నెల్లూరు జిల్లా శాఖ, ప్రజా సైన్స్ వేదిక, విజ్ఞాన ప్రచురణ సంఘాలు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. సేకరించిన వాటిని ఉచితంగా ఇస్తున్నాయి. తొలుత 2019లో నెల్లూరు నగరంలోని నెల్లూరు హాస్పిటల్ ప్రాంగణంలో పుస్తకాల హుండీని ఏర్పాటు చేశాయి.



నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన పుస్తక హుండీ వద్ద నిర్వాహకులు

స్పందన బాగుండటంతో నిర్వాహకులు గతేడాది స్థానిక చిల్డ్రన్స్ పార్కు వద్ద మరోటి పెట్టారు. హుండీలో వేసిన పుస్తకాలేకాక.. నిర్వాహకులు సేకరించిన వాటితో ప్రతి 2 నెలలకోసారి చిల్డ్రన్స్ పార్కు, అన్నమయ్య సర్కిల్, ఎన్టీఆర్ పార్కుల వద్ద ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ప్రదర్శనకు వెళ్లినవారు ఎవరైనా కావాల్సిన పుస్తకాలను ఉచితంగా తీసుకెళ్లొచ్చు. ఇప్పటి వరకు ఇలా 10 వేలకుపైగా పొత్తాలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రదర్శనగా ఉంచిన పుస్తకాలను పరిశీలిస్తున్న మహిళలు

– న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

తితిదే నెయ్యి కల్తీపై నిగ్గు తేల్చాలి

తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



హైదరాబాద్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదానికి సంబంధించిన కల్తీ నెయ్యిపై విచారణకు ఏకసభ్య కమిషన్‌ను వేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, వీలైనంత త్వరగా అసలు విషయం నిగ్గుతేల్చాలని గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలోని శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి కోరారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జంతుకొవ్వు కలపలేదని మాత్రమే సిట్ నివేదిక ఇచ్చిందని, అందులో ఏ పదార్థం కలిసిందో చెప్పలేదని పేర్కొన్నారు. ఈ కేసులో స్వాములు భాగస్వాములు కావడానికి ప్రభుత్వాన్ని అనుమతి కోరతామన్నారు.

మిద్దెతోట పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొర్నెపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో మిద్దెతోటల పెంపకంలో రాణిస్తున్నవారు 'తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోట పురస్కారాలు-2025'కు దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు కోరారు. రఘోత్తమరెడ్డి మిద్దెతోటల సాగుకు కృషిచేస్తున్నారని, ఆయన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు అందజేయనున్నామని చెప్పారు. ఆసక్తి గలవారు పేరు, చిరునామా, ఫోన్ నంబర్, మిద్దెతోట ఎప్పటినుంచి సాగు చేస్తున్నారు, తోట ఫొటోలు, 30 సెకన్ల వీడియోతో పాటు rythunestham.in/awards/2025.html వెబ్‌సైట్‌లో ఇచ్చిన దరఖాస్తు ఫారం నింపి editor@rythunestham.in కు ఈ నెల 15 లోపు మెయిల్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90775 59999 నంబరులో సంప్రదించాలని చెప్పారు.

ఈనాడు

సాంకేతిక లోకంలో మన ముద్రకోసం...

ఆధునిక సాంకేతిక అద్భుతమైన కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం అన్నింటా పెరుగుతోంది. జనరేటివ్ ఏఐ, ఎల్ఎల్ఎం, ఆరోగ్య సంరక్షణ, వ్యాధినిర్ధారణ, రిటైల్ తదితర రంగాల్లో కొత్త సంస్థల ఆవిర్భావానికి అది దారిచూపుతోంది. పనిపద్ధతుల్లో గుణాత్మక పరివర్తనను సాకారం చేసే కృత్రిమ మేధను మరింతగా అందిపుచ్చుకోవడానికి దేశీయంగా సరిపడా నిధులు కరవవుతున్నాయి. నిపుణుల లేమితనంతోనూ ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఏఐ ఆవరణ వ్యవస్థ బలంగా వేళ్లూనుకోకపోవడంతో వినియోగదారులను వేగంగా చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటన్నింటి వల్లా తమ వ్యాపారాల విస్తరణకుగానూ భారతీయ ఏఐ స్టార్టప్‌లు అమెరికా వైపు చూస్తున్నాయి. ఇప్పటికే అలాంటివి వందకు పైగా యూఎస్‌కు తరలివెళ్లడమో లేదంటే అక్కడ కాలుమోపేందుకు ప్రయత్నిస్తున్నట్లుగానో కథనాలు వెలువడుతున్నాయి. అవన్నీ మన ఏఐ పునాదులను పటిష్ఠపరచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. విభిన్న రంగాల్లో విప్లవాత్మక మార్పులను సుసాధ్యం చేయగల ఏఐని సుస్థిర ప్రగతికి ఆలంబనగా మలచుకోవడానికి ఇండియా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి!

ఏఐ కార్యకలాపాల్లో భారత్ క్రియాశీలకంగా ఉన్నప్పటికీ, పెట్టుబడులే సరిగ్గా అందిరావట్లేదు. స్టాన్‌ఫర్డ్ వర్సిటీ నివేదిక ప్రకారం 2013-24 మధ్య కృత్రిమ మేధలో అమెరికా దాదాపు 47వేల కోట్ల డాలర్లు, చైనా 12వేల కోట్ల డాలర్ల ప్రైవేటు నిధులు ఒడిసిపడితే- ఇండియా 11 వందల కోట్ల డాలర్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రపంచవ్యాప్త డేటాలో 20శాతం ఇండియా నుంచే పుట్టుకొస్తుంటే, స్థానికంగా నిల్వ సామర్థ్యం మాత్రం మూడుశాతానికే పరిమితమవుతోంది. ఏఐ మోడళ్ల శిక్షణకు ప్రాణసమానమైన జీపీయూల కొరత కారణంగా కృత్రిమ మేధా రంగంలో భారతదేశ లక్ష్యాల సాధన ఆలస్యమయ్యే ప్రమాదముందని ఆర్థిక సర్వే ఇటీవల హెచ్చరించింది. అలాగే, సెమీకండక్టర్ చిప్‌లకోసం విదేశాలపై ఆధారపడుతుండటం వల్ల ఖర్చు పెరుగుతోంది. ఇలాంటి సమస్యలు ఒకవైపు ఉంటే- మరోవైపు, దేశీయంగా అధిక శాతం సంస్థలు ఏఐని పూర్తిస్థాయిలో వాడటంలేదు. ఏఐ కోర్సులు కేవలం కొన్ని అగ్రశ్రేణి విద్యాసంస్థల్లోనే అందుబాటులో ఉన్నాయి. అత్యధిక శాతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలల్లో ఏఐ విభాగాలు, పాఠ్యప్రణాళికలే కొరవడ్డాయి. ఇవన్నీ కృత్రిమ మేధా ప్రపంచంలో భారత పురోగతిని దెబ్బతీస్తున్నాయి!

మన దేశంలో వచ్చే ఏడాది కల్లా ఏఐకి సంబంధించి 23 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు అందివస్తాయని అంచనా. ఉన్నత విద్యను సంస్కరించుకోకపోతే- నిపుణ మానవ వనరులు లేక పది లక్షల ఏఐ కొలువులు భర్తీకావన్న విశ్లేషణలు వెలుగుచూస్తున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా వంటిచోట్ల వలసదారుల విషయంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్నాయి. కాబట్టి, దేశీయంగా ఆధునిక సాంకేతిక వసతులను సమకూర్చుకుని, ఆయా రంగాల్లో కొలువులను ఒడిసిపట్టేలా విద్యార్థులను రాటుదేల్చాలి. అత్యున్నత ఉపాధి అవకాశాల కల్పనతో ప్రజ్ఞావంతులైన ప్రవాస భారతీయులను స్వదేశానికి రప్పించాలి. అందుకోసం ఏఐ మిషన్ కింద జీపీయూలను త్వరితగతిన అందుబాటులోకి తెచ్చుకోవాలి. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు కానుండటం మౌలిక వసతుల పరంగా కీలక ముందడుగే. ఏఐ పరిశోధనలను విరివిగా ప్రోత్సహిస్తూ, ముఖ్యంగా సొంత మోడళ్ల సృష్టిపై శ్రద్ధ వహిస్తే- ఏఐ పోటీలో అగ్రదేశాలకు దీటుగా ఇండియా దూసుకుపోతుంది!




కొత్తగా ఉద్యోగాలకు వచ్చేవారు ఊహాశక్తికి పదును పెట్టాలి. చుట్టూ ఉన్న మౌలిక సమస్యలను గుర్తించండి. వాటికి మెరుగైన పరిష్కారాన్ని కనిపెట్టగలరేమో ఆలోచించండి. కంఫర్ట్‌జోన్ లోంచి బయటికి వచ్చి రిస్క్ తీసుకోగలిగినవాళ్లే ఏదైనా సాధించగలరు. వయసు పెరిగేకొద్దీ రిస్క్ తీసుకునే శక్తి తగ్గిపోతుంది.

– నికేశ్ అరోరా, సీఈవో, పాలో ఆల్టో నెట్‌వర్క్స్

దాన ఫలం!

సర్వ ప్రాణుల పట్ల దయ ఉన్నవారిని దైవిక లక్షణాలు కలిగినవారిగా చెబుతారు. పవిత్ర భావనలతో, నిస్వార్థంతో జీవించేవారిని తాను వెన్నంటి ఉంటానంటాడు పరమాత్ముడు గీతలో. ఆధ్యాత్మిక సంపద కన్నా కాలంతో పాటు కరిగిపోయే భౌతిక సంపదల పట్ల అనురక్తిని పెంచుకుంటూ మోహంలో కూరుకుపోతున్నారు చాలామంది. తమ చుట్టూ ఎందరో అభాగ్యులు ఉన్నా సాయం చేసేందుకు వెనకాడుతున్నారు. దీనులకు ఉపకారం చేయడంవల్ల కలిగే ఫలితం పవిత్రత... పుణ్యతీర్థాలలో స్నానం చేసినా, తీవ్రమైన తపస్సు ఆచరించినా లభించవని స్కాందపురాణం చెబుతోంది. దీనులు, ఇతర ప్రాణుల పట్ల కరుణ ఉన్నవారికి ప్రపంచంలో దుర్లభమనేది ఉండదంటారు తులసీదాస్.

ఎవరైతే మనసును నిశ్చలభావంతో పరమాత్మ మీద ఉంచి అన్ని ప్రాణుల హితం కోరతారో వారు నిర్వాణ బ్రహ్మాన్ని పొందుతారని చెబుతోంది భగవద్గీత. ఒక రాజు తీర్థయాత్రలకు వెళ్తూ కొందరు ప్రజలను వెంటతీసుకెళ్లాడు. దారిలో ఓ వృద్ధుడు చలికి వణుకుతున్నాడు. రాజుతో సహా అంతా చూస్తూ ముందుకెళ్లిపోగా ఓ రైతు మాత్రం తనకున్న రెండు ధోవతుల్లో ఒకదాన్ని ఆ వృద్ధుడికి కప్పి వెళ్లాడు. ముందుకెళ్లేకొలదీ ఎండ తీవ్రత పెరిగింది. అయితే నడుస్తున్నవారిపై మాత్రం మేఘాలు నీడనిస్తూ అనుసరిస్తున్నాయి. వారంతా కొంతసేపు ఒకచోట విశ్రమించి తిరిగి బయలుదేరుతుండగా ఒక మహాత్ముడు ఎదురై అడిగాడు. 'రాజా ఎవరి గొప్పతనంతో మేఘాలు ఇలా మీకు నీడ గొడుగు పడుతూ వస్తున్నాయో తెలుసా?' అని. రాజు తన పుణ్య ప్రభావమేనని మనసులో అనుకున్నా పైకి చెప్పలేదు. 'మీరు ఒక్కొక్కరూ బయటికి వెళ్లండి. ఎవరి వెంట మేఘం వెళ్తుందో వారి పుణ్యప్రభావమేనని తెలుస్తుంద'ంటాడు. మొదట రాజు, ఆయనను అనుసరిస్తూ ఒక్కొక్కరుగా మిగిలినవారు బయటికి వెళ్లారు. కానీ మేఘాలు కదల్లేదు. చివరికి రైతు వంతు వస్తుంది. అప్పుడు మేఘాలు అతణ్ని అనుసరించాయి. అప్పుడు రాజుతో ఆ మహాత్ముడు 'నీకున్న అపార సంపదలో కొంత దానం చేస్తూ తద్వారా పుణ్యం ఆశిస్తున్నావు. కానీ ఆ రైతు తనకున్న రెండు ధోవతుల్లో ఒకదాన్ని ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఇచ్చేశాడు. పరమాత్ముడు కోరుకునేది ఇలాంటి నిష్కామ భక్తినే' అని వివరించాడు.



అంతర్యామి

జనకుడు, అశ్వపతి, దిలీపుడు వంటి కొంతమంది మహారాజులు ఎంతో సంపద ఉన్నా అదంతా భగవంతుడికి చెందినదని భావించడంతోనే వారి కీర్తి అజరామరమైంది. అహంకారం దానాన్ని కలుషితం చేస్తే.. ఆర్భాటం, గొప్పలకోసం చేసే దానం దైవత్వాన్ని కనుమరుగు చేస్తుందంటారు రామకృష్ణ పరమహంస. ఇతరుల కోసం జీవించేవారే సజీవులు. కేవలం తమ కోసమే జీవించేవారు జీవచ్ఛవాలు అంటారు స్వామీ వివేకానంద. నాది అన్న భావనతో కాక సర్వమూ బ్రహ్మమయం అనుకోవడమే అసలైన దైవీ సంపద.

– మెర్ల సత్య వెంకట త్రిమూర్తులు

శక్తిమంతమైన ఏఐ...
మానవాళికి అగ్నిపరీక్ష!

"కార్ల్ సాగన్ రాసిన ప్రఖ్యాత నవల 'కాంటాక్ట్' సినిమా వెర్షన్‌లో ఓ అద్భుత సన్నివేశం ఉంటుంది. గ్రహాంతరవాసుల నుంచి రేడియో సిగ్నల్ అందుకున్న ఖగోళ శాస్త్రవేత్తను అంతర్జాతీయ కమిటీ ఇంటర్వ్యూ చేస్తుంటుంది. అందులో 'ఒకవేళ గ్రహాంతరవాసులు సంప్రదిస్తే, వారిని మీరేం అడుగుతారు' అన్న ప్రశ్నకు ఆ శాస్త్రవేత్త ఇలా సమాధానం చెబుతారు... 'నేను వారిని ఒక్కటే అడుగుతాను. మీరు ఈ సాంకేతిక కౌమారదశను దాటి, మిమ్మల్ని మీరు నాశనం చేసుకోకుండా ఎలా మనుగడ సాగించారు? ఎలా పరిణామం చెందారు?'. సరిగ్గా మానవాళి ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) విషయంలో ఇదే దశలో ఉంది" అని ఏఐ సంస్థ ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ హెచ్చరిస్తున్నారు.





ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ నుంచి వచ్చిన క్లాడ్ ప్లగిన్‌లు టెక్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తన వెబ్‌సైట్‌లో ఆయన రాసిన ఒక వ్యాసం చర్చనీయాంశమవుతోంది. 'ది అడోలెసెన్స్ ఆఫ్ టెక్నాలజీ' పేరుతో రాసిన ఆ సుదీర్ఘ వ్యాసంలో ఏఐ భవిష్యత్తు, పొంచి ఉన్న ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డారియో సమగ్ర విశ్లేషణ చేశారు. మనం ఇప్పుడు అత్యంత శక్తిమంతమైన సాంకేతికతను చేజిక్కించుకునే దశలో ఉన్నామని, ఇది మానవజాతికి ఒక అగ్నిపరీక్ష వంటిదని, మన సామాజిక రాజకీయ వ్యవస్థలకు ఈ శక్తిని నిర్వహించే పరిపక్వత ఉందో లేదో తెలియని సందిగ్ధత నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు. డారియో అమోడెయ్ విశ్లేషణలోని కీలకాంశాలు ఆయన మాటల్లోనే...

"గతంలో నేను ఏఐ వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలను వివరించాను. ఇప్పుడు నాణేనికి మరోవైపు చూడాలి. ఏఐ వల్ల సర్వనాశనం తప్పదనే ధోరణికి, అలాగే ఏఐతో ముప్పేమీ లేదనే నిర్లక్ష్యానికి దూరంగా ఉంటూ.. వాస్తవిక దృక్పథంతో ఈ సమస్యను చూడాలి. 2023-24లో ఏఐ గురించి అనవసర భయాలు, సంచలన వ్యాఖ్యలు వినిపించాయి. 2025-26 నాటికి భయం పోయి, రాజకీయ నిర్ణయాలన్నీ ఏఐ అవకాశాల చుట్టూ తిరుగుతున్నాయి. ఇది ప్రమాదకరం. వాస్తవానికి 2023తో పోలిస్తే 2026లోనే మనం నిజమైన ప్రమాదానికి మరింత చేరువలో, ఏఐ చాలా శక్తిమంతంగా మారుతున్న దశలో ఉన్నాం. అందుకే భావోద్వేగాలకు తావులేకుండా, రాబోయే ముప్పును ఎదుర్కోవడానికి పటిష్ఠమైన 'యుద్ధ ప్రణాళిక'ను సిద్ధం చేసుకోవాలి.

అసలేంటి ఈ 'శక్తిమంతమైన ఏఐ'?

మనం మాట్లాడే చాట్‌బాట్ మాత్రమే కాదు ఇది. బయాలజీ, ప్రోగ్రామింగ్, గణితం, ఇంజినీరింగ్, రచన వంటి రంగాల్లో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్న వారికంటే తెలివైనది. క్లిష్టమైన గణిత సూత్రాలను పరిష్కరించడం, అత్యుత్తమ నవలలు రాయడం, సాఫ్ట్‌వేర్ కోడ్‌ను ప్రాథమిక స్థాయి నుంచి రాయడం దీనికి వెన్నతో పెట్టిన విద్య. కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా మనుషులు చేసే పనులన్నింటినీ (టెక్స్ట్, ఆడియో, వీడియో, ఇంటర్నెట్ ద్వారా) చేయగలదు. గంటలు, రోజుల తరబడి సాగే పనులను ఆటోమేటిక్‌గా పూర్తి చేయగలదు. ఒక స్మార్ట్ ఉద్యోగిలాగా అవసరమైనప్పుడు వివరణలు అడుగుతూ పని పూర్తి చేస్తుంది. కంప్యూటర్ ద్వారా ఇతర భౌతిక పరికరాలను, రోబోలను, ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌ను నియంత్రించగలదు.

శక్తిమంతమైన ఏఐని సులభంగా అర్థం చేసుకోవాలంటే.. ఒక డేటా సెంటర్‌లో 'మేధావుల దేశం' ఉన్నట్లు ఊహించుకోవచ్చు. ఒకసారి శిక్షణ పొందిన మోడల్ నుంచి లక్షల కాపీలను సృష్టించవచ్చు. ఇవి మనిషి కంటే 10 నుంచి 100 రెట్ల వేగంతో సమాచారాన్ని గ్రహించి పనిచేయగలవు. సుమారు 5 కోట్ల మంది అత్యంత తెలివైన వ్యక్తులు ఒకే చోట ఉండి, మనకంటే వంద రెట్ల వేగంతో పనిచేస్తే ఎంతటి శక్తి జనిస్తుందో ఊహించండి. ఆంత్రోపిక్ పరిశీలన ప్రకారం 'స్కేలింగ్ సూత్రాల' ఆధారంగా ఏఐ సామర్థ్యం విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఏఐ సొంతంగా కోడ్ రాస్తూ, తరవాతి తరం ఏఐ వ్యవస్థల తయారీని వేగవంతం చేస్తోంది. ఈ వేగం చూస్తుంటే ఈ ఏడాదిలోనో లేదా 2027 నాటికో పైన చెప్పుకొన్న శక్తిమంతమైన ఏఐ అందుబాటులోకి వచ్చే అవకాశాలు బలంగా ఉన్నాయి.

అయిదు రకాల పెనుముప్పులు

ఈ శక్తిమంతమైన ఏఐ వ్యవస్థ ఒక దేశం చేతికో, సంస్థ చేతికో చిక్కితే మనం ప్రధానంగా అయిదు రకాల ముప్పులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక జాతీయ భద్రతా సలహాదారు తన దేశాధినేతకు నివేదిక ఇస్తూ- 'ఈ శతాబ్దంలోనే అత్యంత ప్రమాదకరమైన జాతీయ భద్రతా ముప్పు ఇది' అని చెప్పే స్థాయిలో ఆ ప్రమాదాలు ఉంటాయి. అవేంటంటే...

1 *స్వయంప్రతిపత్తి:* 'మేధావుల దేశం' వంటి శక్తిమంతమైన ఏఐ అసలు ఉద్దేశాలు ఏంటి? అది మన పట్ల స్నేహపూర్వకంగా ఉంటుందా లేక శత్రువుగా మారుతుందా? ఆయుధాలు, సైబర్ ఆపరేషన్లు, తయారీ సామర్థ్యంతో ఇది ప్రపంచాన్ని సైనికపరంగా ఆక్రమించుకునే ప్రమాదం ఉంది.

2 *విధ్వంసం:* ఒకవేళ ఏఐ సొంత నిర్ణయాలు తీసుకోకపోయినా, అది ఒక 'కిరాయి సైన్యం' లాగా పనిచేసినా ప్రమాదమే. ఉగ్రవాదులు లేదా దుష్టశక్తులు దీన్ని జీవాయుధాల తయారీకి లేదా భారీ సైబర్ దాడులకు వాడితే... ఆ విధ్వంసం ఊహకందని స్థాయిలో ఉంటుంది.

3 *అధికారం హస్తగతం:* ఒకవేళ ఈ శక్తిమంతమైన ఏఐ సామ్రాజ్యాన్ని ఒక నియంత లేదా ఒక దుష్ట కార్పొరేట్ సంస్థ నిర్మించి, నియంత్రిస్తుంటే.. వారు ప్రపంచాధిపత్యాన్ని సాధించే ప్రమాదం ఉంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ సమతుల్యతను దెబ్బతీసి, ప్రపంచం మొత్తాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చుకోవచ్చు.

4 *ఆర్థిక అల్లకల్లోలం:* పై మూడు ముప్పులూ లేకపోయినా.. ఏఐ కేవలం శాంతియుతంగా ఆర్థిక వ్యవస్థలో పాల్గొన్నా ప్రమాదమే. దీని అత్యుత్తమ సామర్థ్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు వచ్చి భారీ నిరుద్యోగం తలెత్తవచ్చు లేదా సంపద మొత్తం కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం కావచ్చు.

5 *పరోక్ష ప్రభావాలు:* ఏఐ సృష్టించే కొత్త సాంకేతికత, ఉత్పాదకత వల్ల ప్రపంచం అతివేగంగా మారుతుంది. సమాజం ఈ వేగాన్ని తట్టుకోలేక అస్థిరతకు గురయ్యే ప్రమాదం ఉంది.

'సర్జికల్' నిబంధనలే శరణ్యం

శక్తిమంతమైన ఏఐతో పొంచిఉన్న ప్రమాదాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు 'సర్జికల్' (కచ్చితమైన) నిబంధనలతో ముందుకు రావాలి. ఆవిష్కరణలను పూర్తిగా అడ్డుకోకుండా, కేవలం ప్రమాదాలను నివారించేలా ఈ నిబంధనలు ఉండాలి. ఏఐ కంపెనీలు స్వచ్ఛందంగా బాధ్యత వహించడం ఒక ఎత్తయితే, ప్రభుత్వాలు చట్టపరమైన చర్యలు తీసుకోవడం మరో ఎత్తు. ఏఐ ప్రమాదాలను నివారించడానికి చేసే నియంత్రణలు ఆర్థిక విలువను దెబ్బతీయకూడదు, కానీ అదే సమయంలో మొండిగా వ్యవహరించే వారిని కట్టడి చేసేలా ఉండాలి. మన సామాజిక, రాజకీయ వ్యవస్థలు ఈ అపారమైన శక్తిని నిర్వహించగల పరిపక్వతను సాధించగలిగితేనే ఈ అగ్నిపరీక్షలో మానవాళి గెలుస్తుంది!"

– జి.మల్లారెడ్డి

బంగారు పట్టు ముగా

బంగారు వన్నెతో చిరకాలం మన్నే 'ముగా' పట్టు దేశదేశాల్లో ఖ్యాతికెక్కిన భారతీయ విశిష్ట ఉత్పత్తి. కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ పట్టును దక్షిణాదికీ విస్తరించే అవకాశం ఉంది. దీనివల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది. ముగా పట్టు పురుగులకు కావాల్సిన ఆహార మొక్కల పెంపకం ద్వారా ఆదివాసులకు జీవనోపాధీ లభిస్తుంది.

సంప్రదాయంగా ముగా పట్టు అస్సాం తదితర ఈశాన్య రాష్ట్రాలకే ప్రత్యేకం, పరిమితం. ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలు, క్షేత్ర ప్రయోగాలు ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లోనూ ముగా పట్టు ఉత్పాదనను సుసాధ్యం చేస్తున్నాయి. ఒక కిలో ముడి ముగా పట్టు ధర జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో రూ.45వేల నుంచి రూ.50వేలదాకా ఉంటుంది. సీజను కాని సమయంలోనూ ఒక్క పట్టు గూడు ధర రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతుంది. ముగా పట్టు పురుగులకు సోమ్, సువాలు అనేవి ప్రధాన ఆహార మొక్కలు. అవి ప్రధానంగా అడవుల్లో పెరుగుతాయి. ఒక ఎకరా సోమ్ లేదా సువాలు తోటలోని ఆకులు వెయ్యి గ్రాముల దాకా ఎలాంటి వ్యాధులు లేని పట్టు గుడ్లకు (డీఎఫ్ఎల్) సరిపోతాయి. సరైన నిర్వహణ పద్ధతులు పాటిస్తే ఒక్కో పెంపక చక్రంలో 35వేల నుంచి 40వేల వరకు పట్టు గూళ్లు వస్తాయి. ప్రభుత్వం ఒక పట్టు గూడుకు ఆరు రూపాయల ధర నిర్ణయించింది. ఈ లెక్కన ఎకరా పంటకు రూ.2.10 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. గ్రాము డీఎఫ్ఎల్ ధర రూ.20 ఉంది. వాటికయ్యే ఖర్చును తీసివేసినా కూడా ముగా పట్టు సాగు మంచి లాభసాటి వ్యాపారమే. చిన్న, మధ్యతరహా రైతులకు, ఆదివాసీ, గిరిజన తెగలకు ముగా పట్టు చక్కని జీవనోపాధి కల్పించగలదు.





దక్షిణ భారతమూ అనుకూలమే...

ముగా పట్టును అస్సాంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ సాగు చేయవచ్చునని నిర్ధారణ అయింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురం జిల్లాలో, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ముగా సాగు చేపట్టారు. గువాహటిలోని ముగా, ఎరి పట్టుపురుగు గుడ్ల సంస్థ సమకూర్చిన డీఎఫ్ఎల్‌లను కేంద్రీయ పట్టు బోర్డు ద్వారా పై రెండు రాష్ట్రాల రైతులకు అందించారు. ఇలా కేంద్రం, రాష్ట్రాల సహకారం ముగా పట్టు ఉత్పత్తి విస్తరణకు దోహదపడుతోంది. సోమ్ లేదా సువాలు మొక్కలు మూడేళ్లలో ఏపుగా పెరిగి పట్టు పురుగులకు ఆహారంగా ఉపయోగపడతాయి. సోమ్, సువాలు అడవి మొక్కలు కాబట్టి వాటి సాగు అటవీ విస్తరణకూ తోడ్పడుతుంది. ఆదివాసులకు జీవనోపాధి కూడా దక్కుతుంది. వారు పనుల కోసం వలసపోవాల్సిన అగత్యాన్ని నివారించడానికి వీలవుతుంది. అడవులు హరించుకుపోయిన ప్రాంతాల్లో సాముదాయిక కార్యక్రమంగా సోమ్, సువాలు మొక్కల సాగును చేపట్టి పర్యావరణానికి మేలు చేయవచ్చు. ముగా పట్టు ఉత్పాదన అడవుల విస్తీర్ణాన్ని పెంచడమే కాకుండా చిన్న రైతులకు ఆదాయాన్ని సమకూరుస్తుంది. జీవవైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పుల నిరోధం, సుస్థిర జీవనోపాధి కల్పన... ఇలా ఎన్నో లక్ష్యాలను సాకారం చేస్తుంది.

ముగా పట్టుపురుగు పెరగడానికి 20-30 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత, వాతావరణంలో 65-86శాతం తేమ కావాలి. దక్షిణ భారతదేశంలోని అరణ్య, పాక్షిక అటవీ ప్రాంతాల్లో ఈ పరిస్థితులు ఉంటాయి. వానాకాలంలో, ఆ తరవాత అనువైన పరిస్థితులు ఏర్పడతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలలోని అటవీ ప్రాంతాల్లో ముగా పట్టు పురుగులు బాగా పెరుగుతాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో జులై-సెప్టెంబరు, అక్టోబరు-డిసెంబరు సీజన్లు, కర్ణాటక, కేరళలలో జూన్-నవంబరు సీజను, తమిళనాడులో వర్షాకాలంలో ముగా పట్టు సాగుకు అనువైన పరిస్థితులు ఉంటాయి. దక్షిణ భారత అడవుల్లో ముగా సాగు మహిళలకు, గిరిజన తెగలకు అదనపు ఆదాయ వనరుగా నిలుస్తుంది.


మల్బరీకి తోడుగా...

మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కేంద్ర సంస్థల మద్దతుతో ముగా సాగు విజయవంతమైన దృష్ట్యా, దీన్ని దక్షిణ భారత రాష్ట్రాలకూ విస్తరించవచ్చు. ముగా పట్టుపురుగుల పెంపకం కేవలం వ్యవసాయ, ఆర్థిక కార్యకలాపమే కాదు, పర్యావరణ రక్షణకు అమోఘ సాధనం కూడా. ప్రస్తుతం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుల్లో మల్బరీ పట్టు పరిశ్రమ విస్తృతంగా అభివృద్ధి చెందింది. ఇప్పటికే ఉన్న మల్బరీ తోటల సరిహద్దుల వెంట ముగా పట్టు ఆహార వృక్షాలను ప్రయోగాత్మకంగా నాటవచ్చు. ఇది మల్బరీ సాగుకు ఎలాంటి ఆటంకం కలిగించదు. అదనపు ఉపాధికి ఊతమిస్తూ, అనుకూల ప్రాంతాల్లో ముగా పట్టు సాగు క్రమంగా విస్తరించేందుకు తోడ్పడుతుంది. బంగారు పట్టుగా వ్యవహరించే ముగా వందేళ్ల వరకు మన్నుతుంది. శాస్త్రీయ సాగు పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహంతో ముగా సాగును రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రోత్సహించాలి.

– ధరావత్ సాయిచరణ్

శాస్త్రవేత్త, సెంట్రల్ సిల్క్ బోర్డు, అస్సాం

రాజుకు తెలిసొచ్చింది!



చిత్రసీమ రాజ్యాన్ని విచిత్రసేనుడు పాలించేవాడు. అతనికి గర్వం ఎక్కువ. ఒకరోజు ఆస్థాన వైద్యుడు శివశర్మను పిలిచి.. 'నేను ఎప్పటికీ యువకుడిగా ఉండేలా, మరణం లేకుండా శాశ్వతంగా జీవించేలా ఒక మందు తయారు చేసివ్వు. అలా చేస్తే నీకు రాజ్యంలో సగభాగం ఇస్తాను. లేకపోతే ఈ పదవి నుంచి తొలగిస్తాను. నేను చెప్పిన మందు తయారు చేసిన వారికే ఆస్థాన వైద్యుడి పదవి ఇస్తాను' అన్నాడు. 'అలాగే మహారాజా! వైద్య గ్రంథాలు తిరగేసి మీకు ఏ విషయం చెబుతాను. నాకు నెల రోజులు గడువు ఇవ్వండి' అని అడిగాడు శివశర్మ. కొన్నిరోజులకు మహారాజుని కలిసి.. 'మందు తయారుచేసే మార్గం కనుక్కున్నాను. కానీ దానికి సంబంధించిన చెట్టు ఆకులు మీరే స్వయంగా తీసుకురావాలి. ఎవరికీ చెప్పకూడదు. ఒకవేళ చెబితే ఆ మందు పని చేయదు. మనకు నెల రోజుల సమయమే ఉంది' అంటూ ఆ రహస్య చెట్టు గురించి రాజు చెవిలో చెప్పాడు శివశర్మ. దాంతో చాలా ఆనందపడిన రాజు.. 'దానికి నెలరోజులు ఎందుకు.. రెండు రోజుల్లో తీసుకొస్తాను. పసరు మందు తయారు చేయడానికి సిద్ధంగా ఉండండి' అని బయలుదేరాడు. అలా రోజుల తరబడి అడవిలో తిరుగుతూనే ఉన్నాడు విచిత్రసేనుడు. వైద్యుడు చెప్పిన ఆకు ఎక్కడా దొరకట్లేదు. అయినా అలాగే తిరుగుతూ ఉన్నాడు. నెలరోజులు పూర్తయ్యేసరికి వైద్యుడు చెప్పిన లాంటి చెట్టు అసలు ఎక్కడా ఉండదని రాజుకు తెలిసొచ్చింది. వెంటనే కోటకు బయలుదేరాడు. తరవాత వైద్యుణ్ని కలిసి.. 'ఎప్పటికీ నేనే రాజుగా ఉండాలన్న ఆశతో ఆ మందు కావాలని అడిగాను. కానీ మీరు చెప్పినట్లు ఆకులు రాలని చెట్టే లేదు. ప్రతి చెట్టుకూ ఆకులు రాలుతూ వాటి స్థానంలో కొత్తవి చిగురిస్తున్నాయి. అప్పుడే అర్థమైంది ప్రతిచోట మార్పు, కొత్తదనం అవసరమని' అన్నాడు మహారాజు. ఆయనలో వచ్చిన మార్పు చూసి వైద్యుడు సంతోషించాడు.

హాయ్! బుజ్జీ!!

– మొర్రి గోపి



పల్లె తల్లి!

ఇప్పుడు అందరిదీ పట్నం బాటే. చదువుకోవాలన్నా, పని నేర్చుకోవాలన్నా, ఉపాధి వెతుక్కోవాలన్నా, ఉద్యోగం సంపాదించాలన్నా నగరాల్లోనే వెతుకులాట! మెరుగైన భవిష్యత్తు కోసం ఎన్నో ఆశలతో పట్నాలకు చేరిన వారందరి బతుకులూ బాగుంటున్నాయా మరి!

ఇదొక తల్లి దీనగాథ. సంతానమంతా బతుకుదెరువు కోసం నగరానికి చేరారు. ఊళ్లో ఆస్తులన్నీ పంచుకున్నారు. ఒంటరి తల్లి పంపకాల్లో భాగం కాలేకపోయింది. నెలకొకరి ఇంట్లో ఉండేలా సర్దుబాటు జరిగింది. నెల తిరిగి తీసుకెళ్లాల్సి వచ్చేటప్పటికి మొహం చాటేయడం తంతులా మారింది. ఈ వంతులవారీ బతుకుపై అమ్మకు విసుగొచ్చేసింది. కలోగంజో దొరక్కపోదా అన్న ఆశతో సొంతూరు బాటపట్టింది.

ఈ పెద్దాయనది ఇంకో రకం కథ. అమ్మాయి అమెరికాలో, అబ్బాయి ఆస్ట్రేలియాలో! అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లుగా వీకెండ్‌లో పది నిమిషాలు ఫోన్‌లో మాటామంతీ. అంతా పొడిపొడిగానే! ఎలా ఉన్నారు, తిన్నారా, మందులు వేసుకున్నారా.. అంతే, క్యూఅండ్ఏ సెషన్! వాళ్లకి నాన్న డబ్బులూ అక్కర్లేదు. ఆస్తులపైనా ఆసక్తి లేదు. ఒక్కరే ఎలా బతుకుతున్నారన్న బాధే లేదు. పక్కవాడి ఉనికి కూడా పట్టని మహానగరంలో కోట్లమంది మధ్య ఏకాకి జీవనం. భార్య కూడా తోడులేని ఒంటరి బతుకు బోర్ కొట్టేసింది. ఊరికెళ్తే రోజుకొకరైనా పలకరిస్తారు. ఉన్నదంతా, ఊరికే ఇచ్చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. పుట్టిన గడ్డలో మట్టి జ్ఞాపకంలా మిగిలిపోవాలన్న తలంపుతో!

పొలంలో ఎండకు ఎండుతూ ఎంతకాలం కష్టపడతామంటూ నగరం చేరిందో కుటుంబం. చిన్నగా మొదలైన వ్యాపారం పెద్దదైంది. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో చిన్న నిర్లక్ష్యమే శాపమైంది. అంతా తిరగబడింది. వ్యాపారం మునకేసింది. అప్పులు ముంచెత్తాయి. జీవనం భారమైంది. అన్నం పెట్టే పొలాన్ని వదిలేసినందుకు తగిన శాస్తి జరిగిందనే అంతర్మథనం మొదలైంది. నేల తల్లి మళ్లీ ఆదుకుంటుందనే నమ్మకంతో ఊరి బాట పట్టిందా కుటుంబం. ఉద్యోగం వేటలో పట్నం చేరిన జంటది మరో అనుభవం. సగం జీవితం రోడ్లపైనే. వారాంతాల్లోనే కనిపించే పిల్లలు, షిఫ్టుల మధ్య కలుసుకునే భార్యాభర్తలు. ఉరుకులుపరుగుల బతుకు పోరులో అనుకోని ఒక యాక్సిడెంట్ భర్తను బలితీసుకుంది. ఆస్పత్రిపాలైన భార్య దాచుకున్న సొమ్మునంతా బిల్లుగా కట్టేసి బయటపడింది. పిల్లలూ, అప్పులే మిగిలాయి. చిన్న ఉద్యోగంతో పిల్లలతో ఒంటరిగా బతుకుబండిని లాగడం కష్టమే. సొంతూరిలోనే ఎలాగోలా బతకొచ్చని పిల్లల్ని తీసుకుని బయలుదేరిందా తల్లి.

జీవితం ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడిదాకా వెళ్లినా, కష్టం ఎదురైతే ఎవరికైనా గుర్తుకొచ్చేది సొంతూరే. ఎంతమంది బిడ్డలున్నా అమ్మకు భారమే కాదు. అమ్మలాంటి ఊరు కూడా అంతే. అందరినీ కడుపున పెట్టుకుంటుంది. ఉన్నదాంట్లోనే అందరికీ పెడుతుంది. ఆధునిక జీవితం పోపొమ్మంటుంటే, ఎందుకు వెంటబడి వేలాడటం? సొంతూరిలో ఆధునిక సుఖాలుండవేమో, ప్రశాంత జీవితమైతే దొరుకుతుంది కదా! భారమైన జీవితాన్ని బలవంతంగా లాగుతూ, మోయలేనంత బరువుగా ఉందని బాధ పడటం ఎందుకు? బరువు దించుకోవడం ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుంది.

– భ్రమర

చితికిన బతుకులు.. చెదిరిన ఆశలు..

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల స్థితి దయనీయం


గతేడాది నవంబరు 11న గండిగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు

ఈనాడు, అమరావతి
ఈనాడు డిజిటల్, మచిలీపట్నం
కృష్ణలంక, పామర్రు, న్యూస్‌టుడే

'చెట్టంత ఎదిగిన కొడుకు.. ఓ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. అంతే.. ఆ కుటుంబం జీవితంలో కోలుకోలేకపోతోంది. ఇంటికి ఆధారంగా ఉన్న వ్యక్తి.. ఇంటి నుంచి వెళ్లి.. ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఇప్పుడు ఆ కుటుంబాన్ని చూసే దిక్కే లేదు. తండ్రి ఉండగా.. మంచి పాఠశాలలో చదివే ఆ పిల్లల భవిష్యత్తే ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది.' రోడ్డు ప్రమాదంలో.. పోయే ప్రతి ప్రాణం.. ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపుతోంది. బతికున్నా.. తమవాళ్లు లేని ఈ లోకంలో ఉండలేకపోతున్నామనే.. బాధతోనే రోజులు వెళ్లదీస్తున్న కుటుంబాలు.. కోకొల్లలు. ఒక్కో క్షణం వేగాన్ని నియంత్రించుకున్నా.. ఓ హెల్మెట్ పెట్టుకున్నా.. తమ వాళ్లు బతికి ఉండేవాళ్లు కదా.. అనే బాధ.. వారిని దహించి వేస్తోంది. రెప్పపాటులో.. తమ జీవితాలే అంధకారంగా మారిపోయాయని.. రోదిస్తున్నారు.

అనాథలైన.. భార్యాపిల్లలు



విజయవాడ రాణిగారితోటవాసి **జల్ది వెంకటేశ్వరరావు**(38) చిరుద్యోగి. అతడి భార్య స్వప్న కుమారి, పిల్లలు ఈక్షిత్(7) సృజన్ డానియేల్(5). నిరుడు ఆగస్టు 27న రాత్రి టీ తాగేందుకు నడిచి వెళ్తుండగా.. మితిమీరిన వేగంతో వచ్చిన అంబులెన్స్ పీఎన్‌బీఎస్ బస్టాండ్ దగ్గర ఢీకొట్టింది. ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయాడు. ఇంటి ఆధారం కోల్పోవడంతో.. భార్య, పిల్లలు అనాథలయ్యారు. పిల్లలతో ఎలా బతకాలో తెలియక.. స్వప్నకుమారి దిక్కుతోచక తల్లడిల్లుతోంది.



రెప్పపాటులో జీవితం తలకిందులు..



పామర్రు మండలం జమీగొల్వేపల్లికి చెందిన ఎస్.బాలాజీ, ఆయన భార్య **శకుంతల** హోటల్ నడిపి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భవిష్యత్తుపై ఎన్నో ప్రణాళికలు వేసుకున్నారు. కానీ.. నిరుడు అక్టోబరు 21న బెజవాడ.. బందరు హైవేపై ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. శకుంతల అక్కడికక్కడే ప్రాణాలు వదలగా కుటుంబ పరిస్థితి తలకిందులైంది. హోటల్ నిర్వహణలో ఆమే కీలకం కావడంతో.. దానిని నడపలేక బాలాజీ మూసేశారు. ఉన్న ఊరొదిలి జీవనోపాధికి మరోచోటకు వెళ్లిపోయారు. ఇద్దరు పిల్లలతో అక్కడ బతుకీడుస్తున్నారు.

నాలుగు కుటుంబాలకు కడుపుకోత..

చింతయ్య, ప్రిన్స్, రాకేశ్, పాపారావు.. నలుగురు పాతికేళ్ల లోపు కుర్రాళ్లే. 2025 నవంబరులో ఓ మిత్రుడు కారు తేవడంతో.. మిగతా ముగ్గురు ఎక్కారు. గండిగుంట వద్ద అతివేగంగా దూసుకెళ్లగా.. కారు ఎగిరి పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయింది. నలుగురూ మృత్యువాత పడగా.. నాలుగు కుటుంబాలు నేటికీ తేరుకోలేకపోతున్నాయి.

అందొచ్చిన కొడుకు దూరమై..



కుందేరుకు చెందిన రామలక్ష్మి, బాలకృష్ణ కుమారుడు **చింతయ్య**కు 19 ఏళ్లు. పదో తరగతి చదివాడు. అప్పుల్లో ఉన్న కుటుంబాన్ని గట్టెక్కించేందుకు.. తండ్రితో కలిసి పనికి వెళ్తున్నాడు. ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే వేళ చింతయ్య చనిపోయాడు. ఆ కుటుంబం అన్ని రకాలుగా చితికింది. చివరికి.. చింతయ్య చెల్లెలు ఇంటర్ మధ్యలోనే ఆపేసింది.

బతికే దారే లేదు..



విజయవాడ గిరిపురానికి చెందిన రమేష్‌బాబు, రత్నశ్రీ దంపతుల కుమారుడు ఈటే **ప్రిన్స్**కు 22 ఏళ్లు. ఓ ప్రైవేటు ల్యాబ్‌లో పనిచేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. ప్రిన్స్ కష్టంతోనే ఇద్దరు చెల్లెళ్ల పెళ్లి చేశారు. స్నేహితులొచ్చారు.. వెళ్లి వచ్చేస్తానని బయటకొచ్చి ఇంక తిరిగి ఇంటికి చేరలేదు.

ఆశపడేలోపే అనంత లోకాలకు...



మొగల్రాజపురంవాసి చాట్రగడ్డ చక్రపాణి కుమారుడు **రాకేశ్**కు 24 ఏళ్లు. చదువు పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. రేపోమాపో ఉద్యోగం వస్తుంది.. వివాహం చేయాలని ఆ కుటుంబం ఆశపడగా.. దూరమైపోయాడు. నాటి నుంచి ఆ కుటుంబానికి.. నిత్యం నరకమే.

మిగిలింది శోకమే...



మొగల్రాజపురంవాసి గొరిపర్తి శివయ్య ట్రాక్టర్ డ్రైవరు. ఇతడి 23 ఏళ్ల కుమారుడు **పాపారావు.** చిరుద్యోగం చేసి ఆసరాగా ఉన్నాడు. రోజూలాగే బయటకు వెళ్లిన కుమారుడు తిరిగొస్తాడులే అనుకుంటే.. శవమై వచ్చాడు. అప్పటినుంచి ఆ కుటుంబం శోకసంద్రంలోనే ఉంది.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ఈ నెల 9న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక/రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ కూడా అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

పైరవీలుంటేనే.. ఫైలు కదిలేది!

గ్రామీణ నీటి సరఫరా శాఖలో ఉద్యోగి దందా

ఈనాడు, అమరావతి

గ్రామీణ నీటి సరఫరా శాఖలో ఓ చిరుద్యోగి పేట్రేగిపోతున్నాడు. చేసేది చిన్న ఉద్యోగమే అయినా కమీషన్ల దందాతో కాంట్రాక్టుల కథంతా తానే నడిపిస్తున్నాడు. ఇటీవల వక్రమార్గంలో పదోన్నతి పొందింది. అధికారులకు నమ్మిన బంటులా మారి అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నాడు. కాంట్రాక్టులు దక్కాలంటే గుత్తేదారులు తనను ప్రసన్నం చేసుకోవాల్సిందనే స్థాయిలో పైరవీలు చేస్తున్నాడు.

మామూళ్లు ఇస్తేనే ముందుకు: ☛ కీలక కార్యాలయంలో అర్జీలు, ఫిర్యాదుల వివరాలు నమోదు చేసే చిరుద్యోగి ఇతను. కానీ ఉమ్మడి కృష్ణాలో గుత్తేదారులను నడిపించేలా మంత్రాంగం నెరుపుతున్నాడు. గుత్తేదారులకు, అధికారులకు మధ్యవర్తిగా కమీషన్ల బేరాలన్నీ ఇతడే చూసుకుంటాడు.

☛ అతనితో బేరం కుదిరితే చాలు గుత్తేదారులు సవ్యంగా పనులు చేసినా.. చేయకున్నా బిల్లులు చేయించేస్తాడు. అధికారులకు గుత్తేదారులు ఇచ్చే మామూళ్లతో సంబంధం లేకుండా.. తనొక్కడే ప్రత్యేకంగా 3 శాతం కమీషన్ తీసుకుంటాడు. విజయవాడ, బందరులో కొన్ని నామినేషన్ పనుల కేటాయింపులో పైరవీలు చేసి 3 శాతం కమీషన్ బాదేశాడు.

☛ 2023-24, 2024-25లో గన్నవరం సబ్‌డివిజన్ ఓఅండ్ఎం పనుల టెండర్లలో చక్రం తిప్పాడు. టెండర్ల ప్రక్రియ జేఈ, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ స్థాయి అధికారులే నిర్వహించాలి. కానీ కథంతా ఇతడే నడిపించాడు. ఓ గుత్తేదారు 25 శాతం లెస్‌కు టెండర్లు వేయగా.. 5 శాతం వాటా ఇస్తేనే టెండరు ప్రక్రియ కదులుతుందని తేల్చిచెప్పాడు. గుత్తేదారు ఇవ్వకపోవడంతో అధికారులతో పైరవీ చేసి టెండర్ ప్రక్రియ ఆపేసి పాత గుత్తేదారుడితోనే అంచనాలు రివైజ్ చేయించి పనులు చేయిస్తున్నాడు.

పదోన్నతిలో మాయ...

సదరు ఉద్యోగి వక్రమార్గంలో పదోన్నతి పొందాడు. తాను సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లమా చేసినట్లు ధ్రువపత్రాలు పొందుపరిచి పదోన్నతి పొందాడు. గుర్తింపు లేని వర్సిటీ నుంచి పొందిన డిప్లొమా, డిగ్రీ ప్రామాణికంగా నియామకాలు, పదోన్నతులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా అధికారులు కళ్లు మూసుకుని పదోన్నతి కట్టబెట్టడం గమనార్హం.

ఆ ఈఈ అండతోనే...

కొన్నాళ్ల కిందట వరకు బందరులో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ఓ ఈఈ ఇతడిని పెంచి పోషించారు. ఆయన ఇతని ద్వారా బేరాలు చక్కబెట్టేవారు. తర్వాత వచ్చిన ఒకరిద్దరు అధికారులూ ఈఈ బాటలో నడవటంతో కమీషన్ల దందా పేట్రేగుతోంది. తెంపల్లెలో జలజీవన్ మిషన్ పనుల్లో ఓ కాంట్రాక్టు విషయంలో 5 శాతం కమీషన్ తీసుకుని కట్టబెడంలో కీలకం అయ్యారు.

సమసిపోని వేదన.. చక్కదిద్దక యాతన!


కొండపల్లి కోటకు వెళ్లే మలుపు వద్ద జాతీయ రహదారిని ఆనుకొని కుప్పలుగా పోసిన బూడిద

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొండపల్లి కోటకు వెళ్లే మార్గం వద్ద వాహనం వెళ్లిందంటే వెనుక వచ్చే వాహనదారుడికి రోడ్డు కనిపించదు. అంతలా ధూళి కమ్మేస్తోంది. కారణం.. కోటకెళ్లే మార్గంలో బూడిద చెరువు నుంచి వృథాగా పోయే నీరు సుమారు కి.మీ. ప్రయాణించి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కాలువలో ప్రవహిస్తోంది. నీటితోపాటు బూడిద కొట్టుకురావడంతో బూడిదను తొలగించి జాతీయ రహదారిపై కుప్పలుగా పోస్తున్నారు. దీంతో ఎండకు ఎండిపోయి వాహనాలు వెళ్లేటప్పుడు బూడిద ఎగసిపడుతోంది. దీంతో శ్వాసకోశ వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సగం దారిని.. బూడిద కప్పేసింది. ఎదుటి వాహనం కనిపించక ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. - ఈనాడు, అమరావతి


వాహనం వెళ్లిందంటే ఒళ్లంతా బూడిదే మరి..

ప్రతిభ వనంలో.. పసిడి సుమాలు


విజేతలతో కలెక్టర్ లక్ష్మీశ, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి కిశోర్‌కుమార్, కేబీఎన్ కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, ఏవో నారాయణరావు తదితరులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు ఆదివారం నిర్వహించారు. విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల ప్రాంగణం దీనికి వేదికైంది. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందించి అభినందించారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

ఉల్లాస అడుగు.. ఉత్సాహ పరుగు..


యువతీయువకులు, మహిళలు తదితరుల పరుగు

శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం సత్యసాయి రన్ అండ్ రైడ్-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. భగవాన్ సత్యసాయి బాబా శతవర్ష జయంతి వేడుకల్లో భాగంగా ఐక్యతాభావం పెంపొందించడం, ఫిట్ ఇండియా ఉద్యమానికి మద్దతు ఇవ్వాలనే లక్ష్యంతో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జాతీయ యువ సమన్వయకర్త లక్ష్మీకాంత్‌శర్మ తదితరులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతీయువకులు, మహిళలు, వృద్ధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - ఈనాడు, అమరావతి

ఏపీఎన్జీజీవో నామినేషన్లు.. ఉద్యోగుల కోలాహలం



ఉద్యోగులతో కలిసి నామినేషన్ వేసేందుకు ప్రదర్శనగా వెళ్తున్న విద్యాసాగర్, రమణ

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఏపీఎన్జీజీవో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల నామినేషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు భారీగా విజయవాడ తరలివచ్చారు. ఎర్ర కండువాలు ధరించిన ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి నగరం జనసంద్రంగా మారింది. కార్యదక్షత గల నాయకులు తమకు కావాలంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. పాత బస్టాండ్ నుంచి గాంధీ నగర్‌లోని ఏపీఎన్జీజీవో భవన్ వరకు 'ఏపీ ఎన్జీవో వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూ... జెండాలు చేత పట్టి కదంతొక్కారు. మహిళా ఉద్యోగులు ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేస్తూ.. విద్యాసాగర్ బృందానికి స్వాగతం పలికారు. విద్యాసాగర్ సైతం ఉద్యోగులతో కలిసి నృత్యాలు చేశారు. ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చి తమ అభిమాన నాయకుడికి మద్దతు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రే నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించడం రాష్ట్ర చరిత్రలో ప్రథమమంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. విద్యాసాగర్ ప్యానల్ ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఉద్యోగుల్లో ఆనందం రెట్టింపు అయింది. గాంధీ నగర్ ఇసుక వేస్తే రాలనంత జనంతో కిక్కిరిసింది. ఉద్యోగుల ప్రదర్శన, బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఐలా... పూర్తిగా డీలా

☛ ఇన్‌ఛార్జి కమిషనరే దిక్కు
☛ అనుమతి ఇస్తే ఎన్నికల నిర్వహణ

ఆటోనగర్, న్యూస్‌టుడే

కార్మికులకు తాగునీరు లేదు. వీధి దీపాలు వెలగవు. కాలువల్లో మురుగు పారదు. రోడ్ల మీద వ్యర్థాల గుట్టలు పేరుకుపోతున్నాయి. అభివృద్ధి జాడే లేదు. ఇదీ విజయవాడ ఆటోనగర్ పరిస్థితి. వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన పారిశ్రామికవాడ... కూటమి ప్రభుత్వంలోనైనా ప్రగతి పథంలో పయనిస్తుందని భావించిన కార్మికుల ఆకాంక్షకు అనుగుణంగా అడుగులు పడడం లేదు. ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ)కు పాలకవర్గం, పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడం గమనార్హం. ఎందుకో.. పాలకులు కూడా దృష్టి సారించడం లేదు.

ఐదేళ్లూ పన్ను సాకు చూపి.. ✦ 2017లో ఐలా ఎన్నికల జరిగాయి. 2020లో పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. అప్పటినుంచి ఎన్నికలు నిర్వహించలేదు. ✦ మొత్తం 1800 మంది ఫ్లాట్ హోల్డర్లు పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. వారు ఏడాదికి సుమారు రూ.5 కోట్లు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తారు. ఆ మొత్తం నుంచి 35 శాతం వీఎంసీకి చెల్లించి, మిగిలిన నిధులు ఆటోనగర్ అభివృద్ధికి వాడాలి.

✦ ఎన్నికలు నిర్వహణకు 60 శాతం ఫ్లాట్ హోల్డర్లు పన్ను చెల్లించాలనే నిబంధన పెట్టారు. ఆ మేరకు పన్ను వసూలు కాలేదని ఐదేళ్లు సాకు చూపారు. ప్రస్తుతం అంతకు మించి చెల్లించారు. ఎన్నికలు నిర్వహించాలని ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదన పంపారు. అనుమతి రావాల్సి ఉంది.

✦ ఆటోనగర్ గ్రేడ్- 1 ఐలా. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని కమిషనర్‌గా నియమిస్తారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దాదాపు రెండేళ్లు కమిషనర్ లేరు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతకాలం కమిషనర్‌ను నియమించినా... ఏడాదిగా ఇన్‌ఛార్జికే బాధ్యతలు అప్పగించారు.

✦ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్నారు. మల్లవల్లి, ఉమ్మడి కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ ఎస్టేట్ పనులతోనే ఆయన సతమతం అవుతున్నారు. ఆటో నగర్‌పై దృష్టి సారించలేకపోతున్నారు. పూర్తి స్థాయి కమిషనర్‌ని నియమించి, ఎన్నికలు నిర్వహించాలని సంఘాల నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

నేటి నుంచి మేరీమాత ఉత్సవాలు


దివ్యసత్ప్రసాద మందసంతో కొండపైకి వెళ్తున్న మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు

పటమట: గుణదల మేరీమాత ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 11న ముగుస్తాయి. ఇప్పటికే ఆలయంతోపాటు కొండపై విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సామరస్యానికి చిహ్నంగా నిలిచే ఉత్సవాలకు పది లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చే వీలుంది. ఉదయం 7 గంటలకు కొండ కింద బిషప్ గ్రాసీ పాఠశాల మైదానంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ జోసఫ్ రాజారావు, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ విలియం జయరాజు, ఇతర ఫాదర్లు, డయోసిస్ గురువులు లాంఛనంగా ప్రారంభిస్తారు.

❖ కీలక ప్రాంతాల్లో సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు మైనపు వత్తులు వెలిగిస్తారు. కొబ్బరికాయలు కొడతారు. తలనీలాలు ఇస్తారు. సంతానం లేని దంపతులు చెట్లకు ఉయ్యాళ్లు కడతారు. పిల్లలకు అన్నప్రాసనలు, రాత్రులు నిద్ర చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. బిషప్ గ్రాసీ పాఠశాలలో ప్రత్యేక వేదికపై సమష్టి దివ్య పూజబలి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు సిటీ బస్టాండ్, పీఎన్‌బీఎస్, రైల్వే స్టేషన్ నుంచి ఏలూరు లాకుల మీదుగా గుణదల పడవల రేవు సెంటర్‌లోని బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకుంటాయి.

ముగిసిన నవదిన ప్రార్థనలు .. తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఉత్సవాల నవదిన ప్రార్థనలు ఆదివారం రాత్రి ముగిశాయి. విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలిటి విలియం జయరాజు తదితర గురువులు దివ్యసత్ప్రసాద ఆరాధనతో కొండపై పూజాపీఠం వద్దకు చేరుకుని సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఫాదర్లు మరియన్న, తోట సునీల్‌రాజు, పుణ్యక్షేత్రం సహాయ గురువులు, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభ.. భవితకు ప్రేరణ

ఈనాడు–ఈటీవీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు

చిట్టినగర్, న్యూస్‌టుడే

చదువుతో పాటు బహుముఖ ప్రతిభ చూపినప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించడానికి అవకాశం ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెట్టేందుకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. విద్యార్థులు మానసికంగా.. శారీరకంగా దృఢంగా ఉండాలని.. అప్పుడే ఉన్నత స్థానంలో ఎదిగేందుకు నూతన ఆలోచనలు వస్తాయన్నారు. చదువుతో పాటు ఇతర అంశాల్లో రాణించి వారే ఎక్కువ శాతం అనుకున్న లక్ష్యాలు సాధించారని అన్నారు.

◆ 24 ఏళ్ల కిందట ఆస్ట్రేలియాలో ఓ సంస్థ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ విభాగంలో 4,500 మందిని 4 నుంచి 24 ఏళ్ల వయసు వారిని స్టడీ చేసిందని.. ఇతర అంశాల్లో ప్రావీణ్యం ఉన్న వారిలో లీడర్ షిప్ క్వాలిటీ ఎక్కువ కనిపించిందని 2024లో ఓ మ్యాగజైన్‌లో ప్రచురించారని విద్యార్థులకు వివరించారు. చదువుతో పాటు ఆట పాటల్లో పాల్గొనడం, కొత్త విషయాన్ని నేర్చుకోవడం, ప్రముఖుల జీవిత చరిత్రాలు చదవడం వల్ల మెదడు చురుకుదనం పెరిగి కొత్త ఆలోచనలు వస్తాయని అన్నారు. 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్ కె.కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. గత ఐదు నెలల నుంచి వివిధ స్థాయిల్లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 36 వేల మంది హాజరు కాగా వారిలో ప్రతిభను చాటి జిల్లా స్థాయి పోటీలకు 144 మంది విద్యార్థులు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. రెగ్యులర్ అకడమిక్ కాకుండా ఈ పోటీల్లో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం ఉన్నాయని అందుకే సెకండరీ అకడమిక్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. చదివిన విషయ పరిజ్ఞానాన్ని, పోటీ పరీక్షల్లో చూపడం ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలని అన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, వేదికపై 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి కిశోర్‌కుమార్, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ ఏవో నారాయణరావు


పోటీలకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాస్, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ పరిపాలన అధికారి వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు విభాగాల్లో ..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, మైలవరం, విస్సన్నపేట, జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతి పాఠశాల నుంచి ఇఆ్యసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు వచ్చారు.

విజేతలు వీరే..

✦ **వ్యాసరచన:** ఎం.దీక్షిక (విజ్ఞాన్ ఇ.ఎం. స్కూల్, జగ్గయ్యపేట) ప్రథమ, వై.అద్విక (శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్, గన్నవరం)ద్వితీయ, పి.అస్మిత (సెయింట్ థెరిసా ఇ.ఎం.స్కూల్, విస్సన్నపేట) తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారు.

✦ **చిత్రలేఖనం:** సక్షం సుథార్ (వి.పి.సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, విజయవాడ), ఎన్.శంకరి (ఎస్.ఎస్.కె.ఇ.ఎం హైస్కూల్, మైలవరం), జి.ఫణిసాయి ప్రణీత్ (సాయి అరుణా హైస్కూల్, చిట్టినగర్, విజయవాడ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

✦ **ఉపన్యాసం:** పి.కుముద (ఉషోదయ ఇ.ఎం. స్కూల్, పెనమలూరు), ఎం.మనస్వి (విద్యానికేతన్, అవనిగడ్డ), వి.సాయిస్నేహ (త్రివేణి ఇ.ఎం. స్కూల్, గుడివాడ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

✦ **క్విజ్:** బి.మేఘన (కాకతీయ హైస్కూల్, నందిగామ)ప్రథమ, ఎం.రామకృష్ణ (శ్రీవిద్య హైస్కూల్, నందిగామ)ద్వితీయ, బి.పవన్‌కల్యాణ్ (శ్రీవిద్య హైస్కూల్, నందిగామ) తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.

పత్రిక జ్ఞానం విజేతగా నిలిపింది



'ఈనాడు' పత్రిక చదవడం అలవాటు. పత్రికలు చదవడం వల్ల మనకు కావాల్సిన విషయ పరిజ్ఞానం దొరుకుతుంది. సమాజంపై అవగాహన పెంచుకున్నా. 'ఈనాడు' నిర్వహించిన పలు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నాను. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. భవిష్యత్తులో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొనేందుకు 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు దోహదపడ్డాయి. **- ఎం.దీక్షిక, విజ్ఞాన్ ఇ.ఎం.స్కూల్, జగ్గయ్యపేట**

స్ఫూర్తినిచ్చాయి



చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం పట్ల ఆసక్తి. 'ఈనాడు-ఈటీవీ' ప్రాంతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతి గెలుచుకున్నాను. 'ఈనాడు' సంస్థ నుంచి బహుమతి అందుకోవడం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. జిల్లా స్థాయిలో కూడా ప్రథమంగా నిలవాలనే తపనతో వచ్చి పోటీలో పాల్గొన్నాను. ఇచ్చిన అంశంపై దానికి అనుగుణంగా చిత్రం గీసి ప్రథమ స్థానంలో నిలిచాను. **- సక్షం సుథార్, వి.పి.సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, విజయవాడ**

ధైర్యం పెరిగింది



పదిమందిలో బహిరంగంగా మాట్లాడం.. నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలనే పట్టుదల ఉండేది. 'ఈనాడు-ఈటీవీ' ప్రతిభా పాటవ పోటీలు నాకు ఒక వేదికగా దొరికింది. ఆ వేదికపై వారు ఇచ్చిన అంశంపై ఉపన్యాసంలో బహుమతి సాధించాను. ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరిగింది. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ప్రథమ స్థానంలో నిలిచాను. **- పి.కుముద, ఉషోదయ ఇ.ఎం.స్కూల్, పెనమలూరు**

విజ్ఞానం పెంచుకున్నా..



ప్రతి రోజు రాత్రి 9 గంటలకు 'ఈటీవీ' వార్తలు వింటాను. పత్రికలోని ప్రధాన శీర్షికలు చదువుతాను. పత్రికలు చదవడం వల్ల ఎప్పటికప్పుడు కరెంట్ అఫైర్స్‌పై పట్టు దొరుకుతుంది. ఆ విధంగా 'ఈనాడు-ఈటీవీ' నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో క్విజ్‌లో పాల్గొన్నాను. కొత్త కొత్త అంశాలపై, ఆధునిక సాంకేతికతపై ఇచ్చిన అంశాలపై సులభంగా సమాధానాలు రాసి.. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను.
- బి.మేఘన, కాకతీయ హైస్కూల్, నందిగామ

అపూర్వ సమ్మేళనం.... ఆనంద పరవశం

గొల్లపూడి, న్యూస్‌టుడే: 'ఏరా ఎలా ఉన్నావ్...ఎన్నాళ్లయ్యిందో నిన్ను చూసి...', 'నువ్వు అప్పుడెలా ఉన్నావో...ఇప్పుడూ అలాగే ఉన్నావ్ రా' అంటూ పరస్పరం పలకరించుకుంటూ వారంతా సందడిగా గడిపారు. గొల్లపూడిలోని పోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రావూరి చలపతిరావు, అరవపల్లి హనుమంతరావు, నీలం వెంకటేశ్వర్లు, మేకా రామకోటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. అలాగే వారితో పాటు చదువుకుని మృతి చెందిన 22 మంది స్నేహితులకు నివాళులర్పించారు. విద్యాబుద్ధులు నేర్పి చనిపోయిన 12 మంది ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. పూర్వ విద్యార్థులు జాగర్లమూడి జగదీష్, బొద్దులూరి రామ్మోహన్‌రావు, కారంపూడి ఉమామహేశ్వరరావు, అనంత పుష్పలత, చిగురుపాటి వెంకటదుర్గ తదితరులు పాల్గొన్నారు.


ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల బృందం

సాంస్కృతిక రంగాన్ని గాడిన పెడతాం

భవానీపురం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సాంస్కృతిక రంగాన్ని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటక శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో 'కృష్ణాతీరం కవితాహారం' కార్యక్రమాన్ని విజయవాడలోని పున్నమిఘాట్ వద్ద బోధిసిరి బోటులో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. త్వరలో నంది నాటకోత్సవాలు, నంది అవార్డులను అందజేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలను అందిస్తామని తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఇప్పటికే చర్చించామని, త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అమరావతి ఒడిలో ప్రవహించే కృష్ణమ్మకు ఈతరం కవులు సమర్పించిన కవితా హారతి అని అభిప్రాయపడ్డారు. పెన్నా, గోదావరి నదీతీరాల్లో, దేవీపట్నం నుంచి పాపికొండలు వెళ్లే లాంచీలో ఈ విధమైన సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కవులు, కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కవితల కార్యక్రమాన్ని వీడియో డాక్యుమెంటేషన్ ద్వారా డిజిటలైజేషన్ చేసి భావితరాలకు అందిస్తామని తెలిపారు. ఏపీ, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 51 మంది కవులు వినిపించిన కవితలతో కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. ఏపీ సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ.. నది భూమిని సస్యశ్యామలం చేస్తే, కవులు మనుషుల మనసులను సస్యశ్యామలం చేస్తారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. కళలు, సాహిత్యం మన సంస్కృతికి జీవన రేఖలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ, ఆర్డీవో కావూరి చైతన్య, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, వేదికపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

తండ్రి రుణం తీర్చుకున్న తనయలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఆడపిల్లలే కన్న కుమారుల్లై మరణించిన తండ్రి పాడె మోసి అంతిమ సంస్కారాలు జరిపించి కన్నపేగు రుణం తీర్చుకున్న సంఘటన ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నరసాపురంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంధం సుబ్రహ్మణ్యేశ్వరరావు(75) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో తండ్రి మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేయడానికి ఆ నలుగురు ఆడపిల్లలు దుఃఖభారంతో ముందుకొచ్చి పాడె మోశారు. ఈ దృశ్యం గ్రామస్థులు, బంధువులు, చూపరులను కంటతడి పెట్టించింది. మంచి పేరున్న వ్యాపారవేత్త మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఢిల్లీ పర్యటనలో ఉన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విషయం తెలుసుకొని ఫోన్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.


నాన్న పాడె మోస్తున్న కుమార్తెలు

'బీసీలకు బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలి'

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: వచ్చే బడ్జెట్ సమావేశాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని ఏపీ బీసీ సంఘం డిమాండ్ చేసింది. సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సందీప్ అధ్యక్షతన ఆదివారం స్థానిక అంబేడ్కర్ స్మృతివనంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు అందించాలని కోరారు. గురుకులాల సంఖ్య 200కు పెంచాలని, వాటికి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. సబ్‌ప్లాన్ నిధులను బీసీలకు మాత్రమే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు రుణాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, కులవృత్తిదారులను ఆదుకునేందుకు టాస్క్‌ఫోర్స్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్ల బాబు, వెంకటరమణ, రొయ్యూరు వాసు, కుమార్ భవ్య, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత మండలాల్లో సమస్యల పరిష్కారానికి వినతి

రాఘవయ్య పార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలోని కిడ్నీ బాధిత మండలాల్లో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మందులు, తాగునీరు, ఆసుపత్రుల నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో సుమారు 2,500 మంది కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో నాలుగు డయాలసిస్ సెంటర్లు ఉన్నప్పటికీ గత నాలుగేళ్లలో 800 మంది వ్యాధితో మరణించారని గుర్తు చేశారు. గిరిజనులు అధికంగా ఉన్న ఎ.కొండూరు మండలంలో వెయ్యి మందికి పైగా బాధితులు ఉన్నట్లు తెలిపారు. వ్యాధి ప్రారంభం నుంచి వైద్యం అందిస్తే నయమయ్యే అవకాశం ఉన్నందున కిడ్నీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని నిపుణులు సూచించారని, ఆ ప్రాంతంలో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండడంతో వ్యాధి వ్యాప్తి చెందుతోందని, అరికట్టేందుకు శుద్ధి చేసిన కృష్ణా జలాలను ఇంటింటికీ కుళాయిల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కోరారు. బాధిత కుటుంబానికి జీవనం కోసం ఎకరం భూమి ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

దుర్గగుడి పాలకమండలి సమావేశం నేడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మల్లికార్జున మహామండపంలోని జమ్మిదొడ్డి మీటింగ్ హాల్లో దుర్గగుడి పాలకమండలి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. పాలకమండలి ఛైర్మన్, సభ్యులు వివిధ అంశాలపై చర్చించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశ వివరాలను మీడియా ప్రతినిధులకు తెలియజేస్తారని తెలిపారు.

సత్యసాయి సేవా వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లండి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు రన్ అండ్ రైడ్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ట్రాఫిక్ డీసీపీ ఎస్‌కే షిరీన్ బేగం పేర్కొన్నారు. సత్యసాయి బాబా శతవర్ష జయంతి వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో నిర్వహించిన 'సత్యసాయి రన్ అండ్ రైడ్-2026'ని సేవ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుమారు 9 వేల మంది 5 కి.మీ. మేర నిర్వహించిన రన్ అండ్ రైడ్ (సైక్లింగ్)లో పాల్గొని ఐక్యత, సామరస్యతకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సత్యసాయి అందించిన ప్రేమ, కరుణ, సేవ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. రన్ అండ్ రైడ్ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా... ఆరోగ్యం, ఐక్యత, నిస్వార్థ సేవకు ప్రతీకైన పుణ్య యాత్ర అని అన్నారు. 'ఆరోగ్యం మహా సంపద, మానవ సేవే మాధవ సేవ' అన్న భగవాన్ బోధనలను గుర్తు చేశారు. ముందుగా లక్ష్మణరావు, జాతీయ యువ సమన్వయకర్త లక్ష్మీకాంత్ శర్మ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ సురేంద్ర, రాష్ట్ర సేవాదళ్ సమన్వయకర్త కొమరగిరి శ్యామ్‌ప్రసాద్ తదితరులు జ్యోతి వెలిగించి స్వామి ఆశీస్సులు కోరారు. విశ్వశాంతి కోసం సర్వమత ప్రార్థనలు చేశారు. బాలవికాస్ విద్యార్థుల కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రన్ అండ్ రైడ్ పూర్తి చేసిన వారికి పతకం అందించారు. అల్పాహారం ఏర్పాటు చేశారు.


సైకిల్ రైడ్‌లో యువత


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు తదితరులు

న్యాయవాదుల ఐక్యతకు క్రీడలు దోహదం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: న్యాయవాదుల మానసికోల్లాసం, ఐక్యత కోసం క్రీడలు నిర్వహించడం సంతోషదాయకమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య అన్నారు. విజయవాడ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక లయోల కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించారు. బెజవాడ బార్ అధ్యక్షుడు క్రికెట్ టీం టాస్ వేయగా తొలి టాస్ పవన్ గెలిచారు. అనంతరం న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య మొదటి ఓవర్‌కి బ్యాటింగ్ చేసి 5 పరుగులు సాధించి క్రీడా ప్రోత్సాహాన్ని అందించారు. బెజవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎ.కె.బాష మాట్లాడుతూ టోర్నమెంటులో 8 టీంలు పాల్గొంటాయని, హ్యాట్రిక్ చేస్తే రూ.1000, మేడిన్ ఓవర్‌కు రూ.500 సంఘం ఇస్తుందన్నారు. సీనియర్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, సుంకర రాజేంద్ర ప్రసాద్, జి.వెంకటేశ్వరరావు, అల్తాఫ్ హుస్సేన్ హాజరయ్యారు. బెజవాడ బార్ అసోసియేషన్ శాశ్వత సభ్యులు చిత్తరువు నాగేశ్వరరావు క్రికెట్ టీంలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ కార్యనిర్వాహక కమిటీ శ్యామ్ నాయక్, స్టాలిన్ అన్వర్, స్పోర్ట్సు కార్యదర్శి పల్లగాని రవిబాబు ఆధ్వర్యంలో పోటీలు ఉత్సాహంగా సాగాయి.


బహుమతులతో జస్టిస్ జయసూర్య, సుంకర రాజేంద్ర ప్రసాద్ తదితరులు

కృష్ణా రివర్ క్రాస్ పోటీలతో చైతన్యం.. శారీరక వికాసం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా రివర్ క్రాస్ పోటీల ద్వారా చైతన్యంతోపాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. తాడేపల్లిలోని కృష్ణానదీ కరకట్ట వద్ద గల ఆక్వాడెవిల్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రకాశం బ్యారేజీ దుర్గా ఘాట్ వద్ద ప్రారంభమైన 1.5 కి.మీ. కృష్ణా రివర్ క్రాస్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో పదేళ్ల నుంచి 88 సంవత్సరాల వయసు గల వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. రివర్ క్రాస్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో ఉన్నతంగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణానది ఉండడం మంచి శుభ పరిణామమని, పర్యాటక రంగంతో పాటు వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు జిల్లాలో మరిన్ని చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆక్వాడెవిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ తమ సంఘం జీవితకాల ఛైర్మన్ గోకరాజు గంగరాజు ఆశీస్సులతో 26 సంవత్సరాలుగా ఈ ఈత పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏటా ఈత కొలనులో 300 మంది పిల్లలకు ఉచితంగా ఈత నేర్పిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంతోపాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన 634 మంది స్విమ్మర్లు పాల్గొన్నారన్నారు. విజేతలకు రూ.3.20లక్షల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర విపత్తుల నిర్మూలన, అగ్నిమాపక శాఖ డీజీ పి.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు చెక్కులు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి యార్లగడ్డ రమేష్‌కుమార్, పోటీల కన్వీనర్ వడిపిన రాము, ఉపాధ్యక్షుడు గోపాలం సాంబశివరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.


అత్యధిక వయసు విభాగంలో జనార్దనమూర్తికి జ్ఞాపిక బహూకరిస్తున్న డీజీ వెంకటరమణ

బ్రాయిలర్ ధరలు (కిలో టి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

ధర వరలు



వంకాయలు-20/24, టమాటా-14, బెండ-30, పచ్చిమిర్చి-34, కాకర-32, బీర-30/26, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-26, దొండ-40, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-30, దోస-20/30, సొర-12/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-38, బీట్‌రూట్-26, కీరదోస-38, బీన్స్-60/55, క్యాప్సికమ్-64, చింతకాయలు-65, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.
-న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు.

ప్రశ్నించే ఐవోసీఎల్ డీలర్లను భయపెట్టడం తగదు



మాట్లాడుతున్న జీఎస్ రావు, వేదికపై రాజశేఖర్‌రెడ్డి తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : ఐవోసీఎల్ డీలర్ల ప్రధాన సమస్యల పరిష్కారానికి కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకుల డీలర్స్ అసోసియేషన్స్ నూతన అధ్యక్షుడు జీఎస్‌రావు అన్నారు. ఆదివారం కృష్ణాజిల్లా కానూరు వందడుగులరోడ్డులోని కల్యాణ మండపంలో జరిగిన ఉమ్మడి 13 జిల్లాల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకుల డీలర్ల సమావేశంలో కృష్ణాజిల్లా పెట్రోల్ బంకుల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చుంచు నరసింహారావు అధ్యక్షతన నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్ల మార్జిన్ గత 8 ఏళ్ల నుంచి పెంచడంలేదని, ఇప్పుడు పెంచాలన్నారు. డీలర్లకు తెలియకుండా ఐవోసీఎల్ శాప్ ఖాతాలలో ఉన్న డబ్బులను ఐవోసీఎల్ వారు మోసపూరితంగా డెబిట్స్ చేస్తున్నారని, తమకు టార్గెట్ విధించి వేధిస్తున్నారన్నారు. ఐఓసీఎల్‌లో ఉన్న అన్ని క్లాజెస్‌లో ఉన్న హామీలను అతిక్రమిస్తున్నారని.. ప్రశ్నించే డీలర్లను భయపెడుతున్నారన్నారు. ఎల్ఎఫ్ఆర్ రుసుముల పేరుతో డీలర్లను మోసం చేస్తున్నారన్నారు. అందుకే తామంతా ఓ అసోసియేషన్‌గా ఏర్పడి ప్రధానిని కలిసి తమ సమస్యలను తెలియజేయాలనుకుంటున్నామన్నారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా జీఎస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా టి.రాజశేఖర్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఎల్.కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున డీలర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


రిబ్బను కత్తిరిస్తున్న గాంధీ, లితీష్, తెదేపా నాయకులు

మైలవరం: తెలుగు యువత నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో మండల క్రికెట్ టోర్నమెంటును జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు అక్కల గాంధీ, నాయకులు ఆదివారం ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో యువత సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట నారాయణ, గోపాలస్వామి, ప్రసాద్, బ్రహ్మయ్య, రేణుక పాల్గొన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

12న మండల పరిషత్ సమావేశం

గంపలగూడెం, న్యూస్‌టుడే : గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.సరస్వతి ఆదివారం తెలిపారు. సమావేశానికి సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

సాగర్ జలాల సరఫరా నిలిపివేత

గంపలగూడెం, న్యూస్‌టుడే : మదిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం నుంచి సాగర్ జలాలు సరఫరా నిలిపివేసినట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. వారబందీ విధానంలో భాగంగా వారం రోజుల పాటు కాల్వలకు నీరు సరఫరా చేశారు. వారం తర్వాత మళ్లీ మదిర శాఖ కాల్వలకు నీటి విడుదల ఉంటుందని ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు 2వ వార్డులోని డ్రైనులో పూడిక పేరుకుని మురుగు పారుదల లేదని స్థానికుడు నిరంజన్ కుమార్ 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించారు.

★ తిరువూరు 4వ వార్డులోని డ్రైనుల్లో వ్యర్థాలు అడ్డుపడటంతో స్థానికుడు వెంకటాద్రి నాయుడు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారులకు తెలిపారు. స్పందించిన శానిటరీ అధికారి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలను తీయించి బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తిరువూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్(యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నాయకులు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడి వినతిపత్రం అందించారు. ఎస్. ముత్యయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, పి. వెంకటస్వామి, ఎం. ఏసుపాదం, పిట్టా, గోపి, బీబీ. దుర్గారావు, ఎం. బాలరాజు పాల్గొన్నారు.


మమతల ఒడి.. మధురిమల జడి

గొల్లపూడి, న్యూస్‌టుడే


పరస్పరం పలకరించుకుంటున్న మిత్రులు

ప్రస్తుత పరిస్థితుల్లో ఐదేళ్ల, పదేళ్ల కిందట చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలుసుకోవడం అంటే ఎక్కువ మందికి కుదరని పని. అలాంటిది యాభై సంవత్సరాల కిందట పదో తరగతి పూర్తి చేసుకున్న మిత్రులంతా ఒక్క చోట కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. గొల్లపూడిలోని పోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆ బడిలో ఆదివారం సమావేశమయ్యారు. పరస్పరం పలకరించుకుని ఎక్కడెక్కడ స్థిరపడ్డారు, కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకున్నారు.

నెలలుగా ప్రయత్నం



పూర్వ విద్యార్థులమంతా ఒక చోట కలుసుకోవాలని కొన్నేళ్లుగా అనుకుంటున్నా వీలు పడలేదు. యాభై ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఎలాగైనా కలవాలని భావించాం. ఆ ప్రకారం కొన్ని నెలలుగా కసరత్తు చేశాం. తమతో పాటు చదువుకున్న వారి వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించి వారి ద్వారా ఆనాడు చదువుకున్న బడిలో కలుసుకున్నాం. **- వేముల శ్రీనివాసరావు, విశాఖపట్నం**

సంతోషంగా ఉంది




కొన్ని రోజుల కిందట అప్పట్లో తమతో పాటు చదువుకున్న వారంతా కలుస్తామనే సమాచారం రాగానే సంతోషం వేసింది. నాతో పాటు చదువుకున్న వారిలో కొంత మందే తెలుసు. మిగిలిన వారందరినీ కలవాలని విశాఖపట్నం నుంచి వచ్చాను. ఈ విధంగా అందరం కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాం. **- కొడాలి రమాదేవి, విశాఖపట్నం**

పాఠశాల జీవితం కీలకం



జీవితంలో ప్రతి విద్యార్థికి పాఠశాల జీవితం కీలకం. తమ కలయికతో ఆనాటి జ్ఞాపకాలను తిరిగి నెమరువేసుకునే అవకాశం ఏర్పడింది. పది పూర్తి చేసి అప్పుడే యాభై ఏళ్ల పూర్తయ్యిందా అని అనిపిస్తోంది. దీంతో పూర్వ విద్యార్థుల కలయికకు ఒక అడుగు పడింది. **- జాగర్లమూడి జగదీష్, గొల్లపూడి**

వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డాం



ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం స్నేహితులం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డాం. మేము చదువుకున్న పాఠశాలలోనే ఈ విధంగా కలవడం ఆనందంగా ఉంది. రోజంతా సంతోషంగా గడిపాం. పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నాం. **- బొద్దులూరి రామమోహనరావు, గొల్లపూడి**

గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన నేతలు

తిరువూరు: ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం

ఇబ్రహీంపట్నం (గ్రామీణ): విజయవాడ నగర పోలీసుల ఆధ్వర్యంలో 'జీవితాన్ని ప్రేమించు.. డ్రగ్స్‌ను దూరంగా ఉంచు' అనే నినాదంతో నిర్వహిస్తున్న డ్రగ్స్ వ్యతిరేక సైకిల్ ర్యాలీ ఆదివారం గుంటుపల్లికి చేరుకుంది. గొల్లపూడి దత్త కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని గుంటుపల్లి, రమేష్ నగర్, బాజీపేట, తుమ్మలపాలెం, ఇబ్రహీంపట్నం మీదుగా ప్రధానంగా వరకు సాగింది. గుంటుపల్లి ఎస్ఆర్ కళాశాల వద్ద ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, పోలీసు ఉన్నతాధికారులు, గ్రామస్థులు ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్తులో యువతను కాపాడలన్న సంకల్పంతో సాగుతున్న ర్యాలీకి అత్యంత ప్రజాదరణ లభిస్తుందని చెప్పారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. డీసీపీ ఎస్‌వీడీ ప్రసాద్, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, ఎస్ఆర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు: డ్రగ్స్ నిర్మూలనకు చేపట్టిన సైకిల్ ప్రదర్శన సోమవారం మండలంలోని కట్టుబడిపాలెం, జి.కొండూరు గ్రామాల మీదుగా కొనసాగుతోందని ఎస్సై కె.సతీష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు జి.కొండూరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న స్థలంలో అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గంగానమ్మ ఆలయానికి విరాళం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : తూర్పు ఇబ్రహీంపట్నం గంగానమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రముఖులను సన్మానించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సీనియర్ తెదేపా నాయకుడు జంపాల సీతారామయ్య రూ.1,01,116లను ఆలయానికి వితరణ చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వాసులు పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహస్వామి

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక రాజ్యలక్ష్మి అమ్మ వారి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జాకీర్ హుస్సేన్‌కు ఘన నివాళి


జాకీర్ హుస్సేన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు, గ్రామస్థులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో మాజీ రాష్ట్రపతి, భారతరత్న జాకీర్ హుస్సేన్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి చిన్నారులు, గ్రామస్థులు నివాళులర్పించారు. ఆయన స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, గవర్నర్‌గా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను వక్తలు వివరించారు.

శిరస్త్రాణం ధరించకపోతే కేసులు తప్పవు



యువకులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రామచంద్రరావు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : నిర్లక్ష్యంకు నిండు ప్రాణం వెల చెల్లించాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు అన్నారు. ద్విచక్ర వాహనాల చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్న నిబంధనలను కఠినతరం చేసిన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రింగు కూడలిలో హెల్మెట్‌పై ప్రత్యేక డ్రైవ్‌ను ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు తీరని క్షోభలోకి వెళ్లిపోతున్నాయని చెప్పారు. అపోహలు వీడి శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని సూచించారు. శిరస్త్రాణం ధరించకపోతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని వినతి


చీమలపాడులో కరపత్రాలు పంచుతున్న వ్య.కా.సం నాయకులు

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని చీమలపాడులో ఆదివారం సీపీఎం అనుబంధ వ్య.కా.సం నాయకుడు పి.ఆనందరావు ఆధ్వర్యంలో ఈ నెల 12న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కార్మికుల సంబరాలు.. విస్సన్నపేట : కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడంతో మండల కేంద్రంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో కార్మికులు ఆదివారం సంబరాలు చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ముందుకు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ తరహాలో పథకాలు అమలు చేయాలని కోరారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ శ్రేణులు పాల్గొన్నారు.

నరికేస్తూ.. యథేచ్ఛగా తరలిస్తూ..



విస్సన్నపేట- నూజివీడు రోడ్డులో కొందరు పచ్చని చెట్లను నరుకుతున్నారు. లారీల కొద్ది కలపను యథేచ్ఛగా రహదారులను ఛిద్రం చేస్తూ మండల కేంద్రాలు, జిల్లాలు దాటి పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ఆపాల్సిన అటవీ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నరికిన కలపను రోడ్లపై అడ్డంగా వేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

జి.కొండూరు, న్యూస్‌టుడే : ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కవులూరులో ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి 92 మంది హాజరుకాగా వైద్యులు ఈశ్వర్, పవన్ వైద్య సేవలందించారు. ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు మందులను ఉచితంగా అందజేశారు. రామారావు, హనుమంతరావు, నవీన్ తదితరులు పర్యవేక్షించారు.


మైలవరం : వేరికోస్ వీన్స్‌పై పరీక్ష చేస్తున్న వైద్యురాలు

మైలవరం, న్యూస్‌టుడే : ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో వేరికోస్ వీన్స్‌పై ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. తహసీల్దార్ అబ్దుల్ దరియా శిబిరాన్ని ప్రారంభించగా పలువురు బాధితులకు వైద్యులు పరీక్షలు చేశారు. సుశ్రుత ఫౌండేషన్, ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నాయకులు జె. వెంకటేశ్వరరావు, సీహెచ్. నాగభూషణం, శ్రీధర్, డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యదర్శికి అభినందన



నాగార్జున సాగర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న హరికృష్ణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని సున్నంపాడు గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న లేళ్ల హరికృష్ణ నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేశారు. ఈ మేరకు శనివారం విజయవాడలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ పంచాయతీరాజ్ కమిషనర్ వి.నాగార్జున సాగర్ చేతుల మీదుగా ఉత్తమ కార్యదర్శిగా అవార్డు అందుకున్నారు. దీంతో జి.కొండూరు ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో బసవ లింగేశ్వరరావు, పలువురు తెదేపా నాయకులు ఆయనకు ఆదివారం అభినందనలు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


చిన్నారికి జ్ఞాపిక అందిస్తున్న ఉపాధ్యాయులు, నిర్వాహకులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు డివిజన్ పరిధిలోని అప్స డెమోక్రటిక్ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల యూనియన్) ఆధ్వర్యంలో ఆదివారం వివిధ మండలాలకు చెందిన విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టు పెంపొందించేందుకు స్పెల్‌బీ పోటీలను తిరువూరులో నిర్వహించారు. ఇందులో పలువురు పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు.

జోగి రమేష్ ఇల్లు పరిశీలన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటిని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆదివారం పరిశీలించి రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా దాడికి సంబంధించిన వీడియోలను జోగి ఆయనకు చూపించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబుల వీరంగం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : మందుబాబుల వీరంగంతో ఇబ్రహీంపట్నం రింగు కూడలి హడలెత్తింది. ఇబ్రహీంపట్నం రింగు కొండపల్లి బస్టాప్ సమీపంలోని బార్ వద్ద ఇప్పటికే అనేక వివాదాలు జరిగాయి. అందులో భాగంగానే ఆదివారం మరో వివాదం చెలరేగింది. కొందరు మందుబాబులు బార్ పక్కనున్న ఖాళీ భవనంలోకి వెళ్లి మద్యం తాగి ఒకరిపై మరొకరు గొడవ పడ్డారు. పెద్దగా శబ్దాలు చేస్తూ హడావుడి చేయగా ప్రయాణికులు హడలెత్తిపోయారు. కొంత సమయానికి మందుబాబులు ఖాళీ భవనం నుంచి దిగి వివాదం ఆడుకుంటూనే వెళ్లిపోయారు.

దొంగల హల్‌చల్

కొండపల్లి: కొండపల్లి కొత్తగేటు జర్నలిస్ట్ కాలనీలో ఖాళీగా ఉన్న ఓ ఇంటిలో దొంగలు పడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన చోరులు రెక్కీ నిర్వహించి అక్కడున్న ఇనుమును తరలించారు. అనంతరం సీసీ కెమెరాలను తొలగించే ప్రయత్నం చేశారు. దూరం నుంచి చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి రాకతో దొంగలు పరారయ్యారు.

కారును ఢీకొన్న లారీ

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి శివకృష్ణ థియేటర్ వద్ద కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు కొద్దిపాటి గాయాలయ్యాయి. కొండపల్లి నుంచి మైలవరం వైపు వెళ్తున్న కారు స్లో అయ్యే సరికి వెనుక ఉన్న లారీ కారును ఢీకొంది. లారీ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో కొంత సమయం జాతీయ రహదారి- 30పై వాహనాలు బారులుతీరాయి.

విద్యార్థులు చదువులో రాణిస్తే భవిష్యత్తు


మాట్లాడుతున్న ఎస్సై అర్జున్ రాజు

విస్సన్నపేట : విద్యార్థులు చదువులో రాణించాలని స్థానిక ఎస్సై అర్జున్‌రాజు సూచించారు. మండల కేంద్రంలోని శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువులో రాణించిన వారికి ఎస్సైతో పాటు శ్రీశ్రీవిద్యా సంస్థల ఛైర్మన్ సీహెచ్.రాజేంద్ర ప్రసాద్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ మున్నంగి జయరాజు పాల్గొన్నారు.

'యజమానులను సంప్రదించకుండా పనులు తగదు'


సమావేశమైన రైతులు, స్థల యజమానులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : జక్కంపూడిలోని రైతులు, స్థల యజమానులకు ప్రభుత్వం న్యాయం చేయాలని 60:40 స్థలాల యజమానుల సంఘం అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు కోరారు. జక్కంపూడిలోని స్థలాల వద్ద రైతులు, 60:40 ప్లాట్ల స్థల యజమానుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జక్కంపూడి సెక్టార్- ఎలోని స్థల యజమానులతో సంప్రదించకుండా ఖమ్మం- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దాదాపు 50 ప్లాట్ల నుంచి రోడ్డు వెళ్తుందని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. ఏ స్థలంలో నుంచి రహదారి వెళ్తుంది, ఎంత విస్తీర్ణంలో వెళ్తుందో కూడా సర్వే చేయలేదన్నారు. ప్రభుత్వం సర్వే చేయించి స్థల యజమానులతో సంప్రదించి నష్టపరిహారం ఇవ్వాలని, ఆ తర్వాతనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి ఆలపాటి లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సీఆర్‌డీఏ, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు ప్లాన్లు మంజూరు చేయడం లేదన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు శరత్‌బాబు, కోశాధికారి ఆలూరి సత్యనారాయణ, సభ్యులు బి.బసవయ్య, టి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు ప్రత్యేక ఆసుపత్రి నిర్మించాలి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఆసుపత్రిని నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. కానీ వారికి అవసరమైన మందులు, డయాలసిస్, నిపుణులైన వైద్యులు అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. డీవీ.కృష్ణ, చినబాబు, కుమారి, నాగేంద్ర ప్రసాద్, వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదం.. పట్టించుకోని యంత్రాంగం!



గంపలగూడెం మండలం గుళ్లపూడి, తిరువూరు మండలం రాజుగూడెం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి గుంత మధ్యలో కర్ర పాతి ఎర్రని వస్త్రం కట్టారు. రోడ్డు అడుగున సాగునీరు ప్రవాహానికి తూర(సిమెంట్ పైపు) కూడా ఉంది. నెల రోజుల కిందట పైపు పగిలి గుంత పడడంతో సమస్య ఉత్పన్నమైందని దుగ్గిరాల కృష్ణ తెలిపారు. అధికారులు స్పందించి గుంతకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గంపలగూడెం**

ఎండలు మొదలయ్యాయ్!

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. శీతాకాలం పూర్తి కాకముందే భానుడు మండిపోతున్నాడు. ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా కావలిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా నమోదైంది. నరసాపురం, బాపట్ల, ఒంగోలు, కావలి తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీలు పెరిగాయి. రాబోయే రెండురోజుల్లో దక్షిణ కోస్తాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర కోస్తా, యానాంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు అధికంగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని అంచనా వేసింది. రాయలసీమలో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తగ్గొచ్చని తెలిపింది. సోమవారం రాష్ట్రంలో కొన్నిచోట్ల పొగ మంచు కురుస్తుందని అంచనా.

ఉద్యోగి 33 ఏళ్ల సర్వీసు పూర్తిచేస్తే.. ప్రభుత్వానికి పదవీవిరమణ చేయించే అధికారం

- 3 నెలల ముందు నోటీసు.. లేదంటే జీతభత్యాల చెల్లింపు
- ఏపీ సివిల్ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు-2026 ముసాయిదా విడుదల
- ఉద్యోగ సంఘాల అభిప్రాయాలు కోరిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగి పదవీవిరమణ వయసు రాకుండానే 33 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే ప్రజాప్రయోజనాల దృష్ట్యా పదవీవిరమణ చేయించే అధికారం నియామక అధికారికి ఉంటుందని నూతన సివిల్ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు-2026 ముసాయిదాలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. 33 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నందున పూర్తి పింఛను ప్రయోజనాలు వర్తిస్తాయి. 33 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే కాలానికి మూడునెలల ముందు ఉద్యోగికి నియామక అధికారి నోటీసు జారీచేస్తారు. నోటీసు ఇవ్వని పక్షంలో ఆ మూడు నెలలకు సమానమైన జీతభత్యాలు చెల్లిస్తారు. 'పెన్షన్ కమ్యుటేషన్ నిబంధనల ప్రకారం తన పదవీవిరమణ పింఛనులో కొంతభాగాన్ని నగదు (కమ్యుట్)గా మార్చుకునే వెసులుబాటు ఉద్యోగికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు-2026 నూతన ముసాయిదాను ప్రభుత్వం ఈ నెల 4న విడుదల చేసింది. దీనిపై గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నుంచి అభిప్రాయాలు, సూచనలు ఆహ్వానించింది. ఈ నెల 20 లోపు లిఖితపూర్వకంగా అభిప్రాయాలు అందించాలని కోరింది. ఇప్పటివరకు ఉన్న ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980 స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. ఈ ముసాయిదాను ఆర్థికశాఖ రూపొందించింది. మొత్తం 98 పేజీల ముసాయిదాలో ప్రస్తుత నిబంధనలు, వాటి స్థానంలో తీసుకొస్తున్న నిబంధనలను వివరించింది. గరిష్ఠ సర్వీసు 33 ఏళ్ల తర్వాత పదవీవిరమణ చేయించే నిబంధనపై స్పష్టత లేకపోవడంతో ఉద్యోగసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందించేందుకు సిద్ధమవుతున్నాయి. పింఛను కోసం ఉద్యోగులు కనీసం పదేళ్లు, గరిష్ఠంగా 33 ఏళ్ల సర్వీసు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధన ప్రకారం చివరి వేతనంలో 50% పెన్షన్‌గా వస్తుంది. 20 ఏళ్ల తర్వాత స్వచ్ఛంద పదవీవిరమణ చేయొచ్చు. వారికి సర్వీసు ఆధారంగా పెన్షన్ నిర్ణయిస్తారు.

కష్టాల నుంచి పట్టుదలను అలవర్చుకుంటే విజయం

రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు చాగంటి



మాట్లాడుతున్న చాగంటి కోటేశ్వరరావు ★ హాజరైన విద్యార్థులు, ట్రిపుల్ ఐటీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు

నూజివీడు గ్రామీణం, న్యూస్‌టుడే: యువత కష్టాలను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడకుండా.. కష్టాల నుంచి పట్టుదలను అలవర్చుకుని విజయం సాధించాలని ప్రవచనకర్త, ఏపీ రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో 'విద్యార్థులు-నైతిక విలువలు' అనే అంశంపై ఉపన్యసించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఓర్పుతో పైలోకి వస్తున్నారు. భరించడం, క్షమించడం.. విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. గర్వం వీడితే విజయం మన సొంతమవుతుందని, గౌరవం లభిస్తుందని తెలిపారు. పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం రచించిన పాత్‌వేస్ టు గ్రేట్‌నెస్ అనే పుస్తకంలో ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా పలు అంశాలు ఉన్నాయన్నారు. కటిక పేదరికాన్ని అనుభవించి గొప్ప గాయకుడిగా ఎదిగిన ఘంటసాల, డబ్బుల్లేక కష్టపడి అందరికీ ఉపయోగపడే వైద్యుడిగా ఎదిగిన ఎల్లాప్రగడ సుబ్బారావు తీరును వివరించారు. ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే పానుగంటి లక్ష్మీనరసింహం రచించిన వినోదాలు వంటి మంచి పుస్తకాలను చదవాలని సూచించారు. విద్యార్థులు తాము గీసిన చాగంటి చిత్రపటాన్ని ఆయనకు అందించారు. విశ్వవిద్యాలయ అధికారులు చాగంటి దంపతులకు వీణను బహూకరించి సత్కరించారు.

కేజీ గోధుమ పిండి రూ. 20 కే

తెనాలిలో ప్రారంభించిన మంత్రి మనోహర్



మహిళకు గోధుమ పిండి అందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కిలో రేషన్ బియ్యంపై ప్రభుత్వం రూ.47.10 ఖర్చుచేస్తోందని, పాలిష్ చేసిన సన్నబియ్యంతో పోలిస్తే ఆరోగ్యానికి ఇవి చాలా మంచివని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రేషన్ కార్డుదారులకు రూ.20కే గోధుమ పిండిని అందించే కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో 1,800 టన్నుల గోధుమపిండిని పంపిణీ చేస్తున్నాం. రానున్న రోజుల్లో అన్నిచోట్లా పంపిణీ చేస్తాం. వైకాపా పాలనలో రేషన్ పంపిణీ విధానం కొందరికే ఉపయోగపడింది. కార్డులనూ సొంత కార్యక్రమం అన్నట్లు వారి ఫొటోలు, రంగులతో నింపేశారు. కూటమి ప్రభుత్వంలో చౌకధరల దుకాణాలు నెలలో 15 రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అందుబాటులో ఉండేలా మార్పులు చేశాం. స్మార్ట్ రేషన్‌కార్డు ద్వారా రాష్ట్రంలో ఏ దుకాణంలోనైనా సరకులు తీసుకోవచ్చు. డీలర్లకూ మరింత ఆదాయం వచ్చేలా రానున్న రోజుల్లో కొండ ప్రాంతాలు, ఇతర సేంద్రియ సాగు ఉత్పత్తులను వారిద్వారా ప్రజలకు చేరువ చేస్తాం' అని చెప్పారు.



ఆలోచనే విజయానికి పునాది

గెలుపు, ఓటములు రెండూ మన మనసు నుంచే ప్రారంభమవుతాయి. గెలుస్తానని మనసులో బలంగా భావించి కార్యాచరణ మొదలుపెడితే మీరు తప్పక విజయం సాధిస్తారు. అలాకాకుండా ఇది నా వల్ల కాదు అని భావిస్తే అపజయం ఎదురవుతుంది. ఆలోచనా విధానాన్ని సరిచేసుకోవడమే గెలుపునకు పునాది.

– బెంజమిన్ డానియల్, డిజిటల్ క్రియేటర్

రాష్ట్రవ్యాప్తంగా శాప్ క్రీడా సంరంభం

26 జిల్లాల వేదికగా రాష్ట్ర స్థాయి లీగ్స్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో ఉన్న క్రీడాకారుడి ప్రతిభను సైతం వెలికి తీసి రాష్ట్ర, జాతీయస్థాయుల్లో వారు మెరిసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ సంవత్సరం పొడవునా శాప్ లీగ్స్ పేరుతో క్రీడా సంబరాలు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించింది. ఈ నెల 17 నుంచి డిసెంబర్ 28 వరకు 26 జిల్లాల్లో 31 క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయిలో శాప్ లీగ్స్ పేరుతో పోటీలు జరుగుతాయి. ఒక్కో జిల్లాకు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ క్రీడాంశం కేటాయించారు. ఉదాహరణకు ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌ను అనంతపురానికి కేటాయించారు. అన్ని జిల్లాల ఫుట్‌బాల్ జట్లు వచ్చి అక్కడే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటాయి. అంతకుముందు జిల్లా స్థాయిలో టోర్నమెంట్లు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీకి క్రీడాకారుల్ని ఎంపిక చేయనున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీల ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపినవారిని జాతీయస్థాయిలో నిర్వహించే ఖేలో ఇండియా పోటీలకు పంపనున్నారు. శాప్ లీగ్స్‌లో దివ్యాంగులకూ ప్రత్యేకంగా పోటీలున్నాయి. ఈ పోటీలతో పాటు జులై, ఆగస్టు నెలల్లో అమరావతి ఛాంపియన్‌షిప్ పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

సీఎంను బూతులు తిడితే జైల్లో పెట్టరా?

- ఇలాంటి వారికి కులాన్ని ఆపాదిస్తారా?
- మిమ్మల్ని కూడా అరెస్ట్ చేస్తే సరి
- మాజీ సీఎం జగన్‌పై జనసేన ఎమ్మెల్సీ నాగబాబు ధ్వజం



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రిని తిడితే జైల్లో పెట్టకుండా ముద్దు పెట్టుకుంటారా అని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ధ్వజమెత్తారు. అలాంటి వారికి కులాన్ని ఆపాదించి కుల చిచ్చు పెడదామనుకుంటే మిమ్మల్ని కూడా అరెస్ట్ చేస్తే సరిపోతుంది' అని వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి ఆయన మండిపడ్డారు. 'మీరు ఇంకా రాంబాబు, రాంబాబు ఏర్పాటుచేసిన పాలసీల కాలం నాటి రాజకీయాలే చేస్తామంటే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావు' అని విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన ఆదివారం వీడియోను పోస్ట్ చేశారు. కాపు కులాన్ని పట్టుకుని తాగుబోతులు, తిరుగుబోతులు అంటూ మాట్లాడే అంబటి రాంబాబు లాంటి వ్యక్తిని కాపు కులానికి ఒక ఐకాన్‌గా పేర్కొనే వైకాపా బ్యాచ్ సమాధానం చెప్పాలంటూ కొన్ని ప్రశ్నలు సంధించారు. 'ఎప్పటి నుంచో బలిజలు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజంపేట లోక్‌సభ సీటును 2014లో మిథున్‌రెడ్డికి కట్టబెడుతుంటే అంబటి రాంబాబు, పేర్ని నాని ఎక్కడ నిద్రపోయారు. 2024 ఎన్నికల్లో ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో 15-20 శాతం కాపు, బలిజ సామాజికవర్గం ఉన్నా.. ఒక్క లోక్‌సభ టికెట్ వారికి ఇవ్వకున్నా జగన్‌ని ఎందుకు ప్రశ్నించలేదు? కాపునేస్తం లాంటి పథకాలకు వైఎస్సార్ పేరు పెట్టినప్పుడు వైకాపాలోని కాపు నాయకులు ఎక్కడున్నారు? జగనన్నా.. మీ నాయనకు మా కులానికి ఏంటి సంబంధం అని ఎందుకు అడగలేదు? జగన్ వంగవీటి మోహనరంగాను పైకి అభిమానిస్తే ఆయన కుమారుడు రాధాకు టికెట్ ఇవ్వకుండా పార్టీ నుంచి ఎందుకు బయటకు పంపారు? రంగాను లేపిన గౌతంరెడ్డిని నామ్‌కే వాస్తేగా సస్పెండ్ చేసి మళ్లీ ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్‌గా ఎందుకు నియమించారు' అని నిలదీశారు.

జోగి రమేష్ బీసీనని చెప్పుకోవడం సిగ్గుచేటు

గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి



గీత కార్మికునికి గుర్తింపు కార్డును అందజేస్తున్న వీరంకి గురుమూర్తి తదితరులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: 'వైకాపా హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు కల్లు గీత కార్మికులను పట్టించుకోని జోగి రమేష్.. ఇప్పుడు తాను బీసీనంటూ చెప్పుకోవడం సిగ్గుచేటు. బాపట్ల జిల్లాకు చెందిన విద్యార్థి అమర్‌నాథ్‌గౌడ్ చనిపోయినప్పుడు ఆయన ఎందుకు ప్రశ్నించలేదు? గీత కార్మికుల సంక్షేమానికి తెదేపా ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ వైకాపా ప్రభుత్వం రద్దుచేసి, నిధులు మళ్లించినప్పుడు ఎందుకు స్పందించలేద'ని గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి నిలదీశారు. గుంటూరు జిల్లా పాత మంగళగిరిలోని గౌడ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు గౌడసంఘం రాష్ట్ర సమావేశం ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేఖా సుధాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. గురుమూర్తి మాట్లాడుతూ తాడిచెట్లపై నుంచి జారిపడి, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.5 లక్షల చొప్పున చంద్రన్న బీమా అందించేవారని, దాన్ని వైకాపా ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. 'రేపల్లె నియోజకవర్గంలో 120 గీత కార్మిక కుటుంబాలు తాటి బెల్లం తయారుచేసి, విదేశాలకు ఎగుమతి చేసి మంచి ఆదాయం పొందుతున్నాయి. ఈ తరహా చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడంపై ఆలోచిస్తున్నామ'ని చెప్పారు. అనంతరం గీత కార్మికులకు గుర్తింపుకార్డులు అందించారు. పద్మశాలీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, తితిదే బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గౌడ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాతా జయప్రకాశ్, డైరెక్టర్ సొంఠి శివరామ్‌ప్రసాద్, వై.శైలజ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలమంతా టూరిజానిదే

మంత్రి కందుల దుర్గేష్



కొండవీడు కోటలోని చెరువులో జల విహారం చేస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, యడ్లపాడు: రాబోయే కాలమంతా టూరిజానిదేనని.. ఈ విషయంలో ముఖ్యమంత్రి సూచించిన ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం కొండవీడు ఉత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "కూటమి అధికారంలోకి వచ్చాక ఒకవైపు అభివృద్ధి, సంక్షేమం దూసుకెళుతుంటే.. మరోవైపు కళా సాంస్కృతిక వైభవం కొనసాగుతోంది. అన్ని పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి సందర్శకులను ఆకర్షించేలా రాష్ట్రం అంతటా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసినా, నిధులు లేకపోయినా చంద్రబాబు దార్శనికతతో అభివృద్ధి, పర్యాటక పనులు చేస్తున్నాం. ఎక్కడ ఉత్సవాలు నిర్వహించినా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. వారసత్వ సంపదగా ఉన్న కొండవీడు కోటను పరిరక్షించుకుందాం. ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం'' అని అన్నారు.

మూడో ప్రత్యామ్నాయానికి కృషి

- విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు, వేదికపై లక్ష్మణరెడ్డి, ముప్పాళ్ల ప్రసాద్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజాహితం కోరే భావసారూప్యత గల వ్యక్తులు, పౌర సంస్థలతో చర్చించి రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయం ఆవిర్భావానికి కృషి చేస్తున్నట్లు విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జనచైతన్య వేదిక ఆదివారం గుంటూరులో 'రాజకీయ ఘర్షణలు-రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం' అనే అంశంపై ఏర్పాటుచేసిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిని విస్మరించి.. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా పాలక, ప్రతిపక్ష పార్టీలు ఘర్షణలు, దాడులకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం షిర్డీ సాయి సంస్థకు విద్యుత్తు కాంట్రాక్టులు అప్పగించి కోట్లు దోచి పెట్టిందని, అదే సంస్థకు తెదేపా ప్రభుత్వం అధిక రేట్లకు కాంట్రాక్టులు అప్పగిస్తోందన్నారు.

దాడులు సమర్థనీయం కాదు: గతంలో వైకాపా హయాంలో తెదేపా కార్యాలయాలు, తదితరాలపై దాడులు జరిగితే బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వారిపై కఠినచర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు అంబటి ఇంటిపై దాడులు జరిగేవి కాదన్నారు. నేతలు సంస్కారవంతంగా మాట్లాడాలని, కట్టుతప్పినవారిని ప్రజలు నిలదీయాలని సూచించారు. పలు సభల్లో చంద్రబాబుపై జగన్ తీవ్ర పదజాలం ఉపయోగించినా ఎవరూ మాట్లాడలేదని.. దీంతో ఇప్పటికీ జగన్, ఆ పార్టీ నాయకులు అదే విధానం కొనసాగిస్తున్నారని వివరించారు. గతంలో నేతలెవరూ ఇలాంటి పరుష పదజాలం ఉపయోగించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, ముప్పాళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు.. పక్కా ఫైర్ సేఫ్టీ!



పాఠశాల బస్సులో నీటి పైపులు, హీట్ డిటెక్టర్లు





మంటలు వస్తే అప్రమత్తం చేసే లైటు ★ స్ప్రింక్లర్లు

బస్సులు అగ్నికి ఆహుతైన ఘటనలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4 నెలల్లో రెండు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు చనిపోయారు. ఇలాంటి ప్రమాదాలను తప్పించాలని కర్నూలులోని ఓ ప్రైవేటు పాఠశాల ఫైర్ సేఫ్టీ బస్సులను కొనుగోలు చేసింది. ఈ నూతన బస్సుల్లో ఆధునిక అగ్నిమాపక పరికరాలు ఉన్నాయి. పొగ రాగానే ప్రయాణికులు అప్రమత్తమయ్యేలా అలారం, రెడ్ లైట్లు, వేడిని పసిగట్టే డిటెక్టర్లు, నీటి పైపులు, స్ప్రింక్లర్లూ ఉన్నాయి. బస్సు కిందిభాగంలో నీటి ట్యాంకు ఉంది. ప్రమాదం జరిగినప్పుడు స్ప్రింక్లర్లు పని చేసి నీటిని పిచికారీ చేస్తాయి.

– ఈనాడు, కర్నూలు

విద్యార్థుల అస్వస్థతకు ముగిసిపోయిన సరకులే కారణం

- దేవరపల్లి ఆశ్రమ పాఠశాల వార్డెన్, వంటమనిషి సస్పెన్షన్
- ఆసుపత్రుల్లో ఇంకా 41 మంది..



రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మారేడుమిల్లి, రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం దేవరపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అనారోగ్యం పాలవడానికి కాలపరిమితి ముగిసిపోయిన ఇడ్లీ నూక, శనగపిండితో చేసిన అల్పాహారమే కారణమని తేలింది. శనివారం ఉదయం శనగపిండి చట్నీతో ఇడ్లీలు తిన్న తర్వాత కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురైన 89 మందిని ఆసుపత్రులకు తరలించిన విషయం తెలిసిందే. ఆదివారం మరో 14 మందికి అనారోగ్యం కలగడంతో వారినీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం 62 మందిని ఆదివారం పాఠశాలకు పంపించేశారు. ప్రస్తుతం రంపచోడవరం ఆసుపత్రి, మారేడుమిల్లి పీహెచ్‌సీల్లో 41 మంది చికిత్స పొందుతున్నారు. మరోవైపు కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చెందిన బృందం ఆదివారం పాఠశాలను సందర్శించి సరకులను తనిఖీ చేయగా ఇడ్లీ నూక, శనగపిండి కాలపరిమితి ముగిసినవని బయటపడింది. పాఠశాలలో కోతుల సంచారం అధికంగా ఉన్నందున ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదమూ ఉందని వారు పేర్కొన్నారు. సరకుల నమూనాలను మరిన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలిస్తామని బృంద సభ్యులు తెలిపారు. ఆశ్రమ పాఠశాల వార్డెన్ గణపతి, వంటమనిషి లక్ష్మిని సస్పెండ్ చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగదయ్య వెల్లడించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందన్నారు. విద్యార్థుల సంక్షేమంపై పర్యవేక్షణ కొరవడిందని, ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు.

నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు: సీఎం

ఈనాడు, అమరావతి: దేవరపల్లి ఆశ్రమ బాలుర వసతిగృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సీఎంవో, ఇతర ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ఆదివారం సమీక్షించారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, ఎప్పటికప్పుడు ఆ వివరాల్ని తనకు నివేదించాలని ఆదేశించారు. ఈ ఘటనపై సోమవారం లోగా నివేదిక ఇవ్వాలన్నారు. అవసరమైతే బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని అధికారులు సీఎంకు నివేదించారు.

ఫాగింగ్‌తో విద్యార్థులకు అస్వస్థత



బక్కన్నపాలెం యూపీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

విశాఖపట్నం (కొమ్మాది), న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని మధురవాడ సమీపంలో ఉన్న బక్కన్నపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఓ విద్యార్థికి మలేరియా లక్షణాలు కనిపించడంతో శనివారం సాయంత్రం విద్యాలయం ప్రాంగణంలో దోమల నివారణ కోసం రసాయన మందును ఫాగింగ్ చేశారు. ఆ పొగ పీల్చిన కొద్దిసేపటికి సుమారు 50 మందికి పైగా విద్యార్థుల్లో వాంతులు, తల తిరగడం లాంటి లక్షణాలు బయటపడ్డాయి. ఒక్కసారిగా ఎక్కువమంది అస్వస్థతకు గురవడంతో విద్యాలయం నిర్వాహకులు అప్రమత్తమై వెంటనే వైద్యాధికారులకు సమాచారం అందించారు. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు సూచనతో బక్కన్నపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాల్మన్‌రాజ్ పర్యవేక్షణలో విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించారు. వీరిలో 8 మంది విద్యార్థులు నీరసంతో ఇబ్బంది పడటంతో ఆదివారం ఉదయం బక్కన్నపాలెం యూపీహెచ్‌సీకి తరలించి ప్రత్యేక వైద్యచికిత్స అందించడంతో వారి ఆరోగ్యం కుదుటపడింది. దీంతో వారిని తిరిగి విద్యాలయానికి తీసుకొచ్చారు. ఘటన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు లోనై ఆదివారం పెద్ద ఎత్తున విద్యాలయానికి చేరుకుని పిల్లల ఆరోగ్యస్థితి తెలుసుకున్నారు. రసాయన మందులు వినియోగించే సందర్భంలో అజాగ్రత్తగా ఉండటం పట్ల నిర్వాహకులపై వారు మండిపడ్డారు. ఈ ఘటనపై విద్యాలయం ప్రిన్సిపల్ చంద్రశేఖర్ స్పందిస్తూ... అస్వస్థతకు గురైన విద్యార్థులంతా ప్రస్తుతం క్షేమంగా ఉన్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రత్యేక శిబిరం ద్వారా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు.

డా.రాకేశ్ కలపాలకు 'యూరోపియన్ సొసైటీ' ఫెలోషిప్

ఏఐజీ వైద్యుడికి అంతర్జాతీయ గౌరవం



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో సెంటర్ ఫర్ ఒబెసిటీ, మెటబాలిక్ థెరపీ విభాగం సీనియర్ కన్సల్టెంట్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఎండోస్కోపీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ కలపాల.. 'ఫెలోషిప్ ఆఫ్ ది యూరోపియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపీ(ఎఫ్ఈఎస్‌జీఈ)' గౌరవాన్ని పొందారు. యూరోపియన్ సొసైటీ అందించే ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికైన రెండో భారతీయుడిగా అరుదైన ఘనత సాధించారు. గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఎండోస్కోపీ విభాగంలో చేసిన విశేష పరిశోధనలు, క్లినికల్ కేర్, వృత్తిపరమైన సేవలను గుర్తించి ఈ ఫెలోషిప్‌నకు ఆయనను ఎంపిక చేశారు. రాకేశ్ సాధించిన ఈ విజయం తమకు గర్వకారణమని ఏఐజీ ఆసుపత్రి యాజమాన్యం కొనియాడింది.

ఏంటి మాస్టారూ.. ఇలా 'చిక్కి'పోయారు?

తునిలో ఏటీఎం చోరీకి యత్నించి.. దొరికిన ఝార్ఖండ్ వాసి



ఏటీఎం యంత్రాన్ని రాయితో పగులగొడుతున్న నిందితుడు

తుని పట్టణం, న్యూస్‌టుడే: శనివారం అర్ధరాత్రి 12.40 గంటల సమయం. కాకినాడ జిల్లా తుని పట్టణం జీఎన్‌టీ రోడ్డులోని రామా థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి ఓ వ్యక్తి ప్రవేశించాడు. ఆ యంత్రాన్ని రాయితో పగులగొట్టే ప్రయత్నం చేశాడు. తర్వాత ఇనుప ఊచతో కింద డోరు తెరిచాడు. లోపల నగదు ఉండే తలుపును తెరిచేందుకు ప్రయత్నించాడు. ఈ తతంగం 20 నిమిషాల పాటు సాగింది. సీసీ కెమెరాల ద్వారా దీన్ని గుర్తించిన బ్యాంకు కేంద్ర నిఘా విభాగం సిబ్బంది బ్రాంచి మేనేజర్ సౌజన్యకుమారికి సమాచారం ఇచ్చారు. సీఐ గీతారామకృష్ణకు విషయాన్ని తెలియజేయడంతో హుటాహుటిన పోలీసులు, బ్యాంకు అధికారులు అక్కడికి వెళ్లారు. చోరీ ప్రయత్నం ఫలించక అప్పటికే వెనుదిరిగిన వ్యక్తిని గాలించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఏటీఎం పగులగొట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తి ఝార్ఖండ్‌కు చెందిన 35 ఏళ్ల రంజిత్‌కుమార్ జాదవ్‌గా గుర్తించారు. నిందితుడు అక్కడ ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఉద్యోగం రెగ్యులరైజ్ కాకపోవడంతో దాన్ని వదిలేశాడు. రెండేళ్లుగా అతడి మానసికస్థితి సరిగా లేదని తెలిసింది. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో సోదరుడి ఇంటికి వెళ్లిన రంజిత్.. తిరుగుప్రయాణంలో టికెట్ తీసుకోకుండా రైలు ఎక్కడంతో టీటీఈ గుర్తించి తునిలో దించేశారు. తర్వాత పట్టణంలో తిరుగుతూ నగదు కోసం ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

వసుంధర

vasundhara@eenadu.in

నా వెనక... వంద మంది 'వారియర్స్'!

వచ్చేది వేసవి కాలం. ఎంత మంది నీటి ఇక్కట్లు ఎదుర్కొంటారో కదా! అసలు కాలంతో సంబంధం లేకుండా కరవు చూసే ప్రాంతాలూ దేశాలూ బోలెడు. సురక్షిత తాగునీరు లేని వాళ్లకైతే లెక్కేలేదు. అలాంటి నీటిని మనం తెలియకుండానే ఎంత వృథా చేస్తున్నామో! దీనిపైనే అవగాహన కల్పిస్తోంది **నిత్య తమ్మన**. అంతేకాదు, యూకే పార్లమెంట్, ఐక్యరాజ్యసమితి దృష్టినీ ఆకర్షించింది.

మా స్వస్థలం విజయవాడ. కానీ మా కుటుంబం అమెరికాలో స్థిరపడింది. నాన్న వంశీ సైబర్ సెక్యూరిటీలో పనిచేస్తూ రెండు సంస్థలనీ నిర్వహిస్తున్నారు. అమ్మ లక్ష్మి క్వాలిటీ అనలిస్ట్. అన్నయ్య నిహాల్ వెయ్యిమంది వాలంటీర్లతో పాత బ్యాటరీలను రీసైకిల్ చేసి, గిన్నిస్ రికార్డుని నెలకొల్పాడు. అలా నాకూ ఏదైనా సమస్యమీద అవగాహన కల్పించాలి అనిపించింది. సాధారణంగా షవర్ చేస్తున్నప్పుడు చల్లగా వస్తాయని ముందు కొంత నీటిని వదిలేస్తుంటారు. కొన్ని నిమిషాలే కానీ ఒక్కో కుటుంబం ఏటా కనీసం 80 వేల లీటర్ల నీటిని వృథా చేస్తోంది. అందరినీ లెక్కేస్తే ఇంకెంత నీరు వృథా అవుతోందో! బెంగళూరులో ఇప్పటికే 50% బావులు ఎండిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా తాగునీటి సౌకర్యం లేనివాళ్లూ చాలామందే. మనమేమో ఆదా చేయకపోగా వృథా చేస్తున్నామనిపించింది. ఇదే విషయం నాన్నకి చెబితే పరిష్కారం ఆలోచించమన్నారు.



సగం గ్లాసు చాలు

మొదట షవర్‌హెడ్‌లో ఇన్‌స్టంట్ వాటర్ హీటర్ పెడదామనుకున్నాం. కానీ భద్రత దృష్ట్యా ఆ ఆలోచన మానుకున్నాం. తరవాత బ్యాటరీలు, ప్రత్యేక ట్యాంక్ ఇలా ఎన్నో ఆలోచనలు చేశాక చివరికి రీసర్క్యులేషన్ పంప్ కనిపించింది. దీన్ని షవర్ పంపులో అమరిస్తే మనం ఎంచుకున్న వేడికంటే చల్లగా నీళ్లు ఉంటే వాటిని తిరిగి వేడినీటి ట్యాంక్‌లోకి పంపిస్తుంది. దీంతో నేరుగానే వేడినీళ్లు వచ్చేస్తాయి, వృథా ఉండదు. దీన్ని తయారుచేస్తున్న సంస్థ ఏదైనా ఉందా అని వెతికితే ప్రపంచంలోనే అగ్రశ్రేణి సంస్థ 'గ్రండ్‌ ఫాస్' కనిపించింది. వాళ్ల నుంచి మరింత సమాచారం తెలుసుకున్నా. ఆపై 'సేవ్ డ్రాప్' అనే ఎన్‌జీఓని ప్రారంభించి, నీటి ఆదాపై అవగాహన కల్పిస్తున్నా. దాహమేస్తే సగం గ్లాసు నీళ్లే తీసుకోండి. తరవాతా కావాలనిపిస్తేనే మళ్లీ తీసుకోండి. బాటిళ్లలో మిగిలిన నీటిని మొక్కలకు పోయండి అంటూ ఇలాంటి చిన్న చిన్న సలహాలనే ఇస్తున్నాం. నా పని నచ్చి అమెరికా వ్యాప్తంగా 100 మంది విద్యార్థులు వాటర్ వారియర్స్‌గా మారారు. నాతో కలిసి నీటి ఆదాతోపాటు రీసర్క్యులేషన్ పంప్ మీదా అవగాహన పెంచుతున్నారు.

వెళ్లలేక... వీడియో

ఓరోజు నాన్న 'అవగాహన కల్పిస్తే సరిపోదు కదా! ఏ పనికైనా అంతిమ లక్ష్యం ఉండాలి. మీరు చేసేదానిలో అదేంటి' అనడిగారు. అప్పుడు ఆలోచనలో పడ్డా. అమెరికాలో వైట్ హౌజ్, ప్రెసిడెంట్, కాంగ్రెస్‌కి పిటిషన్స్ వేస్తారు. దానికి ట్రాక్షన్ వస్తే రాజకీయ నాయకులంతా దానివైపు చూస్తారని చెప్పారు. అమెరికాలో ఇల్లు కట్టుకునేవాళ్లకి బిల్డింగ్ కోడ్ ఉంటుంది. దానిలో రీసర్క్యులేషన్ పంప్‌నీ తప్పనిసరి చేయమని పిటిషన్ వేశా. దానికి 650కి పైగా సంతకాలు వచ్చాయి. నాకు గతంలో కంటి సమస్య వచ్చి, బాధపడుతోంటే నాన్న భగవద్గీత పరిచయం చేశారు. శ్లోకాలు నేర్చుకోవడమే కాదు... ఇతరులకీ వారానికి రెండు చొప్పున నేర్పిస్తున్నా. దానికి తాత్పర్యం మాత్రం పర్యావరణం, నీటి ఆదా వంటివి జోడిస్తూ చెబుతుంటా. నా పనితీరు నచ్చి ఇక్కడ సీబీఎస్ టీవీ తమ 'విజనర్స్ షో'లో భాగంగా నా ఇంటర్వ్యూ తీసుకుంది. యూకే పార్లమెంట్ లోనూ మాట్లాడే అవకాశం వచ్చింది. కానీ వెళ్లలేకపోయా. దీంతో వీడియో రికార్డు చేసి పంపా. వివిధ దేశాల ప్రతినిధుల ముందు దాన్ని ప్రదర్శించారు. ఐక్యరాజ్యసమితి సీఎస్‌డబ్ల్యూ పేరుతో ఏటా వివిధ దేశాల ప్రతినిధులతో మహిళా సదస్సును నిర్వహిస్తుంది. దానిలో నన్నూ డెలిగేట్‌గా చేర్చారు. 70 ఏళ్ల చరిత్రలో 11ఏళ్లమ్మాయిని ఇలా చేర్చుకోవడం తొలిసారి అని తెలిసినప్పుడు ఆనందమేసింది. యూఎస్‌లోని గవర్నర్లు, మేయర్లు, సెనేటర్లు... ఇలా అందరికీ నీటిఆదా మీద ఉత్తరాలు రాస్తుంటా. పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా 'వాటర్ బస్', 'రీసర్క్యులేషన్ రెవల్యూషన్' అనే రెండు కార్టూన్ కథల పుస్తకాలనీ రచించా. ఈ ఏడాది చివరిలోగా వెయ్యిమంది వాటర్ వారియర్స్‌ని తయారు చేయాలి. పెద్దయ్యాక పీడియాట్రిక్ ఆప్తల్మాలజిస్ట్ అయ్యి, పేదపిల్లలకు ఉచితంగా చికిత్స చేయాలన్నవి నా లక్ష్యాలు.

తనని దక్కించుకునేదెలా..?

మా కోడలు 12 ఏళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతోంది. రెండుమూడు నెలలు మందులు వాడితే సంవత్సరం వరకూ బాగానే ఉంటుంది. తర్వాత మళ్లీ సమస్య తిరగబెడుతోంది. తనకి ఇటీవల వైద్య పరీక్షలు చేయిస్తే హిమోగ్లోబిన్(హెచ్‌బీ) శాతం తక్కువగా ఉంది. 'మానసిక సమస్యకు మందులు వాడటం వల్లే దీనిశాతం తగ్గి ఉంటుంది, ఆపేయండి' అనడంతో వాడటం మానేసింది. ఇప్పుడు హెచ్‌బీ శాతం పెరిగింది. కానీ మానసిక సమస్య తీవ్రమైంది. నిద్రపోలేకపోతోంది, భయపడుతోంది. నేనిక బతకను అంటూ ఏడుస్తోంది. తనని ఎలా కాపాడుకోవాలి?

- ఓ సోదరి

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి, మానసిక నిపుణురాలు


కొన్నిరకాల మానసిక సమస్యలు వైద్యంతో సంబంధం లేకుండా కాలక్రమంలో తగ్గిపోతాయి. కొన్ని అలాకాదు, వస్తూపోతూ కూడా ఉంటాయి. వీటికి చికిత్స తీసుకుంటేనే నయం అవుతాయి. అలాగే కొన్ని జన్యు పరంగానూ వస్తాయి. ఇలా వచ్చినవి ఎక్కువకాలం, సమస్య తీవ్రతను బట్టి జీవితాంతం ఉంటాయి. మీరు చెప్పిన దాన్నిబట్టి చూస్తే మీ కోడలు రెండో రకం సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. దీన్ని 'ఎపిసోడిక్ మెంటల్ ఇల్‌నెస్' అంటారు. దీనిలో సమస్య మొదలైనప్పుడు... ఆకలి లేకపోవడం, ఇతరులతో కలవలేకపోవడం, నిద్ర లేకపోవడం, దుఃఖం, దిగులు వంటివి ఉంటాయి. డిప్రెషన్ లక్షణాలు కనిపిస్తాయి. దీన్ని 'మేజర్ డిప్రెసివ్ డిజార్డర్' అంటారు. ఇది ఒకసారి వచ్చి తగ్గిన తర్వాత కొన్ని ఏళ్లకు మళ్లీ వచ్చే ఆస్కారం ఉంది. ఇలా రావడాన్ని 'రికరెంట్ డిప్రెసివ్ డిజార్డర్' అంటారు. దీని తర్వాతి స్టేజ్‌లో అతి సంతోషం, హింసాత్మకమైన ఆలోచనలు వంటివి ఉంటాయి. తీవ్రతనుబట్టి అది మేనియానా, బైపోలార్ డిజార్డర్ అనేది చెప్పే అవకాశం ఉంటుంది. మీ కోడలి సమస్య ఏంటనేది వైద్యుల్ని సంప్రదిస్తే తెలుస్తుంది. దీనికి రక్తహీనతకీ ఎటువంటి సంబంధమూ లేదు. మానసిక సమస్యలున్నవారికి ఎనీమియా ఉంటే దానికి వేరేగా చికిత్స అందించాల్సి ఉంటుంది. అంతేగానీ, శారీరక సమస్యల దృష్ట్యా మానసిక చికిత్సకు సంబంధించిన మందులు ఆపేయడం సబబు కాదు. కాబట్టి ఆలస్యం చేయకుండా ఆమెను సైకియాట్రిస్టుకు చూపించండి. ఆమె పరిస్థితిని బట్టి మందుల్ని సిఫారసు చేస్తారు. సమస్య తీవ్రత మళ్లీ మళ్లీ రాకుండా ఉండటానికి మూడ్ స్టెబిలైజర్ మందులు ఉంటాయి. వాటిని నిర్ణీత కాలానికి ఇస్తే, సమస్య నుంచి బయటపడేందుకు సహకరిస్తాయి.

రెట్రో వాక్ చేయండి...



ఆరోగ్యంగా ఉండాలన్నా, అందంగా కనిపించాలన్నా వ్యాయామం తప్పనిసరి. ఇందుకోసం మహిళలు సులువుగా ఎంచుకునే మార్గం నడక. అయితే, ఈసారి ముందుకు కాకుండా వెనక్కి అడుగులేసి చూడండి. ఎందుకంటే దీనివల్ల బోలెడు ప్రయోజనాలున్నాయని ఆరోగ్య నిపుణులు చెప్పడంతో యువతరం దీన్ని అనుసరిస్తోంది. ఈ నడక వల్ల శరీరానికీ, మెదడుకీ మధ్య సమన్వయం పెరుగుతుంది. కండరాల దృఢత్వం మరింత మెరుగ్గా ఉంటుంది. అంతే కాదు, దీనివల్ల కీళ్లపై ఒత్తిడీ తగ్గుతుందట. ఊపిరితిత్తుల పని తీరు మెరుగుపడి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కెలోరీలూ ఎక్కువగానే కరుగుతాయి కాబట్టి బరువూ అదుపులో ఉంటుంది. మానసికంగానూ చురుగ్గా ఉంటారు. అయితే, దీన్ని ఎక్కడపడితే అక్కడ చేయొద్దు. సురక్షితమైన బహిరంగ ప్రదేశాల్లో నెమ్మదిగా చేయండి. చిన్న చిన్న సెషన్లుగా ఓ పదినిమిషాలు చేస్తే చాలు. ప్రయత్నించి చూస్తారా?

ఆకు కూరలు వండి తిందామా!



పచ్చదనంతో నిండిన ఆకుకూరల్లో పోషకాలు ఎక్కువ. ఇవి రోగనిరోధకశక్తిని మెరుగుపరుస్తాయనీ మనకు తెలుసు. కానీ, కొన్ని ఆకుకూరలను ఉడికించి తినడం వల్ల వాటి పోషక విలువలు రెట్టింపు అవుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

- పాలకూరలో ఆక్సాలిక్ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కాల్షియం, ఐరన్, విటమిన్ ఇ వంటి పోషకాలను శరీరం గ్రహించకుండా అడ్డుకునే ఆస్కారం ఉంది. పాలకూరను ఉడికిస్తే దీనిలోని ఆమ్ల శాతం తగ్గి పోషకాలు అందడంతోపాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలా అని ఎక్కువ సమయం ఉడికించడం కూడా మంచిది కాదు.
- విటమిన్ ఎ, సి, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉండే మునగాకు ఉడికించి తింటే అందులో పోషకాలు పెరుగుతాయి. ఇవి శరీరంలో వాపు, మంటలను తగ్గిస్తాయి. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. యాంటీఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గిస్తాయి.
- కెలోరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉండే బచ్చలిని ఉడికించి తినడం మేలు. ఇలా చేయడంవల్ల దానిలో బీటా కెరోటిన్, మెగ్నీషియం స్థాయులు పెరుగుతాయి. అంతేకాదు, దీన్నుంచి లభించే విటమిన్ ఎ, సి, కాల్షియం, పొటాషియం వంటి పోషకాలు శరీరానికి సమపాళ్లలో అందుతాయి.
- అయితే కొన్ని ఆకుకూరల్ని మాత్రం సన్నని సెగమీద కొంచెం నూనెతో వేయించడం వల్ల పోషకాలు పెరుగుతాయి. వాటిలో తోటకూర ఒకటి. దీన్ని వేయించడం వల్ల ఫోలేట్, విటమిన్ సి పెరిగి రోగనిరోధకశక్తిని పెంచుతాయి. మెంతికూరను వేయిస్తే పాలీఫినాల్స్ పెరిగి జుట్టు, చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి.

బియ్యప్పిండి... ఎవ్వరికైనా!

మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం... ఏ అమ్మాయి కోరుకునేదైనా ఇదే! కాకపోతే సమస్యల్లా ఒకటే... అందుకు ఏం వాడాలి అనే. ఫలానా క్రీమ్ లేదా సీరమ్ బాగుంది అని ఎవరైనా అన్నారంటే అది మన చర్మానికి పడుతుందా అన్న సందేహం. పోనీ సహజ పదార్థాలు వాడితే అన్న ఆలోచన వచ్చిందా? అయితే బియ్యప్పిండి ఎంచుకోండి. ఇది ఏ చర్మం వాళ్లకైనా సరిపోతుంది... ఆధునిక అధ్యయనాలూ చెబుతున్న మాట ఇది.

బియ్యప్పిండి సహజ ఎక్స్‌ఫోలియేట్‌గా పనిచేస్తుంది. చర్మంలోని తేమను తొలగించకుండానే మృతకణాలనూ, జిడ్డునీ తొలగిస్తుంది. నిగారింపుని ఇవ్వడంతోపాటు చర్మాన్ని ఆరోగ్యంగానూ ఉంచుతుంది అంటోంది అడ్వాన్సెస్ ఇన్ సోషల్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ హ్యూమానిటీస్ రీసర్చ్ అధ్యయనం. ఇది జిడ్డుని తొలగించి, యాక్నేని దూరం చేస్తుంది. చర్మాన్నీ బిగుతుగా మారుస్తుంది. బియ్యప్పిండిలో సహజ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. ఇది ఎరుపుదనం, దురద, దద్దుర్లను దూరం చేస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్నీ దరికి చేరనీయదు.



స్పూను చొప్పున బియ్యప్పిండి, తేనె తీసుకుని బాగా కలపాలి. నీటితో కడిగిన ముఖానికి పట్టించి, మృదువుగా రుద్దండి. ఆపై పావుగంట వదిలేసి, చల్లని నీటితో కడిగితే సరి. మంచి స్క్రబ్‌లా పనిచేస్తుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్నవాళ్లు బియ్యప్పిండికి తగినంత పెరుగు కలిపి ముఖానికి పట్టించండి. పదినిమిషాలయ్యాక కడిగేస్తే చాలు. బియ్యప్పిండి, ముల్తానీ మట్టి సమపాళ్లలో తీసుకుని ఆపై రోజ్ వాటర్ కలపాలి. ఈ ప్యాక్ జిడ్డు చర్మం వాళ్లకి బాగా పనిచేస్తుంది. ఇన్‌స్టంట్ మెరుపు కావాలంటే... బియ్యప్పిండికి చిటికెడు పసుపు, పచ్చిపాలు కలిపి ముఖానికి పట్టించాలి. పావుగంటయ్యాక కడిగేస్తే సరి. పొడి చర్మం ఉన్నవాళ్లు తేనెతో కలిపి రాసుకోవాలి. చక్కగా వంటింట్లో దొరికేస్తుంది. రసాయనాల గోల లేకుండా ఆరోగ్యంగా మెరవొచ్చు. కాబట్టి, ఓసారి దీన్నీ ప్రయత్నించి చూడండి!

వంట థెరపీగా..!

మాటలు తడబడుతున్నాయి... కొన్ని పదాలు సరిగా పలకడం లేదు కూడా.

చేతులు వెనక్కి మడిచి ఉన్నా... వణుకుతూనే ఉన్నాయి.

శరీరం తన ఆధీనంలో లేదు. చూస్తేనే తెలిసిపోతుంది...

తను ఏదో వ్యాధితో సతమతం అవుతోందని. అవును... నిజమే! తనకు పార్కిన్సన్స్.



వైరల్

అయినా చెరగని ఆత్మవిశ్వాసంతో ప్రపంచానికి తన పరిస్థితిని వివరించిందిలా. '14 ఏళ్లున్నప్పుడు ఆరోగ్యం పాడై కోమాలోకి వెళ్లిపోయా. స్పృహ వచ్చాక తెలిసింది సెకండరీ పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడ్డానని. ఒక్కసారిగా శూన్యంలోకి వెళ్లిపోయినట్లు అనిపించింద'నే మనీషా శర్మ స్వస్థలం ఉదయ్‌పూర్. వ్యాధి ప్రభావం నుంచి బయటపడాలంటే... ఏదైనా వ్యాపకాన్ని అలవరచుకోమని సలహా ఇచ్చారట డాక్టర్లు. అప్పుడామె ఎన్నో హాబీలను ప్రయత్నించారు. కానీ అవేవీ పనిచేయలేదట. ఓ రోజు వంట చేయడం ప్రారంభించారు. ఒక్కసారిగా శరీరం తన ఆధీనంలోకి రావడం గమనించారు. అది మొదలు ఆమె వంటను థెరపీగా ఎంచుకున్నారు. అదే ఆమెను మాస్టర్ షెఫ్ ఇండియా ద్వారా ప్రపంచానికి పరిచయం చేసింది. ఇటీవల స్ట్రీమ్ అవుతున్న ఈ కార్యక్రమంలో ఇలాంటి ఎన్నో కథలు వీక్షకుల మన్ననల్ని అందుకున్నాయి. మనీషా వీడియో కూడా వైరలై నెట్టింట ప్రజాదరణ పొందింది. బ్రేకప్ అయ్యిందనో, పరీక్ష తప్పామనో, అనుకున్న ర్యాంకు రాలేదనో ఆత్మహత్యలు చేసుకుంటున్న యువత పెరుగుతున్న ఈరోజుల్లో ఈమె మనోధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే కదూ!

పిల్లలు ఫోన్ చూస్తున్నారా?

పిల్లలకు ఫోన్లూ, డిజిటల్ పరికరాలే ప్రపంచమవుతున్నాయి. దాంతో వాళ్లలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి భద్రతదృష్ట్యా కూడా మంచిది కాదు. డిజిటల్ ప్రపంచంలో పిల్లలు ఎలా ఉండాలనే దానిపై నిపుణులు ఏం చెబుతున్నారంటే...



టీవీ సహా డిజిటల్ పరికరాలతో గడిపే సమయం గురించి ఇంట్లో ఒక ప్రణాళిక ఉండాలి. డిజిటల్ పరికరాలు కాకుండా అందరూ భాగమయ్యే ఆటలు, కాలక్షేపం ఉండేలా చూడాలి. భోజనం, బెడ్‌టైమ్‌లో స్క్రీన్ టైమ్ లేకుండా చూసుకోండి.


- 30, 40 నిమిషాలంటూ స్క్రీన్ టైమ్‌పైన పరిమితులు పెట్టండి. సోషల్ మీడియా, ఫోన్ వినియోగం గురించి తరచూ చర్చించాలి. నేర్చుకున్న విషయాలు, సరదా అంశాలూ, అలాగే ఎదుర్కొన్న ఇబ్బందుల్ని పంచుకోమనాలి. వాళ్లకు నచ్చే యాప్‌లూ, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల గురించి కనుక్కోండి.
- పిల్లలకు ఆన్‌లైన్‌లో ఏవైనా ఇబ్బందులు ఉంటే మీతో పంచుకునేలా చూడండి. ఆ సమస్యను మీరు పరిష్కరిస్తారనే భరోసా వాళ్లకు ఇవ్వండి.
- ఆన్‌లైన్‌లో చూసేవి మనపైనా ప్రభావం చూపుతాయి. చేసే పనుల్లో అది తెలుస్తుంది. కాబట్టి పిల్లల ప్రతి కదలికనూ గమనించుకోండి. ఏది నిజమో, ఏది కృత్రిమమో గుర్తించేలా చేయండి. దేన్నికైనా అతిగా ప్రభావితం అవుతుంటే హెచ్చరించండి.
- ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేయదన్నట్లుగా... మీ ఫోన్ వినియోగం పైనే పిల్లల తీరూ ఆధారపడి ఉంటుంది. కుటుంబంతో కలిసి చూడగలిగే నాణ్యమైన కంటెంట్‌ని గుర్తించండి. కంటెంట్ విలువైనది కాకపోతే దాన్ని చూడటం సమయం వృథా అని అర్థమయ్యేలా చేయండి. స్నేహితులతో ఆడుకోమని ప్రోత్సహించండి. హాబీ శిక్షణకు పంపండి.
- పిల్లలు సోషల్ మీడియా వినియోగం మొదలుపెట్టినా, వీడియో గేమ్ ఖాతా తెరిచినా తెలిసేలా పేరెంటల్ కంట్రోల్స్, ప్రైవసీ సెటింగ్స్‌ని సెట్ చేయాలి. ఎవరితో చాట్ చేయాలి, ఎలాంటి పోస్టులు పెట్టాలి వంటి అంశాలను చెప్పాలి.

స్మార్ట్‌గా ఇంటి భద్రత..!

పక్క వీధిలో దొంగలు పడ్డారు... కరెంటు బిల్లు పేరుతో వచ్చి వృద్ధురాలి మెడలో నగలు దోచుకెళ్లారు... తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ... ఎక్కడ చూడూ ఇలాంటి వార్తలే. ఎంతైనా భయం వేయడం మామూలే. అందుకే ఇంటి భద్రతపై కాస్త ఎక్కువ దృష్టి సారించాలి మరి. స్మార్ట్ ఫీచర్స్‌తో వచ్చిన ఈ సెక్యూరిటీ గాడ్జెట్లను చూడండి. ఇవి మీకు తప్పక ఉపయోగపడతాయి.

బెల్ కొడితే వీడియో కాల్ వస్తుంది...


వీడియో డోర్ బెల్... ఒకరకంగా సీసీ కెమెరాలాంటిదే. కానీ, వైర్‌లెస్, బ్యాటరీతో పనిచేస్తుంది. ఈ కాలింగ్‌బెల్‌కి బటన్, స్పీకర్, కెమెరా ఉండి వైఫైతో పనిచేస్తుంది. దీన్ని ఇంటి బయట డోర్ పక్కన అమర్చాలి. ఇంటికి ఎవరు వచ్చినా ఈ డోర్ బెల్ ప్రెస్ చేయగానే మీ ఫోన్‌కి వీడియో కాల్ వస్తుంది. దాంతో అపరిచిత వ్యక్తులను సులభంగా గుర్తించొచ్చు. ఇంటికి ఎవరు వచ్చారో బయటకు వెళ్లకుండానే చూడొచ్చు. రాత్రి సమయంలో కూడా దీని కెమెరా పనిచేస్తుంది. మనం ఇంట్లో లేనప్పుడు ఫోన్‌కి అలర్ట్‌లనీ పంపుతుంది. ఇంట్లో చిన్న పిల్లలు, వృద్ధులు ఉంటే ప్రమాదాలు జరగకుండా ముందుగానే జాగ్రత్తపడొచ్చు.







దొంగలు పడితే చెప్పేస్తుంది...





ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడితే పెద్ద శబ్దం చేస్తూ యజమాని, పోలీసులకు సమాచారం పంపిస్తాయి 'డోర్, విండో అలారం సెన్సార్లు'. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. ఒకటి డోర్ లేదా విండోకి, మరొకటి వాటి ఫ్రేమ్‌కి పక్కపక్కనే అతికించి ఆన్ చేయాలి. బ్యాటరీతో పనిచేసే దీనిలో లో, హై, మీడియం వాల్యూమ్స్‌తో పనిచేసే అలారం ఉంటుంది. ఎవరైనా తలుపులు, కిటికీలను తెరిచే ప్రయత్నం చేస్తే 30 సెకన్లపాటు మోగుతూ, ఫ్లాష్‌లైట్‌ని ఆన్ చేస్తాయి. అంతేకాదు, మీ ఫోన్, ల్యాప్‌టాప్‌లకు హెచ్చరికలు ఇచ్చేలానూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో దీన్ని తయారుచేశారు.

స్వీట్ హోమ్

సైరన్ మోగుతుంది...





ప్రమాదం అని ప్రతిసారి తలుపులు బిగించుకుని ఇంట్లో కూర్చోలేం కదా! అలాచేస్తే ఇంటి పనులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. అందుకే ఈ 'సెక్యూరిటీ డోర్ స్టాపర్ అలారం' తెచ్చేసుకోండి. ఇంటికి ఎవరైనా వచ్చి తలుపు తీయగానే దీనిలో ఉండే సెన్సిటివిటీ అడ్జస్టబుల్ సెటింగ్స్ సైరన్‌ని మోగిస్తాయి. దీనికి ప్రత్యేక ఇన్‌స్టాలేషన్ అవసరంలేదు, ఛార్జింగ్ పెట్టక్కర్లేదు బ్యాటరీతో పనిచేస్తుంది. డోర్ దగ్గర పెట్టి ఆన్ చేస్తే చాలు. ఎవరు వచ్చినా ఇట్టే తెలిసిపో

కండలపై ఒక్కటిస్తే...



మీ పైన దాడి చేయడానికి వచ్చే వ్యక్తి చేతిని అడ్డుకుని గట్టిగా పట్టుకుని మెలి తిప్పి కిందకు లాగాలి. ఫొటోలో చూపిన విధంగా మోచేతితో అవతలి వ్యక్తి కండల(బైసిప్) మీద బలంగా గుద్దాలి. ఇలా చేస్తే ఆ భాగంలో ఉండే కండరాలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. భరించలేని నొప్పి వస్తుంది. ప్రాక్టీసుతో దీన్ని విజయవంతంగా ప్రయోగించవచ్చు. ప్రాక్టీసు సమయంలో ఎదుటవ్యక్తికి దెబ్బ తగలకుండా చూసుకోవాలి. మంచి ఆహారం తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ శారీరకంగా దృఢంగా తయారవ్వాలి. అప్పుడు మరింత ధైర్యంగా ప్రతిఘటించగలరు.



- ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

చిన్న ప్రతికూలతలే ఒత్తిడి..!

మహిళలూ, అమ్మాయిల జీవితంలో ఒత్తిడీ, ఆందోళనా ఎంతగా భాగమయ్యాయి అంటే... ఏ ఒక్కరిని కదిపినా అన్నీ వాటి కథలే. అయితే ఇవి భారీ పనులూ, ప్రాజెక్టులూ విఫలమవ్వడం వల్ల వచ్చినవి కాదంటారు నిపుణులు. మనం తీసుకుంటున్న ఒత్తిడిలో దాదాపు 60శాతానికి చిన్న చిన్న పనుల్లో ప్రతికూలతలే కారణమని 'జర్నల్ ఆఫ్ హ్యాపీనెస్ స్టడీస్' అధ్యయనంలో వెల్లడైంది. సమయానికి పిల్లలు నిద్ర లేవకపోవడం, వాళ్ల తయారీ ఆలస్యం అవ్వడం, బస్ మిస్ అవ్వడం, ఆఫీసుకు వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌లో చిక్కుకోవడం, అన్ని పనులూ నెత్తికెత్తుకుంటూ మల్టీ టాస్కింగ్ చేయడానికి తయారవ్వడం... లాంటివే దీర్ఘకాలంలో మానసిక రుగ్మతలకు కారణం అవుతున్నాయట. వీటికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాలంటే... బాగా విసుగ్గా, చికాకుగా అనిపించినప్పుడూ, పని ఒత్తిడికి దారితీస్తుందన్న ఆలోచన వచ్చినప్పుడూ వెంటనే శరీరానికి



విశ్రాంతినివ్వమంటున్నారు. మైక్రో వాక్స్, కాఫీ బ్రేకులు, చిన్న చిన్న వ్యాయామాలు, నచ్చిన వ్యక్తులతో మాట్లాడటం వంటివి చేయమంటున్నారు. దీనివల్ల హ్యాపీ హార్మోన్లు విడుదలై, సమస్య అప్పటికప్పుడే సమసిపోతుంది. అలానే, కుటుంబ సభ్యులూ దీన్ని గుర్తించి బయటపడేందుకు మహిళలకు సహకరించాలని చెబుతున్నారు. దంపతుల మధ్య మైక్రోమాన్స్, ఓ చిన్న ప్రశంస, పిల్లలు ఇచ్చే హగ్ అన్నీ ఒత్తిడిని ఆదిలోనే నిర్మూలిస్తాయని చెబుతున్నారు పరిశోధకులు.

హైడ్రోజన్ ఇంధనంగా గ్రీన్‌హౌస్ వాయువు



బొగ్గు నుంచి వెలువడే మీథేన్ వంటి హానికారక గ్రీన్‌హౌస్ వాయువులను పర్యావరణ హిత హైడ్రోజన్ ఇంధనంగా మార్చే టెక్నిక్‌ను ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఉన్న ఐఐటీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్) విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఈ ఇంధనాన్ని సీఎన్‌జీతో నడిచే కార్లలో నేరుగా వినియోగించవచ్చు. ఐఐటీలో కెమికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు కైలాశ్ కృష్ణ, నితిన్ గౌర్, దేవాశీష్ దాస్‌లు ఈ టెక్నిక్‌ను అభివృద్ధి చేశారు. విద్యార్థులకు మార్గదర్శనం చేసిన ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎజాజ్ అహ్మద్ వివరాల ప్రకారం.. బొగ్గు వెలికితీత సందర్భంగా వెలువడే మీథేన్ సాధారణ కార్బన్‌డైయాక్సైడ్ కంటే 25 రెట్లు హానికారకం. ఈ మీథేన్.. పర్యావరణానికి హాని కలిగిస్తుంది. అయితే దీంతో అనేక ప్రయోజనాలున్నాయి. 1 కేజీ బొగ్గు ఆధారిత మీథేన్‌ను ఒడిసిపడితే 25 కేజీల కార్బన్‌డైయాక్సైడ్ వల్ల కలిగేంత నష్టాన్ని నివారించవచ్చు. ఈ మీథేన్‌లో సల్ఫర్, మీథేన్ ఉంటాయి. దీని నుంచి స్వచ్ఛమైన మీథేన్‌ను ఉత్పత్తి చేయాలి. శుద్ధి చేసిన మీథేన్ నుంచి హైడ్రోజన్, కార్బన్ నానో ట్యూబ్‌లను తయారు చేయాలి. ఈ ప్రక్రియలో తయారైన హైడ్రోజన్.. సీఎన్‌జీ స్థానంలో కారు ఇంధనంగా పనికొస్తుంది. కార్బన్ నానో ట్యూబ్‌లను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల తయారీ, స్టీల్ పరిశ్రమలో వాడవచ్చు. ప్రస్తుతం నానో ట్యూబ్‌ల ధర కేజీకి రూ.5లక్షలుంటుంది. అదే మీథేన్ నుంచి తయారుచేస్తే ఖర్చేమీ కాదు.

13 ఏళ్లకే పుస్తకం ప్రచురణ



పదమూడేళ్ల వయసులోనే కథల పుస్తకం రాసి అందరితో శెభాష్ అనిపించుకుంటోంది గుజరాత్‌కు చెందిన ఓ బాలిక! జూనాగఢ్ జిల్లాకు చెందిన రాజూభాయ్ అనే రిక్షాడ్రైవర్ కుమార్తె- ప్రీతి. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. కథలు రాయడం అంటే ఆమెకు చాలా ఇష్టం. ఆమె ఆసక్తిని గమనించి.. ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహించారు. రోజూ ఓ అంశం ఇచ్చి, దానిపై కథ రాయించేవారు. క్రమంగా పట్టు పెంచుకున్న ప్రీతి.. అంతరించిపోతున్న పక్షులు, వన్యప్రాణులు, ప్రస్తుత మానవ పరిస్థితుల ఆధారంగా కథలు రాయడం ప్రారంభించింది. కాకి నేపథ్యంలో 'ద మొబైల్ ఘోస్ట్', 'ద ల్యాండ్ ఆఫ్ బర్డ్స్' వంటి 21 కథలకు అక్షర రూపమిచ్చింది. వాటి సంకలనాన్ని పుస్తక రూపంలో ఇటీవల ప్రచురించారు.

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాల్లేవు

- రాజీపడకుండా పోరాడతాం
- వ్యూహాత్మక రంగాల్లో మలేసియాతో బంధాలు
- ప్రధాని మోదీ వెల్లడి



ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకుంటున్న నరేంద్ర మోదీ, ఇబ్రహీం

కౌలాలంపూర్: ఉగ్రవాదంపై తమ సందేశం విస్పష్టమని, దానిలో ద్వంద్వ ప్రమాణాలకు/ రాజీకి తావే లేదని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. మలేసియా పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పుత్రజయ నగరం వేదికగా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సెమీ కండక్టర్లు సహా కీలక రంగాల్లో సహకారానికి సంబంధించి 11 ఒప్పందాలపై వారి సమక్షంలో సంతకాలు జరిగాయి. ఉగ్రవాదంపై పోరులో భారత వైఖరిని మోదీ మరోసారి తేల్చి చెప్పారు. దీనికోసం భారత్, మలేసియాలు నిఘా వర్గాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయని వెల్లడించారు. ఇరుదేశాల పరిధిలోని సముద్ర మార్గాల భద్రతకూ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. "ఇండో-పసిఫిక్ ప్రాంతం ఇప్పుడు ప్రపంచ వికాసానికి ఒక ఇంజిన్‌లా మారింది. మేం ఆసియాన్ కూటమి దేశాలు సహా యావత్ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను కోరుకుంటున్నాం. ఇంధన, మౌలిక సదుపాయాలు, తయారీ రంగాల్లో ఇరుదేశాల సహకారం బలోపేతమైంది. డిజిటల్ ఎకానమీ, బయోటెక్, ఐటీ విభాగాల్లో ఇరుదేశాల మధ్య పరస్పర పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. మలేసియా- భారత్ ప్రజల మధ్య సంబంధాలు సైతం మరింత మెరుగయ్యాయి. ఫలితంగా ఇరుదేశాల్లో పర్యాటక రంగానికి ఊతం లభించింది. ఈ విజయాల స్ఫూర్తితో మలేసియా, భారత్ భాగస్వామ్యాన్ని మునుపెన్నడూ లేనంత వేగంతో బలోపేతం చేయాలని ఇరువురం నిర్ణయించాం. ఇకపై రక్షణ రంగం, సెమీకండక్టర్ల తయారీ విభాగాల్లోనూ సహకారాన్ని పెంచుకోనున్నాం" అని చెప్పారు.

పెర్దన పుత్రలో ఘన స్వాగతం

మోదీ ఆదివారం ఉదయం కౌలాలంపూర్ నుంచి పుత్రజయ నగరానికి చేరుకున్నారు. మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం అధికారిక నివాసం పెర్దన పుత్రలో అధికారిక లాంఛనాలతో ఆయనకు స్వాగతం లభించింది. అనంతరం ఇరుదేశాల ఉన్నతాధికారుల బృందాలు, ప్రధానుల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. దేశీయ కరెన్సీల్లో చెల్లింపుల్ని ప్రోత్సహించే ప్రయత్నాలను ఇరుదేశాలు కొనియాడాయి. భారత్‌తో వాణిజ్యానికి మరిన్ని అవకాశాలు లభిస్తే మాకెంతో ప్రయోజనమని ఇబ్రహీం అన్నారు. మలేసియా పర్యటన ముగించుకుని మోదీ భారత్‌కు బయల్దేరారు.

మలేసియాలోని నలుగురు ప్రముఖ వ్యాపారవేత్తలతో మోదీ సమావేశమై.. భారత వృద్ధి గాథలో పాలుపంచుకోవాలన్న వారి ఆసక్తిని అభినందించారు. మలేసియాలోని భారత సంతతి మంత్రులు, ఎంపీలు, సెనేటర్లతోనూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమిళుల గురించి మరోసారి ప్రశంసలు కురిపించారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేసిన జెయరాజ్ రాజారావుతో భేటీ అయ్యారు.



ఎక్కువ నిర్ణయాలతో అచేతనస్థితి

ఒకేసారి చాలా నిర్ణయాలు తీసుకోవడం వల్ల అచేతన స్థితి తలెత్తుతుంది. ఈ పరిస్థితి కార్యాచరణ వేగాన్ని నిరోధిస్తుంది. ఇది ఉత్పాదకతను, మానసికస్థితిని దెబ్బతీస్తుంది. ఇలా కాకుండా ఉండేందుకు ఉత్తమమైన తక్కువ నిర్ణయాలు తీసుకోవాలి.

– ఆస్టిన్ ఎల్ రైట్, ఇన్వెస్టర్

జీవితంలో ఏదీ సులువుగా ఉండదు

- పట్టుదలతో ముందుకు సాగాలి
- జెన్-జీకి రాహుల్ సూచన




ఎన్ఆర్ఐ విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాహుల్

దిల్లీ: జీవితంలో ఏదీ సులువుగా ఉండదని, పరిస్థితులకు అనుగుణంగా మారుతూ.. పట్టుదలతో ముందుకు సాగిపోవాలని జెన్-జీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచించారు. దిల్లీలో యూఏఈకి చెందిన ఎన్ఆర్ఐ విద్యార్థులతో ఇటీవల ముచ్చటించిన ఆయన.. దానికి సంబంధించిన వీడియోను యూట్యూబ్‌లో పోస్టు చేశారు. ప్రస్తుత కాలంలో యువత ఎదుర్కొంటున్న ఒత్తిడిపై విద్యార్థులతో చర్చించినట్లు తెలిపారు. వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమతూకం చేసుకోవడం.. ఆలోచించే స్వేచ్ఛ.. ఆందోళనను ఎదుర్కోవడం.. ఇతరులు ఏమనుకుంటారోననే బాధ నుంచి బయటపడటం.. అభద్రతా భావం.. మాట్లాడడానికి భయపడటం.. మొదలైన విషయాలపై విద్యార్థులతో చర్చించినట్లు పేర్కొన్నారు. మనం ఎవరో చెప్పేందుకు ప్రపంచం చాలాసార్లు ప్రయత్నిస్తుందని, మనతో మనం నిజాయతీగా ఉండటమే ముఖ్యమని విద్యార్థులకు రాహుల్ సూచించారు.

కమ్యూనిస్టుల భావజాలమే విధ్వంసకరం

దాన్ని దేశం త్వరగా వదిలించుకోవాలి: అమిత్‌షా



రాయ్‌పుర్: భద్రతను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు రూపొందించడం, మౌలికవసతుల కల్పన, మావోయిస్టుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడం తదితర చర్యలతో వామపక్ష తీవ్రవాదం నడ్డి విరిచామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ముందుగా అనుకున్న మేరకు మార్చి 31 నాటికి ఈ ముప్పు పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టుల భావజాలం దేశానికి విధ్వంసకరమని షా వ్యాఖ్యానించారు. ఈ భావజాలాన్ని భారత్ త్వరగా వదిలించుకోవాలని అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయ్‌పుర్‌లో ఆదివారం వామపక్ష తీవ్రవాదంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

జపాన్ పార్లమెంటరీ ఎన్నికల్లో తకాయిచి కూటమి విజయం



టోక్యో: జపాన్ పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రధానమంత్రి సనాయె తకాయిచి నేతృత్వంలోని సంకీర్ణ కూటమి అఖండ విజయం సాధించింది. మొత్తం 465 సీట్లున్న దిగువ సభకు ఆదివారం ఎన్నికలు జరగ్గా.. అధికార కూటమి మూడింట రెండొంతులకు పైగా స్థానాలను దక్కించుకుంది. ఇప్పటివరకూ అందిన వివరాల ప్రకారం- తకాయిచికి చెందిన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) 316 సీట్లలో విజయ దుందుభి మోగించింది. దీంతో దిగువ సభలో సొంతంగా పూర్తి మెజార్టీని అది దక్కించుకున్నట్లయింది. జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రి తకాయిచి. గత అక్టోబరులోనే ఆమె ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

రూ.45,28,822 కోట్ల దిగుమతులిక సులభం

- పీయూష్ గోయల్ వెల్లడి



దిల్లీ: కొత్త వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికా నుంచి వచ్చే ఐదేళ్లలో రూ.45,28,822 కోట్ల దిగుమతులు చేసుకోవడం సులభమవుతుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ పరిమాణం సరిపోదని, రూ.271.73 లక్షల కోట్ల భారత ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద సంఖ్య కాదని అభిప్రాయపడ్డారు. కేవలం ఏవియేషన్ రంగంలోనే రూ.9.06 లక్షల కోట్లకుపైగా దిగుమతులు అవసరమని, దానికి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ, ముడి చమురు అదనమని తెలిపారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారైన నేపథ్యంలో ఆదివారం ఆయన పీటీఐ వీడియోస్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. '18శాతం సుంకాలను ఎదుర్కొంటున్న భారతీయ ఉత్పత్తులు.. ఇతర దేశాలతో పోలిస్తే అమెరికా మార్కెట్లలో బాగానే లబ్ధి పొందుతాయి. మనతో పోటీపడే చైనాపై 35శాతం, ఇతర ఆసియా దేశాలపై 19శాతం సుంకాలున్నాయి. మనం ప్రపంచంలోని అన్ని దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్నాం. వచ్చే ఐదేళ్లలో ఇవి రూ.181.15 లక్షల కోట్లకు చేరనున్నాయి. అందుకే భారత్‌లో డిమాండు ఉందని అమెరికా ప్రతినిధులకుచెప్పా. సుంకాలను తగ్గించడం ద్వారా పోటీపడాలని సూచించా' అని గోయల్ తెలిపారు.

సెమీ కండక్టర్ చిప్‌లకు గిరాకీ

'దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదుగుతోంది. అందువల్ల పలు ప్రత్యేక రంగాల్లో దిగుమతుల డిమాండు పెరుగుతోంది. సెమీ కండక్టర్ చిప్‌లు, హైఎండ్ యంత్రాలు, డేటా సెంటర్ల పరికరాలు, విమానాలు, విమాన విడి భాగాలు, ఇంధన పరికరాలకు డిమాండు ఉంటుంది. 10 గిగావాట్ల డేటా సెంటర్లను దేశంలో చూడవచ్చు. వాటికి అవసరమైన పరికరాలను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని అమెరికా సరఫరా చేయగలదు' అని వివరించారు.

■ 'మనకు విమానాలు అవసరం. విమాన ఇంజిన్లు అవసరం. విడి భాగాలూ కావాలి. ఇప్పటికే ఈ రంగంలో రూ.4.53 లక్షల కోట్ల ఆర్డర్లను బోయింగ్‌కు ఇచ్చాం. అవి మరింత పెరగనున్నాయి' అని తెలిపారు.

■ మనతో పోటీపడే దేశాలతో పోలిస్తే మనపైనే ప్రతీకార సుంకాలు తక్కువగా ఉన్నాయని వివరించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో మన రైతులకు, మత్స్యకారులకు ప్రయోజనం కలగనుందని గోయల్ తెలిపారు.

ప్రతి ఒక్కరితో చర్చించా

నేను అమెరికా ప్రతినిధుల్లో ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిశా. వారితో బలమైన బంధాన్ని ఏర్పరుచుకున్నాం. ఇప్పుడంతా ఒక కుటుంబంలా కలిసిపోయాం' అని గోయల్ తెలిపారు.


45 ఏళ్ల నాటి చోరీ కేసులో వృద్ధుడి అరెస్టు

- 100 కేజీల గోధుమలు దొంగిలించినట్లు అభియోగం

ఖర్గోన్: మధ్యప్రదేశ్‌లో 45 ఏళ్ల కింద 100 కేజీల గోధుమలను దొంగిలించిన కేసులో శనివారం ఓ వృద్ధుడు అరెస్టు అయ్యాడు. 1980లో సలీమ్ అనే వ్యక్తి మరో ఆరుగురితో కలిసి బల్సముంద్ కాకద్ ప్రాంతంలోని ఒక పొలంలో గోధుమలను దొంగిలించాడు. అతనిపై వారంటుతో సహా, అప్పటి నుంచి ఈ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. అప్పట్లో ఆ గోధుమల విలువ రూ.115 ఉంటుందని ఓ పోలీసు అధికారి తెలిపారు. ప్రస్తుతం బలక్‌వాడా పోలీస్ స్టేషన్ పరిధిలో అతని కుమారుడితో కలిసి కిరాణా కొట్టు నడుపుకొంటున్న సలీమ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టు అతనికి జ్యుడీషియల్ కస్టడీని విధించింది.

సంఘ్ ఆదేశిస్తే పదవీ విరమణ చేస్తా

- ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్



ముంబయి: తన పదవీ విరమణపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ పదవి నుంచి దిగిపోవాలని ఆదేశిస్తే.. వైదొలిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. కులంతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ ఒక హిందువే ఆర్ఎస్ఎస్ చీఫ్‌గా ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు.

అందుకే సంఘ్‌కు మంచి రోజులు

భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్‌కు 'మంచిరోజులు' వచ్చాయా? అని ప్రశ్నించగా.. దాన్ని మరో కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించేందుకు ఆర్ఎస్ఎస్ కట్టుబడి ఉందని, దానికి మద్దతు తెలిపిన వారికి ప్రయోజనం చేకూరిందని వివరణ ఇచ్చారు. సిద్ధాంతపరమైన విధానాలకు కట్టుబడి ఉండటంతోపాటు.. వాలంటీర్ల కృషి వల్ల సంఘ్‌కు మంచి రోజులు వచ్చాయని మోహన్ భాగవత్ అన్నారు. 'ఉమ్మడి పౌరస్మృతి' గురించి ప్రస్తావన రాగా, అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని దాన్ని రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని భాగవత్ సూచించారు. జనాభాలో మతపరమైన అసమతుల్యత గురించి మాట్లాడుతూ, మత మార్పిళ్లు, విదేశీయుల చొరబాట్లు, జననాల రేటు తగ్గిపోవడం అందుకు ప్రధాన కారణాలని భాగవత్ చెప్పారు. ప్రతి కుటుంబంలోనూ ముగ్గురు పిల్లలుండాలని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయని, అయితే దాన్ని పాటించాలా లేదా అన్నది వ్యక్తిగత ఎంపిక మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు.

8,505 మంది గ్రూప్-బీ అధికారులను కేటాయిస్తాం

- సర్ ప్రక్రియపై ఈసీకి తెలిపిన బెంగాల్ ప్రభుత్వం

దిల్లీ: రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) కోసం 8,505 మంది గ్రూప్-బీ అధికారులను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల సంఘాని(ఈసీ)కి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బెంగాల్ ప్రభుత్వం 80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని, మిగతా పని కోసం అంగన్వాడీ కార్యకర్తల వంటి చిన్న స్థాయి సిబ్బందిని వాడుతోందని ఈసీ గతంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ వాదనలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఖండించారు.

ట్రంప్‌నకు భారీ విజయం

- బాండ్ లేకుండానే వలసదారులను నిర్బంధించే విధానాన్ని సమర్థించిన కోర్టు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టులో భారీ విజయం దక్కింది. బాండ్ హియరింగ్‌కు అనుమతి ఇవ్వకుండానే వలసదారులను నిర్బంధించే ఆయన ప్రభుత్వ విధానాన్ని అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ఇలాంటి నిర్బంధాలను ఇటీవల దిగువ కోర్టులు తప్పుబడుతున్న నేపథ్యంలో ఈ తీర్పు ట్రంప్‌నకు భారీ న్యాయ విజయంగా చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వలసదారులను అరెస్టు చేసినప్పుడు బాండ్ హియరింగ్‌ను హోంలాండ్ భద్రతాధికారులు నిరాకరిస్తున్నారు. దీనిపై అనేక కోర్టులు అధికారులకు వ్యతిరేకంగా తీర్పులిస్తున్నాయి. కానీ ఇది రాజ్యాంగం, ఫెడరల్ వలస చట్టాలకు అనుగుణంగానే ఉందని 5వ సర్క్యూట్ కోర్టు ధర్మాసనం శుక్రవారం సాయంత్రం తీర్పు చెప్పింది. ధర్మాసనం తరఫున 2-1 మెజారిటీతో జడ్జి ఎడిత్ హెచ్ జోన్స్ తీర్పు రాశారు. వలస, జాతీయ చట్టాలకు ప్రభుత్వం సరిగానే అర్థం చెప్పిందని అభిప్రాయపడ్డారు. అనుమతిలేని విదేశీయులు దేశంలో ఎక్కడ పట్టుబడినా బాండ్‌పై విడుదలకు అనర్హులని స్పష్టం చేశారు. వారు ఎంతకాలం దేశంలో ఉన్నారన్నదీ అప్రస్తుతమని పేర్కొన్నారు. గతంలో విదేశీయులు సరిహద్దుల్లో అరెస్టయితే. . వారికి ఎటువంటి నేర చరిత్రా లేకపోతే వలసదారుల కోర్టులో బాండ్ హియరింగ్‌ను కోరేవారు. కోర్టులూ వారికి బాండ్లను మంజూరు చేసేవి. మెక్సికోకు చెందిన ఇద్దరు వలసదారులు అమెరికాలో పదేళ్లుగా ఉంటున్నారు. గత ఏడాది వారు తమను నెలలపాటు నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్లు వేశారు. వారికి గత అక్టోబరులో టెక్సాస్ కోర్టు బాండ్లు మంజూరు చేసింది. గత జులైలో ట్రంప్ యంత్రాంగం బాండ్ల విధానాన్ని తిరగదోడింది. తాజాగా అప్పీల్స్ కోర్టు ఆ విధానాన్ని సమర్థించడంతో ట్రంప్‌నకు భారీ విజయం దక్కినట్లైంది.

ప్యాక్స్ సిలికా ప్రోగ్రామ్‌కు భారత్‌ను ఆహ్వానించిన అమెరికా

న్యూయార్క్: కృత్రిమమేధ పురోగతికి అవసరమైన సిలికాన్ సప్లై చైన్ భద్రత కోసం అమెరికా విదేశాంగశాఖ ప్రారంభించిన 'ప్యాక్స్ సిలికా' కార్యక్రమంలో భాగం కావాలంటూ భారత్‌కు ఆహ్వానం లభించింది. ఈ ప్రోగ్రాంలో చేరాలంటూ భారత్‌ను ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని, త్వరలోనే దిల్లీతో ఒప్పందం కుదుర్చుకుంటామని అమెరికా తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీ మధ్య గొప్ప సంబంధాలు ఉన్నాయని, ఈ భూ ప్రపంచంలో చైనాకు పోటీగా ఉండగల ఏకైక దేశం భారత్ అని నొక్కిచెప్పింది. ప్యాక్స్ సిలికాపై కీలక ఒప్పందం కోసం త్వరలోనే దిల్లీ వెళ్లనున్నానని ఆర్థిక వ్యవహారాల అండర్ సెక్రటరీ జాకబ్ హెల్బర్గ్ వెల్లడించారు.

వాషింగ్టన్ పోస్ట్ ప్రచురణకర్త విల్ లూయిస్ రాజీనామా

వాషింగ్టన్: ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న అమెరికా ప్రముఖ దినపత్రిక వాషింగ్టన్ పోస్ట్ ప్రచురణకర్త విల్ లూయిస్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. పత్రికలో మూడోవంతు సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన మూడు రోజులకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పత్రిక సిబ్బందికి లూయిస్ ఈ మెయిల్ పంపారు. వాషింగ్టన్ పోస్ట్ సుస్థిర భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని అందులో పేర్కొన్నారు. ఉద్యోగుల తొలగింపుపై తాజాగా నిర్వహించిన సమావేశానికి లూయిస్‌తో పాటు పత్రిక యజమాని, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ కూడా హాజరు కాలేదు. లూయిస్ స్థానంలో పత్రిక ప్రధాన ఆర్థిక అధికారి జెఫ్ డి ఓనోఫ్రియోను తాత్కాలిక ప్రచురణకర్త, సీఈఓగా నియమించారు.

డాలస్‌లో కాదు.. పాకిస్థాన్‌లో ఉన్నట్లు అనిపిస్తుంది

'ఇస్లామీకరణ'పై కాంగ్రెస్ సభ్యుడు బ్రాండన్ గిల్

న్యూయార్క్: అమెరికాలోని టెక్సాస్‌లో కొన్ని నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాల్లో ఇస్లామీకరణపై రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు బ్రాండన్ గిల్ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి స్థానిక దుకాణ సముదాయాలను సందర్శిస్తే మీరు డాలస్‌లో కాదు, పాకిస్థాన్‌లో ఉన్నట్లు అనిపిస్తుందని వ్యాఖ్యానించారు. డాలస్ ప్రాంత ఇస్లామీకరణపై నియోజకవర్గ ప్రజలు ఆందోళనతో ఉన్నట్లు పేర్కొన్నారు. తన నియోజకవర్గంలోని ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో కొత్తగా మసీదులు పుట్టుకొస్తున్నాయని చెబుతున్నారని అన్నారు. సామూహిక ఇస్లాం వలసలు తమ అమెరికాను చంపేస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

పాక్ ఏజెంట్లతో గొగొయ్ దంపతులకు సంబంధాలు

- అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ ఆరోపణ



గువాహటి: లోక్‌సభ సభ్యుడు, అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్, ఆయన భార్య ఎలిజబెత్ గొగొయ్‌లపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర విమర్శలు చేశారు. గొగొయ్ దంపతులకు పాకిస్థాన్ జాతీయుడు అలీ తౌఖీర్ షేక్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, వారు నిఘా మండలి (ఇంటెలిజెన్స్ బ్యూరో) నుంచి రహస్య సమాచారాన్ని సేకరించి దాయాది దేశానికి చేరవేశారని ఆయన ఆరోపించారు. గువాహటిలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "పాకిస్థాన్ ఏజెంట్ అలీ 2010 నుంచి 2013 మధ్య 13 సార్లు భారత్‌ను సందర్శించారు. ప్రపంచవ్యాప్తంగా భారత వ్యతిరేక ప్రచారాన్ని ప్రోత్సహించేలా పనిచేశారు. 2011లో అమెరికా నుంచి పాకిస్థాన్ వెళ్లిన ఎలిజబెత్.. అలీకి చెందిన 'లీడ్ పాకిస్థాన్' అనే సంస్థలో పని చేశారు. ఆ తర్వాత భారత్‌కు బదిలీ చేసినా ఆమె జీతాన్ని అలీనే చెల్లించారు. ఎలిజబెత్‌కు జీతం చెల్లించేందుకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని (ఎఫ్‌సీఆర్ఏ) సైతం ఉల్లంఘించారు. ఎలిజబెత్ భారత్‌లోని ఓ సంస్థలో పనిచేస్తూ దేశానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి అలీకి చేరవేశారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక వాతావరణ చర్యలపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందుకొని, 45 పేజీల నివేదికను అలీకి పంపారు. ఎలిజబెత్, అలీలు అంతర్జాతీయ కుట్రలో భాగమని నేను విశ్వసిస్తున్నాను. భారత్‌లోని ఓ రెండు సంస్థల్లో పనిచేస్తున్నప్పుడు ఆమె తొమ్మిదిసార్లు పాకిస్థాన్‌కు వెళ్లారు. గౌరవ్ కూడా తన వివాహానికి ముందు 2013లో రహస్యంగా పాక్‌లో పర్యటించారు. లాహోర్‌కు వెళ్లేందుకే వీసా జారీ అయినప్పటికీ, ఆయన ఇస్లామాబాద్, కరాచీలను సందర్శించారు. ఈ పర్యటనపై అస్సాం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. అక్కడ ఉన్న 10 రోజులూ డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉన్నారు. ఈ పర్యటన తర్వాత లోక్‌సభలో భద్రతా విషయాలు, రక్షణ పరికరాలు, అణువిద్యుత్ ప్లాంట్లు వంటి కీలక అంశాలపై ఆయన మాట్లాడారు. దీనిపై అస్సాం ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభించినప్పటికీ. . పాక్ ఏజెంట్ తన ట్వీట్లన్నింటినీ తొలగించారు. గౌరవ్, ఆయన సతీమణికి ఆ ఏజెంట్‌తో సంబంధం ఉందని విశ్వసిస్తున్నాం. పొరుగుదేశాలతో సంబంధంపై మేం ఇప్పటివరకు గొగొయ్‌ను విచారించలేదు. ఆయన పదవికి గౌరవం ఇస్తూ, ఆ విషయాన్ని కేంద్రానికే వదిలిపెట్టాం. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తునకు సిఫార్సు చేస్తున్నాం" అని హిమంత వ్యాఖ్యానించారు.

సీఎం మీడియా సమావేశం సూపర్ ఫ్లాప్: గొగొయ్



బిశ్వశర్మ ఆరోపణలను గౌరవ్ గొగొయ్ తీవ్రంగా ఖండించారు. "రాజకీయ చతురత ఉందని చెప్పుకొనే ఆయన.. అన్నీ అర్థం లేని, నిరాధార ఆరోపణలే చేశారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్న భూముల వ్యవహారాన్ని బయటపెట్టడంతో మేం చేపట్టిన యాత్ర విజయవంతమైంది. దీనికి విరుద్ధంగా సీఎం మీడియా సమావేశం సూపర్ ఫ్లాప్ అయింది" అని గొగొయ్ వ్యాఖ్యానించారు.

బంగ్లా జైలులో మాజీ ఎంపీ రమేశ్ చంద్రసేన్ మృతి



ఢాకా: బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పుర్ సెంట్రల్ జైలులో అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ చంద్రసేన్ (85) మృతి చెందారు. ఐదుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన సేన్.. 2024 ఆగస్టు 16 నుంచి జైలులోనే ఉన్నారు. షేక్ హసీనా ప్రభుత్వం రద్దైన వెంటనే ఆయనపై జమాత్-ఎ-ఇస్లామీ, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ కార్యకర్తలు దాడి చేశారు. తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. హత్య సహా పలు నేరాలను ఆయనపై మోపి జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఎలాంటి విచారణ లేకుండా కటకటాలకే పరిమితమయ్యారు. ఇటీవల జైలులో సేన్ ఆరోగ్యం క్షీణించింది. సరైన వైద్యం ఆయనకు అందలేదు. దీంతో జైలులోనే శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సేన్ మృతి కలకలం సృష్టిస్తోంది. అవామీ లీగ్ పార్టీలో రమేశ్ క్రియాశీలంగా ఉండేవారు. షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చేశాక అవామీ లీగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తాత్కాలిక ప్రభుత్వం నడుపుతున్న మహమ్మద్ యూనస్ సలహామండలికి లక్ష్యంగా మారారు. ఒక్క 2025 సంవత్సరంలోనే బంగ్లాదేశ్ జైళ్లలో దాదాపు 107 మంది చనిపోయారని, ఇందులో ఎక్కువ మంది అవామీ లీగ్ పార్టీ నేతలేనని ఓ స్వచ్ఛంద సంస్థ పేర్కొంది.

మైనారిటీలపై అస్సాం భాజపా అభ్యంతరకర వీడియో

తీవ్రంగా మండిపడ్డ కాంగ్రెస్

దిల్లీ: భాజపా అస్సాం విభాగం ఎక్స్‌లో పోస్టు చేసిన ఓ వీడియోపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో మండిపడింది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని పాయింట్ బ్లాంక్‌లో షూట్ చేస్తున్నట్లు ఆ వీడియోలో కనిపిస్తోంది. ప్రస్తుతం డిలీట్ చేసిన ఆ వీడియోపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ స్పందిస్తూ ఇది మారణహోమానికి పిలుపునివ్వడమేనని పేర్కొన్నారు. ప్రధాని మోదీ దీన్ని వ్యతిరేకిస్తారని తాము అనుకోవడం లేదని, కానీ న్యాయ వ్యవస్థ కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధులు సుప్రియా శ్రీనేత్, షామా మొహమ్మద్, శివసేన(ఉద్ధవ్) ఎంపీలు ఈ వీడియోను ఖండిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు.

19న గాజా శాంతి బోర్డు సమావేశం!

వాషింగ్టన్, ఇస్లామాబాద్: గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన గాజా శాంతి బోర్డు తొలి సమావేశం ఈ నెలలోనే వాషింగ్టన్‌లో జరగనుంది. ఇది ఈ నెల 19వ తేదీన జరిగే అవకాశముంది. ఈ సమావేశానికి శాంతి బోర్డులో చేరిన దేశాల నేతలు హాజరుకానున్నారు. ఆహ్వానాలను శుక్రవారం రాత్రి ట్రంప్ యంత్రాంగం పంపినట్లు సమాచారం.

■ గాజా శాంతి బోర్డు సమావేశానికి రావాలని పాకిస్థాన్‌కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. దీంతో ఆ దేశం నుంచి ప్రధానిగానీ, ఉప ప్రధానిగానీ హాజరయ్యే అవకాశముందని స్థానిక మీడియా పేర్కొంది.

కోటిమంది విద్యార్థులకు ఎంబీయూ పూర్తి: ఉడాయ్

దిల్లీ: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ కీలక మైలురాయి సాధించింది. దేశవ్యాప్తంగా 83,000 పాఠశాలల్లోని కోటి మంది విద్యార్థులకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్(ఎంబీయూ) ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలిపింది. గతేడాది సెప్టెంబరులో చేపట్టిన ఈ ఉచిత ఎంబీయూ కార్యక్రమం ఏడాది పాటు కొనసాగనుందని ఉడాయ్ వెల్లడించింది. సాధారణంగా ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు ఫొటో, పేరు, పుట్టిన తేదీ, లింగం, చిరునామా, జనన ధ్రువీకరణ పత్రం మొదలైన వివరాలతో ఆధార్ జారీ చేస్తుంటారు. ఆ సమయంలో వేలిముద్రలు గానీ, ఐరిస్ వివరాలు కానీ సేకరించరు. నిబంధనల ప్రకారం ఏడేళ్లు దాటితే వేలిముద్రలు, ఐరిస్, ఫొటో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. స్కూల్ అడ్మిషన్, స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందడానికి ఇది దోహదపడుతుంది. ఈ క్రమంలోనే పాఠశాలల్లో ఉచిత ఎంబీయూ శిబిరాలను ఉడాయ్ ప్రవేశపెట్టింది.

ఛాంపియన్

టీ20 ధమాకా
ప్రపంచకప్
ఫిబ్రవరి 7 - మార్చి 8

టీ20 ప్రపంచకప్‌లో చిన్న జట్లు ఎంతో మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయి. గెలుపు అవకాశాలు సృష్టించుకుంటున్నాయి. విజయానికి చేరువగా వెళ్తున్నాయి. కానీ ఆఖర్లో తడబడి ఓటమి పాలవుతున్నాయి. తొలి రోజు నెదర్లాండ్స్, స్కాట్లాండ్, అమెరికా పోరాడి ఓడగా.. రెండో రోజు అఫ్గానిస్థాన్, నేపాల్, ఐర్లాండ్ జట్లు.. ఇంగ్లాండ్‌ను ఇదే బాటలో సాగాయి. ఆదివారం నేపాల్ జట్టు.. ఇంగ్లాండ్‌ను దాదాపు ఓడించినంత పని చేసింది. ఆ జట్టు కేవలం 4 పరుగుల తేడాతో ఓడింది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్, శ్రీలంకతో పోరులో ఐర్లాండ్ కూడా బాగా ఆడినా.. ఓటమిని తప్పించుకోలేకపోయాయి.

వణికించిన నేపాల్

● ప్రపంచకప్‌లో తప్పిన సంచలనం

త్రుటిలో బయటపడ్డ ఇంగ్లాండ్



విల్ జాక్స్ 39 నాటౌట్

ముంబయి

ఈ ప్రపంచకప్‌లో తక్కువ అంచనాలున్న జట్లలో ఒకటి నేపాల్. పెద్ద జట్లకు కనీస పోటీ ఇస్తుందని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ కూనే అనుకుంటే ఆ జట్టు అదరగొట్టింది. టోర్నీలో తన తొలి మ్యాచ్‌లో రెండుసార్లు ఛాంపియన్ ఇంగ్లాండ్‌నే వణికించింది. నేపాల్ అద్భుత పోరాటంతో ఇంగ్లిష్ జట్టును దాదాపు ఓడించినంత పనిచేసింది. అనూహ్య ప్రతిఘటన ఎదుర్కొన్న ఇంగ్లాండ్.. ఓటమి అంచుల్లో నుంచి అతికష్టంగా బయటపడి బతుకు జీవుడా అనుకుంది.

టీ20 ప్రపంచకప్‌లో త్రుటిలో సంచలనం తప్పింది. ఉత్కంఠభరితంగా సాగిన గ్రూప్-సి పోరులో ఇంగ్లాండ్ 4 పరుగుల తేడాతో నేపాల్‌పై కష్టంగా నెగ్గింది. బెతెల్ (55; 35 బంతుల్లో 4×4, 4×6), హ్యారీ బ్రూక్ (53; 32 బంతుల్లో 4×4, 3×6), విల్ జాక్స్ (39 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 4×6) మెరవడంతో ఆదివారం మొదట ఇంగ్లాండ్ 7 వికెట్లకు 184 పరుగులు చేసింది. ఛేదనలో నేపాల్ 6 వికెట్లకు 180 పరుగులు చేసింది. దీపేంద్ర ఐరీ (44; 29 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్. లోకేశ్ బామ్ (39 నాటౌట్, 20 బంతుల్లో 4×4, 2×6), రోహిత్ పౌడెల్ (39; 34 బంతుల్లో 2×4, 2×6) రాణించారు. డాసన్ (2/21), సామ్ కరన్ (1/27) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. జాక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

నేపాల్ పోరాటం: ఛేదనలో కుశాల్ భుర్తెల్ (29; 17 బంతుల్లో 4×4, 1×6) విరుచుకుపడడంతో నేపాల్ 3 ఓవర్లకే 31/0తో నిలిచింది. అయితే అతడు, మరో ఓపెనర్ ఆసిఫ్ షేక్ (7) కొద్ది తేడాలో ఔటైనా.. కెప్టెన్ రోహిత్ పౌడెల్, దీపేంద్ర ఐరీ దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో 14 ఓవర్లు ముగిసే సరికి 123/3తో నేపాల్ సంచలన విజయంపై కన్నేసింది. ఇంగ్లాండ్‌కు ఆందోళన తప్పలేదు. కానీ ఆ జట్టు నిలదొక్కుకున్న ఇద్దరు బ్యాటర్లతో పాటు ఆరిఫ్ షేక్ (10)ను వెంటవెంటనే వెనక్కి పంపింది. 18వ ఓవర్లో 146/5తో నిలిచింది నేపాల్. ఆఖరి 16 బంతుల్లో 39 పరుగులు చేయాల్సిన పరిస్థితి. అయితే కాస్త ఊపిరి పీల్చుకున్న ఇంగ్లాండ్‌ను విధ్వంసక బ్యాటింగ్‌తో హడలెత్తించాడు లోకేశ్ బామ్. ఆర్చర్ బౌలింగ్‌లో అతడు వరుసగా రెండు సిక్స్‌లు బాదడంతో చివరి రెండు ఓవర్లలో నేపాల్‌కు 24 పరుగులు అవసరమయ్యాయి.


దీపేంద్ర ఐరీ 44

గుల్షన్ ఝా (1) ఔటైనా.. జోరు కొనసాగిస్తూ లోకేశ్ రెండు ఫోర్లు దంచడంతో 19వ ఓవర్లో (వుడ్) నేపాల్‌కు 14 పరుగులు వచ్చాయి. ఆఖరి ఓవర్లో పది పరుగులు చేయాల్సిన స్థితిలో నేపాల్‌నే విజయం ఊరించింది. కానీ చివరి ఓవర్లో సామ్ కరన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కేవలం 5 పరుగులే ఇచ్చి ఇంగ్లాండ్‌కు విజయాన్నందించాడు.


మెరిసిన బెతెల్, బ్రూక్: అంతకుముందు బెతెల్, బ్రూక్ విలువైన అర్ధశతకాలతో ఇంగ్లాండ్ మెరుగైన స్కోరు అందుకుంది. ఆ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. బట్లర్ (26; 17 బంతుల్లో 5×4) బ్యాట్ ఝుళిపించినప్పటికీ ఇంగ్లాండ్ ఏడో ఓవర్లో 57/3 నిలిచింది. ఆ దశలో ఎటాకింగ్ గేమ్ ఆడిన బెతెల్, బ్రూక్.. నాలుగో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. బెతెల్, సామ్ కరన్ కొద్ది తేడాలో ఔటయ్యారు. 17 ఓవర్లకు ఇంగ్లాండ్ స్కోరు 139/5. అయితే ఆఖర్లో జాక్స్ విధ్వంసం సృష్టించాడు. భుర్తెల్, నందన్ బౌలింగ్‌లో ఒక్కో సిక్స్ బాదిన అతడు.. కేసీ కరణ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో మూడు సిక్స్‌లు దంచాడు. ఇంగ్లాండ్ చివరి మూడు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 45 పరుగులు రాబట్టింది.

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: ఫిల్ సాల్ట్ (సి) లమిచానె (బి) మల్లా 1; బట్లర్ (సి) ఆసిఫ్ షేక్ (బి) నందన్ యాదవ్ 26; బెతెల్ (సి) లోకేశ్ (బి) ఐరీ 55; టామ్ బాంటన్ ఎల్బీ (బి) లమిచానె 2; బ్రూక్ (సి) మల్లా (బి) నందన్‌యాదవ్ 53; సామ్ కరన్ (బి) ఐరీ 2; విల్ జాక్స్ నాటౌట్ 39; ఆర్చర్ రనౌట్ 1; డాసన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **184; వికెట్ల పతనం:** 1-5, 2-43, 3-57, 4-128, 5-137, 6-157, 7-178; **బౌలింగ్:** కేసీ కరణ్ 3-0-35-0; షేర్ మల్లా 3-0-35-1; దీపేంద్ర సింగ్ ఐరీ 3-0-23-2; నందన్ యాదవ్ 3-0-25-2; లమిచానె 4-0-25-1; కుశాల్ భుర్తెల్ 4-0-40-0

నేపాల్ ఇన్నింగ్స్: కుశాల్ భుర్తెల్ (సి) అండ్ (బి) జాక్స్ 29; ఆసిఫ్ షేక్ (సి) వుడ్ (బి) డాసన్ 7; రోహిత్ పౌడెల్ (సి) సాల్ట్ (బి) డాసన్ 39; దీపేంద్ర సింగ్ ఐరీ (సి) బాంటన్ (బి) సామ్ కరన్ 44; ఆరిఫ్ షేక్ (సి) బట్లర్ (బి) ఆర్చర్ 10; లోకేశ్ బామ్ నాటౌట్ 39; గుల్షన్ ఝా (బి) వుడ్ 1; కేసీ కరణ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 180; **వికెట్ల పతనం:** 1-37, 2-42, 3-124, 4-126, 5-146, 6-175; **బౌలింగ్:** ల్యూక్ వుడ్ 3-0-31-1; ఆర్చర్ 4-0-42-1; లయామ్ డాసన్ 4-0-21-2; విల్ జాక్స్ 2-0-17-1; అడిల్ రషీద్ 3-0-42-0; సామ్ కరన్ 4-0-27-1

శ్రీలంక బోణీ

ఐర్లాండ్‌పై గెలుపు


తీక్షణ 3/23

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంక బోణీ కొట్టింది. ఐర్లాండ్ నుంచి పోటీ ఎదురైనా తట్టుకుని, విజయాన్నందుకుంది. ఆదివారం గ్రూప్-బి పోరులో లంక 20 పరుగుల తేడాతో ఐరిష్ జట్టును ఓడించింది. మొదట లంక 6 వికెట్లకు 163 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (56 నాటౌట్), కమిందు మెండిస్ (44) సత్తా చాటారు. బౌలర్లలో మెకార్తీ (2/40), డాక్రెల్ (2/17) రాణించారు. బదులుగా ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 143 పరుగులకే ఆలౌటైంది. తీక్షణ (3/23), హసరంగ (3/25), పతిరన (2/26) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. హ్యారీ టెక్టార్ (40) టాప్‌స్కోరర్.

ఐర్లాండ్ పోరాడినా..: ఛేదనలో ఐర్లాండ్ 3 ఓవర్లకు 24/0తో శుభారంభం చేసింది. ఈ స్థితిలో స్టిర్లింగ్ (6) ఔటైనా.. మరో ఓపెనర్ అడైర్ పరుగుల వేట సాగించాడు. కానీ పవర్ ప్లే తర్వాత తీక్షణ, హసరంగ క్రమశిక్షణతో బౌలింగ్ చేయడంతో పరుగుల వేగం తగ్గింది. కుదురుకున్న రాస్ అడైర్ (34) ఔట్ కావడంతో ఐర్లాండ్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఈ స్థితిలో టెక్టార్, టకర్ (21) నిలిచారు. ఐర్లాండ్ 12 ఓవర్లకు 84/2తో కోలుకుంది. కానీ టకర్, టెక్టార్ వరుస ఓవర్లలో ఔట్ కావడంతో ఆ జట్టు మళ్లీ ఇబ్బందుల్లో పడింది. తీక్షణ, హసరంగ మూడు ఓవర్ల వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టడంతో ఐర్లాండ్ పనైపోయింది. అంతకుముందు కుశాల్ మెండిస్, కమిందు మెండిస్ పోరాటంతో లంక గౌరవప్రదమైన స్కోరు సాధించింది. 16 ఓవర్లకు లంక 4 వికెట్లకు 104 పరుగులే చేసింది. ఆఖరి ఓవర్లలో కమిందు మెండిస్, కుశాల్ మెండిస్ దూకుడుగా ఆడడంతో లంక అనూహ్యమైన స్కోరును అందుకుంది. ఐర్లాండ్ ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం ఆ జట్టుకు కలిసొచ్చింది.

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక (సి) స్టిర్లింగ్ (బి) డాక్రెల్ 24; కమిల్ మిషార (సి) మెకార్తీ (బి) మార్క్ అడైర్ 14; కుశాల్ మెండిస్ నాటౌట్ 56; పవన్ రత్నాయకే (బి) డాక్రెల్ 5; వెల్లలాగె (సి) డాక్రెల్ (బి) డెలానీ 10; కమిందు మెండిస్ (సి) డాక్రెల్ (బి) మెకార్తీ 44; శానక (సి) మార్క్ అడైర్ (బి) మెకార్తీ 0; హసరంగ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **163; వికెట్ల పతనం:** 1-28, 2-62, 3-68, 4-86, 5-153, 6-153; **బౌలింగ్:** హంఫ్రీస్ 4-0-44-0; మార్క్ అడైర్ 4-0-33-1; మెకార్తీ 3-0-40-2; డాక్రెల్ 4-0-17-2; డెలానీ 4-0-24-1; టెక్టార్ 1-0-5-0

ఐర్లాండ్ ఇన్నింగ్స్: స్టిర్లింగ్ (బి) తీక్షణ 6; రాస్ అడైర్ (బి) హసరంగ 34; టెక్టార్ (సి) రత్నాయకే (బి) హసరంగ 40; టకర్ (సి) మిషార (బి) వెల్లలాగే 21; క్యాంఫర్ (సి) శానక (బి) హసరంగ 13; కాలిజ్ (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) తీక్షణ 4; డెలానీ (సి) చమీర (బి) తీక్షణ 0; డాక్రెల్ (సి) కమిందు (బి) పతిరన 9; మార్క్ అడైర్ (సి) శానక (బి) చమీర 10; మెకార్తీ నాటౌట్ 0; హంఫ్రీస్ (బి) పతిరన 0; ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం:** (19.5 ఓవర్లలో ఆలౌట్) **143; వికెట్ల పతనం:** 1-24, 2-56, 3-105, 4-113, 5-120, 6-120, 7-126, 8-137, 9-143; **బౌలింగ్:** చమీర 3-0-25-1, 4-0-23-3, పతిరన 2.5-0-26-2, వెల్లలాగే 4-0-28-1, హసరంగ 4-0-25-3, శానక 2-0-12-0

టీ20 ప్రపంచకప్‌లో ఈరోజు

స్కాట్లాండ్ × ఇటలీ
వేదిక: కోల్‌కతా, ఉ॥ 11.00

జింబాబ్వే × ఒమన్
వేదిక: కొలంబో, మ॥ 3.00

దక్షిణాఫ్రికా × కెనడా
వేదిక: అహ్మదాబాద్, రా॥ 7.00

ఇలవేనిల్ జోడీకి స్వర్ణం

దిల్లీ: ఆసియా షూటింగ్ (రైఫిల్/పిస్టల్) ఛాంపియన్‌షిప్‌లో భారత మిక్స్‌డ్ జట్టు మెరిసింది. ఒలింపియన్లు ఇలవేనిల్- అర్జున్ బబుతా జోడీ స్వర్ణ పతకం సాధించింది. ఆదివారం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో ఇలవేనిల్- బబుతా (505.0) జంట అగ్రస్థానం సాధించింది. దక్షిణ కొరియా జోడీ (501.0) రజతం, జపాన్ జంట (437.1) కాంస్యం నెగ్గాయి. జూనియర్ విభాగంలో హిమాన్షు ఢిల్లాన్- శాంభవి క్షీరసాగర్ జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో హిమాన్షు- శాంభవి (502.4) అగ్రస్థానం సాధించింది. కజకిస్థాన్ (488.6) రెండు, మాల్దీవులు మూడో స్థానంలో నిలిచాయి. 25 మీ స్టాండర్డ్ పిస్టల్‌లో రియో ఒలింపియన్ గుర్‌ప్రీత్‌సింగ్ స్వర్ణం, హర్ష్ గుప్తా రజతం, అమన్‌ప్రీత్ సింగ్ కాంస్యం సొంతం చేసుకున్నారు. జూనియర్స్‌లో సూరజ్‌శర్మ, ముకేశ్ నేలవల్లి, తనిష్క్ మురళీధర్ నాయుడు వరుసగా స్వర్ణ, రజత, కాంస్యం సాధించారు.


ఇలవేనిల్, అర్జున్

భళా దక్షిణేశ్వర్

డేవిస్ కప్‌లో నెదర్లాండ్స్‌కు భారత్ చెక్


దక్షిణేశ్వర్

బెంగళూరు: యువ ఆటగాడు దక్షిణేశ్వర్ అద్భుత ప్రదర్శనతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలవడంతో డేవిస్ కప్ టెన్నిస్ టోర్నీ ప్రపంచ గ్రూప్‌లో భారత్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయర్స్ పోరులో 3-2తో బలమైన నెదర్లాండ్స్‌ను ఓడించింది. నెదర్లాండ్స్ ర్యాంకు 6 కాగా.. భారత్ 33వ స్థానంలో ఉంది. శనివారం తొలి మ్యాచ్ గెలవడంతో టై 1-1తో సమం కాగా.. ఆదివారం పురుషుల డబుల్స్‌లో యుకి బాంబ్రి-దక్షిణేశ్వర్ సురేశ్ జంట 7-6 (7-0), 3-6, 7-6 (7-1)తో సందర్ అరెండ్స్-డేవిడ్ పెల్ ద్వయంపై గెలిచి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. అనంతరం రివర్స్ సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 7-5, 1-6, 4-6తో జెస్పర్ డి జాంగ్ చేతిలో కంగుతినడంతో టై మళ్లీ 2-2తో సమమైంది. నిర్ణయాత్మక రెండో రివర్స్ సింగిల్స్‌లో దక్షిణేశ్వర్ సురేశ్ 6-4, 7-6 (7-4)తో డెన్ ఔడెన్‌ను ఓడించి భారత్‌కు విజయాన్ని అందించాడు. అతను శనివారం తొలి సింగిల్స్‌లోనూ నెగ్గాడు.

కివీస్ శుభారంభం


సీఫర్ట్ 65

చెన్నై: టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. ఆదివారం తన తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ నుంచి ఎదురైన సవాల్‌ను ఆ జట్టు కాచుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ సీఫర్ట్ (65; 42 బంతుల్లో 7×4, 3×6), గ్లెన్ ఫిలిప్స్ (42; 25 బంతుల్లో 7×4, 1×6) మెరుపులతో 183 పరుగుల లక్ష్యాన్ని కివీస్.. 13 బంతులు మిగిలుండగా, 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్ రెహ్మాన్ (2/31) రాణించాడు. మొదట గుల్బాదిన్ నైబ్ (63; 35 బంతుల్లో 3×4, 4×6) విధ్వంసక ఇన్నింగ్స్ ఆడడంతో అఫ్గాన్ 6 వికెట్లకు 182 పరుగులు సాధించింది.

తడబడి.. నిలబడి: భారీ ఛేదనను కివీస్ పేలవంగా ఆరంభించింది. 14 పరుగులకే అలెన్ (1), రచిన్ రవీంద్ర (0)ల వికెట్లు కోల్పోవడంతో కివీస్‌కు కష్టమే అనిపించింది. కానీ సీఫర్ట్, ఫిలిప్స్ కీలక భాగస్వామ్యం (74)తో ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టారు. ఈ జోడీ అఫ్గాన్ బౌలర్లపై ఎదురుదాడి చేయడంతో కివీస్.. 9 ఓవర్లకు 87/2తో మెరుగైన స్థితికి చేరుకుంది. ఈ స్థితిలో రషీద్ ఖాన్.. ఫిలిప్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అయినా సీఫర్ట్ జోరు కొనసాగించాడు. జట్టు స్కోరు 124 వద్ద అతను నాలుగో వికెట్ రూపంలో ఔటవగా.. చాప్‌మన్ (28), డరిల్ మిచెల్ (25 నాటౌట్), శాంట్నర్ (17 నాటౌట్) మిగతా పని పూర్తిచేశారు.

చెలరేగిన నైబ్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ తొలి 3 ఓవర్లలో 15 పరుగులే చేసింది. ఓపెనర్లు ఇబ్రహీం జద్రాన్ (10), రహ్మనుల్లా గుర్బాజ్ (27) ఆరంభంలో ఆచితూచి ఆడారు. జాకబ్ డఫీ వేసిన నాలుగో ఓవర్లో గుర్బాజ్ సిక్స్, ఫోర్‌తో ఊపందుకున్నాడు. పవర్‌ప్లేలో చివరి ఓవర్లో ఫెర్గూసన్ (2/40) ఓపెనర్లిద్దరినీ పెవిలియన్ చేర్చినా.. అఫ్గాన్‌కు ఇబ్బంది లేకపోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన గుల్బాదిన్ నైబ్.. చెలరేగిపోయాడు. అటల్ (29), రసూలి (20)ల సహకారంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సిక్సర్ల మోత మోగించి అతను.. 18వ ఓవర్లో ఔటయ్యాడు. చివర్లో అజ్మతుల్లా (14), నబి (10 నాటౌట్) కొన్ని షాట్లు ఆడడంతో స్కోరు 180 దాటింది.

అఫ్గానిస్థాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (బి) ఫెర్గూసన్ 27; ఇబ్రహీం జద్రాన్ (సి) ఫిలిప్స్ (బి) ఫెర్గూసన్ 10; నైబ్ (సి) సీఫర్ట్ (బి) రవీంద్ర 63; అటల్ (సి) సీఫర్ట్ (బి) డఫీ 29; రసూలి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 20; అజ్మతుల్లా రనౌట్ 14; నబి నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182; **వికెట్ల పతనం:** 1-35, 2-44, 3-123, 4-156, 5-164, 6-182; **బౌలింగ్:** హెన్రీ 4-0-27-1, డఫీ 3-0-30-1, ఫెర్గూసన్ 4-0-40-2, నీషమ్ 3-0-33-0, శాంట్నర్ 4-0-23-0, ఫిలిప్స్ 1-0-12-0, రవీంద్ర 1-0-14-1

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (సి) అజ్మతుల్లా (బి) నబి 65; అలెన్ (బి) ముజీబ్ 1; రవీంద్ర (బి) ముజీబ్ 0; ఫిలిప్స్ (బి) రషీద్ 42; చాప్‌మన్ (సి) రషీద్ (బి) అజ్మతుల్లా 28; మిచెల్ 25 నాటౌట్; శాంట్నర్ 17 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం:** (17.5 ఓవర్లలో 5 వికెట్లకు) **183; వికెట్ల పతనం:** 1-14, 2-14, 3-88, 4-124, 5-155; **బౌలింగ్:** ఫారూఖీ 2-0-25-0, ముజీబ్ 4-0-31-2, అజ్మతుల్లా 3.5-0-40-1, రషీద్ 4-0-36-1, జియావుర్ 3-0-33-0, నబి 1-0-18-1

పాక్‌కు ఐసీసీ ప్రతినిధి

భారత్‌తో పోరు బహిష్కరణపై పునరాలోచనలో పీసీబీ?

కరాచి: టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ యథాప్రకారం జరుగుతుందా? ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలన్న నిర్ణయంపై పాకిస్థాన్ వెనక్కి తగ్గుతుందా? పాక్‌లో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఈ సంకేతాలే కనిపిస్తున్నాయి. సమస్య పరిష్కారం కోసం పీసీబీతో చర్చలు జరిపేందుకు ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా ఆదివారం పాకిస్థాన్‌కు చేరుకున్నారు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా ఈ నెల 15న కొలంబోలో భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఖ్వాజా ఐసీసీలో సింగపూర్ ప్రతినిధి. కౌన్సిల్‌లో అతడికి చాలా పలుకుబడి ఉంది. అనుబంధ సభ్యదేశం డైరెక్టర్‌గా అతడికి ఓటు హక్కు కూడా ఉంది. ఐసీసీ అతణ్ని మధ్యవర్తిగా నియమించినట్లు పీసీబీ వర్గాలు తెలిపాయి. పీసీబీ ఛైర్మన్ నఖ్వి, పీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్‌తో లాహోర్‌లో ఖ్వాజా చర్చలు జరుపుతాడని చెప్పాయి. ఈ సమావేశం కోసమే అమినుల్ బంగ్లాదేశ్‌కు చేరుకున్నాడు. భారత్‌తో మ్యాచ్ నుంచి వైదొలగడం వల్ల వందల కోట్లు నష్టపోవడంతో పాటు భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అర్థమవడంతో పాక్ ఇప్పుడు పునరాలోచనలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఐసీసీ ప్రతినిధి సైతం పీసీబీతో చర్చలు జరిపేందుకు వెళ్లడంతో చిరకాల ప్రత్యర్థుల పోరు జరిగే అవకాశాలు మెరుగయ్యాయి.

పట్టు కోల్పోయిన ఆంధ్ర

బెంగాల్‌కు ఆధిక్యం

కల్యాణి: బెంగాల్‌తో రంజీ ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్‌లో ఆంధ్ర పట్టు కోల్పోయింది. సుదీప్‌కుమార్ ఘరామి (216 బ్యాటింగ్; 451 బంతుల్లో 27×4) అజేయ డబుల్ సెంచరీతో కదంతొక్కడంతో బెంగాల్ భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 199/5తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్.. మూడో రోజు ఆట చివరికి 6 వికెట్లకు 418 పరుగులు సాధించింది. ఘరామి.. సుమంత గుప్తా (81), హబీబ్ గాంధీ (45 బ్యాటింగ్)లతో భాగస్వామ్యాలు నెలకొల్పాడు. మూడో రోజు 83 ఓవర్లాడిన బెంగాల్ ఒక్క వికెట్టే కోల్పోయి 219 పరుగులు రాబట్టింది. ప్రస్తుతం బెంగాల్ 123 పరుగుల ఆధిక్యంతో ఉంది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులకు ఆలౌటైంది.

దేవికకు మరో టైటిల్


దేవిక

దిల్లీ: భారత యువ షట్లర్ దేవిక సిహాగ్ వరుసగా రెండో టైటిల్ ఖాతాలో వేసుకుంది. గత వారం థాయ్‌లాండ్ మాస్టర్స్ విజేతగా నిలిచిన దేవిక.. ఇప్పుడు అజర్‌బైజాన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో టైటిల్ నెగ్గింది. ఆదివారం ఫైనల్లో ఆమె 21-10, 21-13తో నవ్య కందేరిపై గెలిచింది. సాత్విక్ రెడ్డి, రాధిక శర్మ జోడీ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సాధించింది. ఈ జంట 24-22, 10-21, 24-22తో మిహాలో టొమిక్, ఆండ్‌జెలా విట్‌మన్ ద్వయంపై గెలిచింది.

పాక్ నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది


గంగూలీ

దిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదని పాకిస్థాన్ నిర్ణయించుకోవడం ఆశ్చర్యం కలిగించిందని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. "ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్ ఆడకపోవడం ఏంటి? పాకిస్థాన్ తీసుకున్న ఈ నిర్ణయం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ టోర్నీలో ప్రతి పాయింట్ చాలా కీలకం" అని దాదా పేర్కొన్నాడు. అమెరికాతో తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో తడబడినప్పటికీ.. భారత్ దూకుడుగానే ఆడాలని గంగూలీ సలహా ఇచ్చాడు. "టీ20 క్రికెట్లో మొదటి బంతి నుంచి బాదుతూనే ఉండాలి. భారత్‌లో నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు. చాలా నెలల నుంచి వాళ్లు దూకుడుగానే ఆడుతున్నారు. బాదే క్రమంలో ఒక్కోసారి తడబడే అవకాశాలుంటాయి. అమెరికాపై అదే జరిగింది. అలా అని జట్టు ప్రణాళికలను మార్చుకోకూడదు. ఎప్పటిలాగే ఆడాలి. భారత జట్టు చాలా బలంగా ఉంది. అన్ని విభాగాల్లో సమతూకంగా కనిపిస్తోంది. ప్రపంచకప్ సాగేకొద్దీ జట్టు జోరు అందుకుంటుంది" అని గంగూలీ చెప్పాడు. సూర్యకుమార్ మ్యాచ్ విన్నర్ అని మరోసారి నిరూపించుకున్నాడని దాదా చెప్పాడు. "న్యూజిలాండ్‌తో సిరీస్‌లో రాణించి.. ఆత్మవిశ్వాసంతో ప్రపంచకప్‌కు వచ్చాడు సూర్యకుమార్. అమెరికాపై అతడు స్వేచ్ఛగా ఆడాడు. కొన్ని అద్భుతమైన షాట్లు కొట్టాడు. తాను మ్యాచ్ విన్నర్‌ని అని అతడు నిరూపించుకున్నాడు" అని గంగూలీ చెప్పాడు.

యువ ఛాంపియన్లకు ఘనస్వాగతం



ముంబయి: యువ ఛాంపియన్లు భారత్‌కు చేరుకున్నారు. అండర్-19 ప్రపంచకప్ నెగ్గిన కుర్రాళ్లకు.. ఆదివారం ముంబయి ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. గురువారం అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆయుష్ మాత్రే సేన.. 100 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో భారత్ ఒక్క మ్యాచ్‌లోనూ పరాజయం చవిచూడకుండా కప్పు గెలవడం విశేషం. బీసీసీఐ త్వరలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంది. గతంలో భారత్ 2000, 2008, 2012, 2018, 2022లో ఛాంపియన్‌గా నిలిచింది. "ఆనందంతో మాకు మాటలు రావడం లేదు. మా అబ్బాయి చిన్నప్పటి నుంచి పడ్డ శ్రమకు ఫలితం దక్కింది" అని ఆయుష్ మాత్రే తండ్రి అన్నారు. కోచ్ హృషికేశ్ కనిత్కర్ శిక్షణలో ట్రోఫీ నెగ్గిన భారత కుర్రాళ్లకు బీసీసీఐ రూ.7.5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. ఫైనల్లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 80 బంతుల్లో 175 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన సంగతి తెలిసిందే.


ముంబయి విమానాశ్రయంలో వైభవ్, ఆయుష్

శంకర్‌కు స్వర్ణం

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్


తేజస్విన్ శంకర్

తియాంజిన్: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ అథ్లెట్ తేజస్విన్ శంకర్ స్వర్ణం సాధించాడు. హెప్టాథ్లాన్ పురుషుల విభాగంలో అతడు 5993 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి.. టోర్నీలో భారత్‌కు తొలి స్వర్ణం అందించాడు. భారత్ అయిదు పతకాలతో టోర్నీని ముగించింది. పూజ (హైజంప్, రజతం), తజిందర్‌పాల్ సింగ్ (షాట్‌పుట్, రజతం), ఏస్సీ సోజాన్ (లాంగ్‌జంప్, కాంస్యం), ఆదర్శ్ రామ్ జోతి శంకర్ (హైజంప్, కాంస్యం) పతకాలు సాధించారు.

మేం ఆశ్చర్యపోయాం


అక్షర్ పటేల్

ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో అమెరికాతో పోరులో వాంఖడే స్టేడియంలోని పిచ్ స్వభావం తమను ఆశ్చర్యపరిచిందని భారత వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. సాధారణంగా వాంఖడే వికెట్‌పై భారీస్కోర్లు నమోదవుతాయని అక్షర్ తెలిపాడు. "మ్యాచ్ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక ఉంటుంది. సాధారణంగా ముంబయి వికెట్ ఫ్లాట్‌గా ఉంటుంది. శనివారం పిచ్ భిన్నంగా ప్రవర్తించింది. వికెట్‌ను చూసి ఆశ్చర్యపోయాం. మంచి స్కోరును అంచనా వేసుకునేందుకు మాకు మూడు ఓవర్ల సమయం పట్టింది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆత్మవిశ్వాసం తగ్గలేదు. ఒక్క బ్యాటర్ నిలదొక్కుకున్నా కూడా 140-150 స్కోరు చేరుకుంటామని మాకు తెలుసు" అని అక్షర్ చెప్పాడు. అమెరికాతో మ్యాచ్‌లో ఒక దశలో 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన భారత్.. కెప్టెన్ సూర్యకుమార్ (84 నాటౌట్) మెరుపులతో 161 పరుగులు చేయగలిగింది. తర్వాత ప్రత్యర్థిని 132/8కు కట్టడి చేసి 29 పరుగుల తేడాతో నెగ్గింది.



సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావులకు డిమాండ్ల పత్రాన్ని అందజేస్తున్న ఉక్కు పరిశ్రమ నిర్వాసితుల ఐక్యసంఘం సభ్యులు

ఉక్కు నిర్వాసితుల ఉద్యమాలకు అండగా ఉంటాం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ

విశాఖపట్నం (గాజువాక), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు నిర్వాసితుల న్యాయమైన హక్కుల కోసం ఏళ్ల తరబడి ఉద్యమాలు కొనసాగడం విచారకరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ పేర్కొన్నారు. విశాఖ గాజువాక లంకా మైదానంలో ఆదివారం సాయంత్రం నిర్వాసితుల ఐక్యసంఘం, కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో 'ఉక్కు నిర్వాసితుల ప్రజాగర్జన' పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. జస్టిస్ గోపాలగౌడ మాట్లాడుతూ ఉక్కు నిర్వాసితుల ఉద్యమానికి తామంతా సహకరిస్తామన్నారు. విశ్రాంత డీజీపీ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ అమరావతి రైతులకో న్యాయం, స్టీల్‌ప్లాంటు కోసం భూములు కోల్పోయిన బీసీ నిర్వాసితులకు ఓ న్యాయమా అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం భూములిచ్చి మూడు న్నర దశాబ్దాలుగా ఉపాధి, నష్టపరిహారానికి ఎదురుచూస్తున్న నిర్వాసితుల పట్ల కేంద్రం మొండివైఖరి చూపటం దారుణమన్నారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మాధవ్, రమణమూర్తి తదితరులు మాట్లాడారు.

మే 3న 'నీట్': ఎన్‌టీఏ


ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'నీట్ యూజీ-2026'ను మే 3న నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 8 నుంచి మార్చి 8 రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మే 3న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగే ఈ పరీక్ష. తెలుగు, ఆంగ్లం మాధ్యమాలతో పాటు మొత్తం 13 భాషల్లో నిర్వహించనున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు రూ.1,700, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.1,600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఇతరులు రూ.వెయ్యి దరఖాస్తు రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రం తదితర వివరాలను త్వరలో తెలియజేస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

నేడు ఏపీ వైద్యమండలి ఎన్నికలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి(ఏపీఎంసీ) ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ-ఓటింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో పోలింగ్ నిర్వహిస్తారు. 13 మంది అభ్యర్థులను ఎన్నుకోవాల్సి ఉండగా. . ఆయా స్థానాలకు 84 మంది పోటీలో ఉన్నారు. మండలిలోని అర్హులైన 56,374 మంది వైద్యులు తొలిసారి ఆన్‌లైన్‌లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. రిజిస్టర్డ్ మొబైల్/ఈమెయిల్ ఐడీ ద్వారా పంపే ఓటీపీ, ఐపీ అడ్రస్ ద్వారా మాత్రమే ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక మొబైల్/కంప్యూటర్ నుంచి ఒక ఓటు మాత్రమే వేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఓటరుకు కేటాయించిన అరగంట సమయంలో 13 మందికి ఓటు వేయాల్సి ఉంటుంది. ఎన్నికల ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు పర్యవేక్షణలో పూర్తిచేశారు. ఓట్ల లెక్కింపును ఈ నెల 10న తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ సంచాలకుల కార్యాలయంలో నిర్వహించి.. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. 20 ఏళ్ల విరామం తర్వాత ఏపీ వైద్య మండలి ఎన్నికలు జరుగుతుండటంతో వైద్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

అన్ని రాష్ట్రాలూ మెరుగైన పనితీరు చూపాల్సిందే

- విధానాలు ఎల్లప్పుడూ పనితీరు బాగోలేని రాష్ట్రాలకే అనుకూలంగా ఉండరాదు
- 'పీటీఐ వీడియోస్' ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి: దేశంలో పనితీరు బాగోలేని రాష్ట్రాలు కేంద్రం పంపిణీ చేసే పన్నుల వాటాలో అనివార్యంగా అధిక మొత్తం పొందుతున్నాయని, ఫలితంగా మెరుగైన పనితీరు కనబరుస్తున్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు నష్టపోతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన 'పీటీఐ వీడియోస్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. వెనకబడిన రాష్ట్రాలు క్రమక్రమంగా తమను తాము చక్కదిద్దుకోవడం శుభపరిణామమన్నారు. 'కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఎలాంటి అన్యాయం చేయాలని భావించదు. వెనకబాటుతనానికి జనాభా వంటి కొన్ని పరామితులు ఉన్నాయి. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, వృద్ధిరేటులో మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. అందుకే ఆదాయపంపిణీలో సమస్య ఏర్పడుతోంది. జనాభా పేదరికం ఆదాయ పంపిణీకి ప్రాధాన్యంగా ఉంది" అని చెప్పారు. "ఈ కారణాల వల్ల సాధారణంగా అసంతృప్తి ఉంటుంది. మన విధానాలు పనితీరు కనబరచని రాష్ట్రాలకు అనుకూలంగా ఎల్లప్పుడూ ఉండకూడదు. కొన్ని సందర్భాల్లో రక్షణలు కల్పించడం సరైనదే. అయితే ఎప్పటికైనా అన్ని రాష్ట్రాలూ మెరుగైన పనితీరు చూపాల్సిందే. ఆ బాధ్యత ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలదే. వాళ్లు మెరుగైన పనితీరు చూపించాల్సిందే" అని స్పష్టంచేశారు.

ఇప్పుడు జనాభా నిర్వహణే..

జనాభాపై తన దృక్పథం ఇప్పుడు.. 'జనాభా నియంత్రణ' నుంచి 'జనాభా నిర్వహణ'కు మారినట్లు చంద్రబాబు తెలిపారు. "ఐరోపా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఏం జరిగిందో చూడండి. మన ప్రజలు ఎక్కువమంది పిల్లలను కనాలని మొదటిగా నేనే చెప్పాను. ఆ తర్వాత ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు" అని వెల్లడించారు. త్వరలో కేంద్రంలో ఏదైనా కీలక పాత్ర పోషించే అవకాశముందా అని ప్రశ్నించగా.. అలాంటిదేదీ లేదని తెదేపా అధినేత స్పష్టంచేశారు. "ఏనాడు నేను కేంద్రంలో ఏ పదవినీ ఆశించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడానికే ఎప్పుడూ ఆసక్తి చూపుతాను. అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనైనా.. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోనైనా" అని తెలిపారు. కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు మద్దతుపై మాట్లాడుతూ.. "అది 'పరస్పరం'.. మేం కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాం. వాళ్లు కూడా రాష్ట్రాభివృద్ధికి అండగా నిలుస్తున్నారు. అందువల్లే మేం డబుల్ ఇంజిన్ సర్కారు అని పిలుస్తున్నాం" అని వెల్లడించారు.

నేను రాజకీయ నాయకుడినే..

మిమ్మల్ని మీరు టెక్నాలజీ లీడర్‌గా చూసుకుంటారా? లేక రాజకీయ నాయకుడిగానా? అని ప్రశ్నించగా.. రాజకీయ నాయకుడిగానేనని చంద్రబాబు బదులిచ్చారు. ''నేను ప్రజల కోసమే పనిచేస్తున్నాను. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికీ, సంపద సృష్టికీ నేను టెక్నాలజీని వినియోగిస్తున్నాను" అని చంద్రబాబు అన్నారు.

బ్యాంకులో నిల్వల మాదిరిగానే నీటి ఆదా

సముద్రంలోకి వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటిని నదుల అనుసంధానంతో ఆదా చేసుకోవచ్చని చంద్రబాబు చెప్పారు. మనకు బ్యాంకుఖాతాలో సొమ్ము నిల్వ ఉన్నట్లుగానే.. రిజర్వాయర్‌లో నీటినిల్వ కోసం తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. "గంగా-కావేరీ నదుల అనుసంధానం తొలినాళ్ల నుంచి నా కల. తొలుత దీనిని కొందరు వ్యతిరేకించొచ్చు. అయితే ఎవరు అనుకూలంగా ఉన్నారో వారితో మీరు పనిచేయాలి. చిట్టచివరకు నదుల అనుసంధానమనేది సాధ్యమే" అని వ్యాఖ్యానించారు.

పారిశుద్ధ్య కార్మికుడు.. నిజాయతీలో కుబేరుడు

- చెత్తలో దొరికిన 20 సవర్ల బంగారం, కిలో వెండి
- పోలీసుస్టేషన్‌లో అప్పగింత



పారిశుద్ధ్య కార్మికుడు దురై. కన్నీటి పర్యంతమవుతున్న రాధాకృష్ణన్ కుటుంబీకులు

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తమిళనాడులో ఓ పారిశుద్ధ్య కార్మికుడు చెత్తలో దొరికిన 20 సవర్ల (160 గ్రాముల) బంగారు నగలు, కిలో వెండి వస్తువులను పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. తిరువారూర్ మున్సిపాలిటీలో దురై అనే వ్యక్తి పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈయన ఆదివారం ఉదయం విధుల్లో ఉండగా చెత్తలో ఓ బ్యాగు కనిపించింది. తెరిచి చూడగా బంగారు నగలు, వెండి వస్తువులు ఉన్నాయి. వెంటనే వాటిని తిరువారూర్ నగర పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా. . చెన్నైకి చెందిన రాధాకృష్ణన్ కుటుంబం తిరువారూర్ జిల్లా తిరుత్తురైపూండిలోని బంధువు ఇంట్లో శుభకార్యానికి వచ్చింది. అప్పుడు వెంట తీసుకొచ్చిన 20 సవర్ల బంగారు నగలు, కిలో వెండి వస్తువులు ఉన్న బ్యాగును వారు పోగొట్టుకున్నారు. దీనిపై తిరువారూర్ నగర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు రాధాకృష్ణన్ కుటుంబాన్ని స్టేషన్‌కు పిలిపించి కార్మికుడు దురై చేతులమీదుగా ఆ నగలను అప్పగించారు. రాధాకృష్ణన్ తన కుమార్తె వివాహం కోసం కొంచెం కొంచెంగా కూడబెట్టుకున్న నగలు కావడంతో అవి దొరికిన ఆనందంలో ఆయన భార్య కళ్లు కన్నీటితో నిండిపోయాయి. ఈ దృశ్యాలు చూపరుల హృదయాలనూ బరువెక్కించాయి.



పసుపు పచ్చ కాయలు



బయట ముదురు ఆకుపచ్చగా లోపల పసుపు పచ్చగా ఉన్న కాయలు

పచ్చ పచ్చాని పుచ్చ!

మనవద్ద లభించే పుచ్చకాయలు సాధారణంగా బయట ఆకుపచ్చగా.. కోస్తే లోపల ఎరుపు రంగులో ఉంటాయి. నెల్లూరులో ఈ రంగుల పుచ్చకాయలు కనిపించాయి. వీటిని బెంగళూరు నుంచి తెచ్చినట్లు వ్యాపారులు తెలిపారు. పసుపు రంగులో ఉన్న కాయలు లోపల ఎర్రగా, ఆకుపచ్చని కాయలు లోపల పసుపురంగులో ఆకట్టుకుంటున్నాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

చెన్నైలో దిగాల్సిన విమానం రేణిగుంటకు..

రేణిగుంట, న్యూస్‌టుడే: చెన్నైలో దిగాల్సిన ఓ విమానం వాతావరణం అనుకూలించకపోవడంతో రేణిగుంట విమానాశ్రయానికి చేరింది. నిత్యం హైదరాబాద్ నుంచి చెన్నైకి రాకపోకలు సాగించే ఇండిగో విమానం ఆదివారం ఉదయం 8 గంటల సమయానికి చెన్నై విమానాశ్రయానికి వెళ్లింది. కానీ అక్కడ దట్టమైన పొగమంచు ఉండటంతో ల్యాండింగ్‌కు అనుమతించలేదు. దీంతో పైలట్లు విమానాన్ని రేణిగుంటకు తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. సుమారు గంట తర్వాత చెన్నైలో పొగమంచు తగ్గడంతో విమాన రాకపోకలు కొనసాగించారు.



కాంక్రీటు అరణ్యంలో పచ్చని ఒయాసిస్!

కనుచూపు మేర భారీ భవనాలు.. వాటి మధ్య పచ్చని హారంలా పెరిగిన వృక్షాలు కనువిందు చేస్తున్నాయి. విశాఖ నగరంలోని మిథిలాపురి వుడా కాలనీలోని దారి వెంట ఉన్న చెట్లను స్థానికులు, నగరపాలిక సిబ్బంది గత కొన్నేళ్లుగా కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం చుట్టూ పెద్ద భవనాలు రావడంతో ఆ ప్రాంతం చెట్లున్న దారి ఎడారిలో ఒయాసిస్సులా కనిపిస్తోంది. ఈ వృక్షాల నీడనే ఉషోదయాన స్థానికులు వాకింగ్ చేస్తుంటారు.

– ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, పి.ఎం.పాలెం

శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ టీ.సి.డి.శేఖర్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.సి.డి. శేఖర్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబసభ్యులతో కలిసి మూలమూర్తిని దర్శించుకోగా.. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిన్న వేడుకలకు ఉందిగా.. తిరుమల కల్యాణ వేదిక

భక్తులు తక్కువ ఖర్చుతో నిర్వహించుకొనే వెసులుబాటు



కల్యాణ వేదికలో చిన్నారికి చెవిపోగులు కుట్టిస్తున్న ఓ కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని వకుళమాత అన్నప్రసాద కేంద్రం సమీపంలోని శ్రీవారి కల్యాణవేదికలో భక్తులు సంప్రదాయ పూజా కార్యక్రమాలను నిర్దేశిత రుసుముతో నిర్వహించుకునేందుకు తితిదే వెసులుబాటు కల్పిస్తోంది. వివాహం, ఉపనయనం, సత్యనారాయణ వ్రతం, నామకరణం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, వాహనపూజ తదితర ధార్మిక వేడుకలను సామాన్యులు తక్కువఖర్చుతో ఇక్కడ జరుపుకోవచ్చు. వీటి నిర్వహణ బాధ్యతలను తితిదే పురోహిత సంఘానికి అప్పగించింది. వివాహం ఉచితం కాగా.. ఉపనయనం రూ.300, సత్యనారాయణ వ్రతం రూ.300, కేశఖండన రూ.200, నామకరణం రూ.200, అన్నప్రాశన రూ.200, అక్షరాభ్యాసం రూ.200, వాహనపూజ రూ.200, చెవిపోగులు కుట్టడం రూ.50, చెవిపోగులు కుట్టడం (కాటేజీలో) రూ.100, వేడుకలకు మేళం రూ.100 (సెట్టు), రూ.300 (రెండు సెట్లు), దస్త్రపూజ రూ.200, ఇతర ధార్మిక కార్యక్రమాలకు రూ.200 చొప్పున ఫీజు కట్టాల్సి ఉంటుంది. భక్తులు ముందుగా పురోహితులను సంప్రదించి పూజాసామగ్రి తెచ్చుకోవాలి. కొన్ని వేడుకలు సామూహికంగా జరిపిస్తారు. మరిన్ని వివరాలకు కల్యాణవేదిక వద్దనున్న పురోహిత సంఘాన్ని సంప్రదించవచ్చు.

కర్ణాటకలో కూలిన శిక్షణ విమానం



విరిగిన విమాన భాగాలు

ఈనాడు, బెంగళూరు: శిక్షణకు ఉపయోగించే ప్రైవేటు విమానం కర్ణాటకలో కూలిపోయింది. ఆదివారం మధ్యాహ్నం విజయపుర జిల్లా బాబలేశ్వర్ తాలూకా మంగళూరు గ్రామంలోని పొలాల్లో ఈ విమానం కూలింది. రెడ్‌బర్డ్ ఫ్లైట్ ట్రైనింగ్ విభాగానికి చెందిన సెస్నా 172 ఎయిర్‌క్రాఫ్ట్ వీటీ-ఈయూసీ విమానంలో అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ కునాల్ మల్హోత్రా, ట్రైనీ పైలట్ గౌతమ్ శంకర్ ప్రయాణిస్తున్నారు. ఇంజిన్‌లో సాంకేతిక సమస్యలతో అత్యవసర ల్యాండింగ్ చేసే క్రమంలో ఈ విమానం కూలినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలు కావడంతో బాబలేశ్వర్‌లోని ఆసుపత్రికి తరలించారు. సమస్యను గుర్తించిన వెంటనే పైలట్ పొలాల్లో దించటంతో ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. కలబురగి నుంచి బెళగావికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. దీనిపై పౌర విమానయానశాఖ స్పందిస్తూ.. 'రెడ్‌బర్డ్ ఫ్లయింగ్ ట్రైనింగ్ అకాడమీకి చెందిన విమానం బెళగావి విమానాశ్రయం నుంచి వంద కిలోమీటర్ల దూరంలోని పొలాల్లో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. విమానంలోని ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారు. విచారణ తర్వాత పూర్తి కారణాలు వెల్లడిస్తాం' అని ప్రకటించింది.

ఏపీటీఎఫ్ అధ్యక్షురాలిగా చెన్నుపాటి మంజుల



మంజుల



బసవలింగారావు

ఈనాడు, అమరావతి: ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని విజయవాడలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చెన్నుపాటి మంజుల, బసవలింగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆరుగురు, కార్యదర్శులుగా ఏడుగురు, సభ్యులుగా ఎనిమిది మందిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పాత పింఛను విధానాన్ని అమలుచేయాలని, డీఏ, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

EENADU Vol: 52, Issue: 180 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈసారి వేసవికి థియేటర్లు కళకళలాడనున్నాయి. ఒకప్పటిలా సినిమాలు బాక్సాఫీస్ ముందుకు వరుస కట్టనున్నాయి. రెండేళ్లుగా వేసవి సీజన్ వృథా అవుతూ వచ్చినా... ఈసారి మాత్రం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవల్సిందే అన్నట్టుగా దర్శకనిర్మాతలు తమ సినిమాల విడుదల తేదీల్ని ఖరారు చేస్తున్నారు. దాంతో ఈ వేసవిలో వినోదాల జల్లు కురవడం ఖాయమని తేలిపోయింది. ఇక ఖరారైన ఆయా విడుదల తేదీలకు తగ్గట్టుగా సినిమాలు పూర్తి కావడమే మిగిలుంది.

ఈనాడు సినిమా

ఈ వేసవి... వినోదాలతో హోయి

● వరుస కట్టనున్న తారల చిత్రాలు

వేసవి వినోదాల్లో సినిమాదే అగ్రతాంబూలం. నెలలకొద్దీ సెలవులు... ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయటకెళితే వడగాలులు! ఇంకో వైపేమో ఆకర్షించే అభిమాన తార కొత్త సినిమా. థియేటర్‌లోకి దూరిపోవడానికి ఇంతకంటే కారణాలు ఇంకేం ఉంటాయి? అందుకే వేసవి వచ్చిందంటే బాక్సాఫీస్ హోరెత్తిపోతుంది. దాదాపు మూడు నెలలపాటు కొనసాగే వేసవి సీజన్‌ని దృష్టిలో పెట్టుకుని పదుల సంఖ్యలో సినిమాలు ముస్తాబవుతుంటాయి. మొదట్నుంచీ తెలుగు ప్రేక్షకులకు వేసవి అంటే సినిమా, సినిమా అంటే వేసవి. అలాంటిది కరోనా నుంచీ కీలకమైన వేసవి సీజన్ చాలావరకూ వృథా అవుతోంది. సరైన ప్రణాళిక లేక వస్తాయనుకున్న సినిమాలు వాయిదా పడిపోతున్నాయి. పెద్ద సినిమాలు వస్తాయని చిన్న చిత్రాలు వెనక్కి తగ్గుతుంటాయి. రెండేళ్లుగా బాక్సాఫీస్ ముందుకు అటు అగ్ర తారలూ రాక... ఇటు చిన్న చిత్రాలూ విడుదల కాక వేసవి చప్పగానే ముగిసిపోతోంది. ఈసారి కూడా మార్చిలోనే రావల్సిన 'పెద్ది', 'ది ప్యారడైజ్' సినిమాల విడుదల ప్రణాళికలు మారిపోవడంతో 2026 వేసవి సీజన్ కూడా వృథా అవుతుందా సందేహాలు వ్యక్తమయ్యాయి. వాటిని పటాపంచలు చేస్తూ పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ఆ వెంటనే 'పెద్ది' కొత్త తేదీ వచ్చేసింది. శర్వానంద్ 'బైకర్'తోపాటు చాలా సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి. దాంతో ఈసారి సంక్రాంతిలాగే వేసవిలో కూడా సినీ మారథాన్ కొనసాగే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఆరంభం... ఉస్తాద్‌తో!

మార్చి నుంచే వేసవి సినిమాల జోరు మొదలవుతుంది. అయితే అగ్ర తారల సినిమాలు విడుదలైతేనే బాక్సాఫీస్ దగ్గర అసలు సిసలు వేసవి హంగామా కనిపిస్తుంది. ఈసారి మార్చి 19న యశ్ కథానాయకుడిగా నటించిన 'టాక్సిక్' విడుదలవుతోంది. 'కె.జి.ఎఫ్' చిత్రాల తర్వాత ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు ఉన్నాయి. తెలుగులోనూ ఈ చిత్రం భారీ స్థాయిలో విడుదలవుతోంది. మార్చి 26న పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' రానుంది. విజయవంతమైన 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ - హరీశ్‌శంకర్ కలయికలో రూపొందిన చిత్రమిది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు షురూ అయ్యాయి. త్వరలోనే ఇందులోని మరో గీతాన్ని విడుదల చేయనున్నారు.


యశ్


అడివి శేష్


శర్వానంద్



ఏప్రిల్‌లో ఎన్నెన్నో

మార్చి 19నే రావాల్సిన 'పెద్ది'...నెలకుపైగా వాయిదా పడింది. ఏప్రిల్ 30న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టుగా చిత్రబృందం ప్రకటించింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. పాన్ ఇండియా స్థాయిలో ముస్తాబవుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. చికిరి చికిరి... పాటతో ఇప్పటికే దేశం మొత్తాన్నీ ఊపేసింది. త్వరలోనే ఇందులోని రెండో గీతం విడుదల కానుంది. అగ్ర కథానాయకుల చిత్రాల విడుదల ఎప్పుడనేది పక్కాగా తేలితే, అందుకు అనుగుణంగా మిగతా సినిమాలు విడుదల తేదీల్ని ఖరారు చేసుకుంటాయి. పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్ సినిమాలపై స్పష్టత రావడంతో, మిగిలిన సినిమాలూ విడుదల తేదీల్ని ఖరారు చేసుకొంటున్నాయి. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన 'బైకర్' ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఇందులో సీనియర్ హీరో రాజశేఖర్ ముఖ్యపాత్రని పోషించారు. అభిలాష్ కంకర దర్శకత్వం వహించారు. యు.వి.క్రియేషన్స్ నిర్మిస్తోంది. 'రాకాస' చిత్రం 3నే రానుంది. నిఖిల్ కథానాయకుడిగా నటించిన 'స్వయంభూ' ఏప్రిల్ 10వ తేదీన విడుదల కానుంది. ఈ నెల 11న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేయనున్నారు. అడివి శేష్ కథానాయకుడిగా నటించిన 'డెకాయిట్' కూడా విడుదలకు సిద్ధమైంది.


పవన్ కల్యాణ్

రామ్‌చరణ్

వాటిపై స్పష్టత రావాలి

టాలీవుడ్ వేసవి సీజన్ జులై వరకూ కొనసాగుతుంటుంది. ఏప్రిల్ నెలలో వచ్చే సినిమాలేవో ఖరారైనా, మే, జూన్‌లో సినిమాలపై త్వరలోనే స్పష్టత రానుంది. సూర్య - వెంకీ అట్లూరి చిత్రంతోపాటు, వరుణ్‌తేజ్ 'కొరియన్ కనకరాజు', అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటిస్తున్న 'లెనిన్', బెల్లంకొండ శ్రీనివాస్ 'టైసన్ నాయుడు', సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటిగట్టు' సహా చాలా సినిమాలపై స్పష్టత రావలి. మార్చిలోనే రావాలనుకున్న నాని 'ది ప్యారడైజ్' కొత్త విడుదల తేదీ ఎప్పుడనేది కూడా తేలాల్సి ఉంది. అగ్ర కథానాయకుడు చిరంజీవి నటించిన 'విశ్వంభర' జులై 10న వస్తుందని సమాచారం. ఆల్కహాల్, వీసా... ఇలా చాలా సినిమాలే ఈ వేసవిలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. త్వరలోనే ఆయా సినిమాల రాకపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

సంక్రాంతికి సోగ్గాళ్లు

ఈ ఏడాది సంక్రాంతికి ఐదు సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. బాక్సాఫీస్ దగ్గర వచ్చే ఏడాది కూడా అదే స్థాయిలో సందడి ఉండబోతోందా? అంటే - అంతకంటే ఎక్కువే అంటున్నాయి తెలుగు సినీ పరిశ్రమ వర్గాలు. తెలుగు చిత్రసీమకి నాలుగు మూలస్తంభాల్లాంటి కథానాయకులైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున సినిమాలు వచ్చే సంక్రాంతినే లక్ష్యంగా చేసుకుని పట్టాలెక్కుతున్నాయి. చిరంజీవి - బాబీ కొల్లి, బాలకృష్ణ - గోపీచంద్ మలినేని, వెంకటేశ్ - అనిల్ రావిపూడి సినిమాలు ఇప్పటికే ఖరారు కాగా, 'వాసివాడి తస్సాదియ్యా...' అంటూ నాగార్జున సినిమానీ ప్రకటించింది అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ. సోగ్గాళ్లు మళ్లీ వస్తున్నారని, పండగ ఇంకా కలర్‌ఫుల్‌గా మారుతుందని ఊరిస్తూ... ఆ చిత్రం 2027 జనవరి 15న ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించింది. 'సోగ్గాడే చిన్నినాయనా', 'బంగార్రాజు' చిత్రాల్ని తెరకెక్కించిన దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కురసాల కొంతకాలంగా నాగార్జున కోసం ఓ కథని సిద్ధం చేస్తున్నారు. అది 'సోగ్గాడే...'కి కొనసాగింపు అని సమాచారం. అందులో తండ్రీకొడుకులు కలిసి సందడి చేస్తారని తెలుస్తోంది. నాగార్జునతోపాటు నాగచైతన్య, అఖిల్ కూడా సినిమాలో కనిపిస్తారేమో చూడాలి.


నాగార్జున

స్వాతంత్ర్య దినోత్సవానికి బ్యాటిల్ ఆఫ్ గల్వాన్?

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. చిత్రాంగద సింగ్ కథానాయిక. ఈ సినిమాకి అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్, మాతృభూమి గీతానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాని చిత్రబృందం ఏప్రిల్‌లో అనుకున్న తేదీకి ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోతున్నట్లు తెలుస్తోంది. "బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రం వాయిదా పడింది. ఈ సినిమాని సల్మాన్, నిర్మాతలు కలిసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 14న విడుదల చేయాలనుకుంటున్నారు. దర్శకుడు అపూర్వ కొన్ని సన్నివేశాలను రీ షూట్ చేయాల్సి రావడం, కథలో మార్పులు చేయడం, అంతేకాదు నిబంధనల ప్రకారం ఈ చిత్రాన్ని రక్షణ మంత్రిత్వ శాఖకు చూపించాలి. ఈ ప్రక్రియకు కూడా కొంత సమయం పట్టేలా ఉంది. ఈ కారణాల వల్ల ఏప్రిల్‌లో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడనుంది" అని బాలీవుడ్ వర్గాలు చెప్పినట్టు సమాచారం.


సల్మాన్ ఖాన్

అతిరథికి ఆమే హార్ట్


రియా శిబు

'సర్వం మాయ' చిత్రంలో డెలులూ అనే దెయ్యం పాత్రలో కనిపించి కుర్రకారుని విశేషంగా ఆకట్టుకుంది నటి రియా శిబు. ఈ సినిమాలో మాయగా చేసిన అల్లరి.. థియేటర్లలో పంచిన నవ్వులతో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. తాజాగా ఆమె మరో మలయాళ చిత్రంలో సందడి చేసేందుకు సన్నద్ధమైంది. బసిల్ జోసెఫ్, టొవినో థామస్, వినీత్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'అతిరథి'. రియా శిబు ఈ సినిమాలో స్వాతి ఆర్.కృష్ణ అనే పాత్రలో నటిస్తుందని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. 'హార్ట్ ఆఫ్ అతిరథి' పేరుతో ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. అరుణ్ అనిరుధన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బసిల్, డి.ఆర్.అనంతు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 14న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది.



ప్రేమికుల రోజున... మనసంతా నువ్వే

పాతికేళ్ల కిందట ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని అందుకున్న ఓ మంచి ప్రేమకథా చిత్రం... 'మనసంతా నువ్వే'. ఉదయ్‌కిరణ్ కథానాయకుడిగా నటించారు. రీమాసేన్, తనూరాయ్ ప్రధాన పాత్రలు పోషించారు. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించారు. ఎమ్.ఎస్.రాజు నిర్మాత. ప్రేమికుల రోజుని పురస్కరించుకుని ఈ నెల 14న మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్యన రెడ్డి, రఘురామ్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి. "సున్నితమైన ప్రేమకథతో రూపొందిన ఈ చిత్రం 2001లో విడుదలై సంచలన విజయం సాధించింది. మ్యూజికల్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రాన్ని నేటి తరానికీ చేరువ చేయాలనే లక్ష్యంతోనే మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం" అన్నారు నిర్మాతలు.

మారాలంటున్న నరేశ్

లోకం తీరింతే... నువ్వే మారాలంతే... అంటున్నాడు నరేశ్ అనే ఓ కుర్రాడు. అతని ప్రేమప్రయాణంలోనూ, జీవితంలోనూ చోటు చేసుకున్న మలుపులు ఎలాంటివో తెలియాలంటే 'వాట్స్ అప్ నరేశ్' చూడాల్సిందే. అన్వేష్ మైఖేల్, కావ్య కల్యాణ్‌రామ్ జంటగా రూపొందుతున్న చిత్రమిది. సీవీ విశాల్ దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యలక్ష్మి చింత నిర్మాత. ఈ సినిమా ప్రచార చిత్రాన్ని ఆదివారం విడుదల చేశారు. సాఫ్ట్‌వేర్ జీవితాలు, ఆ రంగంలోని యువతరం ప్రేమలకు అద్దం పట్టే కథతో రూపొందించిన చిత్రమని తెలుస్తోంది. నరేశ్ పాత్రలో కనిపించే కథానాయకుడిని ప్రచార చిత్రంతో పరిచయం చేశారు. హాస్య ప్రధానంగా సాగే ప్రేమకథా చిత్రమిదని, కుటుంబ నేపథ్యం కూడా ఆకట్టుకుంటుందని సినీ వర్గాలు చెప్పాయి. కె.సాయిసంతోష్, ఉషశ్రీ మురళి, సంతోష్ నందివాడ, ప్రియాంక తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: వేదరామన్ శంకరన్, సంగీతం: స్మరణ్ సాయి, కూర్పు: విప్లవ్ నైషదం.


కావ్య, అన్వేష్


భావోద్వేగాల దీక్ష

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తథ్యమనే ఓ మంచి సందేశంతో రూపొందించిన చిత్రమే మా 'ఆర్‌కే దీక్ష' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్. ఆయన దర్శకత్వంలో... అక్సాఖాన్, అలేఖ్యరెడ్డి, కిరణ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. తులసి, అనూష కీర్తన, ప్రవల్లిక, రోహిత్‌శర్మ ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రం మార్చి రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుందని సినీ వర్గాలు తెలిపాయి. దర్శకనిర్మాత మాట్లాడుతూ "ప్రేమ, సందేశం, యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యమున్న కథ ఇది. కథనం కొత్తగా ఉంటుంది. మధుప్రియ ఆలపించిన మూడు పాటలు, వాటిని చిత్రీకరించిన విధానం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయ"న్నారు.


అక్సాఖాన్, రామకృష్ణగౌడ్

టామ్ అండ్ జెర్రీలా గోల్‌మాల్ 5?

హిందీ చిత్ర దర్శకుడు రోహిత్ శెట్టి తెరకెక్కించిన 'గోల్‌మాల్' ఫ్రాంఛైజీలో వచ్చిన నాలుగు చిత్రాలకు ప్రేక్షకుల్లో విశేష ఆదరణ దక్కింది. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో అయిదవ చిత్రానికిగానూ దర్శకుడు రోహిత్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "రోహిత్ శెట్టి పాత కాలపు కామెడీ చిత్రాలకు అభిమాని. ఆయన తెరకెక్కించిన 'గోల్‌మాల్ రిటర్న్స్' సినిమా 'ఆజ్ కీ తాజా ఖబర్' నుంచి, అలానే 'బోల్ బచ్చన్', 'ఖట్టా మీఠా' చిత్రాల ఆధారంగా తదుపరి గోల్‌మాల్ సినిమాలను రూపొందించారు. ఇప్పుడీ ఫ్రాంఛైజీని ముందుకు తీసుకెళ్లేందుకు రోహిత్ అమితాబ్ బచ్చన్, శశి కపూర్ కలిసి నటించిన 'దో ఔర్ దో పాంచ్' సినిమా ఆధారంగా 'గోల్‌మాల్ 5'ని రూపొందించనున్నారు. ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్ ఇద్దరు కీలకపాత్రలు పోషించనున్నారు. దర్శకుడు తన కల్ట్ కామెడీ నేపథ్యంతోనే నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా ఈ సినిమాని తీర్చిదిద్దనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా స్క్రీన్‌ప్లే రాశారు. టామ్ అండ్ జెర్రీల మధ్య పోరాటంలానే ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తేలా ఇది తెరకెక్కనుంది. మార్చిలో చిత్రీకరణ ప్రారంభించి.. వచ్చే ఏడాది ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకుంటున్నారు"అని బాలీవుడ్ చిత్ర వర్గాల సమాచారం.


అజయ్ దేవగణ్

చిన్న చిత్రాలు పరిశ్రమకు ఎంతో అవసరం

"తెలుగు సినిమా ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. మనం ఆస్కార్ స్థాయి సినిమాలు చేస్తున్నాం. అయితే భారీ స్థాయిలో రూపొందేవే కాకుండా, చిన్న సినిమాలు కూడా చిత్ర పరిశ్రమకు ఎంతో అవసరం" అన్నారు ప్రముఖ నటుడు, నిర్మాత మురళీమోహన్. ఆయన ముఖ్య అతిథిగా ఇటీవల హైదరాబాద్‌లో 'అమరావతికి ఆహ్వానం' సినిమా విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. జీవీకే దర్శకుడు. కేఎస్ శంకర్‌రావు, ఆర్.వెంకటేశ్వరరావు నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగానే నిర్వహించిన వేడుకలో మురళీమోహన్ మాట్లాడుతూ "చిన్న సినిమాల్ని నిర్మిస్తూ పరిశ్రమలో అందరికీ ఉపాధిని కల్పిస్తున్నారు శివ కంఠంనేని, వెంకటేశ్వరరావు. వాళ్లు కలిసి చేసిన ఈ చిత్రం విజయవంతం కావాలని ఆశిస్తున్నా" అన్నారు. శివ కంఠంనేని మాట్లాడుతూ "చిన్న చిత్రాలకి ప్రేక్షకులు రావాలి, అప్పుడే మరిన్ని చేయగలుగుతాం. ఏడాదికి దాదాపు 300 చిన్న చిత్రాలు తెరకెక్కుతాయి. వాటితోనే పరిశ్రమ మనుగడ సాధిస్తుంటుంది. వినోదానికి పూర్తి హామీనిచ్చే చిత్రమిది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "పేరు చూసి రాజకీయ నేపథ్యమున్న సినిమా అనుకోవద్దు. రెండున్నర గంటలపాటు వినోదం పంచే హారర్ థ్రిల్లర్ చిత్రమిది" అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు అశ్విన్‌బాబు, రఘుబాబుతోపాటు చిత్రబృందం పాల్గొంది.


ఎస్తేర్, అశ్విన్‌బాబు, శివ, ధన్య బాలకృష్ణ

ఆయుష్మాన్ చిత్రం వాయిదా!


ఆయుష్మాన్ ఖురానా

గతేడాది 'థామా' చిత్రంలో జర్నలిస్ట్ పాత్రలో కనిపించి అలరించాడు హిందీ చిత్ర నటుడు ఆయుష్మాన్ ఖురానా. ఆయన కథానాయకుడిగా రూపొందుతున్న తదుపరి చిత్రం 'పతి పత్నీ ఔర్ వో దో'. ఈ సినిమాలో ఆయనతో పాటు సారా అలీఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి నటిస్తున్న సంగతి తెలిసిందే. కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్నారు. భూషణ్ కుమార్, రేణు రవి చోప్రా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మార్చి నెలలో విడుదల కానుందని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్చిలో కాదు మేలో అంటూ చిత్రబృందం ఈ సినిమా కొత్త విడుదల తేదీని ఖరారు చేసినట్లు సమాచారం. "పతి పత్నీ ఔర్ వో దో' మే 15న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకురానుంద"ని బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.


సారా అలీఖాన్

కొత్త లేబర్ కోడ్.. కొంగొత్త అవకాశాలు

● ఉద్యోగ ప్రకటనల్లో 56% వరకు వృద్ధి
● చిన్న నగరాలపై వర్క్ఇండియా నివేదిక



వ్యాపార సంస్థలు మెట్రో నగరాల వెలుపలకు విస్తరిస్తుండటం, కొత్త కార్మికచట్టం వంటివి చిన్న నగరాల్లో నియామకాలు పెరిగేందుకు కారణమవుతున్నాయని బ్లూ, గ్రే-కాలర్ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వర్క్ఇండియా నివేదిక తెలిపింది. మూడు-నాలుగో అంచె నగరాల్లో ఇలాంటి ఉద్యోగ నియామకాలు గరిష్ఠంగా 56% వరకు పెరిగాయని పేర్కొంది. కొత్త చట్టం వల్ల నియామకాలు ఆగిపోతాయన్న భయాలు వ్యాపించినా.. నిబంధనలు అమల్లోకి వచ్చాక మొత్తం ఉద్యోగ నియామకాలు 8.4% పెరిగాయని తెలిపింది. నివేదిక ప్రకారం..

✦ ఉద్యోగ నియామకాలు కొల్హాపుర్‌లో 56.3%, ఉదయపుర్‌లో 55.3%, గోవాలో 23.6%, విజయవాడలో 20.2%, కోచిలో 17.7%, కోయంబత్తూరులో 14.1%, రాయ్‌పుర్‌లో 13.9% వృద్ధి చెందాయని నివేదిక తెలిపింది.

✦ సమష్టిగా ఈ నగరాల్లో ఉద్యోగావకాశాలు 12-15 శాతం లేదా అంతకంటే ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి.

✦ కొత్త కార్మిక చట్టానికి ముందు 2025 అక్టోబరు 1 నుంచి నవంబరు 20 వరకు; చట్టం అమల్లోకి వచ్చిన 2025 నవంబరు 21 నుంచి 2026 జనవరి 31 వరకు ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ఉద్యోగ నియామక ప్రకటనలను విశ్లేషించి, వర్క్ఇండియా ఈ నివేదిక రూపొందించింది.

✦ ప్రథమ శ్రేణి నగరాల్లో 6.6% స్థిర వృద్ధి నమోదైంది. అహ్మదాబాద్‌లో 19.2%, పుణెలో 13.2%, ముంబయిలో 8.8%, కోల్‌కతాలో 8.9% వృద్ధి కనిపించింది. చిన్న నగరాల్లో నియామకాలు వేగంగా పెరుగుతున్నా, ప్రధాన నగరాల్లోనూ గిరాకీ బలంగానే ఉంది.

✦ కార్యాలయాల నుంచి పని చేస్తున్న ఉద్యోగాలు 8.7% పెరిగాయి. ఇంటి నుంచి పని చేసే నియామకాలు 10.4% తగ్గాయి. పురుషుల ఉద్యోగ నియామకాలు 6.3%, మహిళలకు 10% పెరిగాయి.



మార్చి కల్లా 32 మెగావాట్లకు డేటాసెంటర్ల సామర్థ్యం: ఎల్ అండ్ టీ

డేటా సెంటర్లపై మొత్తం రూ.1,000 కోట్ల వరకు లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) పెట్టుబడులు పెడుతోంది. ప్రస్తుతం సంస్థ ఆధ్వర్యంలో 14 మెగావాట్ల డేటా సెంటర్లుండగా, మార్చి చివరి కల్లా మరో 18 మెగావాట్ల సామర్థ్యాన్ని జతచేసుకోనుంది. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మొత్తం 32 మెగావాట్ల డేటా సెంటర్లు సంస్థ ఆధీనంలో ఉంటాయి. సెమీ కండక్టర్ వ్యాపారంలోనూ సంస్థ విస్తరిస్తోంది. ప్రధానంగా చిప్ డిజైనింగ్‌పై దృష్టి సారించింది. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 4 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యాన్ని 8-10 మెగావాట్లకు మెరుగు పరుస్తోంది.

ఎయిర్ ట్యాక్సీల టేకాఫ్-ల్యాండింగ్‌కు రూఫ్‌టాప్

● పట్టణ రద్దీ తగ్గించేందుకు అవకాశం
● భారత పరిశ్రమల సమాఖ్య నివేదిక



ఎయిర్ ట్యాక్సీల టేకాఫ్-ల్యాండింగ్ కోసం భవనాల పైకప్పులను (రూఫ్‌టాప్స్) ఉపయోగించడం ద్వారా, పెద్ద నగరాల్లో రద్దీని నియంత్రించి, రవాణా సమయాన్ని తగ్గించొచ్చని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది. ఈ సంస్థ రూపొందించిన 'నావిగేటింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ ఇన్ ఇండియా' నివేదిక ప్రకారం.. అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ (ఏఏఎం) వ్యవస్థలో ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ (ఇవీటీఓఎల్) ఎయిర్‌క్రాఫ్ట్‌లు/ఎయిర్ ట్యాక్సీలు అభివృద్ధి చెందుతున్నాయి. వాటి టేకాఫ్-ల్యాండింగ్‌లకు భవనాల పైకప్పులను వాడుకుంటే, మౌలిక సదుపాయాల కొరతను నివారించొచ్చు.

✦ ఏఏఎం కోసం వెంచర్ లీజింగ్, రంగం వారీగా మౌలిక సదుపాయాల నిధుల వంటి ప్రత్యేక ఫైనాన్సింగ్ సదుపాయాలను ఆర్థిక సంస్థలు పరిశీలించొచ్చు. దిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి నగరాల్లో ఎయిర్‌ట్యాక్సీల రాకపోకలకు భవనాల పైకప్పులను వినియోగించడం, సమర్థ పరిష్కారాన్ని చూపుతుంది. ఇందుకోసం వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, టెక్ పార్కులు, నివాస టవర్లను ఎంచుకోవచ్చు.

నిబంధనలు సవరించాలి: ప్రస్తుత నిబంధనలు పైకప్పుల నుంచి సాధారణ వాణిజ్య వర్టికల్ టేకాఫ్-ల్యాండింగ్‌లను అనుమతించవు. ఏఏఎం కోసం వీటిని సవరించాలి. డ్రోన్లు, మందుల సరఫరా-అవయవాల అత్యవసర రవాణా, ఎయిర్ అంబులెన్స్ వంటి సేవలకూ ఇవి ఉపయోగపడతాయి.

✦ దిల్లీ సమీపంలోని గురుగ్రామ్, కొత్తగా రాబోతున్న జెవార్ గేట్‌వేను కలిపే 65-75 కిలోమీటర్ల కారిడార్‌ను నమూనాగా తీసుకుని మన దేశంలో ఏఏఎం సాధ్యాసాధ్యాలను ఈ నివేదిక అంచనా వేసింది. ఈ ప్రాంతాలన్నీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ జెవార్‌లోని నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానుంది.

ఏఐలో మనకు చిన్న మోడళ్లే మేలు

● ఖరీదైన పెద్ద ఎల్ఎల్ఎంలు వద్దు
● జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతలో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. కానీ మన దేశం ఈ మోడళ్లను అనుసరించడం లేదా ఇలాంటివి ఆవిష్కరించేందుకు పోటీపడటం చేయకూడదని జోహో వ్యవస్థాపకుడు, శాస్త్రవేత్త శ్రీధర్ వెంబు అభిప్రాయపడ్డారు. ఇందుకు బదులుగా తక్కువ శక్తి - మూలధనంతో అభివృద్ధి చేయగలిగే చిన్న మోడళ్లపై భారత్ దృష్టి పెట్టాలని సూచించారు. ఈనెల 16-20 తేదీల్లో దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ జరగనున్న నేపథ్యంలో, శ్రీధర్ ఇలా వ్యాఖ్యానించారు. అత్యంత అధునాతన కంప్యూట్ మౌలిక సదుపాయాలు, మూలధనానికి పరిమిత సౌలభ్యం ఉండటంతో ఏఐ మోడళ్ల అభివృద్ధి సవాలుగా మారిందని ఇటీవలి ఆర్థిక సర్వే పేర్కొంది. మన పరిస్థితులకు అనుగుణమైన ప్రాజెక్టులు చేపట్టాలనే దిశగానే వెంబు వ్యాఖ్యానించారు.

వీటికి దూరంగా ఉండాలి: ప్రపంచంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, డేటా, ఆవిష్కరణల్లో దూసుకెళ్తున్న అతిపెద్ద, కీలక కంపెనీలను 'బిగ్ టెక్'గా పిలుస్తున్నారు. ఇలాంటి సంస్థలు నిర్మించిన భారీ ఏఐ మోడళ్లకు 50-100 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.4.5-9 లక్షల కోట్ల) ఖర్చయింది. వీటిని నిర్వహించడానికి అధిక ఇంధన శక్తీ అవసరం. ఇటువంటి పరిస్థితుల్లో వీటికి దూరంగా ఉండటమే మంచి ఆలోచన అవుతుంది. ఇంధనం అవసరం ఎక్కువ ఉండే మోడళ్లను అనుసరించే బదులు, మన మేధస్సును ఉపయోగించుకుని చిన్న, సమర్థవంత ఏఐ నమూనాల పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులు పెట్టాలి. భారీ ఎల్ఎల్ఎంలకు అధిక మూలధనం అవసరం. అంత పెట్టలేం కనుక, ఈ పోటీకి మనం దూరంగా ఉండటం మంచిది. దీని బదులుగా చిన్న, విభిన్న విధానాలను పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఏఐ పరిశోధన, అభివృద్ధికి గణనీయ అవకాశాలు ఉన్నాయి. చిన్న మోడళ్లు, ఇతర విధానాలు సహా సమర్థ ఇంధన శక్తి పద్ధతులను జోహో అనుసరిస్తోంది. ఏఐలో భారీ ఎల్ఎల్ఎంలు కాకుండా ఇతర విధానాలూ ఉన్నాయి. వాటిలో పెట్టుబడుల ద్వారా మంచి ఫలితాలు సాధించొచ్చు' అని వెంబు వెల్లడించారు.

రూ.2 లక్షల కోట్లకు
ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభం
ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) మొత్తం లాభం రూ.2 లక్షల కోట్ల మైలురాయిని అధిగమిస్తుందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాది పీఎస్‌బీల రుణాల్లో వృద్ధి 12 శాతంగా నమోదైనట్లు, డిపాజిట్లు కూడా 10% వృద్ధి చెందుతున్నట్లు వివరించారు.

'మన ఆర్థిక వ్యవస్థ బలానికి బ్యాంకులు కీలకం. ఆర్‌బీఐ నియంత్రణలో ఇవి పటిష్ఠంగా పని చేస్తున్నాయి. కాబట్టి బ్యాంకింగ్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపే అంతర్జాతీయ పరిణామాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని నాగరాజు పేర్కొన్నారు. 2025-26 ప్రథమార్ధంలో పీఎస్‌బీల లాభం రూ.1 లక్ష కోట్లకు చేరుకుందని, పూర్తి ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్లను అధిగమిస్తుందని స్పష్టం చేశారు. పీఎస్‌బీల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) పరిమితిని 20% నుంచి 49 శాతానికి పెంచే ప్రతిపాదన అంతర్-మంత్రిత్వ శాఖల పరిశీలనలో ఉందన్నారు.

✦ 2025 సెప్టెంబరుకు రికార్డు స్థాయిలో స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2.30 శాతానికి, నికర ఎన్‌పీఏలు 3 శాతానికి పరిమితమయ్యాయి. కేటాయింపుల కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) 94.63 శాతానికి మెరుగుపడింది. మూలధన లభ్యత నిష్పత్తి 15.96 శాతంగా నమోదైంది.

✦ 2024-25లో రూ.34,990 కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వ బ్యాంకులు ప్రకటించాయి. ఇందులో ప్రభుత్వ వాటా రూ.22,699 కోట్లు. 2023-24లో రూ.27,830 కోట్లు (ప్రభుత్వ వాటా రూ.22,699 కోట్లు)గా ఉంది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా వరుసగా రూ.2,627.52 కోట్లు, రూ.1,419.36 కోట్లు చొప్పున ప్రభుత్వం సమీకరించింది.

మూడేళ్లలో రెట్టింపు

పీఎస్‌బీల మొత్తం లాభం గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రెట్టింపైంది.

సంవత్సరం	లాభం (రూ.లక్షల కోట్లు)
2022–23	1.05
2023–24	1.41
2024–25	1.78
2025–26	2.0కు మించి (అంచనా)

ఆస్తుల నాణ్యత మెరుగుపడటం, రుణాల వృద్ధి, మూలధన లభ్యత నిష్పత్తి, ఆస్తులపై ప్రతిఫలాలు పెరగడం ఇందుకు దోహదపడ్డాయి.

5 లక్షల టన్నుల డీడీజీఎస్‌లకే అనుమతి



దిల్లీ: భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా 5 లక్షల టన్నుల డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్ (డీడీజీఎస్) దిగుమతులకు సుంకాల మినహాయింపు ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆక్వా, పౌల్ట్రీ, పశుదాణాకు ఉపయోగపడే అధిక ప్రోటీన్ కలిగినవే డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్ (డీడీజీఎస్). దేశీయంగా డీడీజీఎస్‌ల వినియోగం 500 లక్షల టన్నులుగా ఉండగా, అమెరికా దిగుమతుల వాటా 1 శాతమే అవుతుంది. దేశీయంగా నాణ్యమైన దాణా లభ్యతకు ఇవి ఉపయోగపడతాయని, పెరుగుతున్న గిరాకీని తీర్చడంలో దోహదపడతాయని ఒక అధికారి వెల్లడించారు. పశువుల ఆహారం కోసం ప్రత్యేకంగా జొన్న, సోయాబీన్ దిగుమతులు తగ్గుతాయని అంటున్నారు.

సోయాబీన్ నూనె, పశుదాణా సుంకాలపై స్పష్టత కావాలి: భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని వంటనూనెలు, సోయాబీన్ ప్రాసెసింగ్ పరిశ్రమ స్వాగతించింది. అయితే టారిఫ్ కోతలు, కోటా విధానాలు, నాణ్యతా మార్గదర్శకాల వివరాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం.. తమ దేశంలోకి దిగుమతి అయ్యే భారత వస్తువులపై సుంకాలను 50% నుంచి 18 శాతానికి అమెరికా తగ్గించింది. ఇదే క్రమంలో అమెరికా ఉత్పత్తులపై మనదేశం 0% సుంకాలు అమలు చేయనుంది. ఇందులో సోయాబీన్ నూనె కూడా ఉంది. సోయాబీన్ నూనె కోసం దిగుమతులపై మన దేశం అధికంగా ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో వాణిజ్య ఒప్పందాన్ని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) స్వాగతించింది. ప్రస్తుతం అమెరికా నుంచి 1.5-2 లక్షల టన్నుల సోయాబీన్ నూనెను మన దేశం దిగుమతి చేసుకుంటోంది. వీటిపై 10% బేసిక్ కస్టమ్స్ సుంకం, 5% వ్యవసాయ సెస్, 1.6% విద్యా సెస్ కలిపి మొత్తం 16.5% పన్ను పడుతోంది. అమెరికా సోయాబీన్ నూనెపై రవాణా వ్యయాల కారణంగా, టన్నుకు 30-40 డాలర్ల భారం పడుతోందని, అందువల్ల సుంకాల తగ్గింపు ప్రభావం తక్కువేనని ఎస్ఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ మెహతా తెలిపారు. అమెరికా సోయాబీన్ నూనె దిగుమతులను సున్నా కస్టమ్స్ సుంకంతో కోటా ప్రాతిపదికన అనుమతిస్తారా లేదా 6.5% వ్యవసాయ, విద్యా సెస్ కూడా మినహాయిస్తారా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

✦ పశు దాణా దిగుమతులపై సుంకాలు ఎత్తివేయడం ద్వారా మన దేశంలోని పశు, పౌల్ట్రీ రంగాలకు అదనపు సరఫరా పెరుగుతుందని మెహతా వెల్లడించారు. ప్రస్తుతం 7.5-8 మిలియన్ టన్నుల డీడీజీఎస్‌ను మనదేశం దిగుమతి చేసుకుంటోంది. దేశీయ ఉత్పత్తి, ధరలపై అమెరికా ఉత్పత్తుల ప్రభావం పడుతుందని, దేశీయ ప్రాసెసింగ్ సంస్థలను దెబ్బతీయొచ్చని హెచ్చరించారు.

✦ జీఎం-డీడీజీఎస్‌ను మనదేశం అనుమతించలేదని సోయాబీన్ ప్రాసెసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎన్ పాఠక్ తెలిపారు.

కోడి గుడ్లు — 9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495	తూ/ప గోదావరి	485
వరంగల్	497	విశాఖపట్నం	490
విజయవాడ	515	చిత్తూరు	563

టాటా కార్ల ధరలూ పెరుగుతాయ్

దిల్లీ: ప్రయాణికుల వాహనాల (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) తయారీకి వినియోగించే ముడిపదార్థాల ధరలు పెరుగుతున్నందున, రాబోయే వారాల్లో వాహన ధరలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడుతోందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు. ఇప్పటికే పలు సంస్థలు కార్ల ధరలను పెంచినట్లు గుర్తు చేశారు. సుమారు ఏడాది కాలంగా రాగి వంటి లోహ వ్యయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని.. అందువల్ల రాబోయే వారాల్లో వాహనాల ధరలను పెంచుతామని వివరించారు. పెరిగిన ఉత్పత్తి వ్యయాల వల్ల, తమ సంస్థ ఆదాయంపై 2% కంటే ఎక్కువ ప్రభావం పడుతోందని వెల్లడించారు. అయితే కార్ల ధరలను ఎంత మేర పెంచుతారో తెలుపలేదు.

✦ ఇప్పటికే హ్యుందాయ్ కొన్ని మోడళ్ల ధరలు పెంచగా, మారుతీ సుజుకీ ఇండియా కూడా ధరల పెంపునకు సన్నాహాలు చేస్తోంది.

చమురులో అమ్మకాలు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం రూ.1,40,840 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, లాంగ్ పొజిషన్లు అట్టే పెట్టుకోవడం మంచిదే. అయితే రూ.1,62,909 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,70,367; రూ.1,84,978 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.1,40,840 కంటే కిందకు దిగితే, రూ.1,26,229 వరకు పడిపోవచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.2,79,677 కంటే ఎగువన కదలాడకుంటే, లాభాల స్వీకరణ కొనసాగే అవకాశం ఉంది. రూ.2,33,656 కంటే కిందకు దిగితే రూ.2,19,739 వద్ద మద్దతు పొందొచ్చు. ఇంకా దిగితే, రూ.1,89,979, రూ.1,54,154 స్థాయిలో మద్దతు లభించొచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు స్వల్పకాలానికి బలహీనంగానే కనిపిస్తున్నా, షార్ట్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.1,180- 1,205 దరిదాపుల్లో లాభాలు స్వీకరించడం మంచి వ్యూహం అవుతుంది.

● సీసం ఫిబ్రవరి కాంట్రాక్టుకు రూ.189.15 లక్ష్యంతో, రూ.193.15 సమీపంలో షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ రూ.194.45 కంటే పైన కదలాడితే రూ.199.05-202.85 వరకు పెరగొచ్చు.

● జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.314 కంటే ఎగువన చలిస్తే, మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల రూ.313.85 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మేలే.

● అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.301.85 కంటే దిగువన ట్రేడయితే రూ.291.45-282.95 వరకు దిద్దుబాటు కావచ్చు.

ఇంధన రంగం



● ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.5,961 కంటే ఎగువన చలించకుంటే, మరింత కిందకు రావచ్చు. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, షార్ట్ సెల్ పొజిషన్లను కొనసాగించడం మంచిదే.

● సహజవాయువు ఫిబ్రవరి కాంట్రాక్టు కిందకు వస్తే రూ.272.90 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.228.60-170.70 వరకు దిద్దుబాటు కావచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.16,324 కంటే ఎగువన నిలదొక్కుకోకుంటే మరింత దిద్దుబాటు కావచ్చు. అయితే రూ.15,588 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ.15,112; రూ.14,376కు దిగిరావచ్చు.

● జీలకర్ర మార్చి కాంట్రాక్టు రూ.23,449 కంటే దిగువన ట్రేడయితే రూ.23,048 వరకు చేరొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/క్షీణత (శాతంలో)
పసిడి (ఏప్రిల్)	1,40,000	1,55,451	11.37
వెండి (మార్చి)	2,67,501	2,49,499	-6.73
రాగి (ఫిబ్రవరి)	1,225.05	1,242	1.38
సీసం (ఫిబ్రవరి)	190.30	189.85	-0.24
జింక్ (ఫిబ్రవరి)	318.40	325.65	2.28
అల్యూమినియం (ఫిబ్రవరి)	307.90	312.20	1.40
ముడి చమురు (ఫిబ్రవరి)	5,961	5,819	-2.38
సహజ వాయువు (ఫిబ్రవరి)	388.70	317.20	-18.39
పసుపు (ఏప్రిల్)	16,226	16,064	-1.86
జీలకర్ర (మార్చి)	23,500	23,760	1.11

వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు

స్టాక్ మార్కెట్ ఈ వారం

● భారత్-అమెరికా సంయుక్త ప్రకటన నేపథ్యం ● వాహన, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు రాణించొచ్చు
● ఐటీ స్క్రిప్‌లలో నష్టాలు కొనసాగొచ్చు ● విశ్లేషకుల అంచనాలు



మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ వంటివి ఆర్థిక బిడ్‌లు సమర్పించనున్న నేపథ్యంలో, ఈ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. టాటా స్టీల్ మెరుగైన ఫలితాల నేపథ్యంలో ఆ సంస్థ షేర్లు వెలుగులోకి రావొచ్చు. విదేశీ మదుపర్ల ధోరణి కీలకం కానుంది. వరుసగా 3 నెలల పాటు భారీగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు, ఈ నెల తొలివారంలో రూ.8,129 కోట్ల నికర కొనుగోళ్లు జరపడం గమనార్హం. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **టెలికాం** షేర్లు స్వల్పకాలంలో రాణించొచ్చు. భారతీ ఎయిర్‌టెల్ ఫలితాల ప్రభావం ఉంటుంది. జియో ప్లాట్‌ఫాం లిస్టింగ్ వరకు టెల్కోలు టారిఫ్ పెంపులు చేయకపోవచ్చు. వొడాఫోన్ ఐడియాపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు.

● **ఎఫ్ఎమ్‌సీజీ** కంపెనీ షేర్లు లాభాలను కొనసాగించొచ్చు. వినియోగదారు గిరాకీని పెంచేలా ప్రభుత్వ చర్యలుండడం కలిసొచ్చే అంశం. జీఎస్‌టీ కోతలు ప్రస్తుత త్రైమాసికంలో ప్రభావాన్ని చూపడం మొదలు పెట్టనున్నాయి.

● ప్రాథమిక **లోహ** ధరల్లో కదలికలను ప్రతిబింబిస్తూ, లోహ కంపెనీల స్క్రిప్‌లు స్వల్పకాలంలో ఊగిసలాటకు గురికావొచ్చు. గత వారం 15.5% తగ్గిన హిందుస్థాన్ కాపర్‌పై దృష్టి పడొచ్చు.

● **వాహన** షేర్లు సానుకూలతలను కొనసాగించొచ్చు. పండగల సీజను తర్వాతా గిరాకీ రాణించినందున, తయారీ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలంగా నమోదవ్వొచ్చన్న అంచనాలున్నాయి. ఐషర్ మోటార్స్, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్, అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, భారత్ ఫోర్జ్ ఫలితాలు ఈ వారం ఉన్నాయి.

● **ఔషధ** సూచీ ఒక శ్రేణిలో కదలాడొచ్చు. జనరిక్ ఔషధాలకు అమెరికా టారిఫ్ నుంచి మినహాయింపునిచ్చిన నేపథ్యంలో ఆ ప్రభావం పడొచ్చు. సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, సిప్లా ఫలితాలు నిరుత్సాహకరంగా నమోదవడంతో.. ఇతర కంపెనీల ఫలితాల కోసం మదుపర్లు ఎదురుచూస్తున్నారు.

● బడ్జెట్‌కు ముందు పలు **యంత్ర పరికరాల** షేర్లు రాణించిన నేపథ్యంలో, ఈ వారం ఒక శ్రేణిలోనే ట్రేడవవచ్చు. మూలధన వ్యయాలకు సంబంధించి సానుకూల ప్రకటనలున్నందున, అధిక విలువల్లో ఉన్న షేర్లలో పరిమిత లాభాలైనా ఉండొచ్చు.

● ఏఐ కొత్త టూల్స్ పరిణామాల నేపథ్యంలో **ఐటీ** షేర్లు కొంత నష్టపోవచ్చని భావిస్తున్నారు. నిఫ్టీ ఐటీ సూచీ ఈ వారం 35,200 స్థాయికి చేరొచ్చని అంచనా. దీర్ఘకాలానికి ఈ రంగంపై విశ్లేషకులు బులిష్‌గానే ఉన్నారు.

● బలమైన గిరాకీ మద్దతుగా **సిమెంటు** షేర్లు పుంజుకోవచ్చు. దిగుమతి అయ్యే పెట్ కోక్ ధరలు పెరుగుతుండటం ఈ రంగానికి సవాలుగా నిలవొచ్చు. రోడ్లు, రైల్వేలు, మెట్రోలు, పట్టణ మౌలిక వసతుల వల్ల, నిర్మాణ కార్యకలాపాలు కొనసాగొచ్చన్న అంచనాలున్నాయి.

● ఎస్‌బీఐ ఫలితాలు, అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పంద పరిణామాల నుంచి **బ్యాంకింగ్** షేర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. ప్రస్తుతం బ్యాంక్ నిఫ్టీ తన స్వల్పకాల 20 రోజుల చలన సగటుపైనే కొనసాగొచ్చు.

● నిఫ్టీ **చమురు**-గ్యాస్ సూచీలోని కంపెనీలు బులిష్ ధోరణితో ముందుకు సాగొచ్చు. 20 రోజుల, 50 రోజుల చలన సగటు కంటే ఈ సూచీ పైన చలిస్తుండడం ఇందుకు దోహదం చేయొచ్చు.

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,038.40	2086.70	1964.30
ఎమ్‌టీఎన్ఎల్	31.18	32.50	30.10
టాటా కమ్యూనికేషన్స్	1552.70	1576.60	1520.00
వొడాఫోన్ ఐడియా	11.12	11.50	10.70

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5911.00	5989.70	5765.70
కోల్గేట్ పామోలివ్	2133.20	2172.40	2068.40
డాబర్ ఇండియా	508.30	515.70	494.80
ఇమామీ	504.35	513.10	495.30
హిందుస్థాన్ యునిలీవర్	2424.20	2488.40	2305.40
ఐటీసీ	325.80	340.00	301.20
మారికో	752.75	761.70	736.20

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	942.55	958.20	914.20
హిందుస్థాన్ కాపర్	579.85	611.00	560.20
ఎన్ఎమ్‌డీసీ	84.08	86.40	82.00
సెయిల్	160.52	164.20	154.60
టాటా స్టీల్	197.06	199.60	193.10
వేదాంతా	671.05	694.70	628.50

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	201.84	205.10	197.60
బజాజ్ ఆటో	9518.50	9749.20	9356.20
ఐషర్ మోటార్స్	7177.50	7264.80	7066.80
హీరో మోటోకార్ప్	5753.50	5895.50	5644.50
ఎం అండ్ ఎం	3578.00	3625.60	3506.80
మారుతీ	14997.00	15242.30	14748.30
టాటా మోటార్స్	458.25	469.60	441.90
టీవీఎస్ మోటార్	3758.50	3838.80	3627.00

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1191.00	1214.20	1154.40
బయోకాన్	365.40	371.50	358.00
సిప్లా	1330.00	1346.60	1308.20
డాక్టర్ రెడ్డీస్	1241.20	1262.30	1214.50
గ్లెన్‌మార్క్ ఫార్మా	1934.80	1996.70	1880.10
నాట్కో ఫార్మా	823.55	836.90	805.60

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	266.60	272.30	260.20
సీజీ పవర్	674.85	684.10	658.70
ఎల్ అండ్ టీ	4,068.10	4,098.50	4,027.10
సీమెన్స్	3,176.20	3,403.30	3,018.50
థెర్మాక్స్	2,872.60	2,946.20	2,810.20

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1593.70	1631.20	1555.40
ఇన్ఫోసిస్	1507.10	1549.00	1459.00
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5852.00	6070.70	5631.70
టీసీఎస్	2941.60	3016.50	2878.50
టెక్ మహీంద్రా	1619.90	1667.80	1576.00
విప్రో	230.72	235.10	226.40

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	941.10	952.80	931.80
ఐసీఐసీఐ బ్యాంక్	1406.10	1419.60	1388.00
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	85.11	86.70	83.40
ఇండస్ఇండ్ బ్యాంక్	903.60	927.30	883.20
కోటక్‌మహీంద్రా బ్యాంక్	422.35	433.50	404.80
పీఎన్‌బీ	122.85	126.00	119.70
ఎస్‌బీఐ	1066.40	1086.30	1041.10

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1450.80	1465.00	1426.40
బీపీసీఎల్	386.35	390.40	379.30
హెచ్‌పీసీఎల్	463.15	471.80	455.30
ఐఓసీఎల్	175.20	184.10	168.80
ఓఎన్‌జీసీ	268.95	273.10	262.60
ఆయిల్ ఇండియా	497.25	510.00	484.70

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1667.40	1706.90	1632.70
అంబుజా సిమెంట్స్	529.45	535.90	520.80
ఇండియా సిమెంట్స్	452.65	464.30	435.70
శ్రీ సిమెంట్	27330.00	27656.70	26876.70
అల్ట్రాటెక్ సిమెంట్	12722.00	12859.30	12553.30

పీజీ డిప్లొమా-2026

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్) సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ ద్వారా 2026 విద్యా సంవత్సరానికి వివిధ పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ కోర్సులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.300 **కోర్సు వ్యవధి:** ఏడాది **అర్హత:** డిగ్రీ **కోర్సులు:** టెక్నాలజీ అండ్ లా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (AI & ML), సైబర్ లాస్, ఫోరెన్సిక్ సైన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, లైబ్రరీ ఆటోమేషన్ నెట్‌వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, కమ్యూనిటీ ఐ హెల్త్.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత, ఫీజు రసీదుతో పాటు దరఖాస్తు కాపీని పోస్టు ద్వారా పంపాలి. **చిరునామా:** సెక్షన్ ఆఫీసర్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ (సీడీవీఎల్), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, గోల్డెన్ థ్రెషోల్డ్ బిల్డింగ్, అబిడ్స్, నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్- 500001.

దరఖాస్తుకు చివరి తేదీ: 28.02.2026.

వెబ్‌సైట్: https://uohyd.ac.in/

టీచింగ్ పోస్టులు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్).. 40 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత విభాగాల్లో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీలతో పాటు బోధనలో అనుభవం. **వయసు:** 65 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 - 2,18,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 - 2,17,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 - 1,82,400. **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు. ఇతరులకు రూ.1000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 06.03.2026.

ఎంపిక: ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://uohyd.ac.in/non-teaching-project-staff/

తెలంగాణ ఈసెట్-2026

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీఎస్‌సీహెచ్‌ఈ).. తెలంగాణ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈసెట్)-2026 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్) అభ్యర్థులకు 2026-2027 విద్యా సంవత్సరం బీఈ/ బీటెక్/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

పరీక్ష వివరాలు: తెలంగాణ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈసెట్)-2026

అర్హత: పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్).

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.900. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.04.2026.

ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేదీ: 15.05.2026.

వెబ్‌సైట్: https://ecet.tgche.ac.in/

మల్టీ-టాస్కింగ్ స్టాఫ్

ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, గుజరాత్.. స్పోర్ట్స్ కోటాలో రెగ్యులర్ ప్రాతిపదికన మల్టీ-టాస్కింగ్ స్టాఫ్, ట్యాక్స్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మల్టీ-టాస్కింగ్ స్టాఫ్ - 28
- ట్యాక్స్ అసిస్టెంట్ - 18

అర్హత: పదో తరగతి/డిగ్రీతో పాటు ట్యాక్స్ అసిస్టెంట్ పోస్టుకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

వయసు: 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు ట్యాక్స్ అసిస్టెంట్‌కు రూ.25,500-81,100. మల్టీ-టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.18,000-56,900.

ఎంపిక: రాత పరీక్షతో

దరఖాస్తుకు చివరి తేదీ: 21.02.2026 **వెబ్‌సైట్:** https://incometaxgujarat.gov.in/



కృషితో సాధ్యం సివిల్ సర్వీస్

అభ్యర్థుల పరిణతికీ, విస్తృత విషయ పరిజ్ఞానానికీ సవాలు విసిరే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) నోటిఫికేషన్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. ఈ దఫా 933 పోస్టులు భర్తీ చేస్తారు. వీటికి ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.

ప్రిలిమినరీ: ఇది ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ పరీక్ష. సరైన సమాధానాన్ని ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నలను ఇంగ్లిష్, హిందీ భాషా మాధ్యమాల్లో మాత్రమే ఇస్తారు. ప్రశ్నలు అర్థం చేసుకోవడానికి భాషా పరిజ్ఞానం ఉండాలి. .

✦ ఈ పరీక్షను 400 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2. ప్రతీ పేపర్‌కు 200 మార్కులు.

✦ పేపర్-1లో 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికీ 2 మార్కులు.

✦ పేపర్-2లో 80 ప్రశ్నలు. సరైన సమాధానానికి 2 1/2 మార్కులు.

✦ రెండు పేపర్లలోనూ తప్పు సమాధానానికి 0.33 శాతం మార్కు తగ్గిస్తారు.

✦ పేపర్-2 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో కనీస అర్హత మార్కులు 33 శాతం అంటే 200కు 67 సాధిస్తే సరిపోతుంది. ఈ కటాఫ్ మార్కులు దాటితేనే.. పేపర్-1ను పరిగణనలోకి తీసుకుంటారు.

✦ఖాళీలకు 12-13 రెట్ల మందిని మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. ఇందుకోసం ప్రిలిమినరీ పరీక్షలో సాధించిన మార్కులను ప్రామాణికంగా తీసుకుంటారు.

మెయిన్స్, ఇంటర్వ్యూ

✦ మెయిన్స్ పరీక్షలో 9 పేపర్లు. మొత్తం 1750 మార్కులకు ఉంటుంది. ఖాళీలకు 2 రెట్ల మందిని పర్సనాలిటీ టెస్టు(ఇంటర్వ్యూ)కు ఎంపిక చేస్తారు. దీనికి 275 మార్కులు. మొత్తం 2025 మార్కులు.

✦ గరిష్ఠ వయసుకు లోబడి.. జనరల్ అభ్యర్థులు 6 సార్లు సివిల్స్ పరీక్ష రాయవచ్చు. ఓబీసీలు, దివ్యాంగులు (జీఎల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ) 9 సార్లు పరీక్ష రాసే అవకాశం ఉంది. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు ఎన్నిసార్లయినా రాయవచ్చు.

వివరాలు:

అర్హత: ఏదైనా డిగ్రీ. చివరి ఏడాది విద్యార్థులూ అర్హులే.

వయసు: ఆగస్టు 1, 2026 నాటికి 21-32 ఏళ్ల మధ్య ఉండాలి. ఆగస్టు 2, 1994 - ఆగస్టు 1, 2005 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు గరిష్ఠ వయసులో మినహాయింపులు వర్తిస్తాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.02.2026

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఉండదు.

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 24.05.2026

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

పేపర్-I సన్నద్ధత

✦ వివిధ సబ్జెక్టుల్లో పునాది స్థాయి నుంచీ అధ్యయనం ఆరంభించాలి. సిలబస్‌నూ, పరీక్ష ధోరణినీ అర్థంచేసుకోవాలి.

✦ గతంలో వచ్చిన ప్రశ్నలను శ్రద్ధగా గమనించాలి. వాటి ఆధారంగా ప్రతి విభాగం నుంచీ ఎన్ని ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో ఊహించాలి. ప్రశ్నల శైలి ఎలా మారుతోందో గమనించాలి.

✦ విభాగాల వారీ మాక్ టెస్టులు రాసుకోవాలి. ఆశించిన మార్కులు వచ్చినట్లయితే మరో విభాగం చదువుకోవచ్చు. ఇలా అన్నీ చదవడం పూర్తయిన తర్వాత సిలబస్‌లోని విభాగాలన్నీ కవర్ అయ్యే గ్రాండ్ టెస్టులు రాసుకోవాలి. ఈ ఫలితాలు సమీక్షించుకోవాలి.

పేపర్-2కు ఇలా

✦ ఇది అర్హత పరీక్షే, అయినప్పటికీ దీన్ని తక్కువగా అంచనా వేస్తే విఫలమయ్యే ప్రమాదం ఉంది.

✦ ముందుగానే సన్నద్ధతను ప్రారంభించాలి. ఎందుకంటే ఈ పేపర్ రాయడానికి అవసరమైన నైపుణ్యాలను తక్కువ వ్యవధిలో పొందలేము.

✦ లెక్కలంటే భయపడేవారు ముఖ్యంగా ఆర్ట్స్ నేపథ్యం ఉన్నవారు పాత ప్రశ్నపత్రాల నుంచి లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలను సాధన చేసి సామర్థ్యాన్ని సొంతంగా పరీక్షించుకోవాలి. షార్ట్‌కట్ మెథడ్స్‌పై దృష్టి సారించాలి.

సివిల్స్‌కి ఎలా సిద్ధం కావాలి? అనే ప్రశ్న కంటే ముందు.. 'నేను ఎందుకు ప్రభుత్వ అధికారి కావాలనుకుంటున్నాను?' అనే మౌలిక విషయంపై స్పష్టత ముఖ్యం.

✦ సివిల్స్ సాధించాలనే బలమైన కోరిక లేకుండా 'ఓ రాయి వేసి చూద్దాం' అనుకోవడం అవివేకం. లక్ష్య సాధనలో ఎలాంటి అశ్రద్ధ చేసినా కెరియర్‌లో అత్యంత ముఖ్యమైన కాలం (21 నుంచి 32 ఏళ్లు) వృథా అయ్యే ప్రమాదం ఉంది.

✦ జాతీయ స్థాయి పరీక్ష, తీవ్ర పోటీ, అనేక ఆప్షనల్ సబ్జెక్టులు, కీలకమైన మెయిన్స్ రాత పరీక్ష కావడం, ఇంటర్వ్యూకు దాదాపు పది శాతం మార్కులు.. వీటన్నిటి కారణంగా సివిల్స్ పరీక్షలో సహజంగానే చాలా అనిశ్చితి ఉంటుంది. అందువల్ల అంతిమ ఫలితం విషయంలో అభ్యర్థులు చాలా డిటాచ్డ్‌గా ఉండటం అవసరం.

సివిల్స్ అధికారి సూచనలివీ..

పరీక్షా వ్యూహం: ముందస్తు సన్నద్ధత లేనివారు, ఇటీవలే డిగ్రీ పూర్తి చేసుకున్నవారు కనీసం ఒక ఏడాది సమయం తీసుకుని ప్రయత్నించడం ఉత్తమం.

✦ ప్రిలిమ్స్‌కు కొన్ని నెలల ముందు నుంచీ గత ప్రశ్నపత్రాలను నిజమైన పరీక్షలాగే నిర్ణీత సమయంలో రాస్తూ అభ్యాసం చేయాలి. సీనియర్ల సలహా తీసుకుని కటాఫ్ దగ్గర్లో మార్కులు వస్తున్నాయనే నమ్మకం కలిగితేనే ఆ సంవత్సరం పరీక్ష రాయాలి. ప్రిలిమ్స్ కోసం విస్తృతంగా చదవడంతో పాటు ఎలిమినేషన్ లాజిక్ అభ్యాసం చేయాలి.

మెయిన్స్ ఆప్షనల్ సబ్జెక్ట్ ఎంపికకు పరిగణనలోకి తీసుకోవాల్సిన కీలకాంశాలు: ఆసక్తి, సహజ సామర్థ్యాలు, విద్యా నేపథ్యం, కోచింగ్ అందుబాటు, సిలబస్, గత ప్రశ్నపత్రాల అధ్యయనం. తెలుగు సాహిత్యంలో గొప్ప ఆసక్తి, అభిరుచి లేకపోయినప్పటికీ.. తెలుగు భాషపై ఏమాత్రం పట్టు ఉన్నా తెలుగు సాహిత్యాన్ని ఆప్షనల్‌గా పరిశీలించవచ్చు.

✦ గత మెయిన్స్ ప్రశ్నపత్రాల నుంచి రోజుకు కనీసం ఒక ప్రశ్నకు నిర్ణీత పద పరిమితిలో సమాధానం రాసేలా సాధన చేయాలి. రాసిన జవాబులను ఫ్యాకల్టీ సభ్యులు, ప్రొఫెసర్లతో చర్చించాలి. నేడు ఏఐ ద్వారా కూడా సులువుగా ఫీడ్‌బ్యాక్ పొందే అవకాశం ఉండటం అభ్యర్థులకు గొప్ప వరమే.

✦ మెయిన్స్‌లో వివిధ సబ్జెక్టులు, టాపిక్స్ చదువుతున్నప్పుడు వాటిని వేర్వేరు విభాగాలుగా కాకుండా, ఒక దానితో ఇంకొకటి అనుసంధానించేలా స్థూల అవగాహన పెంపొందించుకోవాలి.

✦ స్టాక్ టాపిక్స్‌కి కరెంట్ అఫైర్స్‌ను జోడించడం ముఖ్యం. ఎందుకంటే.. భౌగోళికశాస్త్రం ప్రశ్నలు సమకాలీన వ్యవహారాలతో అనుసంధానం అవుతున్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రశ్నలు.. నైతికత, విలువలతో ముడిపడుతున్నాయి. పర్యావరణ అంశాల్లాంటివి అనేక పేపర్లలో కనిపిస్తున్నాయి.

✦విషయ పరిజ్ఞానంతో పాటు అభివ్యక్తి సామర్థ్యం చాలా ముఖ్యం. ఎక్కువ మంది ఈ పరీక్షకు ఇంగ్లిష్ మీడియంలోనే రాస్తున్నారు. కాబట్టి పుస్తకాలు, ఆంగ్ల దినపత్రికల్లో వ్యాసాలు చదువుతున్నప్పుడు 'ఏం చెప్పారు' అన్న దానితో పాటు 'ఎలా చెప్పారు', 'ఎలాంటి పదాలు వాడారు' అనే విషయాలనూ నిశితంగా పరిశీలించాలి.

సివిల్స్‌లో విఫలమవడానికి ముఖ్య కారణాలు: ముందస్తు అవగాహన లేకపోవడం, పరీక్ష ఆశించే నైపుణ్యాలపై డిగ్రీ పూర్తయ్యేవరకూ దృష్టి పెట్టకపోవడం, ఇంగ్లిష్, అభివ్యక్తిపై పట్టు లేకపోవడం, పుస్తకాలు అనేకం చదివినా రాయడంలో తగినంత సాధన చేయకపోవడం.

కోచింగ్, కెరియర్: అవకాశం, స్తోమతను బట్టి కోచింగ్ తీసుకోవచ్చు. అయితే, ప్రామాణిక పుస్తకాలు చదువుతూ, ఇంటర్నెట్, ఏఐని సరిగా వాడుకుంటూ, తగినంతగా రాయడం సాధన (రైటింగ్ ప్రాక్టీస్) చేస్తే కోచింగ్ తప్పనిసరి కాదు అని కచ్చితంగా చెప్పవచ్చు.

✦ ప్రిపరేషన్ కాలం కూడా కెరియర్ పరంగా సద్వినియోగం అవ్వాలనుకునే అభ్యర్థులు.. ఏదైనా సబ్జెక్టులో రెగ్యులర్ లేదా దూరవిద్య ద్వారా పీజీ చేయవచ్చు. గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలూ రాయొచ్చు. కానీ దృష్టి మొత్తం సివిల్స్ మీదే ఉండాలి. లేకపోతే అసలుకే మోసం వచ్చే ప్రమాదముంది.

✦ ఇరవైకి పైగా ఉన్న సర్వీసుల్లో ఎంపికైన విభాగంలోనే జీవితమంతా గడుస్తుంది. కాబట్టి, అప్లికేషన్ ఫారం నింపేటప్పుడు వివిధ సర్వీసులు, రాష్ట్ర కేడర్లు, వాటిలోని అవకాశాలు, సాధక బాధకాల గురించి తెలుసుకున్న తర్వాతే ప్రాధాన్యతలు గుర్తించాలి.

తల్లిదండ్రులకో మాట

సివిల్ సర్వీసుల్లో అవకాశాలు అనేకం ఉన్నాయి. ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలో భాగం కావడం, స్థిరమైన ఉద్యోగం, సామాజిక గౌరవం, సరిపడే జీతభత్యాలు. అదే సమయంలో కొన్ని సవాళ్లు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్లు, నిర్ణయాల్లో పరిమిత స్వేచ్ఛ, బదిలీలు, సొంత రాష్ట్రానికి దూరంగా ఉండటం మొదలైనవి. కాబట్టి సివిల్స్ ఉద్యోగాలను వాటిపై సాధారణంగా ఉండే క్రేజ్‌తో కాకుండా, వాస్తవిక దృక్పథంతో చూడాలి. పిల్లల మనస్తత్వాన్ని బట్టి వారికి ప్రభుత్వ ఉద్యోగాలపై బలమైన ఆసక్తి ఉంటేనే తల్లిదండ్రులు వారిని ఆ దిశగా ప్రోత్సహించాలి. 'మా అబ్బాయి లేదా అమ్మాయి సివిల్స్ అధికారి అవ్వడం నా కల'. వాళ్లు మెరిట్ స్టూడెంట్లు, కష్టపడి చదువుతారు కాబట్టి వాళ్లు సివిల్స్ రాయాలి అనుకోవడం సరికాదు.



– ఈదర రవికిరణ్, ఐ.ఆర్.ఎస్.

ఇంటర్న్‌షిప్స్ – వర్క్ ఫ్రమ్ హోమ్

యూఐ/యూఎక్స్ డిజైన్

సంస్థ: బెటనట్ ఏఐ
నైపుణ్యాలు: డిజైన్ సిస్టమ్, డిజైన్ థింకింగ్, యూఐ, యూఎక్స్ డిజైన్, వైర్‌ఫ్రేమింగ్
స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://tinyurl.com/bded7np5

ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: కన్సల్ట్ బే.
నైపుణ్యాలు: డేటాఅనొటేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://hosturl.info/4ym8Zc

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: క్యాండిడ్ స్కూల్స్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://tinyurl.com/st4shb9e

ఆన్‌లైన్ జర్మన్ ఫ్యాకల్టీ

సంస్థ: వికల్ప్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: జర్మన్ మాట్లాడటం, రాయడం, ఆన్‌లైన్ టీచింగ్
స్టైపెండ్: రూ.6,000-9,000
దరఖాస్తు గడువు: మార్చి 4
☛ https://hosturl.info/mYS7p

వెబ్ డెవలప్‌మెంట్


సంస్థ: మ్యాడ్అల్‌గోస్
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, మైఎస్‌క్యూఎల్, నోడ్.జేఎస్, రియాక్ట్ స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://url-shortener.me/AU6D

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఎకోఅవెన్‌స్ట్రా హెచ్‌ఆర్ ఇన్ఫోటెక్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఈమెయిల్, లింక్డ్‌ఇన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, లీడ్ జనరేషన్, ఎంఎస్-ఎక్సెల్, ప్రజెంటేషన్ స్కిల్స్, సేల్స్ మేనేజ్‌మెంట్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.5,000-6,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://hosturl.info/faaTYK

లీడ్ జనరేషన్

సంస్థ: నియోగ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్
నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్, ఎంఎస్-ఎక్సెల్, సేల్స్
స్టైపెండ్: రూ.7,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://url-shortener.me/AU6O



నేవీలో అవుతారా అధికారి!

ఇండియన్ నేవీలో అధికారిగా కొలువుదీరే అవకాశం వచ్చింది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో 260 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. యూజీ/పీజీ విద్యార్హతలతో అవకాశం ఉంది. అవివాహిత మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఎంపికైన వారిని శిక్షణ అనంతరం సబ్ లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. వీరు మొదటి నెల నుంచే రూ.1,25,000 వేతనం పొందుతారు.

ఇండియన్ నేవీ భర్తీ చేస్తోన్న ఈ షార్ట్ సర్వీస్ కమిషన్ పోస్టులు.. ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్, ఎడ్యుకేషన్ బ్రాంచ్, టెక్నికల్ బ్రాంచ్‌ల్లో ఉన్నాయి. ఇవన్నీ లెవెల్-10 హోదా ఉద్యోగాలే. పరీక్ష లేకుండా ఉద్యోగంలోకి తీసుకోవడం వీటి ప్రత్యేకత. దరఖాస్తు చేసుకున్న వారిని అకడమిక్ మార్కుల మెరిట్‌తో వడపోస్తారు. అందువల్ల యూజీ/పీజీలో ఎక్కువ మార్కులు పొందినవారు విజయవంతం కావడానికి అవకాశముంది. ఒక్కో పోస్టుకు నిర్ణీత సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. ఇవి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో జరుగుతాయి. ఇందులో విజయవంతమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, తుది నియామకానికి ఖరారు చేస్తారు. వీరికి నేవల్ అకాడమీ, ఎజిమలలో జనవరి, 2027 నుంచి 22 వారాలపాటు సంబంధిత విభాగాల్లో తర్ఫీదునిస్తారు. ఆ తర్వాత మరో 22 వారాలు సంబంధిత విభాగానికి చెందిన కేంద్రంలో తదుపరి శిక్షణ ఉంటుంది. అనంతరం సబ్ లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఉద్యోగంలో లెవెల్-10 మూల వేతనం రూ.56,100 అందుతుంది. దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర ప్రోత్సాహకాలు అదనం. మొదటి నెల నుంచే రూ.1,25,000 జీతం అందుకోవచ్చు. ప్రొబేషన్ వ్యవధి పోస్టుల ప్రకారం రెండు లేదా మూడేళ్లు ఉంటుంది. ఈ పోస్టులు పరిమిత కాల ప్రాతిపదికన (షార్ట్ సర్వీస్ కమిషన్) ఉంటాయి. అంటే ఎంపికైనవారు పన్నెండేళ్లు విధుల్లో కొనసాగుతారు. అనంతరం రెండేళ్లు సర్వీసు పొడిగిస్తారు. అందువల్ల గరిష్ఠంగా 14 ఏళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించవచ్చు. ఆ తర్వాత విధుల నుంచి వైదొలగాలి. అయితే నేవీలో పని అనుభవంతో వీరు సులువుగానే సివిల్ ఉద్యోగాలు పొందగలరు.

ఖాళీలు.. అర్హతలు ఇలా

ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్: జనరల్ సర్వీస్‌లో 76 ఖాళీలు ఉన్నాయి. ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ 18, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్ (అబ్జర్వర్స్) 20, పైలట్ 25 ఖాళీలకు బీఈ/బీటెక్‌లో 60, పది, ఇంటర్‌లోనూ 60 శాతం మార్కులు పొందినవారు అర్హులు. లాజిస్టిక్స్ 10 ఖాళీలకు ఎందులోనైనా 60 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ లేదా ఎంబీఏ లేదా ఎమ్మెస్సీ (ఐటీ)/ ఎంసీఏ లేదా బీఎస్సీ/ బీకామ్‌లతోపాటు లాజిస్టిక్స్/ సప్లయ్ చెయిన్‌లో పీజీ డిప్లొమా ఉన్నవారు అర్హులు.

ఎడ్యుకేషన్ బ్రాంచ్: ఇందులో అన్ని విభాగాల్లోనూ కలిపి 15 ఖాళీలు ఉన్నాయి. వీటికి ఆ పోస్టుల ప్రకారం బీటెక్/ ఎంబీఏ/ ఎంసీఏ/ ఎమ్మెస్సీ విద్యార్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

టెక్నికల్ బ్రాంచ్: ఇంజినీరింగ్ బ్రాంచ్ 42, సబ్ మెరైన్ టెక్ ఇంజినీరింగ్ 8, ఎలక్ట్రికల్ బ్రాంచ్ 38, సబ్ మెరైన్ టెక్ ఎలక్ట్రికల్ 8 ఖాళీలు ఉన్నాయి. సంబంధిత విభాగాల్లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: పోస్టు ప్రకారం మారుతుంది. జనవరి 2, 2000 - జులై 1, 2007 మధ్య జన్మించినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పై అన్ని పోస్టులకు ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారికి అకడమిక్ మార్కుల్లో 5 శాతం సడలింపు వర్తిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తులో పోస్టులవారీ ప్రాధాన్యం తెలపడం తప్పనిసరి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.02.2026

ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ కేంద్రాలు: బెంగళూరు, భోపాల్, విశాఖపట్నం, కోల్‌కతా.

వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

యాప్ డెవలప్‌మెంట్‌లో ఎలాంటి అవకాశాలు?

మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాను. రెండేళ్ల ఉద్యోగానుభవం ఉంది. నాన్ కోడర్స్‌కు యాప్ డెవలప్‌మెంట్ నేర్పించే వేదికలు ఉంటాయా, కోడింగ్ పరిజ్ఞానం, ఐటీ నేపథ్యం లేనివారు ఇందులో రాణించగలరా?

–ఎస్.రాహుల్



■ ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రాధాన్యం పొందుతోన్న రంగాల్లో యాప్ డెవలప్‌మెంట్ ఒకటి. మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్ డివైజ్‌లు విస్తృతంగా ఉపయోగంలోకి రావడంతో యాప్‌ల అవసరం బాగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యాప్ డెవలప్‌మెంట్ కోర్సులు చేయాలనుకునే వారికి వివిధ ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

● బీటెక్ మెకానికల్ చదివారు కాబట్టి, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, కోడింగ్ గురించి కొంత అవగాహన ఉండే ఉంటుంది. ఒకవేళ కోడింగ్ తెలియకపోయినా యాప్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్పే చాలా ఏఐ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ కోడింగ్ నేర్చుకుని యాప్ డెవలప్‌మెంట్ కోర్సులు చేసిన తర్వాత డెవలపర్లతో కలిసి పనిచేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

● కోర్సులు ప్రధానంగా ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్, ఐఓఎస్ యాప్ డెవలప్‌మెంట్, క్రాస్ ప్లాట్‌ఫామ్ యాప్ డెవలప్‌మెంట్ నేపథ్యంతో ఉంటాయి. వీటిలో ప్రోగ్రామింగ్ భాషలైన జావా, కోట్లిన్, స్విఫ్ట్, జావాస్క్రిప్ట్ నేర్చుకుంటారు. అలాగే యూజర్ ఇంటర్‌ఫేస్ డిజైన్, యూజర్ ఎక్స్‌పీరియన్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, ఏపీఐ ఇంటిగ్రేషన్ లాంటి అంశాల్లో శిక్షణ పొందుతారు.

● యాప్ డెవలప్‌మెంట్ కోర్సులు పూర్తిచేసిన వారికి సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఆండ్రాయిడ్ డెవలపర్, ఐఓఎస్ డెవలపర్, ఫుల్ స్టాక్ డెవలపర్, యాప్ టెస్టర్, డిజైనర్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. అలాగే స్టార్టప్స్‌లో పనిచేయడం లేదా ఫ్రీలాన్సర్‌గా ప్రాజెక్టులు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. కొంతమంది స్వయంగా యాప్‌లు రూపొందించి గూగుల్ ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్‌లో చేర్చి ఆదాయం పొందుతున్నారు.

● కోడింగ్ నేర్చుకోవడం యాప్ డెవలప్‌మెంట్‌లో ముఖ్యమైన భాగం. దీంతో యాప్ ఎలా పని చేయాలి, ఏ ఫీచర్లు ఉండాలి అనే విషయాలను రూపొందించవచ్చు. మొదటిసారి కోడింగ్ నేర్చుకునే వారికి కొంత కష్టంగా అనిపించినా, సరైన శిక్షణ, నిరంతర సాధనతో ఇది సులభంగానే ఉంటుంది. ప్రాథమిక ప్రోగ్రామింగ్ లాజిక్ అర్థం చేసుకుంటే, తర్వాత కొత్త ప్రోగ్రామింగ్ భాషలు నేర్చుకోవడం పెద్ద కష్టం కాదు.

● యాప్ డెవలప్‌మెంట్ కెరియర్ ఆశాజనకంగా ఉంటుంది. డిజిటలైజేషన్ వేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో యాప్‌లకు డిమాండ్ ఎక్కువవుతోంది. ముఖ్యంగా ఈకామర్స్, హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, ఫైనాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్, గ్రాసరీస్ రంగాల్లో యాప్‌ల వినియోగం ఎక్కువగా ఉంది. కాబట్టి నైపుణ్యం పొందితే స్థిరమైన ఉద్యోగంతో పాటు మంచి వేతనమూ దక్కుతుంది.

యాప్ డెవలప్‌మెంట్ కోర్సు చేయడం మంచి కెరియర్ మార్గాన్ని చూపుతుంది. ఆసక్తి, పట్టుదల, నిరంతర అభ్యాసం ఉంటే ఈ రంగంలో విజయాన్ని సాధించవచ్చు. సరైన సంస్థను ఎంపిక చేసుకుని, ప్రాక్టికల్ శిక్షణతో పాటు ప్రాజెక్ట్ అనుభవమూ పొందితే భవిష్యత్తులో ఈ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

జనరల్ నాలెడ్జ్

మాదిరి ప్రశ్నలు



◆ ఏ రాష్ట్రంలోని అతిరప్పిల్లి జలపాతాన్ని 'భారతదేశ నయాగరా' అని పిలుస్తారు? జ: కేరళ

◆ భారతదేశ క్రీడా రాజధానిగా పేరు గాంచిన నగరం?
జ: ఒడిశా రాజధాని భువనేశ్వర్ (హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ లాంటి అనేక ఆటలకు ఆధునిక స్టేడియాలు, శిక్షణా కేంద్రాలు, సౌకర్యాలను నిర్మించడం ద్వారా ఈ నగరం క్రీడా రాజధానిగా మారింది.)

◆ దేశంలోని ఏ నగరాన్ని 'సిటీ ఆఫ్ హనీ' గా పిలుస్తారు?
జ: మహరాజ్‌గంజ్, ఉత్తర్‌ప్రదేశ్ (ఈ ప్రాంతంలో తేనె తయారీ, తేనెటీగల పెంపకం చాలా సాధారణం. ఈ ప్రదేశంలో ఏడాది పొడవునా తేనెటీగలకు కావాల్సిన పూలు, పొలాలు, సహజ పచ్చదనం పుష్కలంగా ఉంటాయి. భారత్-నేపాల్ సరిహద్దుకు ఈ ప్రాంతం దగ్గరగా ఉంటుంది.)

◆ భారతదేశంలో మొదటి ప్రైవేట్ రైల్వేస్టేషన్ ఏది?
జ: రాణి కమలాపతి రైల్వేస్టేషన్ (మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉంది. ఈ స్టేషన్‌ను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్ కింద పునర్నిర్మించారు. పశ్చిమ మధ్య రైల్వే జోన్‌లో భాగంగా ఉన్న ఈ రైల్వే స్టేషన్‌ను బన్సాల్ గ్రూప్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. గతంలో దీన్ని హబీబ్‌గంజ్ రైల్వేస్టేషన్‌గా పిలిచేవారు.)

TENTH Mathematics — PAIR OF LINEAR EQUATIONS IN TWO VARIABLES

$\begin{cases} 2x + y = 3 \\ x - 4y = 1 \end{cases}$

1 Mark

Final Exams-2026 IMPORTANT Q & A

1. The pair of equations $5x - 15y = 8$ and $3x - 9y = \frac{24}{5}$ has ( )
   A) one solution B) two solutions
   C) infinitely many solutions D) no solution
   Ans: C

2. If the lines given by $3x + 2ky = 2$ and $2x + 5y + 1 = 0$ are parallel, then the value of k is ( )
   A) $\frac{-5}{4}$ B) $\frac{2}{5}$ C) $\frac{15}{4}$ D) $\frac{3}{2}$
   Ans: C

3. The value of c for which the pair of equations $cx - y = 2$ and $6x - 2y = 4$ will have infinitely many solutions is ( )
   A) 3 B) –3 C) –12 D) no value
   Ans: A

4. One equation of a pair of dependent linear equations is $-5x + 7y = 2$. The second equation can be ( )
   A) $10x + 14y + 4 = 0$
   B) $-10x - 14y + 4 = 0$
   C) $-10x + 14y + 4 = 0$
   D) $10x - 14y = -4$ **Ans: D**

5. A pair of linear equations which has a unique solution $x = 2, y = -3$ is ( )
   A) $x + y = -1;\ 2x - 3y = -5$
   B) $2x + 5y = -11;\ 4x + 10y = -22$
   C) $2x - y = 1;\ 3x + 2y = 0$
   D) $x - 4y - 14 = 0;\ 5x - y - 13 = 0$
   Ans: B

6. Match the following ( )

Group A	Group B
i) $\frac{a_1}{a_2} \neq \frac{b_1}{b_2}$	a) coincident lines
ii) $\frac{a_1}{a_2} = \frac{b_1}{b_2} \neq \frac{c_1}{c_2}$	b) intersecting lines
iii) $\frac{a_1}{a_2} = \frac{b_1}{b_2} = \frac{c_1}{c_2}$	c) parallel lines

   A) i–a, ii–b, iii–c B) i–c, ii–b, iii–a
   C) i–b, ii–c, iii–a D) i–a, ii–c, iii–b
   Ans: C

7. If $x = a, y = b$ is the solution of the equations $x - y = 2$ and $x + y = 4$, then the values of a and b are, respectively ( )
   A) 4 and 2 B) 5 and 3
   C) 3 and 1 D) –1 and –3
   Ans: C

For more IMP Q & A



Writer: Dr. T.S.V.S. Suryanarayana Murty

సంక్షేమ బాటలో సమ్మిళిత వృద్ధి సూత్రాలు!

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

ఒక రాష్ట్ర ఆర్థిక సుస్థిరత అనేది ఆ సమాజంలోని చివరి వ్యక్తి జీవన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ నమూనాలో సాంఘిక భద్రత, ఆర్థిక సాధికారత రెండూ సమాంతరంగా సాగుతున్నాయి. వృద్ధులకు, చేతివృత్తుల వారికి హామీ ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సామాజిక రక్షణ కవచంగా నిలుస్తుంటే, తల్లికి వందనం ద్వారా విద్యారంగంలో మానవ వనరుల అభివృద్ధికి పునాదులు పడుతున్నాయి. దీపం, స్త్రీశక్తి పథకాలు మహిళల ఆర్థిక స్వేచ్ఛను, పొదుపును ప్రోత్సహిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి పెట్టుబడి మద్దతునిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అన్నదాత సుఖీభవ బలోపేతం చేస్తోంది. వీటన్నింటికీ తోడు, పేదరిక నిర్మూలనలో భాగంగా కనీస అవసరమైన ఆహార భద్రతను అన్న క్యాంటీన్ల ద్వారా సాకారం చేయడం విశేషం. రాష్ట్రంలో వినియోగ వ్యయాన్ని పెంచుతున్న ఈ పథకాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. అవి అట్టడుగు వర్గాలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేస్తూ సమ్మిళిత వృద్ధికి దిక్సూచిగా నిలుస్తున్న తీరును అర్థం చేసుకోవాలి.



అన్నదాత సుఖీభవ: ఆంధ్రప్రదేశ్‌లో అర్హత ఉన్న ప్రతి రైతు కుటుంబానికి వ్యవసాయ అవసరాల కోసం రూ.20,000 వార్షిక పెట్టుబడి సహాయాన్ని అందించే పథకమే 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకం. వార్షిక పెట్టుబడి సహాయాన్ని మూడు విడతలు (మొదటి విడత రూ.7000, రెండో విడత రూ.7,000, మూడో విడత రూ.6,000)గా రైతు బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం బదిలీ చేస్తుంది. ◆ ఈ పథకంలో రైతులకు ఇచ్చే సహాయం రూ.20,000లో ఏపీ ప్రభుత్వం ద్వారా రూ.14,000, కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 అందుతోంది.

విడత	ఏపీ ప్రభుత్వం + పీఎం కిసాన్
మొదటి	రూ.5,000 + రూ.2,000 = రూ.7,000
రెండో	రూ.5,000 + రూ.2,000 = రూ.7,000
మూడో	రూ.4,000 + రూ.2,000 = రూ.6,000




◆ రైతులతో పాటు, భూమి లేని కౌలుదారులకు కూడా 20,000/- వార్షిక పెట్టుబడి సహాయాన్ని ఏపీ ప్రభుత్వం అందిస్తుంది. ◆ 'సూపర్ సిక్స్' హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని 2025, ఆగస్టు 2న ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. 46,85,838 మంది రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ.7,000/- చొప్పున జమ చేశారు.

ఏపీ ప్రభుత్వ పథకాలు

దీపం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటగా దీపం పథకాన్ని 1999, జులైలో ప్రారంభించారు. పేద మహిళలు ముఖ్యంగా స్వయంసహాయక బృందాల (డ్వాక్రా) నుంచి కేవలం కనెక్షన్ రుసుం తీసుకుని ఎల్‌పీజీ సిలిండర్లు అందించారు. ఏపీలో 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీల్లో తొలి హామీగా దీపం పథకం 2.0ను అమలుచేసింది. దీని కింద అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదిలో మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తారు. దీపావళి సందర్భంగా దీపం 2.0 పథకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024, అక్టోబరు 31న శ్రీకాకుళం జిల్లా ఏడుపురంలో అధికారికంగా ప్రారంభించారు. ఈ పథకంలో అర్హత ఉన్న కుటుంబాలకు ఉచిత ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు అందిస్తారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ 48 గంటల్లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుంది. దీని ద్వారా ఏపీలో సుమారు 1.5 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి.

తల్లికి వందనం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసింది. 2025, జూన్ 12న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడలో ఈ పథకాన్ని ప్రారంభించారు. పాఠశాలకు వెళ్లే అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఏటా రూ.15,000 చొప్పున తల్లి బ్యాంకు ఖాతాకు నేరుగా నగదు జమ చేస్తారు.



2011 గణాంకాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోనే బాలకార్మికుల వ్యవస్థ ఉంది. అక్షరాస్యతలోనూ రాష్ట్రం వెనుకబడి ఉంది. ఈ రెండు సమస్యల పరిష్కారానికి తల్లిని కేంద్రంగా చేసుకుని కుటుంబాలకు విద్యా వ్యయభారాన్ని తగ్గిస్తూ, నగదు బదిలీ జరుగుతుంది. డ్రాప్‌అవుట్ల సంఖ్య తగ్గించడం కోసం విద్యాసంవత్సరంలో పిల్లవాడికి కనీసం 75% పాఠశాల హాజరు ఉండాలనే అర్హత పెట్టారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదివే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుంది. టాయిలెట్ల నిర్వహణకు రూ.1,000, వాచ్‌మెన్ గౌరవ వేతనం కోసం రూ.1,000 మినహాయించి మిగిలిన రూ.13,000 మొత్తం ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో జమ చేస్తారు. సుమారు 67 లక్షల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది.



అన్న క్యాంటీన్లు: ఈ పథకాన్ని 2016, మార్చిలో పైలట్ ప్రాజెక్టుగా అమరావతిలోని వెలగపూడి వద్ద ప్రారంభించారు. అనంతరం 2018, జులై 11న ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో మొదలుపెట్టారు. ✦ 'అన్న క్యాంటీన్లు 2.0' పథకాన్ని 2024, ఆగస్టు 15న గుడివాడ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ప్రారంభించారు. ✦ ఈ పథకం ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రిపూట భోజనాన్ని కేవలం రూ.5 చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్రంలో పలు పట్టణాలు, నగరాల్లో సుమారు 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఈ సదుపాయం ఉంది. ✦ ఉదయం పూట మెనూగా ఇడ్లీ, పూరి, ఉప్మా, పొంగలి; మధ్యాహ్నం, రాత్రి భోజన మెనూగా అన్నం, కూర, పప్పు, సాంబారు, పచ్చడి, పెరుగు ఉంటాయి.

స్త్రీ శక్తి పథకం



◆ ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని 2025, ఆగస్టు 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ◆ 'సూపర్ సిక్స్' హామీలో భాగంగా అమలు చేసిన ఈ పథకంలో ఆంధ్రప్రదేశ్ నివాసితులుగా ఉన్న మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు నిర్దిష్ట ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ తదితర అయిదు రకాల బస్సుల (సుమారుగా 8,458) సేవలు వినియోగించుకోవచ్చు. ◆ ప్రయాణ సమయంలో మహిళలు ఏపీ నివాసితులుగా ఉన్న ఐడీ కార్డు చూపిస్తే, జీరో ఫేర్ టిక్కెట్లు జారీ చేస్తారు. ◆ సుమారు 2.62 కోట్ల మంది ఈ పథకంతో లబ్ధి పొందుతారు. ◆ 2026, జనవరి 28 నాటికి 40 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు జరిగాయి.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం:



ఈ పథకాన్ని 2024, జులై 1న గుంటూరు జిల్లా పెనుమాకలో సీఎం ప్రారంభించారు. ★ వృద్ధులు, వితంతువులు, గీత, నేతకార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్లు, కళాకారులకు నెలకు రూ.4,000 పింఛను ఇస్తారు. దివ్యాంగులకు రూ.6,000, మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్ అందుతుంది.



రచయిత: జి.వి. సుబ్బారెడ్డి

ప్రాణులపై ప్రయోగాలు వద్దు!

సహజవనరుల విధ్వంసాన్ని అరికట్టి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడానికి ప్రపంచస్థాయిలో పలు పర్యావరణ సంస్థలు ఏర్పాటయ్యాయి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలనే ఉదాత్త ఆశయంతో పని చేస్తున్నాయి. శీతోష్ణస్థితి మార్పులను ఎదుర్కొనేందుకు పర్యావరణ రక్షణపై బాధ్యత పెంచేలా అన్ని దేశాల మధ్య సహకార చట్రాన్ని రూపొందించాయి. ఐక్యరాజ్యసమితి తదితర సంస్థల మార్గదర్శకత్వంలో భారత రాజ్యాంగ నిర్దేశం మేరకు దేశంలో ఈ దిశగా పలు చట్టాలు సిద్ధమయ్యాయి. ఆ సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు, సకల ప్రాణికోటిని రక్షించుకోవాలనే లక్ష్యంతో ఉన్న సంస్థలు, చట్టాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. దేశంలో పర్యావరణ పరిరక్షణ చట్టం సహా ఇతర ముఖ్యమైన చట్టాల్లోని అంశాలు, అందుకు అనుగుణంగా ఏర్పాటైన వ్యవస్థలు, వాటి కార్యకలాపాలను తెలుసుకోవాలి.

పర్యావరణ సంస్థలు - చట్టాలు

1. ఏ అవసరాల కోసం మానవుడు సహజసిద్ధ పర్యావరణాన్ని అతిగా వినియోగిస్తున్నాడు?
   1) ఆర్థిక 2) సామాజిక 3) సాంస్కృతిక 4) పైవన్నీ
2. సుస్థిరాభివృద్ధిలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో చేసిన చట్టాలను ఏమంటారు?
   1) సదస్సులు 2) ఒప్పందాలు 3) సమావేశాలు 4) పైవన్నీ
3. పర్యావరణ పరిరక్షణ కోసం, రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం పలు చట్టాలు, సవరణలు చేశారు?
   1) 253వ 2) 255వ 3) 256వ 4) 123వ
4. పర్యావరణాన్ని కాపాడటం కోసం ఏ సవరణ ద్వారా రాజ్యాంగంలో 51(ఎ)జి అనే అధికరణాన్ని చేర్చారు?
   1) 44వ 2) 42వ 3) 73వ 4) 74వ
5. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 48ఎ అధికరణను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1976 2) 1977 3) 1978 4) 1979
6. పర్యావరణ మంత్రిత్వ శాఖను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1985 2) 1980 3) 1988 4) 1994
7. పర్యావరణ మంత్రిత్వశాఖను పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖగా ఎప్పుడు మార్చారు?
   1) 1985 2) 1986 3) 1987 4) 1988
8. పర్యావరణానికి రాజ్యాంగపరమైన రక్షణలు?
   1) ఆర్టికల్ 51ఎ(జి) 2) ఆర్టికల్ 48ఎ 3) పర్యావరణ మంత్రిత్వ శాఖ 4) పైవన్నీ
9. జల పరిరక్షణ, కాలుష్య నియంత్రణల చట్టం మన దేశంలో ఎప్పుడు చేశారు?
   1) 1975 2) 1974 3) 1976 4) 1978
10. జలకాలుష్య నివారణకు మన దేశంలో ఎప్పటి నుంచి పన్ను విధిస్తున్నారు?
   1) 1977 2) 1978 3) 1979 4) 1980



11. జల కాలుష్య సుంక చట్టాన్ని ఎప్పుడు చేశారు?
   1) 1978 2) 1975 3) 1977 4) 1980
12. జలకాలుష్య సుంక చట్టం – 1977లో నీటి వినియోగదారుల్ని ఎన్ని వర్గాలుగా విభజించారు?
   1) 3 2) 5 3) 4 4) 6
13. వాయు కాలుష్య చట్టం ఎప్పుడు చేశారు?
   1) 1982 2) 1981 3) 1983 4) 1984
14. వన్యప్రాణి పరిరక్షణ చట్టం ఎప్పుడు చేశారు?



   1) 1972 2) 1973 3) 1974 4) 1975
15. వన్యప్రాణి పరిరక్షణ చట్టానికి ఎప్పుడు సవరణలు చేశారు?
   1) 2003 2) 2002 3) 2004 4) 2005
16. వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల హద్దులను మార్చడానికి ఎవరి అనుమతి కావాలి?
   1) జాతీయ వన్యప్రాణి సంస్థ 2) పర్యాటక శాఖ 3) అటవీ శాఖ 4) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్
17. అటవీ పరిరక్షణ చట్టం ఎప్పుడు చేశారు?
   1) 1982 2) 1980 3) 1972 4) 1974
18. అటవీ భూములను కాఫీ, తేయాకు, ఇతరత్రా సాగు అవసరాలకు వినియోగించరాదని ఎప్పుడు సవరణ చట్టం చేశారు?
   1) 1988 2) 1982 3) 1984 4) 1986
19. షెడ్యూల్డ్ తెగల అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని ఎప్పుడు చేశారు?
   1) 2015 2) 2006 3) 2004 4) 2010
20. అంతర్జాతీయ జీవవైవిధ్య కన్వెన్షన్‌లో భాగంగా మన దేశంలో జీవవైవిధ్య చట్టాన్ని ఎప్పుడు చేశారు?
   1) 2004 2) 2002 3) 2006 4) 2008
21. భారతదేశంలో పర్యావరణ ప్రభావ మదింపు విధానాన్ని ఎప్పుడు రూపొందించారు?
   1) 1995 2) 1994 3) 1996 4) 1997
22. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఎప్పుడు ఆమోదించారు?
   1) 1987 2) 1986 3) 1988 4) 1989
23. పర్యావరణ పరిరక్షణ చట్టం–1986 ముఖ్య అంశాలు?
   1) పర్యావరణ నాణ్యత పెంపొందించడం.
   2) పర్యావరణంపై అధికారాలు మొత్తం కేంద్రానివే.
   3) అభివృద్ధి ప్రాజెక్టుల అనుమతుల జారీ
   4) పైవన్నీ

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

24. జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
   1) 1995 2) 1994 3) 2005 4) 2015
25. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1960 2) 1961 3) 1962 4) 1963
26. భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఎప్పుడు జరిగింది?



   1) 1984 2) 1987 3) 1988 4) 1989
27. పర్యావరణ ప్రభావ మదింపు విధానం?
   1) ప్రాజెక్టు ప్రాంతాన్ని వివరించడం.
   2) రాబోయే ప్రభావాలను గుర్తించడం.
   3) ప్రతికూల ప్రభావాలను తగ్గించే మార్గాల అన్వేషణ.
   4) పైవన్నీ
28. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్'ను ఎవరు ఏర్పాటు చేశారు?
   1) ఐయూసీఎన్ 2) ఐపీసీసీ 3) యూఎన్‌సీసీసీ 4) యూఎన్ఐఎస్ఎఫ్
29. రీసైకిల్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తి వాడకంపై నిబంధనలు ఎప్పుడు చేశారు?



   1) 2010 2) 1998 3) 1999 4) 2002
30. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ – ఎన్ ఏం చేస్తోంది?
   1) వర్క్ షాప్స్ 2) రోడ్ షోలు 3) ఎగ్జిబిషన్లు 4) పైవన్నీ
31. గ్రీన్‌పీస్ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) న్యూదిల్లీ 2) ఆమ్‌స్టర్ డ్యాం 3) కెనడా 4) బీజింగ్
32. గ్రీన్‌పీస్ స్థాపిత నినాదం ఏమిటి?
   1) పర్యావరణం 2) శాంతి 3) సుస్థిరత 4) పైవన్నీ
33. గ్రీన్‌పీస్ ఎన్ని దేశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుంది?
   1) 102 2) 52 3) 42 4) 72
34. గ్రీన్‌పీస్ ఏ సమస్యపై ఉద్యమిస్తుంది?
   1) న్యూక్లియర్ పరీక్షలు 2) జన్యు సాంకేతికత 3) అటవీ నిర్మూలన 4) పైవన్నీ
35. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్ఈపీ)ను ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1972 2) 1973 3) 1974 4) 1975
36. యూఎన్ఈపీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) న్యూదిల్లీ 2) నైరోబి 3) విజయవాడ 4) బీజింగ్
37. ఇంటర్ గవర్నమెంట్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్‌ను ఎవరు ఏర్పాటు చేశారు?
   1) యూఎన్ఈపీ 2) డబ్ల్యూఎంఓ 3) 1, 2 4) ఏదీకాదు
38. ఐపీసీసీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1988 2) 1987 3) 1986 4) 1985
39. 'గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ' కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) న్యూయార్క్ 2) వాషింగ్టన్ 3) ఢాకా 4) బీజింగ్
40. 'గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ' ఎన్ని దేశాలకు సంబంధించి కార్యకలాపాలను నిర్వహిస్తుంది?
   1) 182 2) 183 3) 184 4) 185
41. 'గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ'ని ఎప్పుడు స్థాపించారు?
   1) 1991 2) 1992 3) 1994 4) 1995
42. 'వరల్డ్ నేచర్ ఆర్గనైజేషన్' ఎప్పుడు స్థాపించారు?
   1) 2012 2) 2011 3) 2013 4) 2014
43. 'పెటా'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1980 2) 1990 3) 2000 4) 2010
44. 'పెటా ఇండియా'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) కోల్‌కతా 2) ముంబయి 3) న్యూదిల్లీ 4) పుణె
45. 'పెటా ఇండియా'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 2000 2) 2001 3) 2002 4) 2003
46. 'పెటా ఇండియా' నినాదం?
   1) జంతువులు ఉన్నది తినడానికి కాదు.
   2) జంతువులు ప్రయోగాలకు కాదు.
   3) అన్ని ప్రాణులు సమానం
   4) పైవన్నీ
47. 'వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా' ఎప్పుడు స్థాపించారు?
   1) 1994 2) 1995 3) 1996 4) 1997
48. కింది వారిలో డబ్ల్యూపీఎస్ఐ స్థాపకులు?
   1) గోవింద్ ఫంక్ట్ 2) బిలిందా రైట్ 3) హరగోపాల్ 4) నానా పటేకర్
49. హైదరాబాద్‌లోని బ్లూ క్రాస్ సొసైటీ స్థాపకులు?
   1) అక్కినేని అమల 2) కొణిదెల సురేఖ 3) పరిణీతి చోప్రా 4) ఐశ్వర్యారాయ్
50. జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
   1) 1995 2) 1994 3) 2005 4) 2015
51. 'ఇండియా కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) న్యూదిల్లీ 2) జహీరాబాద్ 3) డెహ్రాడూన్ 4) బెంగళూరు
52. ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీ ఎక్కడ ఉంది?
   1) దిల్లీ 2) డెహ్రాడూన్ 3) కోల్‌కతా 4) రాజస్థాన్
53. 'దశోలి గ్రామ స్వరాజ్య మండల్'ను ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?
   1) కేరళ 2) ఉత్తరాఖండ్ 3) బిహార్ 4) ఒడిశా

సమాధానాలు

1-4; 2-4; 3-1; 4-2; 5-1; 6-2; 7-1; 8-4; 9-1; 10-1; 11-3; 12-3; 13-2; 14-1; 15-2; 16-1; 17-2; 18-1; 19-2; 20-2; 21-2; 22-2; 23-4; 24-1; 25-2; 26-1; 27-4; 28-1; 29-2; 30-4; 31-2; 32-4; 33-3; 34-4; 35-1; 36-2; 37-3; 38-1; 39-2; 40-1; 41-1; 42-2; 43-1; 44-2; 45-1; 46-4; 47-1; 48-2; 49-1; 50-1; 51-3; 52-2; 53-2.

వర్గ సమీకరణాలు - II

ముఖ్యాంశాలు

- a, b, c లు వాస్తవ సంఖ్యలు లేదా సంకీర్ణ సంఖ్యలై $a \neq 0$ అయినప్పుడు $ax^2 + bx + c = 0$ రూపంలో ఉన్న సమీకరణాన్ని చలరాశి x లలో వర్గసమీకరణం అంటారు.
- p(x) ఒక వర్గబహుపది అయితే, $p(x) = 0$ రూపంలో ఉన్న వాటిని వర్గసమీకరణాలు అంటారు.
- సమీకరణం సాధన విలువలను మూలాలు లేదా సాధనలు అంటారు.
- $ax^2 + bx + c = 0$ మూలాలు, $x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a}$

మాదిరి ప్రశ్నలు

1. ఒక వర్గ సమీకరణం మూలాల మొత్తం 9, వాటి లబ్ధం −36. అయితే కింది వాటిలో ఆ వర్గసమీకరణం ఏది?

1) $x^2 - 9x - 36 = 0$ 2) $x^2 + 9x - 36 = 0$
3) $x^2 - 9x + 36 = 0$ 4) $x^2 + 9x + 36 = 0$

సాధన: మూలాలు α, β అనుకుందాం.

$\alpha + \beta = 9, \ \alpha\beta = -36$

లెక్కలో కోరిన వర్గ సమీకరణం $x^2 - x(\alpha + \beta) + \alpha\beta = 0$

$\Rightarrow x^2 - 9x - 36 = 0$

సమాధానం: 1

2. $x^2 - 7ax + a^2 = 0$ వర్గ సమీకరణం మూలాలు α, β, $\alpha^2 + \beta^2 = \frac{47}{9}$ అయితే a విలువ ఎంత?

1) $\frac{\sqrt{47}}{3}$ 2) $\pm\frac{1}{9}$ 3) $\pm\frac{1}{7}$ 4) $\pm\frac{1}{3}$

సాధన: దత్తాంశం ప్రకారం, $\alpha + \beta = 7a, \ \alpha\beta = a^2$

$\alpha^2 + \beta^2 = (\alpha + \beta)^2 - 2\alpha\beta = \frac{47}{9}$

$(7a)^2 - 2(a^2) = \frac{47}{9} \Rightarrow 47a^2 = \frac{47}{9}$

$\Rightarrow a^2 = \frac{1}{9} \Rightarrow a = \pm\frac{1}{3}$

సమాధానం: 4

3. $\log_{10}(x^2 + 13x + 52) = 2$ అయితే x విలువ ఎంత?

1) 16, −3 2) −16, 3 3) 13, 50 4) 15, 52

సాధన: $\log_{10}(x^2 + 13x + 52) = 2$

$\Rightarrow x^2 + 13x + 52 = 10^2 = 100$

$\Rightarrow x^2 + 13x - 48 = 0$

$\Rightarrow x^2 + 16x - 3x - 48 = 0$

$\Rightarrow x(x + 16) - 3(x + 16) = 0$

$\Rightarrow (x + 16)(x - 3) = 0$

$\Rightarrow x = -16, 3$

సమాధానం: 2

4. రెండు వరుస ధన సరిపూర్ణాంకాల వర్గాల మొత్తం 340. అయితే ఆ రెండు ధనపూర్ణాంకాలను కనుక్కోండి.

1) 10, 14 2) 12, 16 3) 12, 14 4) 10, 16

సాధన: రెండు వరుస ధన సరిపూర్ణాంకాలు 2x, (2x + 2) అనుకుందాం.

లెక్కప్రకారం, $(2x)^2 + (2x + 2)^2 = 340$

$\Rightarrow 8x^2 + 8x + 4 = 340$

$8x^2 + 8x - 336 = 0 \Rightarrow x^2 + x - 42 = 0$

$\Rightarrow x^2 + 7x - 6x - 42 = 0$

$\Rightarrow x(x + 7) - 6(x + 7) = 0$

$\Rightarrow (x - 6)(x + 7) = 0 \Rightarrow x = 6$ లేదా -7

ధనపూర్ణాంకం కావాలి కాబట్టి $x = 6$ తీసుకోవాలి

లెక్కలో కోరిన ధన పూర్ణాంకాలు $2x = 2 \times 6 = 12, 2x + 2 = 14$

సమాధానం: 3



తగ్గింపుతో కొనుగోలు చేస్తే ఒక్కో కలం విలువ?

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

5. $3(p^2 + q^2 + r^2) = (p + q + r)^2$ అయితే p, q, r మధ్య సంబంధం ఏమిటి?

1) $p = q \neq r$ 2) $p + q + r = 0$
3) $p \neq q \neq r$ 4) $p = q = r$

సాధన: $3(p^2 + q^2 + r^2) = (p + q + r)^2$

$3p^2 + 3q^2 + 3r^2 = p^2 + q^2 + r^2 + 2pq + 2qr + 2rp$

$2p^2 + 2q^2 + 2r^2 - 2pq - 2qr - 2rp = 0$

$p^2 - 2pq + q^2 + q^2 - 2qr + r^2 - 2rp + p^2 = 0$

$= (p - q)^2 + (q - r)^2 + (r - p)^2 = 0$

$= (p - q)^2 = 0 \Rightarrow p = q$

$= (q - r)^2 = 0 \Rightarrow q = r$

$= (r - p)^2 = 0 \Rightarrow r = p$

$= p = q = r$

సమాధానం: 4

6. $x^4 + \frac{1}{x^4} = 322, x > 1$ అయితే $\left(x^3 - \frac{1}{x^3}\right)$ ధన విలువ ఎంత?

1) 76 2) 84 3) 72 4) 80

సాధన: $x^4 + \frac{1}{x^4} = 322$

$= x^4 + \frac{1}{x^4} + 2 = 324 \Rightarrow \left(x^2 + \frac{1}{x^2}\right)^2 = 18^2$

$= x^2 + \frac{1}{x^2} = 18 \Rightarrow x^2 + \frac{1}{x^2} - 2 = 16$

$= \left(x - \frac{1}{x}\right)^2 = 16 \Rightarrow x - \frac{1}{x} = 4$

$= x^3 - \frac{1}{x^3} = \left(x - \frac{1}{x}\right)^3 + 3\left(x - \frac{1}{x}\right)$

$= 4^2 + 3(4) = 76$

సమాధానం: 1

7. 18 అనే సంఖ్యను రెండు భాగాలుగా విభజిస్తే, పెద్ద సంఖ్య వర్గానికి రెట్టింపు, చిన్న సంఖ్య వర్గాని కంటే 313 ఎక్కువ. అయితే ఆ సంఖ్యలను కనుక్కోండి.

1) 10, 8 2) 13, 5 3) 12, 6 4) 11, 7

సాధన: చిన్న సంఖ్య = x అనుకుంటే పెద్ద సంఖ్య = 18 − x

లెక్క ప్రకారం, $2(18 - x)^2 - x^2 = 313$

$\Rightarrow x^2 - 72x + 648 - 313 = 0 \Rightarrow x^2 - 72x + 335 = 0$

$\Rightarrow x^2 - 67x - 5x + 335 = 0 \Rightarrow x(x - 67) - 5(x - 67) = 0$

$= (x - 5)(x - 67) = 0 \Rightarrow x = 5$ లేదా 67

ఇక్కడ మనం తీసుకోవాల్సింది $x = 5$

$18 - x = 18 - 5 = 13 \Rightarrow \therefore x = 13, 5$

సమాధానం: 2

8. ప్రతి పెన్ను ధరను రూ.8 తగ్గిస్తే రూ.90కి నాలుగు పెన్నులు ఎక్కువ కొనుగోలు చేయగలం. అయితే ఒక్కో కలం విలువ ఎంత?

1) 30 2) 20 3) 16 4) 18

సాధన: ప్రతి పెన్ను ధర = రూ.x, పెన్నుల సంఖ్య = y అనుకుందాం.

లెక్కప్రకారం, $xy = 90 \Rightarrow y = \frac{90}{x}$

$(x - 8)(y + 4) = 90 \Rightarrow (x - 8)\left(\frac{90}{x} + 4\right) = 90$

$\Rightarrow (x - 8)(4x + 90) = 90x$

$\Rightarrow 4x^2 - 32x - 720 = 0$

$\Rightarrow x^2 - 8x - 180 = 0$

$\Rightarrow x^2 - 18x + 10x - 180 = 0$

$\Rightarrow x(x - 18) + 10(x - 18) = 0$

$\Rightarrow (x - 18)(x + 10) = 0$

$\Rightarrow x = 18, -10$

x = పెన్ను ధర = రూ.18.

సమాధానం: 4



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

916 Word of the Day

Despise

Telugu meaning: ద్వేషించడం, అసహ్యించుకోవడం

English meaning: The word despise (డిస్పైస్) is a verb that means to hate or dislike someone or something very strongly.

Synonyms: Hate, Loathe ; ***Antonyms:*** Love, Admire

Usage: **1.** She despised dishonesty and refused to work with people who lied for personal gain.

2. The citizens despise corruption because it weakens the nation's progress and trust.

కరెంట్ అఫైర్స్



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) ఆరోది, చివరిది అయిన ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన కీలక రేట్లను యథాతథంగా కొనసాగించింది. డిజిటల్ మోసాల బారిన పడిన వారికి పరిహారం; సూక్ష్మ- చిన్న, మధ్య తరహా కంపెనీ (ఎంఎస్ఎంఈ)లకు హామీ లేని రుణ మొత్తం పెంపు లాంటి కీలక ప్రకటనలు చేసింది. అంతర్జాతీయ అనిశ్చితులు పెరిగినా.. అమెరికా-ఐరోపాతో మన దేశానికి కుదిరిన వాణిజ్య ఒప్పందం వల్ల ఆర్థిక వ్యవస్థలో సానుకూల వాతావరణం కనిపిస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.



పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్ నిరోధక వ్యవస్థల తయారీకి సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (మెగాసాఫ్ట్)తో ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ భారీ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం, ఇంద్రజాల్ రూపొందించే కౌంటర్-డ్రోన్-వ్యవస్థలకు కీలకమైన రాడార్, సెన్సార్ స్కానింగ్, జామింగ్, స్పూఫింగ్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను సిగ్మా ప్రత్యేకంగా రూపొందించి, సరఫరా చేయనుంది.

అంతర్జాతీయ స్థాయిలో 40 మంది నిపుణులతో కృత్రిమమేధపై ఐక్యరాజ్యసమితి కొత్తగా ఏర్పాటు చేయనున్న స్వతంత్ర శాస్త్రీయ కమిటీకి ఐఐటీ-మద్రాస్ ప్రొఫెసర్ బలరామన్ రవీంద్రన్ ఎంపికయ్యారు. ఈ జాబితాలోని నిపుణులను ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ స్వయంగా సిఫార్సు చేశారు. మూడేళ్ల పాటు ఈ కమిటీ కొనసాగుతుంది.

అణ్వస్త్రాలను మోసుకెళ్లగల అగ్ని-3 బాలిస్టిక్ క్షిపణిని భారత్ 2026, ఫిబ్రవరి 6న విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరానికి చేరువలోని చాందీపూర్ నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలంపైనున్న లక్ష్యాలను ఛేదించగల ఈ అస్త్రం పరిధి 3 వేల కిలోమీటర్ల పైనేనని అధికారులు తెలిపారు.

- అధునాతన క్షిపణి అయిన అగ్ని-3.. ఇప్పటికే భారత సైనిక దళాల అమ్ములపొదిలో చేరింది. 1.5 టన్నుల పేలోడ్‌ను ఇది మోసుకెళ్లగలదు. దీని పొడవు 17 మీటర్లు. ఘన ఇంధనంతో పనిచేసే రెండు దశలు ఇందులో ఉన్నాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన న్యూజిలాండ్‌కు చెందిన ప్రముఖ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. అణు భౌతికశాస్త్ర (న్యూక్లియర్ ఫిజిక్స్) రంగంలో విశేష పరిశోధనలు చేశారు. అణు నిర్మాణం, రేడియోధార్మికత స్వభావంపై చేసిన ప్రయోగాలు ఎందరికో మార్గదర్శకమయ్యాయి. అణువుల్లో శక్తితో కూడిన కేంద్రకం ఉంటుందని కనిపెట్టింది ఈయనే. రూథర్‌ఫర్డ్ 'పరమాణు నమూనా'ను ప్రతిపాదించారు. రసాయనశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. అణు భౌతికశాస్త్ర పితామహుడిగా పేరొందిన ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్ జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం - వృత్తి జీవితం

- ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్ 1871, ఆగస్టు 30న న్యూజిలాండ్‌లోని స్ప్రింగ్ గ్రోవ్‌లో జన్మించారు. 1876లో ఫాక్స్‌హిల్ పాఠశాలలో చేరి, అక్కడ విద్య అభ్యసించారు. ఆ సమయంలోనే ఆయనకు సైన్స్ పట్ల ఆసక్తి ఏర్పడింది. పాఠశాలలో అన్ని స్థాయుల ఫిజిక్స్ పుస్తకాలను క్షుణ్నంగా చదివేవారు. 1883లో ఆయన కుటుంబం మార్ల్‌బరో సౌండ్స్‌లోని హావ్‌లాక్ పట్టణానికి వలస వెళ్లడంతో అక్కడి స్కూల్‌లో చదువు సాగించారు.
- 1887లో స్కాలర్‌షిప్ సాయంతో నెల్సన్ కాలేజియేట్ స్కూల్ (ప్రస్తుతం నెల్సన్ స్కూల్)లో మాధ్యమిక విద్యను అభ్యసించారు.
- 1889లో న్యూజిలాండ్ విశ్వవిద్యాలయంలోని కాంటర్‌బరీ కాలేజ్‌లో చదివేందుకు ఆయనకు స్కాలర్‌షిప్ లభించింది. 1894 వరకు అందులోనే అభ్యసించారు. అక్కడ చదివే సమయంలో సైన్స్ పట్ల తన ఆసక్తి మరింత ఎక్కువైంది.




- 1895లో రూథర్‌ఫర్డ్‌కు రాయల్ కమిషన్ ఫర్ ది ఎగ్జిబిషన్ ఆఫ్ 1851 రిసెర్చ్ ఫెలోషిప్ లభించింది. దీని సాయంతో ఆయన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కావెండిష్ ప్రయోగశాలలో చేరేందుకు ఇంగ్లండ్ వెళ్లారు. అక్కడ ఆయన ప్రముఖ ఆంగ్ల భౌతిక శాస్త్రవేత్త జె.జె.థామ్సన్ కింద పనిచేశారు.
- 1898 నుంచి 1907 వరకు మెక్‌గిల్ యూనివర్సిటీలో భౌతికశాస్త్రాన్ని బోధించారు. 1907లో ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనా, ఆయన చేసిన పరిశోధనలు - ఆవిష్కరణలు, ఆర్ఆర్‌బీ జేఈ, ఆర్ఆర్‌బీ టెక్నీషియన్ గ్రేడ్ 3, ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

ఉత్తర అమెరికా



ప్రపంచంలోని ఏడు ఖండాల్లో మూడో అతిపెద్ద ఖండం ఉత్తర అమెరికా. ఆర్థికంగా, సాంకేతికంగా, పారిశ్రామికంగా అభివృద్ధిలో ముందంజలో ఉంది. అధిక సంపన్నులను కలిగిన దేశాలు ఇక్కడే ఉన్నాయి. ఈ ఖండం ప్రపంచంలోని అనేక దేశాలకు దిశానిర్దేశం చేసే స్థాయికి ఎదిగింది. పోటీపరీక్షార్థులు ఈ ప్రాంత ఉనికి, సరిహద్దులు, భూస్వరూపాలు, శీతోష్ణస్థితి, వ్యవసాయం, రవాణా తదితరాలపై దృష్టి సారించాలి.

భారతదేశానికి సముద్రమార్గం కనుక్కోవాలనే ప్రయత్నంలో క్రిస్టోఫర్ కొలంబస్ ఉత్తర అమెరికాను కనుక్కున్నాడు. ఇది భారతదేశం కంటే 8 రెట్లు పెద్దది. ఈ ప్రాంతంలోని పనామా కాలువ వాణిజ్యపరంగా కీలకపాత్ర పోషిస్తుంది. చదువు, అవకాశాల కోసం ప్రపంచంలోని అనేక మంది యునైటెడ్ స్టేట్స్, కెనడా లాంటి దేశాలకు వెళ్తున్నారు.

సరిహద్దులు: ఈ ఖండానికి తూర్పున అట్లాంటిక్ మహాసముద్రం, పశ్చిమాన పసిఫిక్ మహాసముద్రం, ఉత్తరాన ఆర్కిటిక్ మహాసముద్రం, దక్షిణాన కరేబియన్ సముద్రాలు ఉన్నాయి. ఉత్తర, పశ్చిమార్ధ గోళాల్లో ఈ ఖండం ఉంది. ఇందులో మొత్తం 23 దేశాలు ఉన్నాయి.

ఉనికి, శీతోష్ణస్థితి, పరిశ్రమలు, రవాణా, నదీ వ్యవస్థ మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Executive Trainee Posts

Cochin Shipyard Limited, Kerala is inviting applications for Executive posts in departments of including Mechanical, Electrical, Civil, Safety, Human Resources, etc. The total number of posts is 64. The application fee is Rs.1000. Eligible candidates can apply online before 20 February 2026.

Scientific and Technical Officer Posts

The Bhabha Atomic Research Centre (BARC), Department of Atomic Energy, Mumbai is inviting applications for the Scientific Officer and Technical Officer posts. The total number of posts is 21. The last date for online applications is 27 February 2026.

Marine Engineer Posts

The Cochin Port Authority, Kerala is inviting applications for filling Marine Engineer posts. The total number of posts is 7. Eligible candidates can apply online before 23 February 2026.

Did You Apply..?

Today (February 9) is the last date for the following Jobs

- Andhra Pradesh State Eligibility Test (AP SET)-2025. ***Eligibility:*** Master's Degree.
- 54 Sports Quota Posts in RRC South Eastern Railway. ***Eligibility:*** Degree, Intermediate (12th class).
- 40 Deputy Manager jobs at NHAI. ***Eligibility:*** Degree.

For more information and other notifications - scan QR code

Sentence Improvement

Directions (Qs. 1 - 6): *Select the correct Active form of the given sentence.*

1. The confidential files were being examined by the investigation team.
A) The investigation team examined the confidential files.
B) The investigation team has examined the confidential files.
C) The investigation team was examining the confidential files.
D) The investigation team examines the confidential files.

2. The final decision has been announced by the committee.
A) The committee announced the final decision.
B) The committee has announced the final decision.
C) The committee announces the final decision.
D) The committee had announced the final decision.

3. The suspect was arrested by the police last night.
A) The police arrested the suspect last night.
B) The police arrest the suspect last night.
C) The police are arresting the suspect last night.
D) The police had arrested the suspect last night.

4. The project will be monitored by the senior manager.
A) The senior manager monitors the project.
B) The senior manager is monitoring the project.
C) The senior manager monitored the project.
D) The senior manager will monitor the project.

5. A new bridge is being constructed by the government.
A) The government constructs a new bridge.
B) The government has constructed a new bridge.
C) The government is constructing a new bridge.
D) The government constructed a new bridge.

6. The forms had been submitted by the applicants before the deadline.
A) The applicants submit the forms before the deadline.
B) The applicants had submitted the forms before the deadline.
C) The applicants were submitting the forms before the deadline.
D) The applicants have submitted the forms before the deadline.

SSC Exams

English

Directions (Qs. 7 - 11): *Select the correct Passive form of the given sentence.*

7. The engineers are inspecting the damaged bridge carefully.
A) The damaged bridge is being inspected carefully by the engineers.
B) The damaged bridge was inspected carefully by the engineers.
C) The damaged bridge has been inspected carefully by the engineers.
D) The damaged bridge is inspected carefully by the engineers.

8. The clerk will verify the documents tomorrow.
A) The documents are verified tomorrow by the clerk.
B) The documents will be verified tomorrow by the clerk.
C) The documents were verified tomorrow by the clerk.
D) The documents have been verified tomorrow by the clerk.

9. They completed the survey within two days.
A) The survey is completed within two days by them.
B) The survey has been completed within two days by them.
C) The survey was completed within two days by them.
D) The survey is being completed within two days by them.

10. The manager has approved the budget proposal.
A) The budget proposal has been approved by the manager.
B) The budget proposal was approved by the manager.
C) The budget proposal is approved by the manager.
D) The budget proposal is being approved by the manager.

11. The staff members are arranging the conference hall.
A) The conference hall is arranged by the staff members.
B) The conference hall was arranged by the staff members.
C) The conference hall has been arranged by the staff members.
D) The conference hall is being arranged by the staff members.

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

రంగులు మార్చి.. ఏమార్చే కృత్రిమ చర్మం!



బోలెడు ఉపయోగాలు..
ఈ స్మార్ట్ చర్మ సాంకేతికతతో అధునాతన ఎన్‌క్రిప్షన్ పరిజ్ఞానాలు, బయోమెడికల్ సాధనాలు, వాతావరణానికి తగ్గట్టు ప్రతిస్పందించే వ్యవస్థల రూపకల్పన వంటి రంగాల్లో ఈ ఆవిష్కరణ బాగా ఉపయోగపడవచ్చునని పేర్కొన్నారు.

- ఆక్టోపస్ ప్రేరణతో రూపొందించిన శాస్త్రవేత్తలు

సైన్స్, ఇంజినీరింగ్, పరిశ్రమల్లో కృత్రిమ పదార్థాలను వివిధ అవసరాలకు ఉపయోగిస్తుంటారు. అయితే వాటిలో చాలావరకు.. నిర్దిష్టంగా కొన్ని పనులకు ఉద్దేశించినవే మాత్రమే రూపొందినవి. తాజాగా అమెరికాలోని పెన్ స్టేట్ వర్సిటీకి చెందిన పరిశోధకులు బహుళ విధులు నిర్వర్తించగల స్మార్ట్ కృత్రిమ చర్మాన్ని తయారుచేశారు. పరిస్థితికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోగల ఈ పదార్థాలను వివిధ లక్ష్యాలను నెరవేర్చేలా ప్రోగ్రామ్ చేయవచ్చు. సమాచారాన్ని దాచేయడం, పరిసరాల్లో కలిసిపోవడం, మృదువైన రోబోటిక్ వ్యవస్థల రూపకల్పనకు ఈ సాంకేతికతలో వీలు కలుగుతుంది. జలచరమైన ఆక్టోపస్ తన చర్మ తీరుతెన్నులను వేగంగా మార్చుకోగలదు. శత్రు జీవిని ఏమార్చడానికి వీలుగా పరిసరాల్లో సులువుగా కలిసిపోవడానికి, తన జాతికి చెందిన మరో జీవితో కమ్యూనికేషన్ సాగించడానికి ఈ విధానాన్ని వాడుతుంది. దీని నుంచి స్ఫూర్తి పొందిన పరిశోధకులు కృత్రిమ, మృదువైన పదార్థాన్ని రూపొందించడానికి 4డీ ప్రింటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఈ ముద్రిత పదార్థం స్థిరంగా ఉండదు, పర్యావరణ పరిస్థితులకు స్పందనగా చురుగ్గా రూపురేఖలను మార్చుకుంటుందని వారు చెప్పారు. అందువల్లే ఈ ప్రక్రియను 4డీ ప్రింటింగ్‌గా పేర్కొంటున్నట్లు తెలిపారు.

✦ తాజా విధానం ద్వారా శాస్త్రవేత్తలు హైడ్రోజెల్‌తో ప్రోగ్రామ్‌కు వీలైన ఒక స్మార్ట్ చర్మాన్ని తయారుచేశారు. ఇది మృదువుగా, నీరు పుష్కలంగా ఉన్న పదార్థం. ఒకే వ్యవహారశైలి ఉండే సాధారణ కృత్రిమ పదార్థానికి భిన్నంగా ఈ స్మార్ట్ చర్మాన్ని అవసరమైనట్లుగా బహుళ విధాలుగా తీర్చిదిద్దుకోవచ్చు.

✦ వేడి, ఒత్తిడి, ద్రావణాల తాకిడికి స్పందనగా ఈ పదార్థం తన రూపురేఖలు, భౌతిక వ్యవహారశైలి, ఉపరితల తీరుతెన్నులు, ఆకృతిని మార్చుకుంటుంది.



ఎలా?

పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేయడానికి శాస్త్రవేత్తలు హాఫ్‌టోన్-ఎన్‌కోడింగ్ ప్రింటింగ్ విధానాన్ని ఉపయోగించారు. ఇది చిత్రం లేదా భౌతిక తీరుతెన్నుల డేటాను సున్నాలు, ఒకట్లలోకి మార్చింది. అనంతరం ఆ సమాచారాన్ని నేరుగా హైడ్రోజెల్ పదార్థంలోకి చొప్పించింది. చుక్కల పోకడల ద్వారా ఫొటోలను ముద్రించిన రీతిలో ఇది ఉంటుంది.

✦ ఈ డిజిటల్ పోకడలను చొప్పించడం ద్వారా భిన్న పరిస్థితులకు స్పందనగా స్మార్ట్ చర్మం స్పందించే తీరును ప్రోగ్రామ్ చేశారు.

✦ పదార్థంలోని భిన్న ప్రదేశాలు స్పందించే తీరును ముద్రిత పోకడలు నిర్దేశిస్తాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులు, ద్రవాలు, భౌతిక ఒత్తిడికి స్పందనగా కొన్ని ప్రాంతాలు ఉబ్బెత్తుగా మారొచ్చు. కొన్ని కుంచించుకుపోవడం లేదా మృదువుగా మారడం జరగొచ్చు.

✦ ఈ పోకడలను జాగ్రత్తగా డిజైన్ చేయడం ద్వారా పదార్థం మొత్తం వ్యవహారశైలిని పరిశోధకులు నియంత్రించగలిగారు. సూటిగా చెప్పాలంటే.. పరిసరాల్లోని మార్పులను బట్టి ప్రతిస్పందించి భిన్న తీరుపై ఈ చర్మానికి సూచనలు చేశారు.

✦ ఈ విధానం ద్వారా దృశ్య సమాచారాన్ని అవసరాన్ని బట్టి దాచేయడం, వెల్లడి చేయడం సాధ్యమవుతుంది. పరీక్షల్లో భాగంగా మోనాలిసా చిత్రాన్ని హైడ్రోజెల్ పొరపైకి చొప్పించారు. ఆ పదార్థాన్ని ఇథనాల్‌తో కడిగినప్పుడు అది పారదర్శకంగా మారింది. ఎలాంటి చిత్రం కనిపించలేదు. చల్లటి నీటిలో ఉంచినప్పుడు క్రమంగా వేడిచేసినప్పుడే ఆ చిత్రం కనిపించింది. ఇలా హైడ్రోజెల్‌పై ఎలాంటి చిత్రాన్నైనా ముద్రించొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

✦ ఒక ఉపయోగాలు.. పరిసరాల్లో కలిసిపోయేలా చేయడానికి, సమాచారాన్ని ఎన్‌క్రిప్ట్ చేయడానికి ఈ పరిజ్ఞానాన్ని వాడొచ్చు. కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లోనే అది బహిర్గతమవుతుంది.

✦ మొత్తంమీద ఆక్టోపస్ తన శరీర ఆకృతి, చర్మ తీరును సమన్వయం చేసుకుంటున్న రీతిలోనే కృత్రిమ చర్మం కూడా ఏకకాలంలో తన రూపును, ఆకృతిని నియంత్రించుకోగలదని పరిశోధకులు తెలిపారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

దలైలామాను లాగొద్దు

- ఎప్‌స్టీన్ ఫైళ్లపై అరుణాచల్ సీఎం పెమా ఖండు స్పష్టీకరణ



ఇటానగర్: ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా పేరుందని వచ్చిన వార్తలను అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు ఖండించారు. ఆయనను ఈ వివాదంలోకి లాగొద్దని సూచించారు. 'తప్పుడు సమాచారం ఆధారంగా గౌరవనీయమైన దలైలామా ఆధ్యాత్మిక సంస్థను అపఖ్యాతి పాల్జేసే ప్రయత్నం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యం. దీనిని ఖండిస్తున్నా' అని ఖండు ఎక్స్‌లో స్పందించారు. ✦ 'ఎప్‌స్టీన్ ఫైళ్లలో దలైలామా పేరుందని వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎప్‌స్టీన్‌ను గానీ, ఆయన ప్రతినిధులను గానీ దలైలామా ఎన్నడూ కలవలేదని స్పష్టంగా చెప్పదలుచుకున్నాం' అని దలైలామా కార్యాలయం విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది.

బ్రిటన్ ప్రధాని చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాజీనామా

లండన్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మోర్గాన్ మెక్ స్వీనీ వైదొలిగారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నట్లుగా ఆరోపణలొచ్చిన మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ రాయబారిగా నియమించడానికి ప్రధానికి సలహా ఇచ్చి పొరపాటు చేసినందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆదివారం మెక్ స్వీనీ వెల్లడించారు. స్వీనీ సలహాతోనే 2024లో మాండెల్సన్‌ను స్టార్మర్ అమెరికాలో రాయబారిగా నియమించారు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో ఆయన పేరు రావడంతో గత ఏడాది సెప్టెంబరులో తొలగించారు. ఈ విషయంలో ఇప్పటికే ప్రధాని స్టార్మర్ క్షమాపణలు చెప్పారు. తాజాగా ఆయన చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాజీనామా చేశారు. 'పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో రాయబారిగా నియమించాలని ప్రధానమంత్రికి సలహా ఇచ్చాను. ఆ నిర్ణయం తప్పు. ఆయన మా పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశారు. దేశం పరువు తీశారు. రాజకీయాల్లో విశ్వసనీయతకు నష్టం కలిగించారు. దీనికి నాదే పూర్తి బాధ్యత' అని స్వీనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ✦ మాజీ మంత్రి, రాయబారి, సీనియర్ రాజకీయవేత్త అయిన మాండెల్సన్.. లేబర్ పార్టీలో కీలక నాయకుడు. శుక్రవారం ఆయన ఇంట్లో, మరోచోట లండన్ మెట్రోపాలిటన్ పోలీసులు సోదాలు జరిపారు.

బురఖాతో మహిళల కంపార్ట్‌మెంట్‌లోకి ఆగంతుకుడు

- ముంబయి లోకల్ ట్రైన్‌లో ఘటన

ఇంటర్నెట్ డెస్క్: ముంబయిలో రద్దీగా ఉండే లోకల్ ట్రైన్‌లో ఓ ఆగంతుకుడు బురఖా ధరించి మహిళల కంపార్ట్‌మెంట్‌లోకి చొరబడటం కలకలం రేపింది.



అతడి అసాధారణ ప్రవర్తనతో మహిళా ప్రయాణికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అతన్ని చుట్టుముట్టి నిలదీశారు. బురఖాతో వచ్చింది పురుషుడని తెలియడంతో రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. తర్వాతి స్టేషన్‌కు చేరక ముందే నిందితుడు ఆ రైలు నుంచి దూకి మరో రైలు ఎక్కి పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. దొంగతనం చేయడానికే అతడు బురఖాతో వచ్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

శత్రు ఉపగ్రహాలపై నిఘా..!

- భారత్ ముందడుగు

ఇంటర్నెట్ డెస్క్: భారత అంతరిక్ష పరిశోధనల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఇటీవల పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక మైలురాయి సాధించింది. తమ ఉపగ్రహం నుంచి కక్ష్యలోని వస్తువులను చిత్రీకరించే స్వదేశీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది. దీంతో ఉపగ్రహాలపై నిఘా ఉంచే సామర్థ్యాన్ని భారత ప్రైవేటు రంగం సొంతం చేసుకున్నట్లయింది.

80 కిలోల భూపరిశీలన ఉపగ్రహం ఏఎఫ్‌ఆర్‌ను ఫాల్కన్-9 రాకెట్ ద్వారా అజిస్టా రెండున్నరేళ్ల క్రితం కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం విజయవంతంగా పనిచేస్తోన్న ఈ శాటిలైట్ మరో రెండున్నరేళ్ల సేవలు అందించగలదు. పరిశోధనల్లో భాగంగా ఏఎఫ్‌ఆర్ సాయంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని అజిస్టా విజయవంతంగా చిత్రీకరించింది. వీటికి సంబంధించి ఫిబ్రవరి 3న రెండు ప్రయోగాలను వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించింది. తొలి ప్రయోగాన్ని 300 కి.మీ దూరం నుంచి, రెండో ప్రయోగాన్ని 245 కి.మీ దూరం నుంచి చేసినట్లు వెల్లడించింది.

ఈ రెండు సందర్భాల్లోనూ వేగంగా తిరుగుతున్న ఐఎస్ఎస్‌ను ఏఎఫ్‌ఆర్ సెన్సర్లు స్పష్టంగా చిత్రీకరించాయని.. ట్రాకింగ్ అల్గోరిథమ్‌లు, ఎలక్ట్రో-ఆప్టికల్ ఇమేజింగ్ వందశాతం కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ రెండు సాంకేతికతలను దేశీయంగానే అభివృద్ధి చేశామని, కక్ష్యలోని వస్తువులను ట్రాక్ చేసేందుకు వీటిని ఉపయోగించవచ్చని అజిస్టా వెల్లడించింది.

కమ్యూనికేషన్, నేవిగేషన్, భూపరిశీలన, వ్యూహాత్మక అవసరాల కోసం ప్రస్తుతం భారత్ దాదాపు 50 శాటిలైట్లను నిర్వహిస్తోంది. వీటికి రక్షణ కల్పించేందుకు కక్ష్యలో ఇతర ఉపగ్రహాలు ఏం చేస్తున్నాయనే విషయం తెలుసుకోవడం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ నిఘా సామర్థ్యాలపై ఇస్రో ఇప్పటికే దృష్టి పెట్టగా. . వీటికి అజిస్టా వంటి ప్రైవేటు రంగ సంస్థల పరిశోధనలు మరింత దోహదం చేస్తాయని అంటున్నారు.

ఇరాన్‌లో నర్గిస్ మొహమ్మదీకి మరో ఏడున్నరేళ్ల జైలుశిక్ష

దుబాయ్: నోబెల్ శాంతి పురస్కార గ్రహీత నర్గిస్ మొహమ్మదీకి ఇరాన్‌లో మరో ఏడున్నరేళ్ల జైలుశిక్ష ఖరారైంది. ఈ విషయాన్ని ఆమె న్యాయవాది మొస్తాఫా నిలీ ధ్రువీకరించారు.



మషద్ నగరంలోని రెవల్యూషనరీ కోర్టు ఈ శిక్ష విధించినట్లు తెలిపారు. 53 ఏళ్ల నర్గిస్. . ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం, భద్రతా బలగాలతో ఘర్షణ వంటి అభియోగాలతో నమోదైన కేసులో ఇప్పటికే 13 ఏళ్ల 9 నెలల జైలుశిక్ష అనుభవిస్తున్నారు. వైద్యపరమైన కారణాలతో పెర్లోపై బయటకు వచ్చిన ఆమెను పోలీసులు గత డిసెంబరులో మళ్లీ అరెస్టు చేశారు. మరోసారి భద్రతాబలగాలతో ఘర్షణ, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం ఆరోపణలను మోపారు. దీంతో తాజాగా ఆమెకు ఏడున్నరేళ్ల జైలుశిక్ష పడింది. తన అరెస్టుకు నిరసనగా ఈ నెల 2 నుంచి నర్గిస్ జైలులో నిరాహార దీక్ష చేస్తున్నట్లు సమాచారం.



మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ప్రవాస భారతీయుల సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు వేడుకలో కంజీరా వాయిస్తున్న ప్రధాని మోదీ

పీడబ్ల్యూబీడీ కోసం యూపీఎస్సీ సవరణ

దిల్లీ: బెంచ్‌మార్క్ డిసేబిలిటీ (పీడబ్ల్యూబీడీ) ఉన్న అభ్యర్థుల కోసం పరీక్షా కేంద్రాల కేటాయింపుల విధి విధానాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సవరించింది. దీని ప్రకారం.. సివిల్ సర్వీసెస్ పరీక్ష-2026, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష- 2026లకు పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పరీక్షా కేంద్ర సామర్థ్యంపై ఎటువంటి పరిమితి ఉండదు. 'పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు కేంద్రాలను ఎంచుకునే ప్రక్రియ మునుపటిలాగే కొనసాగుతుంది. వారు ఎంచుకున్న పరీక్షా కేంద్రంలో ఇబ్బందులు లేకుండా, అవసరమైన చోట అదనపు సామర్థ్యం ఉండేలా చర్యలు తీసుకుంటాం' అని యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు.

11 ఏళ్ల తరువాత ప్రభుత్వ లాయర్ల ఫీజు పెంపు

దిల్లీ: దేశవ్యాప్తంగా కోర్టుల్లో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించే న్యాయవాదుల ఫీజును కేంద్రం దాదాపు 11 ఏళ్ల తరువాత పెంచింది. రెగ్యులర్ అప్పీళ్లు, ఇతర పిటిషన్లపై తుది విచారణకు హాజరయ్యే గ్రూప్ ఏ కౌన్సిళ్ల ఫీజు గతంలో రూ.13,500 ఉండగా.. ఇప్పుడు రోజుకు, ఒక కేసుకు రూ.21,600 చేశారు. గ్రూప్ బీ, గ్రూప్ సీ కౌన్సిళ్లకు రూ.9 వేలుగా ఉన్న ఫీజును రూ.14,400కి పెంచారు. ప్రభుత్వ న్యాయవాదులకు చెల్లించాల్సిన రుసుమును చివరిసారిగా 2015 అక్టోబరులో సవరించారు. ఇతర విభాగాల కేసులు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేయడానికి చెల్లించే రుసుములనూ సవరించారు. అలాగే తాము ఉన్న చోట కాకుండా బయటి కోర్టులకు హాజరయ్యే ప్రభుత్వ న్యాయవాదులకు చెల్లించే ఫీజులను కూడా పెంచారు.

ఉగ్రవాద సంస్థలకు భారత్ నిధులందిస్తోంది

- పాక్ మంత్రి తీవ్ర ఆరోపణలు

లాహోర్: ఇస్లామాబాద్‌లోని ఓ మసీదు సమీపంలో జరిగిన ఆత్మాహుతి దాడి ఘటనపై పాకిస్థాన్ మళ్లీ కారుకూతలు కూసింది. తమ దేశంలోని ఉగ్ర సంస్థలకు భారత్ నిధులందిస్తోందని ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి మోహసిన్ నఖ్వీ ఆరోపణలు చేశారు. దాడిలో ఐసిస్, తాలిబాన్ పేర్లు బయటకు వస్తున్నాయని చెప్పారు. వారికి నిధులు, లక్ష్యాలు భారత్ నుంచే వస్తున్నాయని ఆరోపించారు. మొదట్లో ఉగ్రవాదులకు 500 డాలర్లు అందేవని, ఇప్పుడు 1,500 డాలర్లు వస్తున్నాయని అన్నారు. ఎవరో వారి బడ్జెట్ పెంచుతున్నారని అన్నారు. మసీదు దాడిలో ప్రధాన సూత్రధారైన అఫ్గాన్ పౌరుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

'బిహార్ నవనిర్మాణ్ యాత్ర'కు ప్రశాంత్ కిశోర్ శ్రీకారం

బెతియా: జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ 'బిహార్ నవనిర్మాణ్ యాత్ర'కు శ్రీకారం చుట్టారు. బిహార్‌లోని వెస్ట్ చంపారన్ జిల్లా నుంచి ఆదివారం ప్రారంభమైన ఈ యాత్ర.. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తుందని కిశోర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నిజాయతీ, జవాబుదారితనం కలిగిన రాజకీయ ప్రత్యామ్నాయ పార్టీగా జన్ సురాజ్ అవతరించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం కూడా ప్రజల్లో పార్టీ క్రియాశీలకంగా ఉందని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ మేరకు అందాయో ఈ యాత్ర ద్వారా తెలుసుకోనున్నామని ఆయన తెలిపారు.

రష్యాలో భారతీయులపై దాడి చేసిన బాలుడిలో నియోనాజీ భావజాలం!

మాస్కో: రష్యాలో భారతీయ విద్యార్థులపై కత్తితో దాడి చేసిన బాలుడు నియోనాజీ భావజాలానికి ప్రభావితమైనట్లు తేలింది. 15 ఏళ్ల ఆ బాలుడు నిషేధిత వైట్ పవర్/ నేషనల్ సోషలిజం సంస్థకు చెందినవాడిగా భావిస్తున్నారు. దీనిని 2012లోనే ఉగ్రవాద సంస్థగా రష్యా సుప్రీం కోర్టు ప్రకటించింది. దాడి సమయంలో బాలుడు కొన్ని నినాదాలు చేశాడు. బాధితుల రక్తంతో అతడు డార్మెటరీ గోడలపై నాజీ గుర్తును చిత్రీకరించినట్లు స్థానిక రెన్ టీవీ వెల్లడించింది. దాడి జరిగిన ప్రదేశం మొత్తం రక్తపు మడుగుగా మారింది. నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో ఇద్దరు పోలీసు అధికారులు గాయపడినట్లు మేజర్ జనరల్ ఇరిన వోల్క్ వెల్లడించారు. మరోవైపు దాడిలో గాయపడిన నలుగురు భారతీయ విద్యార్థులు కోలుకుంటున్నట్లు కాన్సులర్ అధికారులు తెలిపారు. ఉఫాలోని స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో జరిగిన దాడిలో వీరితోపాటు మొత్తం ఆరుగురు గాయపడిన సంగతి తెలిసిందే.

సూరజ్‌కుండ్ ఎగ్జిబిషన్‌లో తెగిపడిన ఊయల

- బాధితులను రక్షించే యత్నంలో ఇన్‌స్పెక్టర్ మృతి



ఫరీదాబాద్: హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లఖర్‌పుర్ గ్రామంలోని సూరజ్‌కుండ్ ఫెయిర్‌గ్రౌండ్స్‌లో జరుగుతున్న అంతర్జాతీయ చేతివృత్తుల మేళాలో ఓ భారీ ఊయల (సునామీ స్వింగ్) అనూహ్యంగా తెగిపోయింది. ఇది మొదట ఒకపక్కకు ఒరిగి, ఆ తర్వాత పూర్తిగా నేలకూలింది. ఆ సమయంలో దానిపై 19 మంది సందర్శకులున్నారు. వీరిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఇన్‌స్పెక్టర్ జగదీశ్ ప్రసాద్(58) తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. ఘటనలో మరో 12 మందికి గాయాలయ్యాయి. ప్రసాద్ వచ్చే నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. శనివారం సాయంత్రం 6 గంటలకు జరిగిన ప్రమాద ఘటనలో గాయపడిన వారిలో ముగ్గురు పోలీసు సిబ్బంది ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ జగదీశ్‌కు హరియాణా ప్రభుత్వం అమరవీరుడి హోదా కల్పించింది. ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు పూర్తిచేసింది. ఆ కుటుంబానికి రాష్ట్ర డీజీపీ అజయ్ సింఘాల్ రూ.కోటి పరిహారాన్ని ప్రకటించారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇస్తామని తెలిపారు. తీవ్రంగా గాయపడినవారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఊయల నిర్వాహకుడు మహమ్మద్ షకీర్ సహా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ ఆదేశించారు.



వెనెజువెలా ప్రతిపక్ష నేత విడుదల

కారకాస్: వెనెజువెలా ప్రతిపక్ష నేత జువాన్ పబ్లో గ్వానిపా ఆదివారం విడుదలయ్యారు. గత 8 నెలలుగా రాజధాని కారకాస్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఆయన ఉన్నారు. ప్రవాసంలో ఆశ్రయం పొందుతున్న మరియా కొరీనా మచాడోకు ఆయన అత్యంత సన్నిహితుడు. గత ఏడాది మే నెలలో గ్వానిపాను ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారనే కారణంతో నిర్బంధించారు. డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. డిటెన్షన్‌లో ఉన్న నేతలందరినీ విడుదల చేయాలని ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



రష్యా క్షిపణి దాడితో ఉక్రెయిన్‌లోని దొనెట్స్క్ రీజియన్ క్రమటోర్స్క్‌లో ధ్వంసమైన అపార్ట్‌మెంట్

పసిడి పూతతో పెయింటింగ్స్.. అదరహో గోపాల్!

బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నవేళ.. హరియాణాలోని సూరజ్‌కుండ్ అంతర్జాతీయ హస్తకళల మేళాలో ఓ స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పసిడి పూతతో ఉన్న పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తుండటమే అందుకు కారణం. రాజస్థాన్ రాజధాని జైపుర్‌కు చెందిన హస్తకళాకారుడు గోపాల్‌ప్రసాద్ శర్మ వాటిని తీర్చిదిద్దారు. 24 క్యారెట్ల



బంగారంతో గోపాల్‌ప్రసాద్ తీర్చిదిద్దిన కళాఖండాలు ఇప్పటికే ఆయనకు 36కు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను తెచ్చిపెట్టాయి. వాటిలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, కేంద్రప్రభుత్వం అందించిన జాతీయ మెరిట్ అవార్డు, రాజస్థాన్ సర్కారు ఇచ్చిన శిల్పరత్న అవార్డు వంటివి ఉన్నాయి. రామ దర్బార్‌తోపాటు మహాత్మా గాంధీ, మహారాణా ప్రతాప్, మదర్ థెరిస్సా వంటి అనేక మంది గొప్ప వ్యక్తుల చిత్రాలకు బంగారంతో గోపాల్‌ప్రసాద్ రూపునిచ్చారు. ఆయన రూపొందించిన దాదాపు 500 పెయింటింగ్స్‌ను సూరజ్‌కుండ్ మేళాలో ప్రదర్శనకు ఉంచారు. వాటి ధర రూ.500 నుంచి రూ.10 లక్షల వరకు ఉంది.

అకాల వర్షాలు, కీటక సమస్యలకు నెట్‌హౌస్‌తో చెక్!

అకాల వర్షాలు, కీటకాలు రైతులకు చాలా ఇబ్బందుల్ని తెచ్చిపెడుతుంటాయి. ఆ సమస్యల్ని తప్పించేందుకు- పర్యావరణహిత నెట్‌హౌసింగ్ అనే సాగు పద్ధతిని ప్రోత్సహిస్తోంది గుజరాత్ ప్రభుత్వం. ఇందులో భాగంగా రైతులకు 65% రాయితీతో నెట్‌హౌస్‌లను అందిస్తోంది. ఈ విధానంలో పంటల నాణ్యత పెరుగుతోందని, రైతులకు అధిక ధరలు గిట్టుబాటు అవుతున్నాయని భావ్‌నగర్ హార్టికల్చర్ విభాగం అధికారి ఎంబీ వాఘమాసీ తెలిపారు. పర్యావరణానికీ మేలు కలుగుతోందని చెప్పారు. ప్రస్తుతం భావ్‌నగర్ జిల్లాలో 55 స్వయం ఉపాధి నర్సరీ యూనిట్లు నెట్‌హౌస్‌లతో పనిచేస్తున్నాయని వెల్లడించారు.



నాడు డబ్బుల్లేక గుడిలో నివాసం.. నేడు ఉగాండాలో బడా వ్యాపారవేత్త

- గుజరాత్ నుంచి వలస వెళ్లిన హర్షద్‌భాయ్ విజయగాథ ఇదీ..

వీధి వ్యాపారిగా ఉగాండాలో జీవితాన్ని ప్రారంభించిన ఓ వ్యక్తి.. ప్రస్తుతం ఆ దేశంలో బడా వ్యాపారవేత్తగా ఎదిగారు. గుజరాత్‌లోని మెహసానా జిల్లా విస్నగర్ నుంచి వలస వెళ్లిన హర్షద్‌భాయ్ విజయగాథ ఇది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం వలసదారుడిగా ఉగాండాకు చేరుకున్న హర్షద్.. చేతిలో ఎక్కువ డబ్బు లేకపోవడంతో వీధి వ్యాపారిగా జీవితాన్ని ప్రారంభించారు. ఒక గుడిలో నివసిస్తూ.. చిన్నచిన్న వస్తువులు అమ్ముతూ జీవనం సాగించారు. తర్వాత స్థిరాస్తి రంగంలో అడుగుపెట్టారు. 'తిరుపతి హర్ష్' పేరిట కంపెనీని ప్రారంభించారు. క్రమంగా వ్యాపారంలో మంచి స్థాయికి చేరుకున్నారు. ఉగాండాలో అనేక ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య, నివాస ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. వేల మందికి ఉపాధి కల్పించారు. తమ దేశ అభివృద్ధికి హర్షద్ చేసిన కృషిని గుర్తించి.. ఉగాండా అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన 'ది డిస్టింగ్విష్డ్ ఆర్డర్ ఆఫ్ ది క్రెస్టెడ్ క్రేన్ (గ్రాండ్ ఆఫీసర్)'ను ఆయనకు అక్కడి ప్రభుత్వం ప్రదానం చేసింది.



ఐటీ ఉద్యోగం వదిలి చేపల పెంపకం.. ఏటా రూ.లక్షల ఆర్జన

ఆమె ఉన్నత చదువులు చదువుకున్నారు. మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగం చేశారు. తర్వాత ఓ కోచింగ్ సెంటర్ పెట్టారు. కానీ ఆ పనులేవీ సంతృప్తినివ్వలేదు. దీంతో- చేపల పెంపకం మొదలుపెట్టి ఏటా రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌కు చెందిన భవానీ ఝా స్ఫూర్తిదాయక గాథ ఇది.



భవాని 2007లో ఐటీ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. అనంతరం హైదరాబాద్‌లో రెండేళ్లు ఉద్యోగం చేశారు. పెళ్లయ్యాక జబల్‌పుర్‌కు తిరిగివెళ్లి కోచింగ్ సెంటర్ ప్రారంభించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. కొవిడ్ విజృంభణతో కోచింగ్ సెంటర్ మూతపడటంతో.. చేపల పెంపకాన్ని ఎంచుకున్నారు. ఏమాత్రం అనుభవం లేకున్నా.. సవాలుగా స్వీకరించి పని మొదలుపెట్టారు. జబల్‌పుర్‌కు 15 కిలోమీటర్ల దూరంలోని హినోటియా గ్రామంలో 4.5 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. పాలిథీన్ షీట్‌తో లైనింగ్ వేసే అత్యాధునిక విధానాన్ని అనుసరిస్తూ.. పంగాసియస్ చేపల పెంపకం ప్రారంభించారు. ప్రస్తుతం ఏటా 20-30 టన్నుల చేపలను విక్రయిస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

నేరం చేస్తారు.. దుస్తులు మారుస్తూ.. ఏమారుస్తారు!

■ ఇటీవల హైదరాబాద్ పార్శిగుడలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు 500 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఎక్కడా ఆధారం దొరకలేదు. ఒక మహిళ గంటల వ్యవధిలో చీర, జీన్స్, నైటీ ధరించినట్లు గుర్తించారు. అనంతరం అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. 'దొంగతనం తర్వాత పోలీసుల దృష్టి మరల్చేందుకే దుస్తులు మార్చుకుంటానంటూ' నిందితురాలు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.

■ కోఠిలోని బ్యాంకు స్ట్రీట్‌లో జనవరి 3న ఏటీఎంలో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన వస్త్ర వ్యాపారిపై కాల్పులు జరిపిన అంతర్రాష్ట్ర దొంగలు రూ.6 లక్షలు దోచుకొని బాధితుడి బైక్ పైనే పారిపోయారు. మార్గం మధ్యలో కాచిగూడలో ఆగి.. దుస్తులు మార్చుకున్నారు. సాయంత్రం చాంద్రాయణగుట్టలో కొత్త దుస్తులు కొనుగోలు చేశారు. వాటిని ధరించి దర్జాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొంతూరుకు వెళ్లిపోయారు.

● పోలీసులకు చిక్కకుండా ఆడ, మగ దొంగల ఎత్తుగడలు



ఇటీవల కోఠిలో దోపిడీకి పాల్పడి.. కాచిగూడ ప్రాంతంలో దుస్తులు మార్చుకుంటున్న దొంగలు

ఈనాడు, హైదరాబాద్: దొంగతనాలు.. దోపిడీలు.. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నేరస్థులు ఆధారాలు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొట్టేసిన సొత్తును సురక్షిత ప్రాంతానికి తరలించే వరకు.. చిక్కకుండా ఉండేందుకు కొత్త పన్నాగాలు పన్నుతున్నారు. మార్గంమధ్యలో వేర్వేరు రకాల దుస్తులు మారుస్తూ గమ్యాన్ని చేరుతున్నారు. 'ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పలు దొంగతనాలు, దోపిడీ కేసుల దర్యాప్తులో పోలీసులు ఈ కోణాన్ని గుర్తించారు. 3 నెలల వ్యవధిలో సుమారు 10 చోరీ కేసులను విశ్లేషించినప్పుడు కొందరు నిందితులు ఏకంగా ఎనిమిది చోట్ల ఆగి రకరకాల దుస్తులు ధరిస్తూ మస్కా కొట్టే ప్రయత్నం చేశారు' అని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

దర్యాప్తు ప్రక్రియపై అవగాహనతో..

ఇళ్లలో చోరీలు.. చైన్ స్నాచింగ్, దోపిడీలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తు అధికారులు ముందుగా నేరం జరిగిన ప్రాంతం లేదా సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తారు. నిందితులు ధరించిన దుస్తులు, పాదరక్షలు, నడక, వేషభాషలను విశ్లేషిస్తారు. ఆయా వివరాలను రాష్ట్రవ్యాప్తంగా ఠాణాలకు చేరవేసి అప్రమత్తం చేస్తారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు దొరికిన పక్షంలో అవి పాత నేరస్థులవా, కొత్త వ్యక్తులు నేరాల బాట పట్టారా అనే అంచనాకూ వస్తారు. పాత నేరస్థులేనని గుర్తించిన పక్షంలో..వారు చివరిగా ఏ కేసులో అరెస్టయ్యారు, ఏ జైలు నుంచి విడుదలయ్యారు తదితర వివరాల ఆధారంగా నిందితుడి ఆచూకీ తెలుసుకుంటారు. 'ఈ దర్యాప్తు క్రమంపై అవగాహన ఉన్న నేరగాళ్లు ఎప్పుడూ కొత్త మార్గాలు ఎంచుకుంటున్నారు. జైళ్లలో ఏర్పడిన పరిచయాలు, నేరగాళ్లు పంచుకునే అనుభవాలతో కొత్త నేర పాఠాలు నేర్చుకుంటున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, దిల్లీలకు చెందిన దొంగలు నేరం చేశాక ఆనవాళ్లు దొరక్కుండా.. దుస్తులు మారుస్తూ తప్పించుకుంటున్నారు. ఉదాహరణకు ఇటీవల హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ ప్రాంతంలో వరుస చోరీలకు పాల్పడిన ఘరానా దొంగ.. ఇంట్లోకి నడుచుకుంటూ వెళ్లాడు. సొత్తు కొట్టేశాక ఒక్క కాలితో కుంటుకుంటూ బయటికి వచ్చాడు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరానికి చెందిన నేరస్థుడు హైదరాబాద్ శివార్లలోని ఇళ్లను ఎంచుకుంటాడు. చోరీకి వెళ్లే సమయంలో రెండు, మూడు చొక్కాలు ధరిస్తాడు. చోరీ చేసి బయటికి వచ్చేటప్పుడు మరో చొక్కా.. తర్వాత మార్గంమధ్యలో మరో చొక్కా మారుస్తాడు' అని సైబరాబాద్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. 'ఎంతటి కరడుగట్టిన నేరస్థుడైనా ఒక చిన్న ఆధారంతో పట్టుబడటం ఖాయం. జైలు పరిచయాలు, యూట్యూబ్ వీడియోలు, సినిమాల్లో మాదిరిగా నేరాలు చేసి తప్పించుకోవచ్చని నిందితులు ఆలోచిస్తున్నారు. ఇదంతా భ్రమేననే విషయాన్ని గుర్తించాలి' అని సైబరాబాద్ పరిధిలోని ఏసీపీ ఒకరు వివరించారు.

శాప్ లీగ్స్ పోటీలకు అర్హతలివీ..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో ఉన్న క్రీడాకారుడి ప్రతిభను సైతం వెలికి తీసి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో వారు మెరిసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ సంవత్సరం పొడవునా శాప్ లీగ్స్ పేరుతో క్రీడా సంబరాలు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించింది. ఈ నెల 17 నుంచి డిసెంబర్ 28 వరకు 26 జిల్లాల్లో 31 క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయిలో శాప్ లీగ్స్ పేరుతో పోటీలు జరుగుతాయి.

● ఎంపిక ప్రక్రియ జిల్లా స్థాయిలో ఉంటుంది.
● జిల్లా స్థాయిలో టోర్నమెంట్ నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు
● జిల్లాకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుడు కచ్చితంగా ఆ జిల్లావాసి అయి ఉండాలి
● పోటీలు రాష్ట్రస్థాయిలో జరుగుతాయి
● వయోపరిమితి ఆయా క్రీడాంశాల మీద ఆధారపడి ఉంటుంది
● అర్హత గలవారు క్రీడాయాప్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీల్లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ఇప్పటి వరకూ నిర్ణయించిన ప్రకారం ఈ కింది తేదీలు, ప్రాంతాల్లో ఆయా క్రీడా పోటీలు జరుగుతాయి. వీటిలో మార్పులు జరిగే అవకాశం ఉంది

క్ర. సంఖ్య	క్రీడలు	ఆతిథ్య జిల్లా	సెలక్షన్స్ తేదీ	పోటీలు నిర్వహించే తేదీలు
1.	చెస్	తిరుపతి	ఫిబ్రవరి 17	ఫిబ్రవరి 21, 22
2.	సైక్లింగ్	ఎన్టీఆర్	ఫిబ్రవరి 24	ఫిబ్రవరి 28, మార్చి 1
3.	లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో హైలెవల్ జావెలిన్, 4×100 రిలే	గుంటూరు	మార్చి 10	మార్చి 14, 15
4.	బ్యాడ్మింటన్(మాస్టర్స్)	డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	మార్చి 17	మార్చి 21, 22
5.	టెన్నిస్ (మాస్టర్స్)	విజయనగరం	మార్చి 24	మార్చి 28, 29
6.	వాటర్ స్పోర్ట్స్	ఎన్టీఆర్	ఏప్రిల్ 7	ఏప్రిల్ 11, 12
7.	లాన్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్	ఎన్టీఆర్	ఏప్రిల్ 14	ఏప్రిల్ 18, 19
8.	ఆర్చరీ	ఎన్టీఆర్	ఏప్రిల్ 21	ఏప్రిల్ 25, 26
9.	ఫుట్‌బాల్	అనంతపురం	మే 5	మే 9, 10
10.	బీచ్ వాలీబాల్	ఎన్టీఆర్	మే 12	మే 16, 17
11.	అథ్లెటిక్స్	గుంటూరు	మే 19	మే 23, 24
12.	బాక్సింగ్	విశాఖపట్నం	మే 26	మే 30, 31, జూన్ 1
13.	వెయిట్ లిఫ్టింగ్	ఏలూరు	జూన్ 9	జూన్ 13, 14
14.	ఈత	కర్నూలు	జూన్ 16	జూన్ 20, 21
15.	హ్యాండ్‌బాల్	ఏలూరు	జూన్ 23	జూన్ 27, 28, 29
16.	వాలీబాల్	విజయనగరం	సెప్టెంబర్ 8	సెప్టెంబర్ 12, 13
17.	జిమ్నాస్టిక్స్	కాకినాడ	సెప్టెంబర్ 15	సెప్టెంబర్ 19, 20
18.	బ్యాడ్మింటన్	కాకినాడ	సెప్టెంబర్ 22	సెప్టెంబర్ 26, 27
19.	జూడో	ప్రకాశం	అక్టోబర్ 6	అక్టోబర్ 10, 11
20.	హాకీ	కడప	అక్టోబర్ 13	అక్టోబర్ 23, 24, 25
21.	బీచ్ ఫుట్‌బాల్	నెల్లూరు	అక్టోబర్ 27	అక్టోబర్ 30, 31
22.	ఖోఖో	అనకాపల్లి	నవంబర్ 3	నవంబర్ 13, 14, 15
23.	కబడ్డీ	అనకాపల్లి	నవంబర్ 17	నవంబర్ 21, 22, 23
24.	రైఫిల్ షూటింగ్	తిరుపతి	నవంబర్ 25	నవంబర్ 28, 29
25.	పారా స్పోర్ట్స్(అథ్లెటిక్స్)	ఏలూరు	నవంబర్ 25	నవంబర్ 28, 29
26.	పారా స్పోర్ట్స్ (స్విమ్మింగ్)	"	"	"
27.	పారా రైఫిల్ షూటింగ్	ఎన్టీఆర్	నవంబర్ 25	నవంబర్ 30
28.	బీచ్ హ్యాండ్‌బాల్	విశాఖ	డిసెంబర్ 1	డిసెంబర్ 5, 6
29.	బీచ్ కబడ్డీ	బాపట్ల	డిసెంబర్ 8	డిసెంబర్ 12, 13
30.	బీచ్ సెపాక్ టాక్రా	బాపట్ల	డిసెంబర్ 15	డిసెంబర్ 19, 20
31.	బాస్కెట్‌బాల్	చిత్తూరు	డిసెంబర్ 22	డిసెంబర్ 26, 27, 28

సీఎం అధ్యక్షతన నేడు మంత్రులు, కార్యదర్శుల సమావేశం

● వర్చువల్‌గా పాల్గొననున్న కలెక్టర్లు, ఎస్పీలు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం సోమవారం జరగనుంది. వెలగపూడిలోని సచివాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలూ వర్చువల్‌గా ఇందులో పాల్గొంటారు. జీఎస్‌డీపీ, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పదిసూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం సమీక్షించనున్నారు. రాష్ట్రానికి వచ్చిన వివిధ పెట్టుబడులు, ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన పీపీపీ ప్రాజెక్టుల పురోగతి అంశాలపై కూడా చర్చ జరగనుంది. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపైనా చంద్రబాబు సమీక్షిస్తారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో శాఖలు తీసుకోవాల్సిన కార్యాచరణ, చేరుకోవాల్సిన లక్ష్యాలపై మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు, ఎస్పీలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

ఉపాధి నిధుల లక్ష్యం రూ.3,310 కోట్లు

● కేంద్రం నుంచి రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ యత్నం
● సగంలో ఉన్న పనులు పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశం
● ఏప్రిల్ 1 నుంచి జీరామ్‌జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో చర్యలు

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకం వచ్చే నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో సగంలో ఉన్న పనులు పూర్తిచేయించి కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు సహా మొత్తం రూ.3,310 కోట్లు రాబట్టేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఒకవైపు పనులు పూర్తిచేయిస్తూనే.. ఇంకోవైపు అంతే వేగంగా నరేగా పోర్టల్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. ఆ శాఖ కమిషనర్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈ నెల 1 నుంచి 7 వరకు జిల్లాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులపై సమీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి వీబీ జీరామ్‌జీ అమల్లోకి రానుంది. ఇందుకోసం రాష్ట్రానికి వచ్చే నెలలో కేంద్రం నిధులు కేటాయించనుంది. ఇందులో రాష్ట్రప్రభుత్వ వాటా 40% నిధులు సమకూర్చాలి. ఇందుకోసం అధికారులు ఇప్పటికే ముందస్తు ప్రణాళికలు తయారుచేశారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లోనూ జీరామ్‌జీ కోసం రూ.3వేల కోట్ల నుంచి రూ.4వేల కోట్లు రాష్ట్ర వాటా కింద చూపించే అవకాశాలున్నాయి.

వివిధ దశల్లో రూ.1,800 కోట్ల పనులు

జీరామ్‌జీ అమలుల్లోకి వచ్చేలోగా 2025-26లో ఉపాధిలో మెటీరియల్ నిధులతో ప్రారంభించి ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న దాదాపు రూ.1,800 కోట్ల విలువైన పనులు మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో రహదారులు, కాలువలు, పంచాయతీ భవనాలు, ఇతర పనులు ఉన్నాయి. 2025-26లో ఇప్పటివరకు పూర్తిచేసిన పనులకు కేంద్రం నుంచి రూ.1,400 కోట్లు రావాలి. వీటి బిల్లులు ఇప్పటికే అప్‌లోడ్ చేశారు. 2024-25లో పూర్తిచేసిన పనులకు మరో రూ.110 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.3,310 కోట్లు మార్చి నెలాఖరులోగా కేంద్రం విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోంది. ఇందుకోసం సగంలో ఉన్న పనులు నెలాఖరులోగా పూర్తిచేయించి బిల్లుల చెల్లింపుల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరపాలని యోచిస్తోంది.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి: మాధవ్

ఈనాడు, అమరావతి: పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం దేవరపల్లి ఆశ్రమ బాలుర వసతిగృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కోరారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

మన్ కీ బాత్ వీక్షణ ఏర్పాట్లకు భాజపా కమిటీ

ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు చేసేందుకు కమిటీని నియమించినట్లు భాజపా ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కమిటీకి ఇన్‌ఛార్జ్‌గా నాగోతు రమేశ్‌నాయుడు, కన్వీనర్‌గా సునీల్‌రెడ్డి వ్యవహరించనున్నారని తెలిపింది.

పశు పరిశోధనలో వందేళ్లు

● ఒంగోలు జాతి పరిరక్షణలో లాంఫామ్ కేంద్రం విశేష కృషి



లాంఫామ్‌లోని పశుపరిశోధనా కేంద్రంలో ప్రయోగశాల

ఈనాడు, అమరావతి: రాజసానికి మారుపేరుగా నిలిచే ఒంగోలు జాతి పశువుల పరిరక్షణకు గుంటూరు సమీపంలోని లాం ఫామ్ కేంద్రంగా ఏర్పడిన పరిశోధన కేంద్రం శత వసంతాలకు చేరుకుంది. ఒంగోలు జాతి పశువుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతున్న తరుణంలో వాటి సంరక్షణ, విస్తరణ, వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణకు విశేష కృషిచేస్తున్న ఈ సంస్థ 1926లో ఏర్పాటైంది. ఈ కేంద్రం కృషితో.. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఒంగోలు జాతి పశువుల సంఖ్య పెరిగింది. పాలు, వెన్న, కోడెదూడల అమ్మకంతో రైతులు ఆదాయం గడించేవారు. ఈ ప్రభావంతో తమిళనాడులోని కోయంబత్తూరు, కర్ణాటకలోని హోసూరు ప్రాంతాల్లోనూ ఒంగోలు గిత్తల సంఖ్య పెరిగింది. పండుగలు, ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల సమయాల్లో పశు ప్రదర్శనలు గ్రామాల్లో కోలాహలంగా జరిగేవి. ఈ స్ఫూర్తితో ఎడ్ల పందేలు చాలాచోట్ల ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

ప్రభుత్వాల చేయూత..

లామ్ ఫామ్‌లోని పశు పరిశోధన కేంద్రం అనేక పరిశోధనలతో అన్నదాతలకు చేరువ అవుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ప్రత్యేక పథకాలు, నిధులను కేటాయించాయి. పరిశోధనల్లో భాగంగా విదేశీ ఆంబోతుల జన్యువులను చొప్పించి అధిక దిగుబడి ఇచ్చే కొత్త సంకర జాతిని తయారు చేశారు. విదేశీ జాతులైన హెచ్.ఎఫ్, బ్రౌన్ స్విస్, జెర్సీ ఆంబోతుల సంకరంతో ఏళ్లగా జరిపిన ప్రయోగాల వల్ల 50-50 శాతం లక్షణాలు కలిగిన ఒంగోలు-హెచ్.ఎఫ్. సంకరజాతి రూపొందింది. మన దేశ ఉష్ణ మండల శీతోష్ణ స్థితిని తట్టుకుని అధిక ఉత్పాదక శక్తిని ఈ జాతి నమోదు చేసింది. స్వదేశీ జాతులైన ఒంగోలు, గిర్, హరియాణా, దార్వార్కర్ గోవులను పరిరక్షించి.. జన్యుపరంగా అభివృద్ధిపై ఈ కేంద్రం దృష్టి సారించింది. పశువుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్న తరుణంలో మేలైన ఆవులు, ఆంబోతులను అనేక ప్రాంతాల నుంచి సేకరించి అభివృద్ధి పరిచారు. దిగజారుతున్న పాల ఉత్పాదక శక్తిని తిరిగి పెంపొందించే పరిశోధనలు చేశారు. ఒంగోలు జాతి పరిరక్షణలో భాగంగా పిండోత్పత్తి, పిండ మార్పిడి జీవ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉత్తమ జన్యు సంతతిని పెంచేలా కృషి చేస్తున్నారు. పిండ మార్పిడి దూడ సైతం ఇక్కడ జన్మించడం విశేషం. ప్రస్తుతం లామ్ ఫామ్‌లో ఉన్న పిండ మార్పిడి ప్రయోగశాలను జాతీయ స్థాయి ప్రయోగశాలగా గుర్తించారు. ఈ సందర్భంగా లాంఫామ్ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఆచార్య యం.ముత్తారావు మాట్లాడుతూ.. ఒంగోలు జాతికి పున్వైభవ దీప్తి, ఆధునిక జీవ సాంకేతిక పశు పరిశోధనలతో రైతు సేవలో శత వసంతాలు పూర్తి చేసుకోవడం గర్వకారణమని వ్యాఖ్యానించారు.



ప్రయోగశాలలో పరీక్షలు చేస్తున్న శాస్త్రవేత్తలు



లాంఫామ్ పశు పరిశోధన కేంద్రంలో ఒంగోలు జాతి పశువులు

మానసిక ఆరోగ్యానికి ఆటలు అవసరం: డైరెక్టర్



క్రికెట్ కిట్ అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ఈనాడు, అమరావతి: శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆటలు అవసరమని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి లీప్ క్రికెట్ టోర్నమెంట్, త్రోబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "ఉపాధ్యాయులు చదువుతోపాటు ఆటలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ఏటా టీచర్స్ క్రీడలకు అకడమిక్ క్యాలెండర్‌లో స్థానం కల్పిస్తాం" అని సూచించారు. ప్రతి జిల్లాకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పి.పార్వతి, అదనపు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, జేడీ సుబ్బారావు, పాఠశాల క్రీడల కార్యదర్శి భానుమూర్తి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల బెదిరింపులతో గిరిజనుడి బలవన్మరణం



రామారావు

వెంకటాపురం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి, మనస్తాపానికి గురైన ఓ గిరిజనుడు బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాపురం గ్రామానికి చెందిన రామారావు(36) వాట్సప్‌నకు పక్షం రోజుల కిందట ఓ లింక్ వచ్చింది. దాన్ని తెరవడంతో అతడి ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులోని పూర్తి సమాచారాన్ని దొంగిలించారు. తర్వాత డిగ్రీ చదువుతున్న అతడి కుమార్తె ఫొటోను వాట్సప్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకొని తరచూ ఫోన్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేయసాగారు. ఆమెను కిడ్నాప్ చేస్తామని, ఉద్యోగం రాకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాధితుడు గ్రామ మాజీ సర్పంచి సత్యానికి చెప్పగా. . ఆయన ఐదు రోజుల కిందట ఫోన్ ద్వారా విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. రామారావు శుక్రవారం నేరుగా వెంకటాపురం పోలీసుస్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పారు. సెల్‌ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు సైబర్ మోసగాళ్ల ఫోన్ నంబర్లను బ్లాక్‌లిస్టులో పెట్టామని, అధైర్యపడొద్దని సూచించారు. అయినా బెదిరింపులు రావడంతో ఆందోళనకు గురైన రామారావు శనివారం మధ్యాహ్నం సమయంలో గడ్డి మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను వెంకటాపురం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ములుగు జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై కొప్పుల తిరుపతిరావు పేర్కొన్నారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'హెచ్‌ఎఫ్‌వో' ఏసీలతో ఓజోన్‌కు రక్ష

● అభివృద్ధి చేసిన ఐఐసీటీ



ఈనాడు, హైదరాబాద్: ఏసీలు, రిఫ్రిజిరేటర్లలో చల్లదనం కోసం వినియోగిస్తున్న హైడ్రోఫ్లోరో కార్బన్లు (హెచ్‌ఎఫ్‌సీ).. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. ఈ సమస్యను నివారించేందుకు వీటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత హైడ్రో ఫ్లోరో ఒలిఫిన్స్ (హెచ్‌ఎఫ్‌వో) రసాయనాల అభివృద్ధిలో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) కీలక పురోగతి సాధించింది. విదేశాల నుంచి ఈ గ్యాస్‌ను దిగుమతి చేసుకోవడం ఖరీదైనది కావడంతో.. దేశీయంగా దొరికే ముడి పదార్థాలతో తక్కువ ఖర్చుతో హెచ్‌ఎఫ్‌వోల తయారీపై ఐఐసీటీ దృష్టిపెట్టింది. కొన్ని హెచ్‌ఎఫ్‌వోలు స్వల్పంగా మండుతాయి. వీటిని సురక్షితంగా ఎలా వాడాలి? ఇతర రసాయనాలతో కలిపి మంటలు అంటుకోకుండా ఎలా చేయాలనే దానిపై పరిశోధనలు చేసింది. ఈ రసాయనాలను తక్కువ ఖర్చుతో, ఎక్కువ స్వచ్ఛతతో తయారు చేయడానికి అవసరమైన ప్రత్యేక ఉత్ప్రేరకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. వీటిని త్వరలోనే పైలట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులోకి తెస్తామని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

✦ 2040 నాటికి శీతలీకరణ, ఎయిర్ కండిషనింగ్ రంగాల్లో హెచ్‌ఎఫ్‌సీల వినియోగాన్ని 80-85 శాతం తగ్గించడం లక్ష్యంగా... మాంట్రియల్ ప్రొటోకాల్ అంతర్జాతీయ ఒప్పందంపై 2016లో భారత్ సంతకం చేసింది. ఇది 2019లో అమల్లోకి వచ్చింది. ఇందుకోసం నాలుగో తరం రిఫ్రిజిరేటర్ రసాయనాలుగా పిలిచే హెచ్‌ఎఫ్‌వోను వాడాలని నిర్ణయించారు. అయితే ఈ రసాయనాల తయారీ సాంకేతికత భారత్‌లో లేకపోవడంతో దిగుమతిపైనే ఆధారపడుతున్నారు. హెచ్‌ఎఫ్‌వోలు వాతావరణంలో కొన్ని రోజుల్లోనే విచ్ఛిన్నమవుతాయి. వీటిలో ఉండే డబుల్ బాండ్ ఇందుకు దోహదపడుతుంది. దీంతో భూతాపానికి కారణం కావు. పాత ఏసీలలో కూడా పెద్దగా మార్పులు చేయకుండానే ఈ కొత్త రసాయనాలను వాడవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీల జీఎస్టీ ఎగవేత

గుర్తించిన ఇంటెలిజెన్స్ విభాగం

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు జీఎస్టీ ఎగవేత మోసాలను జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం పట్టుకుంది. మొత్తం రూ.5వేల కోట్ల విలువైన ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్ జీఎస్టీ చెల్లించకుండా ఎగవేసినట్లు గుర్తించింది. దేశవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్న ముఠాలో ముంబయికి చెందిన ప్రభుకుమార్, హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి ప్రధాన సూత్రధారులుగా గుర్తించినట్లు జీఎస్టీ అధికార వర్గాలు తెలిపాయి. వీరు కొన్ని సంవత్సరాలుగా జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సిండికేట్ ముఠా వ్యవహారాలపై హైదరాబాద్, దిల్లీ, ముంబయిలో జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు సోదాలు నిర్వహించి పలు వివరాలు సేకరించారు. పన్ను ఎగవేత, అక్రమ లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని అధికారులు తెలిపారు. కొంతకాలంగా ఈ కంపెనీల పనితీరుపై అధికారులు నిఘా పెట్టి అక్రమాలను గుర్తించినట్లు సమాచారం.

అనుమతులు లేనిదే 'అచ్చంపేట' చేపట్టవద్దు

ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో నిర్మిస్తున్న అచ్చంపేట సాగునీటి ఎత్తిపోతల పథకం (ఉమా మహేశ్వర ప్రాజెక్టు) పనులను అవసరమైన అనుమతులు లేనిదే చేపట్టవద్దంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర అనుమతులు లేవని, పులుల రక్షిత ప్రాంతం సమీపంలో నిర్మాణాలు, భూ సేకరణ తదితర అంశాలను విస్మరిస్తున్నారంటూ బల్మూరు మండలానికి చెందిన అనంత సీతారాంరెడ్డి, తలకంటి అనిల్‌కుమార్ ఎన్జీటీని ఆశ్రయించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా సిద్ధం చేయలేదని ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రైబ్యునల్ ఈ నెల 2న పనులను చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. రూ.1,534.5 కోట్లతో ఈ ఎత్తిపోతల పనులకు 2023, మే 3న రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది. టెండర్లు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. భూ సేకరణ కూడా జరగలేదు. పలుమార్లు ప్రభుత్వ భూమిలో పనులు మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు జరగగా స్థానికులు, గిరిజనులు అడ్డుకున్నారు. ఈ పథకం కింద మొత్తం 4 వేల ఎకరాల వరకు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ పథకంలోని నిర్మాణాలు అమ్రాబాద్ పులుల రక్షిత అటవీ ప్రాంతానికి 100 నుంచి 300 మీటర్ల దూరంలో ఉండటం, కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు లేకపోవడంతో నిర్మాణాల విషయంలో ముందుకెళ్లరాదంటూ ఎన్జీటీ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందే అన్ని రకాల అనుమతులు పొందాల్సి ఉంటుందని సూచించింది.

కుమురం భీం జిల్లాలో కలకలం రేపిన మావోయిస్టుల సంచారం

ఈటీవీ-ఆదిలాబాద్: తెలంగాణలోని కుమురంభీం జిల్లాలో మావోయిస్టుల సంచారం కలకలం రేపింది. ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల పరిధిలోని డోర్లి-పంగిడిమాదారం వద్ద మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టగా వారి ఆచూకీ లభ్యం కాలేదు. డిసెంబరు రెండో వారంలో కుమురం భీం జిల్లా సిర్పూర్(యు) మండలం బాబ్జీపేట-పంగిడి సరిహద్దుల్లోని పెద్దదోబ వద్ద మకాం వేసిన 16 మంది తర్వాత లొంగిపోయారు. ఈ క్రమంలోనే ఓ దళ కమాండర్ సహా 14 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను వేదికను చేసుకున్నట్లు పోలీసులకు తొలుత సమాచారం అందింది. మూడు రోజుల కిందట సాయుధులైన ప్రత్యేక పోలీసులు అటవీప్రాంతాన్ని జల్లెడ పట్టడంతో.. అనుమానం వచ్చిన మావోయిస్టులు స్థావరం మార్చినట్లు తెలిసింది. తాజాగా డోర్లి-పంగిడిమాదారం అటవీ ప్రాంతంలో ఉన్నట్లు అందిన సమాచారంతో గ్రేహౌండ్స్ దళాలు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు నాలుగువైపుల నుంచి చుట్టుముట్టాయి. అప్పటికే వారు ఆ స్థావరాన్ని ఖాళీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మావోయిస్టులు గుమిగూడిన చోట వంటపాత్రలు, సామగ్రి, పవర్‌బ్యాంకులు లభ్యమైనట్లు తెలిసింది. ఈ నెల 11న పురపాలికల పోలింగ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పోలీసు యంత్రాంగం నిఘా మరింత పటిష్ఠం చేసింది.

7 వేలకు పైగా బడుల్లో.. 10 లోపు విద్యార్థులే

- ఒక్కరే ఉన్నవి 170.. ఇద్దరున్నవి 420
- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య
- 2026-27లో ప్రవేశాలు పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: 1.. 2.. 3.. 4.. 5.. ఇవేమీ ర్యాంకులు కాదు.. కొన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యలు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక బడుల్లో పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. 170 పాఠశాలల్లో ఒక్కరు.. 420 బడుల్లో ఇద్దరు.. 654 చోట్ల ముగ్గురు.. 757 స్కూల్స్‌లో నలుగురు విద్యార్థులు చొప్పున ఉండడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగానే ఉంటున్నా.. ప్రాథమిక స్థాయికి వచ్చేసరికి ప్రవేశాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల బదిలీలు, నియామకాలు చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ఇటీవల ఈ వివరాలు సేకరించింది. ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్న ఫౌండేషన్ బడులు తిరుపతి జిల్లాలో అధికంగా 18 ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 15 ఉన్నాయి. ఇద్దరు పిల్లలున్నవి 58తో తిరుపతి జిల్లా మొదటి స్థానంలో.. 39తో చిత్తూరు రెండో స్థానంలో ఉన్నాయి. బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కరే ఉన్నవి అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లో ఆరేసి చొప్పున ఉండగా.. ఇద్దరు పిల్లలతో నడుస్తున్నవి అనకాపల్లి జిల్లాలో 20, శ్రీకాకుళం జిల్లాలో 13 ఉన్నాయి.

◆ రాష్ట్ర వ్యాప్తంగా పది మంది లోపు విద్యార్థులున్న బడులు 7,250 ఉండగా, పది కంటే ఎక్కువ మంది ఉన్నవి 17,249గా తేలింది. 11-15 మంది పిల్లలున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు మూడు ఉన్నాయి.

◆ గతేడాది ఒక్కరు, ఇద్దరు, ముగ్గురు విద్యార్థులున్న 563 బడుల్లో ఈ ఏడాది ఆ ఒక్కరూ లేకుండా పోయారు. వాటిలో కొత్తగా ప్రవేశాలు నమోదు కాలేదు. విద్యార్థులు ఎవరైనా చేరితే ఆయాచోట్ల టీచర్లను కేటాయించాలని విద్యాశాఖ భావిస్తోంది. ప్రవేశాల కోసం ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించాలని ఆలోచన చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు వచ్చే విద్యా సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆదర్శ బడుల్లోనూ..

తరగతికి ఒక్కో టీచర్‌ను కేటాయించే లక్ష్యంతో ప్రారంభించిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లోనూ కొన్ని చోట్ల పిల్లల సంఖ్య తక్కువగా ఉంది. 11-15 మంది విద్యార్థులున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు మూడు ఉండగా.. 16-20 మధ్య పిల్లలున్నవి 12 ఉన్నాయి. 109 బడుల్లో 21-30 మంది ఉండగా.. 456 చోట్ల 31-40 మంది ఉన్నారు. 40 మందికి పైగా పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ బడులుగా మార్పు చేసి, తరగతికో ఉపాధ్యాయుడిని నియమించాలనే ఉద్దేశంతో వీటిని ప్రారంభించారు. ఇప్పుడు 124 బడుల్లో 30 మంది లోపు పిల్లలున్నారు. ఈ పరిస్థితులపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతమంది ఉన్నా, అన్ని పాఠశాలలనూ నిర్వహిస్తామన్నారు. ఏ ఒక్క బడినీ మూసివేయమని స్పష్టం చేశారు.

ఎందుకు ఈ పరిస్థితి?

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులు లేవు. అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నా.. ఆ తర్వాత అక్కడి నుంచి పిల్లలు పూర్తిస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం లేదు.

విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఏకోపాధ్యాయ బడుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఒకే టీచర్. . ఒకే గదిలో 1, 2 తరగతులు, 1-5 తరగతులు బోధించే పరిస్థితి ఉంది. ఈ విధానంపై చాలామంది తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. పూర్వ ప్రాథమిక విద్య బోధన విధానంలోనూ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని విద్యా రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య

విద్యార్థులు	ఫౌండేషన్ బడులు	బేసిక్ ప్రాథమిక పాఠశాలలు	మొత్తం
1	126	44	170
2	292	128	420
3	377	277	654
4	416	341	757
5	436	437	873
6	397	478	875
7	361	517	878
8	327	511	838
9	247	533	780
10	289	716	1,005
10పైన	1,297	15,952	17,249

నెయ్యి కల్తీ జరిగిందని సుబ్బారెడ్డి ఒప్పుకొన్నారు

- శ్రీవారి భక్తులకు జగన్ క్షమాపణలు చెప్పాలి
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్



ఈనాడు, దిల్లీ: వైకాపా పాలనలో తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదానికి ఉపయోగించిన నెయ్యి కల్తీ అయిందని తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇప్పటికైనా నిజం ఒప్పుకోవడం సంతోషకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ అంశంపై నేటికిచ్చిన అబద్ధాలు ప్రచారం చేసిన జగన్ శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం రాత్రి ఈ అంశంపై ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి నెయ్యి కల్తీని అంగీకరించడంతో ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు నిజమని మరోసారి రుజువు అయ్యాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లమంది భక్తులు తిరుమల ప్రసాదాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారని, అటువంటి ప్రసాదంలో కల్తీ నెయ్యిని వాడటం క్షమించరాని నేరమని కలిశెట్టి అన్నారు. ఇప్పటికైనా జగన్ తన తప్పును అంగీకరించి స్వామివారికి, భక్తులకు బహిరంగంగా క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. వైకాపా చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, ధర్మాన్ని కించపరిచిన వారెవ్వరూ తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు.

సుకుమామిడి-గుడిసెకు ట్రెక్కింగ్ మార్గం!

- సాహసికులకు సరికొత్త అనుభూతినిచ్చేలా అటవీశాఖ ప్రతిపాదనలు



ట్రెక్కింగ్ చేసే గుడిసె కొండలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: ఎత్తయిన కొండలపై విశాలమైన స్థలం... కొండల చుట్టూ పచ్చదనంతో నిండిన లోయలు.. అదే పేరెన్నికగన్న పర్యాటక ప్రాంతం.. గుడిసె. అక్కడ క్యాంప్ ఫైర్ వేసుకొని సూర్యోదయాన్ని చూడటం వర్ణించలేని గొప్పఅనుభూతి. అలాంటి ఈ ప్రాంతం ట్రెక్కింగ్ చేసే సాహసికులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. చింతూరు అటవీ డివిజన్ లక్కవరం రేంజ్ (మోతుగూడెం)పరిధిలోని సుకుమామిడి నుంచి గుడిసెకు అధికారులు ట్రెక్కింగ్ మార్గం అన్వేషించారు. సర్వే చేసి, అమలు కోసం అటవీ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. అనుమతులు రాగానే చింతూరు మండలం సుకుమామిడి నుంచి మారేడుమిల్లి మండలం గుడిసె వరకు ట్రెక్కింగ్ కోసం 5 మీటర్ల వెడల్పుతో మార్గం అందుబాటులోకి వచ్చే వీలుంది.

7 గంటల ట్రెక్కింగ్

లక్కవరం అటవీ రేంజ్ అటవీ క్షేత్రాధికారి గవిరెడ్డి వెంకటనానాజీతో కూడిన ఏడుగురు సభ్యుల బృందం 3 నెలల కిందట మోతుగూడెం సమీపంలోని సుకుమామిడి పెద్దగుంపు నుంచి గుడిసెకు ట్రెక్కింగ్ మార్గాన్ని సర్వే చేశారు. ఈ బృందం ఏడు కొండలను 10 కి.మీ. మేర 60 డిగ్రీలు, 2 కి.మీ. మేర 90 డిగ్రీల కోణంలో ఎక్కారు. ఇందుకు 7 గంటల సమయం పట్టింది. ఇక్కడి కొండలు సముద్ర మట్టానికి 1,200 అడుగుల ఎత్తులో ఉండటంతో ఇంత సమయం తీసుకుంది. ఇలాంటి పరిస్థితులు ట్రెక్కింగ్ చేసే వారిని ఉత్సాహపరుస్తాయని వెంకటనానాజీ తెలిపారు. ప్రస్తుతం మోతుగూడెం నుంచి గుడిసెకు వాహనాలపై చేరాలంటే 100 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. అదే ట్రెక్కింగ్‌కు అనుమతులు వస్తే పర్యాటకులు తూర్పు కనుమలను సరికొత్తగా చూడొచ్చని ఈ ప్రయత్నం చేశామన్నారు. ట్రెక్కింగ్ చేసే పర్యాటకులకు కొంత రుసుము తీసుకొని భోజనం, ఫైర్ క్యాంపింగ్, గైడ్ వంటి ఏర్పాట్లూ చేయనున్నట్లు ప్రతిపాదనలు చేశామన్నారు.

భాజపా యువమోర్చా రాష్ట్ర కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: భాజపా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గాన్ని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సునీల్ రెడ్డి ఆదివారం ప్రకటించారు. కమిటీలో సభ్యుల వివరాలు ఒక ప్రకటనలో విడుదల చేశారు.

◆ **ఉపాధ్యక్షులు:** పైడికొండల సింధు (పశ్చిమగోదావరి జిల్లా), తోట సూర్యప్రకాశ్ (అనంతపురం), బోరె నరేంద్ర చక్రవర్తి (శ్రీకాకుళం), గుత్తా అశోక్‌నాయుడు (నెల్లూరు), గుడిపల్లి పృథ్వీరెడ్డి (తిరుపతి), కటిక జగదీష్ (విశాఖపట్నం), కె.ప్రదీప్ దుత్తారెడ్డి (గుంటూరు)

◆ **ప్రధాన కార్యదర్శులు:** బేతిరెడ్డి ఆదిత్య (తూర్పుగోదావరి), కోట్ల అజయేశ్ యాదవ్ (అనంతపురం), నాగోతు హరికృష్ణ (తిరుపతి)

◆ **కార్యదర్శులు:** సంతతి శ్రీనవ్య (విశాఖపట్నం), బొమ్మన విజయ్ (కడప), బాల వినాయక వరప్రసాద్ (పశ్చిమగోదావరి), చిత్రాల నాగిరెడ్డి (ఎన్టీఆర్), నాసిన మణికుమార్ (బాపట్ల), చల్లా కౌశిక్ యాదవ్ (గుంటూరు), బి.ఉదయ్‌కుమార్ (సత్యసాయి), నరేంద్ర వర్మ (అంబేడ్కర్ కోనసీమ)

◆ **జోనల్ ఇన్‌ఛార్జి:** ఎరుకునాయుడు (ఉత్తరాంధ్ర జోన్), కె.ఈశ్వర్ గౌడ్ (గోదావరి జోన్), లేఖల రాజశేఖర్‌రెడ్డి (కోస్తా జోన్), గుడపాటి సుబ్బరాజు (రాయలసీమ జోన్)

◆ **అధికార ప్రతినిధులు:** సంజన (విశాఖపట్నం), ఎ.రవితేజరెడ్డి (శ్రీసత్యసాయి), తరిగోపుల అశోక్ (అనంతపురం), కొండా ప్రసాద్ (విశాఖపట్నం), గనిశెట్టి అరవింద్‌కుమార్ (అంబేడ్కర్ కోనసీమ)

◆ **కోశాధికారి:** ఎ.కిషన్ (తిరుపతి), **సహ కోశాధికారి:** మురగ నరేశ్ (నెల్లూరు)

◆ **కార్యాలయ కార్యదర్శి:** చినమరాజు నర్సిరాజు (ఎన్టీఆర్)

◆ **లీగల్ సెల్ కన్వీనర్:** ముసునూరు వినోద్‌కుమార్ (ఎన్టీఆర్), కో-కన్వీనర్: వీరవల్లి వెంకట రవికుమార్ (నెల్లూరు)

◆ **కళాశాల ఔట్‌రీచ్ సెల్ కన్వీనర్:** ఎ.ప్రతాప్ (శ్రీసత్యసాయి)

◆ **స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కన్వీనర్:** జీవన్ (తిరుపతి), కో- కన్వీనర్: ఎం.సాయినాథ్‌రెడ్డి (అనంతపురం)


◆ **ఐటీ సెల్ కన్వీనర్:** డి.కె.నవీన్ చౌదరి (చిత్తూరు)

◆ **సోషల్ మీడియా కన్వీనర్:** వి.వంశీధర్ (పల్నాడు), కో- కన్వీనర్: బి.శ్రీనివాసరావు (గుంటూరు)

◆ **విధాన పరిశోధన శిక్షణ కన్వీనర్:** కళాసముద్రం తేజస్విని (అనంతపురం)

దూర విద్య.. అక్రమాలకు దగ్గర!

- వర్సిటీల దూర విద్య కోర్సుల పరీక్షల్లో అవకతవకలు
- చూచిరాతలకు అనుమతిస్తున్న కొన్ని స్టడీ కేంద్రాలు
- ఆదాయంపై దృష్టి తప్ప.. డిగ్రీ నాణ్యతను పట్టించుకోని విశ్వవిద్యాలయాలు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో దూర విద్య కోర్సుల నిర్వహణ అపహాస్యంగా మారింది. ఈ కోర్సుల్లో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలు ఆయా కోర్సులను ఆదాయ వనరుగా చూస్తున్నాయే తప్ప.. డిగ్రీ నాణ్యతను పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా స్టడీ కేంద్రాలకు అనుమతులిస్తూ.. పరీక్షల నిర్వహణను గాలికి వదిలేస్తున్నాయి. రెగ్యులర్ డిగ్రీలతో సమానంగా వీటికి ప్రాధాన్యం ఉండటంతో చాలామంది దూర విద్య కోర్సుల్లో చేరుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని కొన్ని స్టడీ కేంద్రాలు.. పరీక్షల్లో చూచిరాతలకు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఒక అభ్యర్థికి బదులు మరొకరితో రాయిస్తున్నాయి. వీటిపై విశ్వవిద్యాలయాలకు ఫిర్యాదులు వస్తున్నా.. సకాలంలో చర్యలు తీసుకోవడం లేదు. దూర విద్య కేంద్రాలకు పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు సరైన సిబ్బంది లేకపోయినా.. తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నాయి. స్టడీ కేంద్రాల కేటాయింపులోనూ పైరవీలు సాగుతున్నట్లు, డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆదాయం కోసం ఒక వర్సిటీ పరిధిలో మరో విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఆంధ్ర, నాగార్జున విశ్వవిద్యాలయాలు రాష్ట్ర వ్యాప్తంగా స్టడీ కేంద్రాలకు అనుమతులిచ్చాయి.

ఆంధ్ర వర్సిటీలో కొత్త విధానాలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 33 కోర్సులు నిర్వహిస్తోంది. వీటి ద్వారా వర్సిటీకి రూ.50 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఇటీవల జరిగిన పరీక్షలకు చాలాచోట్ల పరిశీలకులను నియమించలేదన్న విమర్శలు వచ్చాయి. దీంతో గత నవంబరులో చాలా కేంద్రాల్లో చూచిరాతలు సాగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వర్సిటీ తెలుగు రాష్ట్రాల్లో 78 చోట్ల పరీక్షలు నిర్వహిస్తోంది. 50 వేల మంది వరకు ప్రవేశాలు పొందుతున్నారు. గత నవంబరులో జరిగిన పరీక్షల్లో విజయనగరం జిల్లా కొత్తవలస ప్రగతి డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థికి బదులు మరొకరు పరీక్ష రాసిన ఘటన వెలుగు చూసింది. చూచిరాతలు రాస్తున్న ఏడుగురిని పట్టుకున్నారు. దూర విద్య హిందీ పరీక్షకు చేతిరాతతో రాసిన ప్రశ్నపత్రాలను అభ్యర్థులకు అందించారు. దీన్నిబట్టి కనీసం ప్రశ్నపత్రాల సెట్టింగ్‌పైనా దృష్టిసారించడం లేదని అర్థమవుతోంది.

నాగార్జునలో మరో వింత..

నాగార్జున విశ్వవిద్యాలయం తెలంగాణ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి, సరిహద్దు ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయిస్తోంది. వీటిలో చూచిరాతలు భారీగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. అనంతపురం జిల్లా గుంతకల్లులోని ఓ కళాశాలలో చూచిరాతలతో పాటు ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాసేందుకు నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల స్టడీ కేంద్రాల నిర్వాహకులు వాట్సప్‌లో ప్రశ్నపత్రాలను బయటకు పంపి, జవాబులు తెప్పిస్తున్నారు. మరికొన్ని చోట్ల పరీక్ష కేంద్రాల తలుపులు మూసివేసి, లోపలికి ఎవ్వరూ రాకుండా కాపలా పెడుతున్నారు. విద్యార్థులకు పుస్తకాలు అందించి, చూచిరాతలు రాయిస్తున్నారు.

◆ నాగార్జున వర్సిటీకి సంబంధించి రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో ఎక్కువగా అవకతవకలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. మైదుకూరులో జవాబుపత్రాల బుక్‌లెట్లను ఇళ్లకు పంపించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. గతంలోనూ ఇక్కడి పరీక్ష కేంద్రాలపై ఫిర్యాదులు వచ్చినా.. వర్సిటీ అధికారులు చర్యలు తీసుకోలేదు. గతంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి దూర విద్యకు అనుమతి లేకపోయినా.. ప్రవేశాలు కల్పించడంతో మూడేళ్ల పాటు పరీక్షలు నిర్వహించలేని దుస్థితి ఏర్పడింది.

వైద్యుల కొరత.. రోగులకు వెత!

- మంగళగిరి ఎయిమ్స్‌లోని 38 డిపార్ట్‌మెంట్లలో అదే పరిస్థితి
- కార్డియాలజీ, సీటీవీఎస్ వంటి కీలక చోట్లా అరకొరగానే నియామకాలు
- ఇంకా ప్రారంభమవ్వని ఆరు విభాగాలు.. పోస్టులు మంజూరైనా భర్తీ లేదు
- సమాచార హక్కు చట్టం వివరాలు.. 'ఈనాడు' పరిశీలనలో బహిర్గతం

ఈనాడు, అమరావతి: మంగళగిరి ఎయిమ్స్‌ను వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒకటి మినహా అన్ని డిపార్ట్‌మెంట్లలోనూ ఇదే పరిస్థితి. కీలకమైన కార్డియాలజీ, సీటీవీఎస్ సేవల్లోనూ అరకొర వైద్యులతోనే నెట్టుకొస్తుండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ ఆరు విభాగాలు ప్రారంభానికి నోచుకోకపోవడం.. కొన్ని పోస్టులు మంజూరైనా నియామకాలు చేపట్టకపోవడం ఇబ్బందికరంగా మారింది. మంగళగిరిలో 2018 జనవరి 24న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చేసుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం.. దీన్ని 193 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం 177.07 ఎకరాలు బదిలీ చేసి, మ్యుటేషన్ చేసింది. ఇంకా 15.93 ఎకరాలు సమకూర్చాల్సి ఉంది. ఎయిమ్స్‌లో మొత్తం 45 డిపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా.. ఇప్పటివరకు 39 కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలోనూ సరిపడా వైద్యులు లేరు. ఈ వివరాల కోసం 'ఈనాడు' సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయగా.. ఎయిమ్స్ వర్గాలు ఖాళీల పరిస్థితిని తెలిపాయి.

ఇదీ పరిస్థితి

మంగళగిరి ఎయిమ్స్‌లో మొత్తం 45 డిపార్ట్‌మెంట్లకు 39 ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఇంకా 6 డిపార్ట్‌మెంట్లు (రుమటాలజీ, నవజాతు శిశు సంరక్షణ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ హెమటాలజీ, మెడికల్ బయోటెక్నాలజీ) ప్రారంభించలేదని స్పష్టం చేశారు. ప్రారంభమైన వాటిలోనూ వైద్యుల భర్తీ అరకొరగానే ఉంది.

అనాటమీ ఒక్కటే ఫుల్

ప్రస్తుతం అనాటమీ విభాగం ఒక్కచోటే మంజూరైన 9 పోస్టులకు గాను అందరూ ఉన్నారు. అనస్తీషియాలజీలో 17 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు.. బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీలో మంజూరైన 3 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్డియాలజీలో మంజూరైన ఒక్క అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు కూడా ఖాళీగా ఉండటం గమనార్హం.

◆ కీలకమైన కార్డియోథొరాసిక్ వాస్క్యులర్ సర్జరీ (సీటీవీఎస్) విభాగంలో ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఇలా మూడు స్థానాల్లో ఒక్కొక్కటి మంజూరు కాగా.. అన్నీ ఖాళీనే. అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముగ్గురికి గాను ఇద్దరే ఉన్నారు.

◆ సీఎఫ్ఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు 5 మందికి ఒక్కరే ఉండటం ప్రస్తావనార్హం. ◆ రేడియో డయాగ్నసిస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు 8 మందికి ఒక్కరే ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

వాటిలో భర్తీనే జరగలేదు

గ్యాస్ట్రో ఎంటరాలజీలో 5, మెడికల్ హెమటాలజీలో 2, నియోనేటాలజీలో 4, రుమటాలజీ అండ్ క్లినికల్ ఇమ్యునాలజీలో 2, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో 4 పోస్టులు మంజూరు కాగా.. ఆయా విభాగాల్లో ఒక్కరూ లేకపోవడం గమనార్హం.

◆ మెడికల్ బయోటెక్నాలజీలో పోస్టులు మంజూరే కాలేదు.

◆ కొరత వల్ల ఏ విభాగంలో ఎప్పుడు వైద్యులుంటారో అర్థం కాని దుస్థితి. ప్రతి వైద్యుడికీ వారంలో 2 నుంచి 3 రోజుల చొప్పున ఓపీ కేటాయించగా.. ఆ రోజుల్లో వారు వస్తేనే సేవలు అందుతున్నాయి. ఆ వివరాలు తెలియక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

డిపార్ట్‌మెంట్	మంజూరైన పోస్టులు	ప్రస్తుతం ఉన్నవారి సంఖ్య
అనస్తీషియాలజీ	28	12
బయోకెమిస్ట్రీ	7	6
బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ	5	2
కార్డియాలజీ	6	4
కార్డియోథొరాసిక్ వాస్క్యులర్ సర్జరీ	6	2
సీఎఫ్ఎం	8	6
డెంటిస్ట్రీ	8	3
డెర్మటాలజీ	6	2
ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం	5	2
ఈఎన్‌టీ	5	3
ఫోరెన్సిక్ మెడిసిన్	6	4
జనరల్ మెడిసిన్	11	7
జనరల్ సర్జరీ	10	8
హాస్పిటల్ ఎడ్మినిస్ట్రేషన్	5	3
మెడికల్ ఆంకాలజీ	3	1
మైక్రోబయాలజీ	10	6
నెఫ్రాలజీ	5	2
న్యూరాలజీ	6	2
న్యూరోసర్జరీ	7	1
న్యూక్లియర్ మెడిసిన్	5	2
అబ్‌స్ట్రెటిక్స్ గైనకాలజీ	10	5
ఆప్తల్మాలజీ	8	2
ఆర్థోపెడిక్స్	9	6
పీడియాట్రిక్ సర్జరీ	5	3
పీడియాట్రిక్స్	10	5
పెథాలజీ	12	6
ఫార్మకాలజీ	6	5
సైకాలజీ	9	5
ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్	4	2
సైకియాట్రీ	6	4
పల్మనరీ మెడిసిన్	6	2
రేడియో డయాగ్నసిస్	11	3
రేడియేషన్ ఆంకాలజీ	6	3
సర్జికల్ ఆంకాలజీ	5	3
ట్రామా అండ్ ఎమర్జెన్సీ మెడిసిన్	9	4
ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్‌బ్యాంక	5	2
యూరాలజీ	6	1
బయో స్టాటిస్టిక్స్	2	1



యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తజనం

యాదగిరిగుట్టకు భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువజామున స్వాతి వేడుకలో భాగంగా దేవస్థానం చేపట్టిన గిరి ప్రదక్షిణలోనూ అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఖజానాకు రూ.52,79,728 చేకూరాయని ఈవో భవానీ శంకర్ తెలిపారు. సుమారు 60 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడిగా సుంకరి మల్లేశం



ఈనాడు, హైదరాబాద్: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జాతీయ అధ్యక్షుడిగా తెలంగాణకు చెందిన సుంకరి మల్లేశం ఎన్నికయ్యారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఈ నెల 6, 7, 8 తేదీల్లో బీఎంఎస్ త్రైవార్షిక సమావేశం జరిగింది. ఇందులో కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాఝీ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 2,500 మంది, 13 దేశాలనుంచి 36మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా సుంకరి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సురేంద్రపాండేను ఎన్నుకున్నారు. మల్లేశం ఈఎస్ఐసీ బోర్డులో సభ్యుడిగా పనిచేసిన సమయంలో తెలంగాణలోని సనత్‌నగర్‌కు ఈఎస్ఐసీ ఆస్పత్రిని మంజూరు చేయించారు. ఈఎస్ఐసీ పరిధిలోకి వచ్చే కార్మికుల పిల్లలకు వైద్యవిద్య సీట్లలో 35% సీట్లు కేటాయించడంలో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన ఈపీఎఫ్‌వో సీబీటీ సభ్యుడిగా ఉన్నారు. ఈ సమావేశంలో బీఎంఎస్ పలు తీర్మానాలు ఆమోదించింది.

ఏసీబీ కేసు ఆబ్జెక్ట్‌లు ఎఫ్‌ఎస్‌ఎల్‌లో లేవు


- టీజీఎఫ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(టీజీఎఫ్‌ఎస్‌ఎల్)లో శనివారం జరిగిన అగ్నిప్రమాద ఘటనపై వదంతుల్ని నమ్మొద్దని టీజీఎఫ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాల్ని వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. 'అగ్నిప్రమాద ఘటనపై నాంపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో ప్రాథమిక దర్యాప్తు పూర్తి కాగానే ల్యాబొరేటరీని తిరిగి తెరుస్తాం. ప్రస్తుతం నష్టం పరిమాణాన్ని అంచనా వేస్తున్నాం. ఒకవేళ ఏదైనా కేసులో ఆబ్జెక్ట్‌లు పనికిరాకుండా పోతే న్యాయస్థానాలకు వివరాల్ని వెల్లడిస్తాం. ఆ వివరాల్ని త్వరలోనే పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతాం..' అని వెల్లడించారు.

ఘటన అనంతరం రెండు కేసుల విషయంలో సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ఏసీబీ నమోదు చేసిన కేసు(ఓటుకు నోటు)లో 2015 జూన్ 12, జులై 14 తేదీల్లో మొత్తం 16 మెటీరియల్ ఆబ్జెక్ట్‌లను ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి(ఏసీబీ) కోర్టు విశ్లేషణ నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పంపించింది. ఈ ఆబ్జెక్టులన్నింటినీ 2015లోనే పరిశీలించి కోర్టుకు నివేదికలు సమర్పించాం. అనంతరం ఆ కేసుకు సంబంధించిన అన్ని కేసు ఆస్తుల్ని 2021 మార్చిలో న్యాయస్థానానికి తిరిగి అప్పగించాం. అలాగే పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు(ఫోన్ అక్రమ ట్యాపింగ్)కు సంబంధించి 2024 నుంచి ఇప్పటి వరకు వివిధ తేదీల్లో మొత్తం 136 మెటీరియల్ ఆబ్జెక్ట్‌లు ఎఫ్ఎస్ఎల్‌కు అందాయి. వాటిల్లో ఈ ఏడాది జనవరిలో వచ్చిన 7 ఐటమ్స్ తప్ప మిగిలిన 129 పరిశీలించి నివేదికల్ని ఇప్పటికే సంబంధిత అధికారులకు పంపించాం. 7 ఐటమ్స్ పరిశీలన సైతం పూర్తయింది. నివేదికలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని మెటీరియల్ ఆబ్జెక్ట్‌లను అప్పగించాం. ఈ కేసులోని అన్ని మెటీరియల్ ఆబ్జెక్ట్‌లు ఎఫ్ఎస్ఎల్‌లో సురక్షితంగా ఉన్నాయి' అని స్పష్టం చేశారు.

మాట నిలబెట్టుకోకుంటే ఉరేసుకుంటా

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



భైంసా, న్యూస్‌టుడే: పుర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే భైంసా పురపాలికను దేశంలోనే మూడో స్థానంలో నిలుపుతానని.. అలా చేయని పక్షంలో ఉరేసుకుంటానని తెలంగాణలోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఛైర్మన్‌గా చేస్తే పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని.. గోండు బిడ్డగా మాటిస్తున్నానన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఆనంద్‌రావు పటేల్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎంఐఎం పార్టీ కుట్రలతో పట్టణ పేదలు ఇందిరమ్మ ఇళ్లకు నోచుకోలేదని ఆరోపించారు. మతాల మధ్య చిచ్చు పెట్టే భాజపా, ఎంఐఎం పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

సిద్దిపేట జిల్లాలో పెద్దపులి హల్‌చల్

ఆరు పశువులను చంపిన మృగం

నంగునూరు, కోహెడ, న్యూస్‌టుడే: నెల రోజులకు పైగా తెలంగాణలోని మూడు జిల్లాల్లో సంచరిస్తున్నట్లు ఆనవాళ్లున్న పెద్ద పులి.. సిద్దిపేట జిల్లాలో ఆరు పశువులపై ఆదివారం వేకువజామున దాడి చేసి చంపేసింది. సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పులి సంచరిస్తోంది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్‌లో రెండు దూడలపై దాడి చేయడంతో.. ఒకటి చనిపోయింది. కోహెడ మండలం ఆరెపల్లి పంచాయతీ పరిధిలోని కనీల బాయి తండా సమీపంలో మేత మేస్తున్న ఐదు ఆవులపై పులి దాడి చేసి చంపేసింది. ఘనపూర్‌లో అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. ఆరెపల్లిలో ఆవును చంపుతుండగా చూసినట్లు రైతు మాలోతు రమేశ్ తెలిపారు. హుస్నాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సిద్ధార్థ, ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్సై అభిలాష్ ఘటనా స్థలాలను పరిశీలించారు. ఆరెపల్లి, బస్వాపూర్, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, శనిగరం గ్రామాలకు చెందిన రైతులను అప్రమత్తం చేశామన్నారు. కోహెడ సమీపంలోని సింగరాయగుట్టల ప్రాంతంలో పులి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.



నేర్చుకోవడమంటే చదువుకోవడం మాత్రమే కాదు

నేర్చుకోవడమంటే కుర్చీకే పరిమితమై చదువుకోవడం ఒక్కటే కాదు. కొన్ని సందర్భాల్లో కాసేపు నడవడం, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడం, సానుకూల దృక్పథంతో ఉండటం ఏకాగ్రతను పెంచుతాయి. కాబట్టి చదువుకుంటూ.. మధ్యమధ్యలో విరామం తీసుకుంటూ.. ముందుకు సాగుతూ మంచి ఫలితాలు సాధించండి.

– చేతనా వాశిష్ఠ, వెట్‌వాట్ వ్యవస్థాపకురాలు

సూపర్ సందేశం





ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గంగాధర పాండే. ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 5కే పరుగులో పాల్గొన్న ఆయన తన 'సూపర్‌మ్యాన్' గెటప్‌తో అందరినీ ఆలోచింపజేశారు. సూపర్ మ్యాన్ డ్రెస్‌కు వెనుక ఉండే కేప్(భుజాల నుంచి కాళ్ల వరకు ఉండే పొడవైన వస్త్రం) వేగంగా పరుగెత్తేందుకు, ఎగిరేందుకు సాయపడుతుంది. ఈ క్రమంలో గంగాధర తన కేప్‌నకు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు వంటివి అంటించుకున్నారు. దానిపై 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ ఎండింగ్ రన్నర్(సూపర్)' అనే నినాదం రాసుకొని అందరినీ ఆలోచింపజేశారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని చిన్నారులు, యువతకు అర్థమయ్యేలా చెప్పేందుకు ఈ గెటప్‌ని ఎంచుకున్నట్లు గంగాధర తెలిపారు. 61 ఏళ్ల వయసున్న ఆయన బబుల్ ఫీలింగ్స్ ఎన్జీవో అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

– ఈనాడు, హైదరాబాద్